# మిసిమి

మాసపత్రిక

**సంపుటి 34** **సంచిక 11**

**నవంబర్ - 2023**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

*సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్***

*సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం*

KALA JYOTHI
Since 1946

Printed & Published by
**BAPANNA ALAPATI**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,
**Hyderabad - 500 020.**
Ph: 040 - 27612436, 27645538.

Editor: **V. ASWINI KUMAR**
**Ph: 994 951 6567**

<u>**చందా వివరాలు:**</u>
₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : **జి. ఉమాసుందరి**
**040-27645536**

**Scan QR to Pay**
**Misimi Publication**

LIBRARY OF CONGRESS
**LCCN 91-903060**

**UGC Care**

ISSN
INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
**ISSN 2454-4329**

**misimi90monthly@gmail.com**
www.misimimonthly.com
facebook.com/misimimaasapathrika

YouTube **: Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## *నవంబర్ నెల సూచికలు...*


వారసత్వం : ఎడిటర్ ...3

అమృత వర్షిణి : వి.ఎస్.ఆర్. మూర్తి ... 4

కాశీలో పద్మాల వీధి : డా. కిల్లాడ సత్యన్నారాయణ... 5

మ.న.సు. రాయుడు గారితో : **మిసిమి** ... 12

బహుభాషా పండితులు-ఆచార్య రోణంకి : శీలా సుభద్రాదేవి ... 21

ప్రవాసాంధ్ర విలక్షణ కవి-పఠాభి : డా. డి.కె. ప్రభాకర్ ... 23

కార్మికుల రక్షకుడు-డా. అంబేద్కర్ : డా. సుబ్బయ్య బోరుగడ్డ ... 26

గాంధార శిల్పకళ : డా. బెల్లంకొండ రమేశ్‌చంద్ర ... 29

తెలంగాణలో వైష్ణవభక్తి-శతకాలు : గడ్డం సత్యపాల్ రెడ్డి ... 34

గుస్టావ్ క్లిమ్ట్-ముద్దు ముచ్చట : తంగెడ విశ్వేశ్వర ప్రసాద్ ... 38

తెలుగు సాహిత్య పరిశోధన : బుక్కే ధనక నాయక్ .... 42

బిడ్డల యాదిలో గద్దర్ : ఆచార్య అనుమాండ్ల భూమయ్య ... 45

భువిలో దివి-వియన్నా : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు ... 48

రాజస్థాన్ కోటలు : ప్రొ. లక్ష్మీ అయ్యర్ ...54

చిత్రగీతాలు - హిందుస్థానీ బాణీలు : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 57

సూక్తి సురభి : రెంటాల సాంబశివరావు .... 62

దార్శనికుడు-డా. అక్కినేని నాగేశ్వర రావు : మండలి బుద్ధప్రసాద్ ... 64

ఉషోదయం - నవలాహృదయం : రాజా రామమోహన రావు ... 69

మాలతీ చందూర్ : డా. హరిపద్మరాణి ... 71

సిక్కోలు రాజకీయ చరిత్ర : నాగబోయిన నాగేశ్వర రావు ... 76

చదవండి : **మిసిమి** ... 78





**పద్మవిభూషణ్**
**పండిట్ కిషన్ మహరాజ్**



**మోజార్ట్**

**అట్టమీది బొమ్మలు**



బుగ్గ మందారం




పాండు రాజు




కుంతీదేవి



సిగ్గు సింగారం

## వారసత్వం

గత శతాబ్దకాలం పైగా ఎన్నో ఆవిష్కరణలు జరిగాయి. పాకటం మొదలు పైకెగరటం వరకూ – పలుకు దగ్గర్నుంచి సెల్ వరకు – అక్షరం నుంచి అంతరిక్షం వరకు మానవ మేధకు – కృషికి పరిమితులు, పరిధులు ఉన్నట్లు అనిపించదు. ఈ కృషిలో మూడు నాలుగు తరాలు తరించిపోయాయి. అయితే ఇందులో అదృష్టవంతులు 1920 తరువాత జన్మించి, ఈ ప్రపంచంలో ఎన్నో కష్ట నష్టాలు, సుఖసంతోషాలు చూసినవారు. వారి చరిత్రే మన సమీప చరిత్ర. మనిషి తాపత్రయం సంపద, అధికారం అయినా జ్ఞానార్జనకు తమ జీవితాలను ధారపోసిన వారికీ కరువు లేదు. జ్ఞానాన్ని మనిషి ఔన్నత్యానికి – నైతిక విలువలకు అన్వయించినవారు తక్కువ కాదు. మన జీవిత కాలావధి పరిమితమే – కానీ ఆ పరిమిత కాలంలోనే అపరిమిత సాధన చేసినవారు మనకి ఎందరో ఈ సమీప చరిత్రలో తెలియవస్తారు. వారి తపన, తమ అరుదైన జీవిత ఉత్సవ ఘట్టాలను ముందు తరాలకు అందించడమే. అలాంటి వారి గురించి చెప్పాలంటే శతజయంతి పూర్తి చేసుకున్న ఆలపాటి రవీంద్రనాథ్ (కీ.శే.). వీరు వెలిగించిన చిరుదీపం 'జ్యోతి'. తెలుగులో పత్రికలు పురుడుపోసుకుంటున్న సమయమది. లౌకిక పరమైన బాధ్యతలు నిర్వహిస్తూనే జ్యోతిని దశదిశలా ప్రసరింపజేసి మరిన్ని పత్రికలు ప్రచురించి ప్రాచుర్యం కల్పించారు. ఎందరో రచయితలకు ప్రోత్సాహ సహాయాలు అందించి రచనలు చేయించారు. ఆయన ప్రోత్సహించిన వారిలో జ్ఞానపీఠం ఎక్కినవారు రావూరు భరద్వాజ. వారి యజ్ఞం అంతటితో ఆగలేదు. ఆంధ్రప్రదేశ్ అవతరణతో రాజధానికి తరలివచ్చి 'కళాజ్యోతి' జయకేతనాన్ని ఎగురవేశారు. అయినా తృప్తి – మేధోపరమైన సంతృప్తి కోసం **మిసిమి** కి ఊపిరిలూదారు ఎందుకు? ముందు తరాలకు ఇదిగో ఇటువంటి పత్రిక తెలుగులో వచ్చింది – పట్టుచీర కట్టింది – వెన్నెల్లో ఆడుకుంది – బంగారు మెరుగులీనింది అని చెప్పటానికి, వారసత్వాన్ని అందించటానికి! వారి జయంతి నవంబరు 4వ తేది. 102 సంవత్సరాల పండుగ జరుపుకుందాం.



ఆలపాటి రవీంద్రనాథ్

ఈ సంచికలో మన్నం రాయుడు గారి పరిచయ ప్రక్రియ ఉంది. వారు కూడా తెలుగు భాషకు అక్షర నిధి ఏర్పాటు చేస్తున్నారు, స్వయంప్రతిపత్తితో. అది కూడా మహాయజ్ఞం లాంటిదే. దాని ప్రతిఫలాలు తెలుగు జాతికి అంకితం చేస్తున్న యోగులు వారు. వారి యజ్ఞం అవిఘ్నంగా కొనసాగాలని, యజ్ఞాశ్వాన్ని దశదిశలు పరిగెత్తించాలని ఆశిస్తున్నాం. ఈ సందర్భంగానే ఆగష్టు సంచిక ముఖచిత్రం 'అనంతశయన పద్మనాభ శ్రీమహావిష్ణువు' ఏకాండ దారుశిల్ప ముఖ్య కథనాన్ని, మూలకారకుల వివరాలను అందించాము. **మిసిమి** పాఠకులు ఎందరో వెళ్లి దర్శించుకుని వచ్చి, మాకు చెప్పినవాళ్లు ఉన్నారు. దీనికి కారణభూతులు అయిన చదలవాడ కుటుంబం – ముఖ్యంగా శరత్‌బాబు గారు కూడా పైన ఉదహరించిన మహానుభావుల కోవలోకే వస్తారు. ఎందుకంటే వ్యాపారాన్ని పక్కనపెట్టి, వ్యాపకాన్ని తలకెత్తుకుని తమ మహాసంకల్ప సాధనకు ఎన్ని కష్టనష్టాలకు లోనయ్యారో వారి కథనం విన్నాం.



మన్నం రాయుడు

ఇప్పుడైనా నేటితరం కాస్త పరుగులు తగ్గించి – ఆపమని అడగలేం – ఫోనున్ పక్కనపెట్టి – పుస్తకమున్ చేతబూని వారి వారసత్వపు చిహ్నాలను గమనించి గర్వించవలసిందిగా, ఈ పరంపరను ఏదో రూపంలో కొనసాగించవలసిందిగా ఆశించటం అత్యాశ కాదేమో? పైన చెప్పిన ముగ్గురి మహాయజ్ఞాల పవిత్ర అగ్నిశిఖల వెచ్చదనం తగ్గిపోకుండా తమవంతు కృషి కొనసాగించాలి – తెలుగు తెనుగు అని గళమెత్తి పలికే ప్రతిప్రాణీ ఆ వెచ్చదనంలో సాంత్వన పొందాలని అగ్నిసాక్షిగా అస్తు – అవిఘ్నమస్తు.



శరత్‌బాబు

# అమృత వర్షిణి

ఎప్పటి శ్రీకృష్ణుడు? ఎప్పటి గీత! అయిదు వేల సంవత్సరాలు గడిచి పోయాయి. ఇప్పుడింకా ఆ 'గీత' మన గీతల్ని మెరుగుపర్చగలదా? నిజమే, యుగం మారింది. అవసరాలు మారినయ్. వాటిని బట్టి విలువలు రూపాంతరీకరణం చెంది, కాలగమనంలో పలచబడి, మనిషిని గందరగోళంలో పడేస్తున్నయ్. ప్రాపంచిక సంపదలెన్ని వున్నా, విజ్ఞాన శాస్త్రం అంతరిక్షాన్ని అరచేత నిలిపినా, అన్వేషణలన్నీ జీవించటానికి అక్కరకొచ్చే రీతిలో సాగుతున్నా, ఆనందం అందని పండై వేదననే మిగుల్చు తున్నది.సమాజ గమనం మందగించి, మానవుడిలో దీనత్వ, దానవత్వాలు పెచ్చరిల్లి, ఆదర్శాలను ఆశలు ప్రతిఘటిస్తున్న నేపథ్యంలో, ద్వాపరాంతంలో, రణభూమికలో జ్ఞాన శంఖాన్ని పూరించి, పూర్ణ మానవత్వాన్ని ఆవిష్కరించే దిశలో నల్లనయ్య పలికిన చల్లని మాటలే ఈనాటికీ మానవాళికి సాంత్వన కలిగిస్తాయి. దిశానిర్దేశం చేస్తాయి. మనిషి, మనిషిగా మనవలసిన అవసరాన్ని స్పష్టం చేస్తాయి. అనంత ముఖీనంగా సాగిన కృష్ణ గీత ఒక తాత్త్విక విభూతి. సమన్వయము – సంఘర్షణ, లాలిత్యం – కాఠిన్యం, మాధుర్యం – విషాదం, మోహం – మోహనం పరమ రమణీయంగా కలబోసుకున్న అచ్చమైన మానవ మాధవీయమే శ్రీకృష్ణ సంచారం. ఆయన అందించిన బోధ, మానవ హృదయాంతర్గత చైతన్యాన్ని మేల్కొలిపి, మనిషిని కర్తవ్యోన్ముఖుణ్ణి చేయగల శక్తివంతమైన ప్రబోధం. "ధర్మాన్ని స్మరించు – ధర్మాన్ని ఆచరించు" అన్న బోధ మనిషికి ఆనంద మార్గాన్ని సిద్ధం చేస్తుంది. ఎవరు చేయవలసిన పనిని వారు సక్రమంగా, సులక్షణంగా, సర్వజన హితంగా చేయటమే ధర్మం.

సమస్త మానవజాతి, పరస్పరం యోగక్షేమాలను వహిస్తూ, ప్రేమ – సేవలను సమన్వయం చేసుకోగలిగితే జీవితం నందనవనం అవుతుంది.కష్టం ఒక కర్మనిష్ఠ, మనిషిని జాగృతం చేసే మహత్తర భూమిక. తనను తాను నిగ్రహించుకుని, సంస్కరించుకోగల అవకాశం లభించినప్పుడు, ఎంతటి కష్టమైనా ఒక యోగమై నిలుస్తుంది. కర్మలు చేస్తూ వుండాల్సిందే. కర్మానుభవాలు నిలబడాలి. కర్మల వలన లభించే లాభాలను వదులు కోవాలి. అపేక్ష నుండీ ఉపేక్ష వైపు మనసును మళ్ళించాలి. అది శాంతిని ప్రసాదిస్తుంది. కోరికలు తగ్గించుకుంటుంటే మనసు నెమ్మదిస్తుంది. అది స్థితప్రజ్ఞను అనుగ్రహిస్తుంది. మనిషి ఉత్తముడు, ఉన్నతుడు కావాలి. ఆలోచన – ఆచరణల మధ్య సమన్వయం ఉండాలి. సంఘర్షణ లేని జీవితం, ఇతరులకు ఆనందాన్ని, ఆదర్శాన్ని అందిస్తుంది. మానవజన్మ, కర్మల వలన ఏర్పడింది. సత్కర్మలతో దాన్ని మరింత సుందరతమం చేయాలి. మనం మంచిని ఆచరిస్తే, ఫలితం లోకానికంతటికీ చెందుతుంది. వైరాగ్యమే అసలు సంపద. వైభోగం నశించవచ్చు. అది దు:ఖకారిణి. అన్నీ వున్నా. ఏవీ తనవి కావన్న భావనలో ఉండటమే వైరాగ్యం. సుఖం, సంతోషం తాత్కాలికమైనవి. ఆనందమే శాశ్వతమైనది.

*బ్రహ్మనిష్ఠ గల వాడే బ్రాహ్మణుడు...*
*అసత్యాన్ని ధిక్కరించు వాడు క్షత్రియుడు...*
*నిరంతరం కృషి సలుపువాడు వైశ్యుడు...*
*కర్మనిష్ఠాపరుడే శూద్రుడు...*

ఈ నాలుగు స్థితుల సమగ్రత్వమే మానవత్వం. తత్త్వవేత్త, దేహాభిమానంలేని వాడు, నిత్యత్యాగి, శాంతం, వైరాగ్యం, కరుణ, మధుర వాక్కు సచ్చరిత్ర కలవాడే గురువు. సమర్పణ, శరణాగతి, వినయం, శ్రద్ధ, ఏకాగ్రత, ఓర్పు కలవాడే శిష్యుడు అధ్యయనం, అభ్యాసం, ఆచరణ వుంటే లోకంలో అసాధ్యమన్నది లేదు. అంతర్గత శక్తే గురువు, దానిని ఎల్లవేళలా గుర్తెరిగి వర్తించాలి. ధ్యాన, జ్ఞాన, యోగాల ద్వారా శక్తిని వృద్ధి చేసుకోవాలి. ఆ శక్తిని సమాజహితం కోసం వెచ్చించాలి. ఉత్తమ భావం, ఉత్తమ రూపం, ఉత్తమ కర్మలే దైవం. దేవ అంటే ఆట. దైవం అంటే ఆడించే వాడు, అడుకునేవాడు! దైవంతో ఆడగలిగిన వాడు మానవుడు. ప్రజ్ఞకున్న రెండు కోణాలివి.

*మంచి మాటలను వినటం శ్రవణ సత్వం.*
*మంచినే చూడగలగటం దృష్టి సత్వం.*

జీవితం నియమబద్ధం కావాలి. మానవుడు మర్యాదలను అతిక్రమించకూడదు. ఆక్రమణ చేయకూడదు. తన పరిధిలో తాను వుంటూ, కర్తవ్య నిర్వహణ చేయాలి. నూనె, వత్తి, ప్రమిద లేకుండా దీపం ఉండదు. దేహం, మనసు, హృదయం లేకుండా మనిషి లేడు. పరస్పరం, ఒక దానిపై ఒకటి ఆధారపడినట్లు, వ్యక్తి లేకుండా సమాజం లేదు. సమాజ బలం లేకుండా వ్యక్తి రాణించడు. విధ్వంసాన్ని విడనాడాలి. విధాయకాన్ని మరువరాదు. అయితే చెడును విధ్వంసం చేయాలి. మంచిని పెంచి, పోషించాలి.

*ధ్యాయతో విషయాన్పుంస: సఙ్గాస్తేషూపజాయతే!*
*సఙ్గాత్సఞ్జాయతే కామ: కామాత్ క్రోధోభిజాయతే!!*
*క్రోధాద్భవతి సమ్మోహ: సమ్మోహాత్ స్మృతివిభ్రమ:!*
*స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి!!!*

(కోరికలు కోపానికి దారితీస్తాయి. కోపం వల్ల మనిషి విచక్షణాశక్తిని కోల్పోతాడు. అందువల్ల బుద్ధి నశిస్తుంది. అది మనషి పతనానికి హేతువవుతుంది) ఇలాంటి సందేశాల్ని కాలం, మతం, దేశం, జాతి వంటి భావాల చట్రంలో బిగించి ఉపేక్షించగలమా! కాస్త జాగ్రత్తగా గీతాబోధను ఆచరించటం ప్రారంభిస్తే, మనిషి మనసు శాంతి ధామమై, ప్రశాంతి నిలయమై, ఆనంద కాసారమై స్థిమితంగా ఉంటుంది.

ప్రపంచ శాంతి, వ్యక్తి శాంతితోనే మొదలౌతుంది.

వి.ఎస్.ఆర్. మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త, ఫోన్ : 9440603499

# కాశీలో పద్మాల వీధి

*– కిల్లాడ సత్యనారాయణ*

పద్మాల వీధి పేరు వినగానే ఇందులో గొప్పతనం ఏముందనిపిస్తుంది. నిజమే. పద్మాలు ఉండే కొలనులు, ఆ కొలనులుండే వీధులు సామాన్యమే. కాశీలో ఈ పద్మాలవీధి ప్రత్యేకం. అలాంటి వీధి గురించి నేను వినలేదు. పద్మాలంటే పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ వంటి పురస్కారాలు. ఈ పురస్కారాలు అందుకున్న వ్యక్తులు పద్మాలు. ఆ పద్మాలు ఉండే వీధి కబీర్ చౌరా. ఇది కబీర్ జ్ఞానోదయం పొందిన స్థలం. ఇక్కడే ఆయన దోహాలను, బీజక్కలను రాసారు. ఇక్కడ కబీరుమతం ఉంది. ఈ వీధికి ఓ ఆకర్షణ ఉంది. ఈ వీధిలోకి ఒక రాతిపలక మనల్ని స్వాగతిస్తుంది. అది ఒక బోర్డు. ఆ బోర్డు చూసి ఆశ్చర్యపోయాను. ఆ బోర్డు మీద సుమారు 40 మంది పేర్లు. వారి బిరుదులు, అవార్డులు. ఇంటి నెంబర్లతో సహా రాసి ఉంది. ఈ 40 మంది సంగీత విద్వాంసులే. వీరిలో చాలామంది పద్మాన్ని అందుకున్న వాళ్లే. ఆ వీధిలో నడుచుకుంటూ ముందుకు వెళ్లాను. ఆ వీధిలో ప్రతి ఇంటిద్వారం పక్కన రాతిపలక బోర్డు ఉంది. ఆ బోర్డులో ఆ ఇంట్లో ఉన్న సంగీత విద్వాంసుల పేర్లు, వారి ప్రత్యేకత రాసి ఉన్నాయి. ఆ బోర్డు చూస్తే చాలు, ఆ ఇంట్లో ఎన్ని పద్మాలున్నాయో తెలుస్తుంది. ఆ వీధి మొత్తం గాలించాను. ఈ బోర్డులేని ఇల్లు లేదంటే లేదు. అలాంటి వీధిని నేను దేశంలో ఎక్కడా చూడలేదు. విదేశాల్లో ఉన్నాయేమో తెలీదు.



పద్మభూషణ్ రాజన్ మిశ్రా, సాజన్ మిశ్రా
వీరిద్దరు అన్నదమ్ములు. 57 సంవత్సరాలు వీరిద్దరూ కలిసి పాడారు.

సితార వాద్యకారుడు అన్షుమాన్ నాకు మిత్రుడు. వాళ్ళింటికి వెళ్ళాను. అతను కబీర్ చౌరా సంగీతసంపద గురించి వివరించాడు. అన్షుమాన్ పం. కిషన్ మహారాజ్ గారి బంధువు. నన్ను వాళ్ళింటికి తీసుకువెళ్ళాడు. కిషన్ మహారాజ్ గారు కీర్తిశేషులయ్యారు. వారి కుమారుడు పూరన్ మహారాజ్ తబలా వాద్యకారుడు. మేం వెళ్ళేసరికి ఆయన వాళ్ళ ఆరేళ్ల అమ్మాయికి తబలా నేర్పుతున్నారు. ఆ అమ్మాయి తబలా వాయిస్తుంటే చూడ ముచ్చటయ్యింది. ధిరి నా ధిరి నా, ధిరి ధిరి న న...వాయిస్తుంది. పూరన్ గారు మమ్మల్ని చూసారు. ఇంట్లోకి తీసుకెళ్లారు. పూజగది చూపించారు. వారి నాన్నగారి ఫోటోలు చూపించారు. వారు సాధన చేసుకునే హాలు చూపించారు. చాలా ప్రశాంతంగా ఉంది. “ మా నాన్నగారు ఎక్కువగా చదువుకోలేదు.” కానీ చాలా క్రమశిక్షణతో ఉండేవారు. ఎప్పుడూ కొత్త విషయం నేర్చుకోవాలనే ఆసక్తితో ఉండేవారు. అందుకే ఇంగ్లీషు భాష కొంచెం నేర్చుకున్నారు. “వాళ్ళ నాన్నగారు ఫొటోవైపు తదేకంగా చూస్తూ, అన్నారు పూరన్.” “మీ నాన్నగారు ఈ ఇంట్లోనే పుట్టారా?” అనడిగాను నేను. ‘‘అవునండి. ఆయన సెప్టెంబర్ 3, 1923లో జన్మించారు. వీరు పం. కంటే మహారాజ్ గారి శిష్యులు” అన్నారు.

“వీరు ఏ వయస్సు నుండి సాధన ప్రారంభించారు?’’ ఆయన గురించి ఇంకా తెలుసుకోవాలన్న నా కుతూహలాన్ని పూరన్ గమనించారు. “ఆయన పదకొండేళ్ల వయస్సులో కాశీలో అఖిల భారత సంగీత సమ్మేళనం జరిగింది. దానిలో నాన్నగారు తబలా వాయించారు. మంచి పేరు వచ్చింది. అప్పటి నుండి ఆయన కీర్తి పెరుగుతూ వచ్చింది. ఆయన పం. ఓంకార్ నాథ్ ఠాకూర్, ఉస్తాద్ బడే గులాం అలీ ఖాన్, అమీర్ ఖాన్, నజాకత్ అలీ, ఉస్తాద్ విలాయత్ అలీ ఖాన్, పం. రవిశంకర్, పం. భీం సేన్ జోషీ వంటి ప్రముఖులతో కలిసి ప్రదర్శన యిచ్చారు. శ్రీ అచ్చన్ మహారాజ్, శ్రీ శంభూమహారాజ్, శ్రీమతి సితారాదేవి, సు.శ్రీ. రోషన్ కుమారి, నటరాజ గోపీకృష్ణ, బిర్జూమహారాజ్ వంటి మేటి నాట్య కళాకారులకు తబలాతో అండగా నిలిచారు.




పద్మవిభూషణ్
పండిట్ కిషన్ మహరాజ్

1960లో గాంధీ జయంతి ఉత్సవానికి పండిత్ రవిశంకర్‌తో కలిసి నేపాల్‌లో ప్రదర్శన ఇచ్చారు. 1965లో యూ.కె లో కామన్ వెల్త్ ఆర్ట్ ఫెస్టివల్ లో శ్రీ రవిశంకర్ తో కలిసి తబలా వాయించారు. అంతేకాదు. వీరు అనేక దేశాల్లో ప్రదర్శన ఇచ్చారు. భారతీయ సంగీత గౌరవాన్ని ఎలుగెత్తి చాటారు. సంగీత రంగంలో వీరు పొందని బిరుదు లేదు. అందుకోని అవార్డు లేదు. 1969 లో వీరికి సంగీత సామ్రాట్ బిరుదు లభించింది. 1973లో వీరిని 'పద్మశ్రీ' వరించింది. 2002లో వీరిని 'పద్మ విభూషణ్' తో భారత ప్రభుత్వం సత్కరించింది. వీరికి లభించిన అవార్డులు ఒకవంతయితే, జనాదరణ రెండింతలు. "మే 4, 2008లో వీరు మమ్మల్ని విడిచి వెళ్ళిపోయారు" అంటూ కళ్ళు తుడుచుకున్నారు పూరన్ గారు. తండ్రి పట్ల వారికి గల గౌరవం, ఆత్మీయత నా కళ్ళ ముందు నిలిచాయి. పూరన్ గారి శ్రీమతి కాఫీ తీసుకొచ్చారు. నేనూ, అన్షుమాన్ తీసుకున్నాం. "సార్ స్టాఫ్‌కు కూడా ఇవ్వు" అన్నారు పూరన్ తన భార్యతో. "మీరు పోలీసు అధికారి. సంగీతం పట్ల మీకు ఇంత అభిరుచి ఎలా? నాకు ఆశ్చర్యంగా ఉంది. మీ అమ్మాయికి కూడా సంగీతం నేర్పిస్తున్నారని అన్షుమాన్ చెప్పాడు." అనడిగారు పూరన్. సన్నటి నా నవ్వుతో బదులిచ్చాను. వారి వద్ద నుండి బయలుదేరాం.

పం. కిషన్ మహరాజ్ కుటుంబంతో తన బంధుత్వం గురించి అన్షుమాన్ చెప్పాడు. అలా చెబుతూ కబీరు మఠంలోకి తీసుకువెళ్ళాడు. ముందుగా మహంత్ గారికి ఫోను చేసాడు. "అరె. సత్యనారాయన్ జీ. ఆప్ ఆ రహే హై. మై కోయీ ఔర్ సమజా. బహుత్ ఖుషీ హుయి. ఆయియే" అంటూ లోపలికి తీసుకెళ్లారు మహంత్ సంత్ వివేక్ దాస్ ఆచార్య. అన్షుమాన్ మా ఇద్దరి ఆత్మీయతను గమనిస్తున్నాడు. నేను మహంత్ గారిని 'కబీర్ కే రామ్' పుస్తకావిష్కరణలో కలిసాను. "కబీరును కొత్త కోణంలో చూపిస్తుంది ఈ పుస్తకం" అంటూ అప్పుడు ప్రసంగించాను. ఆ పుస్తక రచయిత ప్రొ. ఇండీవర్ పాండేగారు నాకు మిత్రులు. ఆ తర్వాత మేం రెండు మూడుసార్లు కలిసాం. మా మధ్య కొంత సాంగత్యం ఏర్పడింది. ఆయన నాకు మఠం చూపించారు. కబీర్ చౌరాలోని ఒక చిన్న గుట్ట మీద నుండి కబీరు ఉపదేశం ఇచ్చేవాడు. ఆ స్థలాన్ని అలాగే భద్రంగా ఉంచారు. దానిపై చిన్న గుడిసె కట్టారు. సాధువులకు అన్నసంతర్పణ చేసేవాడు. ఇక్కడే నీరూ, నీమాలు కబీరును పెంచారు. ఇప్పుడిక్కడ కబీరు మఠం ఉంది. ఈ మఠంలో మగహర్ నుండి తెచ్చిన పుష్పం మీద కబీరు సమాధి నిర్మించారు. తర్వాత దానిపై మందిరం కట్టారు. కబీరు సిద్ధాంతాలకు అనుగుణంగా ఈ మందిరంలో ఏ ఆడంబరం ఉండదు. ఈ మందిరం పక్కనే బీజక్ మందిరం ఉంది. దీనిలో మహంత్ గారి గద్దీ ఉంది. ఆ ప్రాంగణంలో ఏ మూల చూసినా కబీర్ దోహాలే. అక్కడ ధార్మిక, తాత్విక చర్చలు జరుగుతూ ఉంటాయి. కబీరు మఠానికి దగ్గర్లో రాజన్ మిశ్రాగారి ఇల్లుంది. అక్కడికి వెళ్ళాం. ప్రవేశ ద్వారం పక్కన ఒక బోర్డు ఉంది. ఆ ఇంట్లో ఎవరెవరు ఏ కళల్లో ప్రావీణ్యులో ఆ బోర్డు ద్వారా తెలుస్తుంది. నాలుగు శతాబ్దాల కుటుంబ పరంపరను ఇద్దరన్నదమ్ములు కీర్తిశిఖరాలకు తీసుకెళ్లారు. వాళ్లే రాజన్ మిశ్రా, సాజన్ మిశ్రా. వీరిద్దరికీ సంగీత శిక్షణ తాతగారు పండిత్ బడేరాంజీ మిశ్రా, తండ్రి హనుమాన్ మిశ్రా ఇచ్చారు. 1978లో బాల్యంలో వీరిద్దరూ శ్రీలంకలో ప్రదర్శన ఇచ్చారు. ఆ తర్వాత చాలా దేశాల్లో పాడారు. ఖయాల్ శైలికి వీరిద్దరి జోడి ప్రఖ్యాతి చెందింది. సంగీత క్షేత్రంలో వీరు చాలా అవార్డులు పొందారు. 2007లో వీరిద్దరినీ పద్మభూషణ్ తో భారత ప్రభుత్వం సత్కరించింది. సాజన్ పెళ్లి పండిత్ బిరుజూ మహరాజ్ కుమార్తె కవితతో జరిగింది. రాజన్ వివాహం పండిత్ దామోదర్ మిశ్రా కుమార్తెతో జరిగింది. రాజన్ కుమారులు రితేష్, రజినీష్ లు కూడా మంచి గాయకులు. రాజన్ – సాజన్ మిశ్రాల తండ్రి పం. హనుమాన్ ప్రసాద్ మిశ్రా. వీరు సారంగి వాద్యంలో నిష్ణాతులు. వీరు కబీర్ చౌరాలో జన్మించారు. కేంద్రీయ సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్నారు. ఏప్రిల్ 24 2021న పం. రాజన్ మిశ్రాను కొరోనా బలితీసుకుంది.



టుమ్రీరాణి పద్మవిభూషణ్ గిరిజాదేవి

ఆ తర్వాత టుమ్రీరాణిగా పేరుగాంచిన శ్రీమతి గిరిజాదేవిగారి ఇంటికి వెళ్ళాం. వారి ఇంటికి తాళం వేసి ఉంది. ఆమె కుమార్తె మున్నీదేవి గారు కలకత్తాలో ఉంటున్నారని అన్షుమాన్ చెప్పాడు. శ్రీమతి గిరిజాదేవిగారు 1929 లో జన్మించారు. ఐదేళ్ల వయసు నుండే సంగీత సాధన ప్రారంభించారు. తొమ్మిదేళ్ల వయసులో 'యాద్ రహే 'హిందీ సినిమాలో నటించారు. ఆమె గురువు సర్జూప్రసాద్ మిశ్రా శాస్త్రీయ సంగీతంలో నిష్ణాతుడు. ఆమె 1949లో అలహాబాద్ ఆకాశవాణిలో మొదటిసారి పాడారు. ఆ తర్వాత చాలా ప్రదర్శనలు ఇచ్చారు. 1980లలో కలకత్తాలోని ఐటిసి సంగీత పరిశోధన సంస్థలో పనిచేసారు. సంగీతంపై పరిశోధనలు చేయించారు. ఆ తర్వాత బీహెచ్ యూలో కూడా బోధించారు.

ధ్రుపద్, ఖయాల్, టప్పా, తరానాలు పాడేవారు. అలాగే సాంప్రదాయ పద్ధతులైన హోరీ, చైతి, కజరి, ఝు, భజనలు కూడా పాడేవారు. శ్రీమతి గిరిజాదేవికి 1989లో పద్మభూషణ్, 2016 లో పద్మవిభూషణ్ లభించాయి. అన్షుమాన్ నన్ను పం. చన్నూలాల్ మిశ్రా గారి ఇంటికి తీసుకెళ్ళాడు. వీరు పం. అనోఖేలాల్ మిశ్రాగారి అల్లుడు. అనోఖేలాల్ గారు ప్రముఖ తబలా వ్యాద్యకారులు. పం. చన్నూలాల్ మిశ్రా హిందుస్థానీ సంప్రదాయ సంగీతంలో నిష్ణాతులు. కిరానా ఘరానా, ఖయాల్, చైతి, టుమ్రీలలో ప్రావీన్యులు. వీరు కబీర్ దోహాలను, రామచరితమానస్ ను శాస్త్రీయ సంగీతంలో పాడారు. వీరి గురువు స్వర్గీయ పద్మభూషణ్ ఠాకూర్ జయదేవ్ సింగ్. వీరివద్ద కిరానా ఘరానా నేర్చుకున్నారు. వీరిని 2010లో పద్మభూషణ్, 2020లో పద్మవిభూషణ్ వరించాయి. వీరు వారణాసి ఘరానాకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొచ్చారు. 2021లో వీరి భార్య, కుమార్తె కోవిడ్ కారణంగా స్వర్గస్తులయ్యారు. అనోఖేలాల్ మిశ్రా పం. చన్నూలాల్ మిశ్రాగారి మామగారు. అనోఖేలాల్ మిశ్రా పేదరికంలో పుట్టారు. తబలా నేర్చుకోవాలనుకున్నారు. ఆయన ఆసక్తికి మెచ్చి భైరో ప్రసాద్ మిశ్రా ఆయనను శిష్యుడుగా చేర్చుకున్నారు. అప్పుడు ఆయనకు ఆరేళ్లు. పట్టుదలతో సాధన చేసేవారు. ఆయనను 'నా దిన్ దిన్, నా దేరే దేరే టక్'ల మాంత్రికుడిగా పేర్కొంటారు. ఆయనను తబలా సామ్రాట్ అంటారు. ప్రముఖ తబలా వాద్యకారుడు శ్రీ శాంతప్రసాద్ మిశ్రాగారు అనోఖేలాల్ గురించి ఇలా అంటారు. "నేను ఆయన వాయించిన దాంట్లో నాలుగో వంతు మాత్రమే వాయిస్తున్నాను. అయినా నాకు ఎక్కువ ఖ్యాతి లభించింది. వచ్చే జన్మలో నేను ఆయన వాద్యంలో సగం వాయిస్తే, నన్ను వాళ్ళు ఆకాశానికి ఎత్తుతారు." పం. రాంసహాయ్ 1780-90 మధ్య జన్మించారు. మూడేళ్ల వయసు నుండే తబలా సాధన ప్రారంభించారు. 20 ఏళ్ల వయసులో తబలా వాద్యంలో వీరి కీర్తి దేశమంతా వ్యాపించింది. వీరు బనారస్ తబలా ఘరానా వైతాళికులు. తబలాశిరోమణి శ్రీ కంఠే మహరాజ్ గారు 1880లో కబీర్ చౌరాలో జన్మించారు. వీరు తబలాలో స్తుతిని ప్రవేశపెట్టారు. వీరు అనేకమంది శిష్యులను తయారు చేసారు. బనారస్ తబలాకు విశ్వఖ్యాతిని తీసుకొచ్చినవారు పం. శాంతా ప్రసాద్ మిశ్రా. వీరు 1920 జూలై 18న కబీర్ చౌరాలో జన్మించారు. తొమ్మిదేళ్ల వయసులో తన తండ్రి నుండి తబలా నేర్చుకున్నారు. ఈయన జర్మనీ, ఆఫ్రికా, కాబుల్, యూరప్‌లో ప్రదర్శన ఇచ్చారు. మేరీ సూరత్ తేరీ ఆంఖే, జనక్ జనక్ పాయల్ బజే, షోలే వంటి చిత్రాల్లో తబలా వాయించారు. మ్యూజిక్ డైరెక్టర్లు రాహుల్ దేవ్ బర్మన్, బప్పిలహరి వీరి శిష్యులు. వీరికి 1972లో పద్మశ్రీ, 1991లో పద్మభూషణ్ లభించాయి. అన్షుమాన్ మంచి సితార వాద్యకారుడు. విదేశాల్లో ప్రదర్శన ఇచ్చాడు. క్రిందటి సంవత్సరం 'కాశీ గౌరవ్' అవార్డు అందుకున్నాడు. వారణాసిలో 2023లో జరిగిన G-20 ప్రతినిధుల సమావేశంలో ప్రదర్శన యిచ్చాడు. ఇద్దరం నడుచుకుంటూ వెళ్తున్నాం. మార్గంలో – "సార్. నాకో ఘటన గుర్తుకొచ్చింది. చెప్పనా?" అన్నాడు అన్షుమాన్. చెప్పండి అన్నాను.

"1979లో కబీర్ చౌరాలోని 'రామచరిత మానస్ సమితి' రజతోత్సవంలో ఒక చమత్కారం జరిగింది. ఈ

సంస్థ స్థాపకుడు పండిత్ బైజనాథ ప్రసాద్ మిశ్రా. ఆయన దేశంలో ప్రసిద్ధ సారంగీ వాదకులు. ఆయన ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్, పం. కిషన్ మహారాజ్, పం. బైజనాథ్ మిశ్రాలు ముగ్గురూ కలిసి శహనాయి- తబలా-సారంగిల యుగలబందిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి రావడం కోసం బిస్మిల్లాఖాన్ గారికి వాహనం పంపిస్తానన్నారు బైజనాథ్ మిశ్రా. దాన్ని తిరస్కరిస్తూ బిస్మిల్లాఖాన్ తమ సహచరులతో నడిచి వచ్చారు. కార్యక్రమం తర్వాత నడిచి వెళ్లారు. "సహ కళాకారుడి కార్యక్రమానికి వెళ్ళడానికి వాహనా లెందుకు?'' అన్నారు. ''కాశీలో సంగీతం ఎప్పుడు పుట్టింది? ఎవరు ప్రారంభించారు?" అనడిగాను. "దీనికి ఖచ్చితమైన సమాధానం నా దగ్గర లేదు. కానీ కాశీ జనజీవనంలో మిళితమై సంగీతం ప్రాచీనకాలం నుండీ ప్రవహిస్తుంది" అని బదులిచ్చారు అలా మాట్లాడుకుంటూ ఇద్దరం అన్నుమాన్ ఇంటికి వెళ్ళాం. ఆయన సంగీతానికి సంబంధించిన కొన్ని పుస్తకాలు నా ముందుంచారు.

బౌద్ధ జాతక కథల్లో కాశీరాజు బ్రహ్మదత్తుడి గురించి వర్ణించబడింది. ఆ కాలంలో విఖ్యాత వీణావాదకులు గుప్తిల్ ఉజ్జయిని వీణావాదకులు 'ముసిల్' ను వీణపోటీలో ఓడించినట్లు చెప్పబడింది. బౌద్ధకాలంలో నగరవధువులు శ్యామా, సులసా, చిత్రలేఖ తమ నృత్యసంగీతాలతో మనోరంజనం చేసేవారు. వీరికి సమాజంలో గౌరవం ఉండేది. మధ్యకాలంలో ముస్లిం పాలకుల ద్వారా ఇరానీ సంగీతం ప్రవేశించింది. భారతీయ సంగీతంతో ఇచ్చి - పుచ్చుకోవడం జరిగింది. ఫలితంగా కొత్త సంగీత శైలులు, వాద్యాలు వచ్చాయి. మొఘల్ సామ్రాజ్యం తరువాత, రాజులు, నవాబులు దీన్ని పోషించారు. మైసూరు, విజయనగరం, కాశీ రాజులు వంటి రాజులు, హైదరాబాదు, అవధ్ వంటి నవాబులు... సంగీత, నృత్య కళలకు ఆశ్రయం ఇచ్చారు. ఆ తర్వాత ఇది కుటుంబాలకు పరిమితమయింది. వంశపారంపర్య ఘరానాగా వృద్ధి చెందింది. మూడు తరాలు ఒక కళను లేదా శాస్త్రాన్ని నిరంతరంగా కొనసాగిస్తే ఆ కుటుంబాన్ని ఘరానాగా పిలుస్తారు. కాశీ ఘరానాల నిలయం. అందులో కబీర్ చౌరా ఘరానాల దేవాలయం.

అవధ్ నవాబుల సంగీతప్రేమను తెలిపే పుస్తకం 'మఅదన్ - ఉల్ - మౌసికి'. కాశీలో ధ్రుపద్ గాయకుడు మనోహర్ మిశ్ర, ఖ్యాల్ గాయకుడు బకా-మదారి, శాదీఖాన్ ముఖ్యులు. గాయికలలో చిత్రా, అనుపమ్ ముఖ్యులు. సితార వాయిద్యంలో వాజ్ పాయ్, సారంగిలో జతన్ మిశ్ర, కల్లూ, ధన్నూ డాడీ విద్వాంసులు. శహనాయిలో అహ్మద్ అలీ, తబలాలో పం. రామసహాయ్, ప్రకాష్ ప్రముఖులు. కాశీరాజు మహీప్ నారాయణ్ సింగ్ ఆస్థానంలో తాన్ సేన్ వంశస్తులైన జీవనఖాన్ - ప్యారేఖాన్ ఉన్నారు. రాజా చేతసింగ్ వద్ద దులారి, కజ్జన్, కిషోరి, రుక్మిణి, చిత్తన్ బాయ్ పనిచేసారు. రాజా బల్వంత్ సింగ్ ఆస్థాన కళాకారులుగా చతుర్ బిహారీ మిశ్రా, జగరాజ్ సుకుల్, ఖుషహాల్ ఖాన్ ఉన్నారు. రాజా ఈశ్వరి నారాయణ్ సింగ్ ఆస్థానంలో జాఫర్ ఖాన్, ప్యారే లాల్, బాసత్ అలీఖాన్ ముఖ్యులు.

మొగల్ సామ్రాజ్యం అంతమయ్యాక, ఢిల్లీ నుండి కాశీకి చాలా మంది కళాకారులు వచ్చారు. ఇక్కడ కళాసాగరంలో స్థిరపడ్డారు. వీరిలో వీణావాదకులు వారిస్ అలీ, టప్పా గాయకులు అక్బర్ అలీ, ధ్రుపద్ గాయకులు నిసార్ అలీ, ఖయాల్ గాయకులు సాదిక్ అలీ ముఖ్యులు. కొందరు అవధ్ నుండి వచ్చారు. కాశీ కళలకు వియెన్నా లాంటిది. ఇది కళాకారులను ప్రేమిస్తుంది. రాజపోషణ పోయింది. కళలు కుటుంబాల్లో వెలిగాయి. ఘరానాలు వెలిసాయి. అశిక్ అలీ ఖాన్ గారి కుటుంబంలో తెలియానాల ఘరానా (సితార), మనోహర మిశ్రా గారి కుటుంబంలో పియరీ ఘరానా, శివదాస్ మిశ్రా గారి కుటుంబంలో 'శివదాస్-ప్రయగ్ మిశ్రా ఘరానా ముఖ్యమైనవి. పియరీ ఘరానా పండిత్ దిల్ రాం మిశ్రాతో ప్రారంభమైంది. వీరు క్రీ.శ. 16వ శతాబ్దపు ప్రథమ భాగానికి చెందినవారు.వీరు సేవక్ పేరుతో అనేక దృపద్‌లు రాసారు. వీరి కుమారులు మనోహర్ మిశ్రా (1794-1846), హరి ప్రసాద్ మిశ్రా ( ప్రసిద్దూజీ)పేరు గాంచిన గాయకులు. మూడో కుమారుడు విశ్వేశ్వర మిశ్రా సితార వాద్యకారులు. పాటియాల మహారాజు 40 రోజులు సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. దేశం నలుమూలల నుండి 1400 మంది విద్వాంసులు ఇందులో పాల్గొన్నారు. దానిలో తాన్ సేన్ వంశస్థుడైన తాన్ రస్ ఖాన్ ను ప్రసిద్దూ - మనోహర్‌లు ఓడించారు. పాటియాలా మహారాజు వీరి శిష్యుడయ్యారు. వీరిని పాటియాలాలో ఉండిపొమ్మని అభ్యర్థించారు. చాలా ధనం, వజ్రవైఢూర్యాలు ఇస్తానన్నారు.

వాటన్నింటినీ వీరు తిరస్కరించారు. రాజుగారిని కాశీ వచ్చి నేర్చుకోమన్నారు. వీరిరువురి కుమారులు కూడా మంచి గాయకులే. దర్గాహిమిశ్రా ఘరానా దర్గాహితో మొదలయ్యింది. దర్గాహిమిశ్రా తాతగారు రామ్ చరణ్ మిశ్రా తబలా వాద్యకారులు. దుర్గాహి మిశ్రా కబీర్ చౌరాలో స్థిరపడ్డారు. వీరు కాశీరాజు దర్బారు గాయకులు. ప్రముఖ గాయికలు జద్దన్ బాయి, శ్యామా బాయి వీరి శిష్యులు. గాయికలలో ప్రముఖంగా చెప్పుకోవలసిన పేరు హుస్నాబాయి. ఈమె పం. రామసేవక్ జీ, పం. చోటే రామదాసుల శిష్యురాలు. ఈమె నృత్యం కూడా చేసేవారు. కొత్త కొత్త రచనలు చేసేవారు. ఈమెకు భాషపై మంచి పట్టు ఉండేది. ప్రముఖ కవి భారతేందు ఈమె ద్వారా గీతా గోవిందాన్ని స్వరబద్ధం చేయించారు. పద్మశ్రీ సిద్దేశ్వరీదేవి బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. ఆమె బంధువు, గాయిక రాజేశ్వరీదేవిగారి వద్ద పెరిగింది.

సంగీతంతో సిద్దేశ్వరీదేవి పరిచయం యాదృచ్ఛికం. రాజేశ్వరీదేవి తన కుమార్తె కమలేశ్వరికోసం సంగీతశిక్షణ ఏర్పాటు చేసారు. సిద్దేశ్వరికి ఇంటి పనులు అప్పగించారు. ఒకసారి ప్రముఖ సారంగి వాద్యకారులు సియాజిమిశ్రా గారు కమలేశ్వరికి నేర్పుతున్నారు. ఆయన నేర్పుతున్న టప్పాలను చెప్పలేకపోయింది. అది చూసి తల్లి కోప్పడింది. కమలేశ్వరిని కొట్టింది. ఆమె ఎక్కెక్కి ఏడవ సాగింది. వంటగదిలో ఉన్న సిద్దేశ్వరి పరుగున వచ్చి అడ్డుపడింది. టప్పా ఎలా పాడాలో సిద్ధేశ్వరి కమలేశ్వరికి చెప్పింది. ఏ శిక్షణా లేకుండా ఆమె అంత సరళంగా చెప్పడం అందర్నీ ఆశ్చర్యంలో ముంచింది. మరునాడు గురువు సియాజీమిశ్రా వచ్చి సిద్దేశ్వరిని దత్తత కోరారు. అలా ఆమె సియాజీగారి ఇంట్లో ఉండి సంగీతం నేర్చుకున్నారు. ఆమె టప్పా, ఖ్యాల్, చైతీ, దాద్రీ లలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. ఆమె 1966లో పద్మశ్రీ పొందారు. ప్రముఖ దర్శకులు మనికౌల్ గారు ఆమెజీవిత ఆధారంగా 'సిద్దేశ్వరీ' డాక్యుమెంటరీ తీసారు. సియాజీమిశ్రా గారు సారంగిలో అద్భుత ప్రతిభగలవారు. వీరు రాజేశ్వరీ, సిద్దేశ్వరీ, కాశీబాయిల గురువు. ఆయన రోజూ పదహారు గంటలు సాధన చేసేవారట. ఒక్కోసారి రాత్రంతా సాధనలోనే మునిగిపోయే వారట. ఒకసారి రాత్రి సాధనలో ఉన్నప్పుడు ఆయనను తేలు కుట్టిందట. దానిని ఆయన గమనించ లేదు. మరుసటిరోజు చెయ్యి లాగుతున్నట్లుందని భార్యకు చెప్పారు. వైద్యులు వచ్చారు. సాధనలో తేలుకుట్టిన విషయాన్ని గమనించని ఆయన ఏకాగ్రతకు ఆశ్చర్య పోయారు. ఒకసారి ప్రముఖ ఢిల్లీ సారంగి మమ్మన్ ఖాన్ బనారస్ వచ్చారు. ఆయన కార్యక్రమం ఘనంగా జరిగింది. దానితో ఆయనలో అహం పెరిగింది. ఆ సభలో ఆయన "బనారస్‌లో నాతో పోటీ పడగల మగాడున్నాడా" అని సవాలు విసిరారట. సియాజీ మహారాజ్ ముందుకొచ్చారు. ఆయన ప్రదర్శనకు ప్రేక్షకులే కాదు, మమ్మన్ కూడా మంత్రముగ్ధులయ్యారు " నా వాదనలో టప్పాశైలిని మిళితం చేసాకనే మళ్ళీ నేను బనారస్‌లో అడుగుపెడతాను" అన్నారట మమ్మన్ ఖాన్.



పద్మాల వీథి

కాశీలో శహనాయి వాద్యకారులు చాలామంది ఉండేవారు. వీరిలో ప్రముఖవ్యక్తి శ్రీ నందలాల్ జీ. వీరు 1896లో జన్మించారు. వీరి తాత, తండ్రి కూడా శాహనాయి వాద్యకారులే. వీరు ప్రముఖ గాయకులు బడే రామదాస్ జీ శిష్యులు. వారి నుండి ధృపద్, ఖయాల్, టప్పా, ఠుమ్రీ, చైతీ నేర్చుకున్నారు. వీరు కాశీరాజు ఆస్థానంలో శహనాయి వాద్యకారుడుగా చేరారు. ఆకాశవాణిలో కూడా ప్రదర్శన ఇచ్చారు. వీరి తర్వాత మహబూబ్ అలీ, శంసుద్దీన్ ఖాన్, ఇందాద్ హుస్సేన్, ఖాదిం అలీ, విష్ణు ప్రసన్న శహనాయిని కొనసాగించారు.

భారతరత్న ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ శహనాయిని విశ్వపటలంపై నిలబెట్టారు. ఫ్లూటులో శ్రీ భోలానాద్, హార్మోనియంలో శ్రీ లక్ష్మణ ప్రసాద్, శ్రీ ధృవజీ, మృదంగంలో బాబూ జోధ్ సింగ్, అమరనాథ్ మిశ్రా, మన్నూజీ, విఠల్ దాస్ జీ ప్రముఖులు. సితారలో ఉస్తాద్ మస్తాక్ అలీ ఖాన్, గుల్గూ మహారాజ్, విశ్వేశ్వర మిశ్రా ప్రముఖులు. సారంగిలో శ్రీ హనుమాన్ ప్రసాద్ మిశ్రా, పం. బైజనాద్ మిశ్రా నిష్ణాతులు. 'నాట్యరాణి' గా

విశ్వగురు రవీంద్రునిచే సత్కరించబడ్డ సితారాదేవి గురించి అడిగాను. వారి నాన్నగారు కబీర్ చౌరాలోనే ఉండేవారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. ముగ్గురు కుమార్తెలు పేరు గాంచిన నర్తకులు. ఆయనకు కథక్ నృత్యం అంటే ప్రాణం అంటూ – సార్. ఈ పుస్తకం చదవండి. దీనిలో పెద్ద కుమార్తె అలఖనందా, మూడవ కుమార్తె సితారాదేవీల సాక్షాత్కారాలున్నాయి అంటూ కమల్ నయన్ రాసిన బనారస్ తేరే రంగ్ హజార్ పుస్తకాన్నిచ్చారు. మా నాన్నగారు పం. సుఖదేవ్ మిశ్రా నేపాల్ రాజాస్థాన గాయకులు. అక్కడి రాజగురువు రఘుపండిత్ గారి కుమార్తెను ప్రేమించారు. పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత బెనారస్ వచ్చారు. ఆయన గానం నుండి కథా నృత్యంవైపు మళ్ళారు. ఒక కథను నృత్యంగా మలిచే కొత్త శైలిని ప్రారంభించారు. ప్రారంభంలో నాన్నగారి నుండి నేర్చుకున్నాం ఆ సాక్షాత్కారంలో అన్నారు అలఖ్ నందా. మా నాన్నగారు కథక్ నృత్యం అభివృద్ధి చేయాలనుకున్నారు. బనారస్ లోని చౌక్ వద్ద 'రాధా – కృష్ణ నృత్య కేంద్రం' స్థాపించారు. అక్కడ కథక్ శిక్షణ యిచ్చేవారు. అక్కడ నేర్చుకునేందుకు తవైఫ్‌లు కూడా వచ్చేవారు. దీనితో మా బ్రాహ్మణ సమాజం నాన్నగారిని వెలేసింది అని సితారాదేవిగారు ఆ పుస్తకంలో చెప్పారు. ఆ తర్వాత కుటుంబాన్ని తీసుకుని పం. సుఖదేవ్ గారు ముంబయి వెళ్లారు. అక్కడ పిల్లలకు కథక్‌లో శిక్షణ యిప్పించారు. కలకత్తా, బెనారస్ వస్తూ ఉండేవారు.

కొంతకాలం తర్వాత మేం బెనారస్ వచ్చేశాం. సినిమా నిర్మాత – దర్శకుడు శంకరభట్ గారు నాట్యం చేయగల హీరోయిన్ కోసం వెదుకుతున్నారు. నేను నృత్యం చేస్తున్నప్పుడు నన్ను చూసారు, వెంటనే తన సూర్యకుమారి సినిమాలో మాస్టర్ బచ్చు సరసన నాయిక అవకాశం యిచ్చారు అన్నారు అలఖ్ నందాజీ. అలఖ్ నంద, మాస్టర్ బచ్చు మధ్య ప్రేమ ఏర్పడింది. వివాహానికి అలఖ్ నందా నాన్నగారు అంగీకరించలేదు. ఫలితంగా వేరయిపోయారు. మాస్టర్ బచ్చుకు టి.బి సోకింది. తాను బనారస్ లోనే ప్రాణం విడిచారు.

అలఖ్ నందగారు చాలా హిందీ సినిమాలలో నటించారు. సూర్య కుమారి, పన్ ఘట్, జాదూ కా ఫోడా, హుమాయూన్, భక్త రాజ్ వంటి సినిమాల్లో నటించారు. కథక్ రాణిగా ప్రసిద్ధికెక్కిన సితారాదేవి కలకత్తాలో జన్మించారు. వారణాసిలో తండ్రి వద్ద పది సంవత్సరాల వరకూ ఉండి, కథక్ నేర్చుకున్నారు. ఆ రోజుల్లో ఆడపిల్లలు నాట్యం చేయడాన్ని హేయంగా చూసేవారు. అది తవైఫ్‌ల పనిగా భావించేవారు. పదేళ్ల వయస్సులో తాను బనారస్ లోని బడే గణేశ్ మందిరంలో స్టేజి మీద నాట్యం చేసారు సితారాదేవి. "తన కూతుళ్ల చేత కథక్ నృత్యం చేయించడం ద్వారా, ఈ నృత్యాన్ని తవైఫ్‌లు, భాండ్‌ల స్థాయి నుండి ఉన్నతవర్గ సభ్యసమాజ కళ స్థాయికి చేర్చారు మా నాన్నగారు." అంటారు సితారాదేవి. ఆ తర్వాత సితారాదేవి చాలా ప్రదర్శనలు యిచ్చారు. పదకొండేళ్ల వయసులో ముంబయిలోని అతియాబేగం హౌస్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్, సరోజినీదేవి ముందు ప్రదర్శన యిచ్చారు. పన్నెండేళ్ల వయసులో ముంబయిలోని జహంగీర్ హాలులో ప్రదర్శన యిచ్చారు. అక్కడ ఆమె నృత్యం చూసి, సినీ నిర్మాత, దర్శకుడు నిరంజన్ శర్మ ఆశ్చర్యపోయారు. సినిమాలలో అవకాశం ఇచ్చారు. పదహారేళ్ల వయసులో ఆమె ప్రదర్శ న చూసి, రవీంద్రుడు ఆమెకు 'నృత్య సామ్రాజ్ఞి' బిరుదునిచ్చారు. ఆమె 1967లో లండన్‌లోని 'రాయల్ అబెర్ట్ హాల్'లో, 1976లో న్యూయార్క్ లోని 'కార్నేగి హాలు' లో ప్రదర్శన యిచ్చారు. ఆమె సుమారు 40 హిందీ సినిమాలలో నటించారు. చాలా సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. సినిమాల్లో నటించడం వలన కథక్ నృత్య సాధన దెబ్బతింటుందని భావించారు. సినిమాల్లో నటించడం మానివేశారు. తాను నటించిన ఆఖరి చిత్రం 'మదర్ ఇండియా'. ప్రముఖ సినీనటులు మధుబాల, రేఖ, మాలాసిన్హా, కాజోల్‌లకు ఆమె నృత్యం నేర్పారు. ఆమె బనారస్ ఘరానా ఉన్నతి కోసం చాలా కృషి చేసారు. ఆమెకు 1973లో పద్మశ్రీ లభించింది. ఆమె పద్మభూషణ్ వస్తే, తిరస్కరించారు.

సితారాదేవి అక్క తార. ఆమె కుమారుడు నటరాజ గోపీకృష్ణ. కథక్‌లోనే గాక, భరతనాట్యంలో కూడా ప్రావీణ్యం పొందారు. అతి తక్కువ వయసులో హిందీ సినిమా కొరియోగ్రాఫర్ గా ఆయన పేరు నిలిచిపోయింది. ఆయన చాలా సినిమాలలో నటించారు. ఆయన నటించిన మొదటి సినిమా 'ఝనక్ ఝనక్ పాయల్ బజే'. భారత ప్రభుత్వం నటరాజ గోపీకృష్ణను ' పద్మశ్రీ'తో సత్కరించింది. 'బనారస్: తేరే రంగ్ హజార్' పుస్తకంలో గోపీకృష్ణ ఫోటో చూస్తూ ఉండిపోయాను. ''సార్. మీరు అంగీకరిస్తే

సితారాదేవి గారి ఇంటికి వెళ్దాం. ఇక్కడకు దగ్గరే.” అన్నాడు అన్షుమాన్. పుస్తకం అన్షుమాన్ కు తిరిగి ఇచ్చాను. “వద్దు సార్. మీరు ఉంచుకోండి.” అన్నాడు. ‘నేను కొనుక్కుంటా నని’ చెప్పి తిరిగిచ్చేసాను. ఇద్దరం కలిసి సితారాదేవి గారి ఇంటికి వెళ్ళాం.

బనారస్ లోని కబీర్ చౌరాలో వీరి ఇల్లు ఉంది. ఆ ఇంటి ద్వారం వద్ద పేర్ల పట్టిక కూడా ఉంది. కానీ ఆ ఇంటిని గోపీకృష్ణగారు అమ్మేసారు. అయినా ఆ కళాకారుల మీద గౌరవంతో వాళ్ళపేర్ల పట్టికను అలాగే ఉంచాడు ఆ ఇంటి యజమాని. కథక్ నృత్యంలో బనారస్ ఘరానాకు అగ్రస్థానం ఉంది. ఈ ఘరానాను పం. జానకీ ప్రసాద్ ప్రారంభించారు. సునయన అగర్వాల్ గారు ప్రస్తుతం ఈ ఘరానాలో ప్రముఖ నర్తకి. కబీర్ చౌరా ఇటువంటి ఘరానాలకు కేంద్రం. కాశీసంగీతాన్ని విశ్వవ్యాప్తం చేసింది ఈ వీధే. ఇప్పుడు కూడా ఈ వీధిలో అడుగడుగునా సంగీతమే పలకరిస్తుంది. కబీర్ చౌరాలో ఏ వేళ కానీ, ఏ మూల కానీ సరిగమలు ధ్వనిస్తూనే ఉంటాయి. ఒకచోట హార్మోనియం పలకరిస్తే, మరోచోట తబలా తడుతుంది. ఇంకోచోట గజ్జెలు మ్రోగుతాయి. మరోచోట కంఠం పాడుతోంది. కబీర్ చౌరా కళాకారుల సరస్సు. కళాకారులకు కాశీ ఒక స్వర్గం. కబీర్ చౌరా నా కళ్ళ ముందు కదులుతూనే ఉంది. ఒక్క వీధిలోనే ఇన్ని పద్మాలు. కాశీ మొత్తంలో ఎన్ని ఉన్నాయో!

*విషయసేకరణ:*

*1. శ్రీ శంభూనాథ మిశ్రా రాసిన ‘సంగీత్ సాధకోం కీ నగరీ : కాశీ ‘వ్యాసం ‘కాశీ నగరీ ఏక్: రూప్ అనేక్’ పుస్తకం నుండి, సమాచార మరియు ప్రసారణ మంత్రిత్వశాఖ, ఢిల్లీ ప్రచురణ. 2. శ్రీ కమల్ నయన్ రాసిన ‘ బెనారస్: తేరే రంగ్ హజార్ ‘ పుస్తకం నుండి. 3. శ్రీ కామేశ్వర నాధ మిశ్రా రాసిన ‘కాశీ కే సంగీత సాధక్ , సోచ్ విచార్ జూలై, 2011.*

డా. కిల్లాడ సత్యనారాయణ
ఫోన్ : 8333987838

## ఆర్. వేదవల్లి



ప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసురాలైన శ్రీమతి ఆర్. వేదవల్లి గారు 1935వ సంవత్సరంలో తమిళనాడులోని మన్నారుగుడిలో శ్రీ రామస్వామి అయ్యంగార్, పద్మాసిని అమ్మాళ్ దంపతులకు జన్మించారు. మద్రాసులో శ్రీ ముదిగొండాన్ వెంకటరామయ్యర్ వద్ద సంగీత విద్యని అభ్యసించారు. చిన్నతనంలోనే ఆకాశవాణి నిర్వహించిన కర్ణాటక లలిత సంగీత పోటీలలో ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. కేంద్ర ప్రభుత్వం వారి స్కాలర్‌షిప్ పొంది, మహావిద్వాంసురాలు టి. ముక్త గారి వద్ద జావళీలు, శ్రీ వెంకటరామయ్యర్ వద్ద పల్లవులు అభ్యసించారు. శ్రీ అరియక్కుడి రామానుజ అయ్యంగార్ గారి సలహా మేరకు వీరు పూర్తిస్థాయిలో సంగీతాన్ని వృత్తిగా స్వీకరించి దేశవిదేశాలలో తమ కచేరీల పరంపరని నేటికీ కొనసాగిస్తున్నారు. మద్రాసు మ్యూజిక్ అకాడమీ వారి టీచర్స్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ నందు కొంతకాలం సేవలందించి ఆ తరువాత అడయార్ ప్రభుత్వ సంగీత కళాశాలలో ప్రొఫెసర్‌గా సేవలందించారు. వీరు మంచి వైణికులు కూడా. సంస్కృత, తెలుగు, కన్నడ, తమిళ భాషలలో మంచి వైదుష్యం కలిగి ఉండటం వలన సంగీత రచనలను భావయుక్తంగా పాడటంలో నిష్ణాతురాలు అనిపించుకున్నారు. వీరి సోదాహరణ ప్రసంగాలన్నీ ‘సంగీత సంప్రదాయం’ అన్న పేరుతో గ్రంథరూపంలో ప్రచురించి సంగీత లోకానికి అందజేయడం మన అదృష్టం. మద్రాసు మ్యూజిక్ అకాడమీ వారి ‘సంగీత కళానిధి’, ది ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ సొసైటీ వారి ‘సంగీత కళా శిఖామణి’ వంటి ఎన్నో బిరుదులు పొందారు.

- నాదరేఖలు - శ్రీ శంకర నారాయణ

# ఎమ్.వి. రాయుడు గారితో ....

- మిసిమి

## 'మనసు' రాయుడు

రాయుడు గారూ స్వాగతం - **మిసిమి** కి స్వాగతం -

ఇదివరలోనే మీ గురించి పరిచయం **మిసిమి** లో రాశాము. మీరు ప్రత్యేకంగా బెంగుళూరు నుండి వచ్చి - 'చిత్రకళా నీరాజనం' **మిసిమి** అట్టమీది బొమ్మల సమాహారం - ఆర్ట్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. మీ 'మనసు' ద్వారా మీరు తెలుగు భాషకు చేస్తున్న నిరుపమాన సేవ మరో భాషలోనో - మరో రాష్ట్రంలోనో జరిగితే - ప్రభుత్వ పెద్దలు పద్మశ్రీ - పద్మభూషణాలతో సత్కరించేవారు. భాషను వాడుకుని వ్యాపారం చేసేవారున్నారు - భాషను అడ్డుపెట్టుకుని కీర్తి తురాయిలు పెట్టుకున్న వారున్నారు. తెలుగు రాష్ట్రాలలో. కానీ భాషాసేవకు విలువైన సమయాన్ని - ఇంకా విలువైన వనరులను హరింపజేసుకునేవారు ఎందరుంటారు? - అది కూడా ఎటువంటి గుర్తింపు, ఇటు ప్రభుత్వపరంగా, అటు ప్రజల పరంగా కూడా ఆశించకుండా ఒక అక్షరనిధిని నిర్మించి భవిష్యత్తరాలకు అందుబాటులోకి తెస్తున్నారు గత దశాబ్దకాలంగా. మిమ్మల్ని ఎలా సమ్మానించాలో తెలియదు. కనీసం మీ కార్యకలాపాలను **మిసిమి** పాఠకులకు తెలియజేసే ఉద్దేశ్యంతోనే మీతో మాటామంతీ జరపాలని అడిగాము. మీరే మా గ్రంథాలయానికి వచ్చి మా మాట మన్నించారు. స్వాగతం-సుస్వాగతం.



రాయుడు గారితో.....

**మిసిమి : రాయుడు గారూ నమస్కారం. మనసు ఫౌండేషన్ పెట్టడానికి కారణమేమిటి?**

**రాయుడు :** 1998-99 ప్రాంతంలో "కథానిలయం" కార్పస్ ఫండ్ కోసం కొంత చందా అడిగారు. నాకెప్పటి నుంచో ఒక కోరిక ఉంది. ఒక తెలుగు రచయితదైనా మొత్తం రచనలు ఒకేచోట ముద్రించాలని. దానికి ప్రేరణ చదువుకునే రోజుల్లో 1977లో షేక్స్పియర్ మొత్తం రచనలను ముప్పై రూపాయలకు కొన్నాను నేను. అలా నేను కారా మాస్టారుకి ఒక మాట చెప్పాను. "మీ మొత్తం రచనలను ఒక పుస్తకంగా వేస్తాను ఆ పుస్తకం అమ్మకాలపై వచ్చిన డబ్బు మీరు కార్పస్ ఫండ్‌గా తీసుకోండి" అని. దానికి సంబంధించిన మేటర్ అంతా వి.వి.న. మూర్తి గారు సేకరించారు. కంపోజింగ్, ప్రూఫింగ్ రచన సాయి గారు చేశారు. పబ్లికేషన్ కళాజ్యోతి బాపన్నగారు చూశారు. పుస్తకం రిలీజ్, మిగిలిన అంశాలు నేనూ, నిమ్స్ డైరెక్టర్ డా. నరేంద్రనాథ్ చూసుకున్నాం. నేనూ, నరేంద్రనాథ్ మేమిద్దరం చిన్నప్పటి నుంచి స్నేహితులం. అలా ప్రింట్ చేసిన ఆ పుస్తకాలు కథానిలయంకు ఇచ్చాము. కొన్ని మా దగ్గరుంచుకుని అమెరికా మిత్రులకు ఇచ్చి ఓ వంద డాలర్లు కార్పస్ ఫండ్ కోసం పంపమని కోరేవాళ్లం. ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. ఆ పుస్తకాన్ని మా తమ్ముడింట్లో డా. రామరాజు గారు చూశారు. ఆయనో సలహా చెప్పారు. ఇట్లాంటి పుస్తకం రాచకొండ విశ్వనాథశాస్త్రి గారి రచనలపై తెద్దాం అంటూ... ఈలోగా నేనూ, మా తమ్ముడు గోపి (డా. మన్నం గోపీచంద్) మా అమ్మా, నాన్నల పేరుతో ఏదయినా చేయాలని అనుకున్నాము. 2006 చివరలో



మ.న.సు త్రయం : (ఎడమనుంచి)
రాయుడు, గోపీచంద్, చంద్రమౌళి

సాహిత్యానికి సంబంధించి ఏదయినా చేయాలను కున్నప్పుడు రావిశాస్త్రి గారి రచనల ప్రచురణ ఉపయుక్తంగా అనిపించింది. అలా "మనసు" ఫౌండేషన్ మొదలయింది. అప్పటికింకా లోగో లేదు. లెటరింగ్, బొమ్మ బాపు గారు వేశారు. చంద్ర మా ఇంట్లో ఓ పదిహేను రోజులుండి రావిశాస్త్రి గారి కథలు చదివి బొమ్మ వేశాడు. అలా "మనసు" ఫౌండేషన్ పేరున వేసిన మొదటి కలెక్టెడ్ వర్క్స్ రావిశాస్త్రి గారిది. కారా మాష్టారుది మళ్లా తర్వాత వేశాం. ఇంకో రెండు అనువాదాలు కూడా వేశాం, అదే సమయంలో.

***మిసిమి* : "మనసు" పేరెందుకు పెట్టారో చెబుతారా?**

**రాయుడు :** మా అమ్మ నాన్నగార్ల పేరు కలిసొచ్చేలా "మనసు" పేరు పెట్టాము. మన్నం నరసింహం (మా నాన్నగారు) సుబ్బమ్మ (మా అమ్మగారు) కలిసి "మనసు" అయింది. ఇలా ఏర్పడిన తర్వాత రెండు అనువాదాలు తీసుకున్నాము. మొదటిది "చెప్పులు కుడుతు, కుడుతు" ఈ పుస్తకం ఒంగోలు చుట్టుపక్కల ఉన్నటువంటి మాదిగల జీవిత చరిత్ర. 1890లో ఎమ్మా రౌషాంబు క్లౌ అనే ఆయన రాశారు. ఆ పుస్తకం ఆయన క్రిస్టియన్ మిషనరీగా ఇక్కడున్న కాలంలో రాశారు. వారంతా ఎందుకు క్రైస్తవం వైపు మొగ్గు చూపారో ఈ పుస్తకంలో ఆయన రాశారు. ఆంగ్లంలో దీని శీర్షిక WHILE SEWING SANDALS" వి.వి.న.మూర్తి గారు తెలుగు అనువాదం చేశారు. ఇప్పుడు ఇద్దరు, ముగ్గురు పబ్లిషర్స్ పునః ప్రచురణ చేసే క్రమంలో ఉన్నారు. ఈ మూల రచయితలు భార్యాభర్తలు. అమెరికన్ బాప్టిస్ట్ మిషన్‌లో ఒంగోలు వచ్చి పని చేశారు.

***మిసిమి* : నిష్పక్షపాతంగా ఉందా పుస్తకం?**

**రాయుడు :** కొంచెం ఉంటుంది. కానీ ముఖ్యమయిన అంశాలకి అన్యాయం చేయలేదు. ఈ పుస్తకాన్ని, కాళీపట్నం రామారావు గారి పుస్తకాన్ని కలిపి విడుదల చేశాం. అదయిన తర్వాత శ్రీశ్రీ శతజయంతి ఉత్సవం వచ్చింది. అప్పటికే 'విరసం' వాళ్లు ఆయన రచనలన్నీ ప్రచురించారు. వాళ్లు చేయకుండా మిగిలిపోయింది, శ్రీశ్రీ పాటల ప్రస్థానం. చాలామంది దగ్గర పాటల పుస్తకాలు సేకరించాం. సమస్య ఏమిటంటే వాటిని తిరిగి వారికి ఇచ్చేయాలి. శ్రీశ్రీ పాటల పుస్తకంతో మా స్కానింగ్ వర్క్ మొదలయింది. ఎవరు పాటల పుస్తకమిచ్చినా స్కాన్ చేయటం... ఆ తర్వాత ఇచ్చేయటం జరుగుతుండేది. మొదట్లో ఏం చేసేవాళ్లమంటే... ల్యాప్‌టాప్ సహాయంతో వారి దగ్గరే స్కాన్ చేసి పుస్తకాన్ని తిరిగి ఇచ్చేసేవాళ్లము. దీనితోపాటు ఎన్ని సినిమాలు రిలీజ్ అయ్యాయి... అందులో శ్రీశ్రీ ఎన్ని పాటలు రాసుంటాడు అన్న పరిశోధన చేసేవాళ్లం. సరే ఈలోగా మా శ్రమ పూర్తయి 'శ్రీశ్రీ' పుస్తకం బయటకు వచ్చింది... అదే సమయంలో మా కజిన్ చంద్రమౌళి ఓ మాటన్నాడు. "ఇప్పటికి ఓ 700-800 పాటల పుస్తకాలు సేకరించి స్కాన్ చేశాం కదా. ఈ పనిని కొనసాగిద్దాం." మనం ఏవయితే దాచలేదో, వాటిలో మొదటిది పాటల పుస్తకాలు. ఆ తర్వాత సినిమాలకు సంబంధించి ఏ రకమైన పత్రికలు, పుస్తకాలు వస్తాయి, పాంప్లెట్లో వేసేవారు. అవికూడా దాచలేదు మనం. తర్వాత సినిమాలకు సంబంధించి రిలీజ్ డేట్స్... మా చంద్రమౌళి వీటన్నిటికి కలిపి ఒక పేరు పెట్టేశాడు... దానిపేరు "E చిత్రపురి". ఫొటోలు, నెగెటివ్స్, స్టిల్స్ సేకరించడం... ఒకచోట చేర్చడం చేశాం. ఆ తర్వాత చిన్నపిల్లల పుస్తకాలకు సంబంధించి కూడా ఇదే దుస్థితి. చందమామ ఒకటే దాచిపెట్టారు. తెలుగు చందమామ లన్నింటిని స్కాన్ చేశాం. సమస్య ఏమిటంటే రచనలు కాపీరైట్, చందమామ ఉద్యోగులు చిత్ర, శంకర్ బొమ్మలకు ఇబ్బంది ఉండదు. వడ్డాది పాపయ్య గారి బొమ్మలు కాపీరైట్ చట్టం కిందకు వస్తాయి. ఆయన వారసులు ఎవరో తెలియదు. మళ్లీ సినిమా విషయానికి వస్తే ఫొటోలు, నెగెటివ్‌లు ఒక లక్షపైన అందుబాటులో ఉన్నాయి. బ్లాక్ & వైట్ వర్కింగ్ స్టిల్స్ ఓ అరవై, డబ్బై వేలుంటాయి. అయితే ఇవన్నీ చేసే క్రమంలో మా దృష్టి డిటెక్టివ్ నవల్స్‌పై పడింది. చిన్న పిల్లల పుస్తకాలు,



మ.న.సు ఫౌండేషన్ భవనం, వరికుంటపాడు

దాని తర్వాత బూతు పుస్తకాలు. తర్వాత 2011లో సర్ ఆర్థర్ కాటన్ పుస్తకం అనువాదం చేయించాం. కవన శర్మ గారు అనువాదం చేశారు. కాటన్ గారి అమ్మాయి ఆ పుస్తకాన్ని ఆంగ్లంలో రాసింది. ఆ పుస్తకావిష్కరణ ధవళేశ్వరం ఆనకట్టపై పెట్టుకున్నాం. ఆ పుస్తకం ఆవిష్కరణ సమయంలో కాళీపట్నం రామారావు గారొచ్చారు. నేను, వి.వి.న. మూర్తి గారు కథానిలయం ఎందుకు డిజిటలైజ్ చేయరు అని ఆయనతో తగాదా వేసుకున్నాం. భవిష్యత్తులో ఎవరూ రాలేరు. పంపలేని పరిస్థితులు వస్తాయని చెప్పాం. ముందు ఆయన ఒప్పుకోలేదు. ప్రింట్ కాపీ చాలు గద. అవసరమయితే జెరాక్స్ ఇస్తాం కదా అని అన్నారు. వాదించి వాదించి మొత్తానికి ఆయన్ని ఒప్పించాం. ఇప్పుడు వెబ్‌సైట్‌లో నలభై ఐదు వేల కథలున్నాయి.

***మిసిమి* : కథానిలయం మొదటి అంతస్తు హాలులో ఆయన కొంతమంది రచయితల ఫొటోలు సేకరించి ఉంచారు. అది గొప్ప ప్రయత్నం అనిపిస్తుంది. శ్రీకాకుళం లాంటి సుదూర ప్రాంతంలో 'కథానిలయం' ఉండటం అది చూసేందుకు కథాభిమానులు రావటం గొప్ప విషయం కదా.**

**రాయుడు :** వి.వి.న. మూర్తి గారు అక్కడ కథల ఇన్‌ఛార్జ్. ఆయన కథలతో పాటుగా నవలలు, వ్యాసాలు ఇలాంటివి కూడా సేకరించారు. కథలు ఇలా ఏర్చి కూర్చిన వెబ్‌సైట్ వేరే భాషల్లో లేదు. అది విశేషం అనిపిస్తుంది. "kadhanilayam.com" కు కారా మాస్టారు పోయిన తర్వాత ట్రాఫిక్ పెరిగింది. సర్వర్ మార్చి వేరే సర్వర్‌కు అనుసంధానం చేశాం.

***మిసిమి*: శ్రీశ్రీ సినిమా పాటలతో మీ డిజటలైజేషన్ ప్రాజెక్టు మొదలయింది. దాన్ని నెమ్మదిగా పెంచుకుంటూ వచ్చారు.**

**రాయుడు :** అవును కథల పుస్తకాలు, డిటెక్టివ్ నవలలు, బూతు పుస్తకాలు స్కాన్ చేసుకుంటూ వచ్చాక వీటికో లిమిటేషన్ ఉందని అర్థమయింది. 2015 వచ్చేసరికి అన్ని రకాల పుస్తకాలు స్కానింగ్ చేసేశారు. కొత్త వనరులు లభించడం లేదు. అప్పటికి 25 లక్షల పేజీల స్కానింగ్ పూర్తయింది.

***మిసిమి* : మధ్యలో చిన్న పిడకలవేట. ఇన్ని చేస్తున్నారు. చేస్తున్నవాటి గురించి చెబుతున్నారు. బానే ఉంది. అసలు మీ ప్రధాన వ్యాపకం ఏమిటి?**

**రాయుడు :** (నవ్వుతూ) నేను వృత్తిరీత్యా ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్‌ని. గ్రాడ్యుయేషన్, పోస్టుగ్రాడ్యుయేషన్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో చేశాను. ఆ తర్వాత కొద్దిరోజులు హెచ్.సి.ఎల్.లో ఉద్యోగం చేశాను. కొద్దికాలం పాటు మధ్య ప్రాచ్య ఆసియా (Middle East) వెళ్లాను. తర్వాత తిరిగొచ్చేసి ఇంకో భాగస్వామితో కలిసి "Custom Designed Power Supplies for Nuclear Plants" తయారు చేస్తుండేవాళ్లం. 2014 వరకు సంస్థను నడిపించాం. తర్వాత పిల్లల కోరిక మేరకు ఆపేశాం. వాటి తయారీలో నేర్చుకున్నవి చాలా ఉన్నాయి. ఆ ఆసక్తితో పి.హెచ్.డి. కోసం పవర్ ఎలక్ట్రానిక్స్‌లో రిజిస్టర్ చేసుకున్నాను. లక్కీగా ఒక నిర్ణీత గడువు నిశ్చయించుకుని పూర్తి చేశాను. మూడు సంవత్సరాల ఒకరోజు మాకు మేం ఇచ్చుకున్న గడువు. ఆ గడువులో రెండు అమెరికన్, రెండు భారతీయ పేటెంట్లు తెచ్చుకోగలిగాము. తొమ్మిది అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధన వ్యాసాలు వచ్చాయి. అలా పి.హెచ్.డి. పూర్తయింది. కానీ పి.హెచ్.డి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో చేయటానికి వయసు అడ్డొచ్చింది. యాభై ఏళ్లు దాటిన తర్వాత అక్కడ పరిశోధన కుదరదు. పబ్లిక్ సెక్టర్ అండర్ టేకింగ్‌లో పనిచేస్తూ ఉండాలి. ఆ నిబంధనల వలన గుంటూరు విజ్ఞాన కాలేజీలో పి.హెచ్.డి.ని విజయవంతంగా పూర్తి చేశాను. అది నా మరో పార్శ్వం.

మళ్లీ స్కానింగ్‌కు వస్తాను. స్కానింగ్ మేం హైదరాబాద్ లోను, బెంగుళూరులోను చేస్తుండేవాళ్లం. మాకు స్కానింగ్ చేసే శ్యామ్‌నారాయణ గారు 2015లో గుంటూరుకు షిఫ్ట్ అయ్యారు. నాకు బెంగుళూరులో ప్రధాన సమస్య తెలుగు తెలిసిన వారు దొరక్కపోవటం. ఎవరయిన పుస్తకాలిచ్చినా, ఎప్పుడు తిరిగి ఇవ్వగలను అని ఓ బెంగ ఉండేది. ఇక లాభం లేదని 2018లో సొంత భవనం కట్టుకోవాలని నిశ్చయించుకున్నాం. ఆ భవనం కూడా



మ.న.సు కార్యాలయం

ఒంగోలు – నెల్లూరు సరిహద్దులో ఉన్న మా పొల్లాల్లో. "మనసు" కుటుంబం అక్కడకు చేరుకుంది. పామూరు దగ్గరగా ఉన్న వరికుంటపాడు అనే గ్రామంలో మా భవనం ఏర్పడింది. కాళీపట్నం రామారావు గారి చేతుల మీదుగా 2019 ఉగాదికి ''మనసు ఫౌండేషన్'' భవంతి ప్రారంభోత్సవం జరిగింది. అక్కడినుంచి మా స్కానింగ్ యాక్టివిటీస్ ఊపందుకున్నాయి.

***మిసిమి* : ఈ తెలుగు మీద వ్యామోహం మీకెందుకు కలిగింది?**

**రాయుడు :** మా నాన్న మంచి చదువరి. మొన్నామధ్య "వాహిని" ప్రత్యేక సంచికను రచయిత్రి చంద్రలత కోరితే పంపించాను. అందులోంచి తనో ఐటెంను నాకు పంపించింది. అదేమిటంటే శాశ్వత చంద దారుల లిస్టు. అందులో మా నాన్నపేరుంది. అది 1959వ సంవత్సరం ప్రత్యేక సంచిక. ఇక నా వరకు వస్తే ఏడో తరగతి నుంచి అన్నిరకాల పుస్తకాలు చదువుతూ ఉండేవాడిని. వీక్లీలు, మంత్లీలు... ఇలా... సీరియస్ రీడింగ్ కోసం లైబ్రరీలకు వెళుతుండేవాడిని. నేను, నా మిత్రుడు శర్మ వెళుతుండే వాళ్లం ఒంగోలులో. అక్కడి లైబ్రేరియన్ మధుసూదన్ మమ్మల్ని బాగా ఆదరిస్తూ ఉండేవాడు. ఇవి చదవండి అని కొన్ని పుస్తకాలు సూచిస్తూ ఉండేవాడు. ఇక ISSC కు వెళ్లాక జింఖానాలో లైబ్రరీ ఉండేది. అక్కడ ఎమెస్కో వారి పుస్తకాలుండేవి. ఆరుద్ర సమగ్రంధ సాహిత్యం సంపుటాలుండేవి. ఒక్కో సంపుటి తెచ్చుకుని చదువుతుండే వాడిని.



పుస్తకాల దొంతరలు

***మిసిమి* : కోటీ యాభైలక్షలు ఇప్పటి వరకు స్కాన్ చేశారు కదా... దానితోపాటు సర్వలభ్య సమగ్ర రచనల సంకలనాలు వేస్తున్నారు.**

**రాయుడు :** అవునండీ. కోవిడ్ సమయంలో మా యాక్టివిటీ కాస్త తగ్గింది, కానీ మళ్లీ త్రిపురనేని రామస్వామి చౌదరి, చే.రా సంకలనాలు తీసుకొచ్చాం. ఇప్పుడు కె. సభా రచనలను తెచ్చే ప్రయత్నంలో ఉన్నాం. ఇంక పూర్తిస్థాయిలో మెటీరియల్ దొరకలేదు. అలా శ్రీపాద వారి సంకలనం రిలీజ్ అయిన తర్వాత ఇంకా వారి రచనలు కొన్ని లభించాయి. కె. సభతో పాటు, తిరుమల రామచంద్ర గారి సర్వలభ్య రచనలు తెచ్చే ప్రయత్నంలో ఉన్నాం. ఆ తరువాత వచ్చే సంకలనాలు డిజిటల్ ఎడిషన్‌గా తెద్దామనుకుంటున్నాం. ప్లేట్ మేకింగ్, ప్రింటింగ్ ఆర్డర్ కాకుండా, డిజిటల్ ఆర్డర్.... 200 నుండి 300 కాపీల వరకు మాత్రమే వేద్దామనుకుంటున్నాం. మేము వేసిన సంకలనాల్లో అన్నిటికన్నా చిన్న సంకలనం పట్టాభిది.

***మిసిమి* : స్కానింగ్‌లో మనకెదురయ్యే సాధక బాధకాలు చెప్పండి?**

**రాయుడు :** పుస్తకాలు రాగానే 'R' / 'NR' అని పెట్టుకుంటాం. 'R' అంటే 'Returnable' అని. 'NR' అంటే Non 'Returnable' అని. రిటర్నబుల్ పుస్తకాలకు ప్రాధాన్యం ఇస్తాము. నాన్ రిటర్నబుల్ పుస్తకాలకు మా అవసరాన్ని బట్టి చేస్తుంటాం.

***మిసిమి* : స్కాన్ చేసినదాన్ని ప్రింట్ చేస్తారా?**

**రాయుడు :** లేదండీ ఉదాహరణకు 'భారతి' పత్రిక అన్ని సంచికలు మా దగ్గర ఉన్నాయి. కానీ వాటిని ప్రింట్ చేయలేం కదా. గుంటూరులో లంకా సూర్యనారాయణ గారి లైబ్రరీ ఉంది తెలుసు కదా. దాదాపు రెండు లక్షల పుస్తకాలున్నాయక్కడ. ఎంతమంది సుమారుగా అక్కడికి వెళుతుంటారో చెప్పగలరా? పక్కనే ఇంకో లైబ్రరీ ఉంది. సివిల్స్ కోసం వ్యక్తిత్వ వికాస పుస్తకాలు చదువు కోవడం కోసం వెళతారు. 'కథా నిలయం'కు ఎంతమంది వస్తారో తెలుసా. కారా మాస్టారుగారబ్బాయి సుబ్బారావుని అడిగితే నెలకు ఐదుమంది వస్తే ఎక్కువ అన్నారు. అలాగే కడప సి.పి. బ్రౌన్

గ్రంథాలయం తీసుకోండి జానమద్ది హనుమశాస్త్రి గారు ఎంతో కష్టపడి నిర్మించారు. చక్కటి వసతులు ఉన్నాయి. చదివే వారందరు వ్యక్తిత్వ పుస్తకాలు కోసం వస్తారు. ప్రింట్ కాపీ కోసం విశాలాంధ్రకో, నవోదయాకో వెళ్లటం తగ్గిపోయిది ఇవాళ.

**మిసిమి : మీరు ఎన్ని కాపీలు పబ్లిష్ చేస్తారు?**

**రాయుడు :** మేము 1300 కాపీలతో సర్వలభ్య సమగ్ర రచనలు వేయటం మొదలుపెట్టాం. ఇప్పుడు వెయ్యి కాపీలకు వచ్చాం. చేకూరి రామారావు దగ్గరకు వచ్చేటప్పటికి అది ఆరువందలకు తగ్గింది. ఇక నుండి రెండొందల కాపీలే. డిజిటల్ ప్రింటింగ్ ద్వారా మేం ప్రచురించినవన్నీ ఎమెస్కోకి ఇచ్చేశాం. అవన్నీ మేం ఖర్చుపెట్టిన దానికన్నా తక్కువకు ఇచ్చేసినవే. గురజాడ, శ్రీశ్రీ, శ్రీపాద, జాషువా, కథ 25, పతంజలి రచనలు ఈ పుస్తకాలు ఎక్కువగా అమ్ముడయ్యాయి. ఈ సర్వలభ్య ప్రచురణకు సంబంధించి మొదటి కీలక అంశం. బేస్ మెటీరియల్ దొరకటం. పాపులర్ రచనలు వెంటనే దొరుకుతాయి. తొలిరోజుల్లో రాసినవి దొరకవు. కె. సభా కు అదే సమస్య ఎదురవుతోంది. వారి రచనల్లో ఇంకా ఇంకా నలభై శాతం దొరకాలి. రచనల ఇండెక్స్ తయారు చేసుకుంటున్నాం. కానీ ఆ రచనలు దొరకడం లేదు. కొంతవరకు ఆ రచయితలపై చేసే పరిశోధనలు సహాయపడతాయి. ఉదాహరణకు జాషువాపై భాస్కర చౌదరి అనే వ్యక్తి పరిశోధన చేశారు. జాషువా విషయంలో దొరకనివి కూడా మాకు దొరికాయి. 'రక్తగానం' అనే చిన్న బుక్‌లెట్ ఒకటి దొరకలేదు. శ్రీపాద విషయంలో ఇంకా పదిశాతం వరకు లభించలేదు. ఇకపోతే స్కాన్ చేసిన ఈ కోటీ యాభైలక్షల పేజీలను ఇండెక్స్ చేయాలి కదా. ఇండెక్స్ ఎలా చేస్తామంటే ముందుగా మేగజైన్స్‌ని ఇండెక్స్ చేస్తాం. పత్రికలకు టైటిల్ ప్రకారం... ఆ తర్వాత సంచిక ప్రకారం చేస్తాము. ఇలా విడగొట్టేస్తాం. స్కాన్ చేసిన పేజీలు మంచి కండిషన్‌లో ఉన్నాయో లేదో చూస్తాం. మేం చేసిన ఇండెక్స్‌లో తెలుగులో ఇంకా కొన్ని తప్పులున్నాయి. వాటిని సవరించి జనవరి నాటికి అందరికీ అందుబాటులోకి తెద్దాం



వి.ఎస్.టి. సాయి, ఆంధ్రభారతి

అనుకుంటున్నాము. ఇంగ్లీషులో ఉన్న టైటిల్స్‌ని తెలుగులోకి మార్చాము. వాటిల్లో ఇంకా సవరణలు చేయాల్సి ఉంది. క్రాస్ వెరిఫై చేసుకోవాలి. అలాగే స్కాన్ చేసేటప్పుడు, ఆ స్కాన్ శుభ్రంగా రావాలంటే పుస్తకంలోని పేజీలను విడగొట్టాలి. చిన్న పుస్తకాలు ఫరవాలేదు కానీ పెద్ద పుస్తకాలు, పర్ఫెక్ట్ బైండింగ్‌తో ఉంటాయి. స్పైన్ కట్ చేయాలి. తర్వాత రీ బైండ్ చేయాలి. మాన్యువల్ కట్టర్‌ని తెచ్చి చేస్తున్నాం. రీ బైండ్ చేసేప్పుడు సగం వాక్యం బైండింగ్‌లోకి వెళ్లిపోతోంది. దానిని కష్టపడి సరిచేయ గలుగుతున్నాం. అదో టెక్నికల్ ప్రాసెస్. మాటల్లో చెప్పడం కష్టం. స్కానింగ్ కంటే ఈ పని ఎక్కువవుతోంది. ఇక ఇప్పుడు వచ్చిన పుస్తకాల్లో ఎక్కువ మాకు పంపించింది మండలి బుద్ధప్రసాద్ గారు. ఆయన చెప్పారని జె.వి. పూర్ణచంద్ గారు పంపించారు. కడియాల రామ్మోహన్ రాయ్ గారి పుస్తకాలు వారి శ్రీమతి పంపించారు. తర్వాత రచన సాయి గారు పంపించారు. ఇప్పుడు మాకు వచ్చిన పుస్తకాలు రాపాక ఏకాంబరాచార్యులు గారు పంపించినవి. 168 బాక్సులు వచ్చాయి. కనీసం ఒక వెయ్యి పుస్తకాలన్నా ఎక్కడా దొరకనివి వారి దగ్గర దొరుకుతాయని అనుకుంటున్నాం. ఇలా ఈ పుస్తకాలన్నీ ప్యాక్ చేసేటప్పుడు మావాళ్లుంటారు. వాటి కండిషన్ క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఎవరియినా పుస్తకం మాకు తిరిగి ఇవ్వక్కర్లేదు అంటే వాటిని అట్టపెట్టెలో పెట్టేస్తాం. ఇండెక్స్ చేసిన తర్వాత పుస్తకంలో అన్ని పేజీలు ఉన్నాయా లేదా అని చూస్తాం.

**మిసిమి : ఇంత స్కానింగ్ చేస్తున్నారు మీరు బావుంది. దీని End Use ఏమిటో ఆలోచించారా?**

**రాయుడు : End Use** చాలా సింపుల్ అండీ. గట్టిగా ఆలోచించాం. కాపీరైట్ ఇష్యూలుంటాయి. కాపీరైట్ యాక్ట్ ప్రకారం కాపీ చేయటం తప్పుకాదు. సర్కులేట్ చేయడం తప్పు. కాపీరైట్ అయిపోయాక పుస్తకాలు వెబ్‌సైట్‌లో పెట్టేస్తుంటాం. రచయిత మరణించాక అరవై ఏళ్ల తర్వాత కాపీరైట్ ఇష్యూ ఉండదు. శ్రీశ్రీ కాపీరైట్ 2045 వరకు ఉంటుంది. శ్రీపాద వారి కాపీరైట్ 21లో ముగిసింది. కాపీరైట్ తీసుకుని పబ్లిష్ చేయగలం కానీ అమ్మలేం కదా.

1927లో కాశీనాథుని నాగేశ్వరరావుగారు అప్పటికి దొరికిన రచనల 'వాఙ్మయ సూచిక' వేశారు. కాపీరైట్ విషయంలో పేరు చెప్పను కానీ ఒక ప్రముఖ రచయిత గారబ్బాయి ఒక మాట అన్నాడు. "సర్ మీకది సాహిత్యం... నాకది ఆస్తి" ఇది నేను మర్చిపోలేని మాట. వీళ్లందరికీ ''బే వారసులు'' అని పేరు పెట్టు కుంటున్నాం. అందుకని కాపీరైట్ లేకుండా మేం ముట్టుకోం. మీరడిగిన ప్రశ్నకు మళ్లా చెప్పాలంటే ప్రజలకు ముందుగా నాన్ కాపీరైట్ రచనలను అందించాలి అని నిర్ణయించుకున్నాం. ఆగిపోయిన పత్రికలకు సంబంధించి చూస్తే, అవి పబ్లిష్ అవటం ఆగిపోయి అరవై ఏళ్లయితే చాలు పెట్టేస్తాం. యువ, జ్వాల ఇటువంటి మాస పత్రికలు పెట్టొచ్చు. జాగ్రత్తగా చూసి, చెక్ చేసి పెడతాం. కొంత డిటెక్టివ్ నవలమీద ఫోకస్ పెట్టి 1930కు ముందు పబ్లిష్ అయిన 30–40 డిటెక్టివ్ నవలలను సేకరించాం. చాలా వరకు పాత పుస్తకాలు 'శాలివాహన' శకంగా వేశారు. దానికో డెబ్భై ఏళ్లు కలిపి కరెక్షన్ చేస్తున్నాం. 1900 ముందర, 1950 ముందర ఇట్లా వర్గీకరించి చేస్తున్నాం. పత్రికలు ఇప్పటి వరకు 4వేలకు పైగా రిజిస్ట్రేషన్ అయ్యాయని తెలిసింది. మా దగ్గర పన్నెండు వందలు స్కాన్ చేశాం. అవి ఒక సంచిక నుంచి అనేక సంచికలు వరకు వచ్చినవి ఉన్నాయి. కమర్షియల్ వాల్యూ ఉంది. మేమెందుకు ఇవ్వాలి అనుకునేవాళ్లు ఇంకా ఉన్నారు మనదగ్గర. వాళ్లొక పన్నెండు వందల మంది ఉంటారు.



వి.వి.న. మూర్తి

***మిసిమి* : మీరు చేస్తున్న పని ఎవరయిన వేరే భాషల్లో చేస్తున్నారా?**

**రాయుడు** : కన్నడంలో అయితే జరగలేదు. అంతవరకు చెప్పగలను. అలాగే ఒక రచయిత కంప్లీట్ వర్క్స్ ఇతర భాషల్లో వచ్చాయా అన్నది కూడా అనుమానమే.

***మిసిమి* : హిందుస్తాన్ టైమ్స్‌లో ఒకసారి వ్యాసం వచ్చింది. కన్నడ మీడియంగా సివిల్ సర్వీసెస్ రాస్తున్నవారు ఎక్కువ. ఎంపిక అయ్యేవారు ఎక్కువ తెలుగు, తమిళ్ వాళ్లు పదుల సంఖ్యలో ఉంటే కన్నడంలో ఒక సంవత్సరం 220 మంది రాస్తే వారిలో 90 శాతం మంది ఎంపిక అయ్యారు. కన్నడ వారికి భాషపట్ల ప్రేమ ఎక్కువ. కమిట్మెంట్ ఎక్కువ. ఇది సాహిత్యంలో ప్రతిఫలించడం మీరు గమనించారా?**

**రాయుడు** : ఇది కొత్త విషయంగా భావించాలి. ఇక మీరు అడిగిన ముందరి ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే దక్షిణ భారత భాషల్లో స్కానింగ్ డిజిటలైజేషన్ అంతగా లేదనే చెప్పాలి. మరీ బల్లగుద్ది చెపితే ఓవర్ స్టేట్‌మెంట్ అవుతుందేమో (నవ్వు).

***మిసిమి* : ఈ మధ్య 'తానా' వారు గిడుగు రామ్మూర్తి అవార్డు ఇచ్చారు కదా!**

**రాయుడు** : అవునండి. తెలుగు భాషకు చేసిన సేవకు గాను ఆ పురస్కారం ఇచ్చారు. నేనేమీ దరఖాస్తు చేసుకోలేదు. తోటకూర ప్రసాద్ లాంటి వారు నా పేరు ప్రతిపాదించినట్టున్నారు.

***మిసిమి* : వారు మీ వర్క్ గురించి ఏమన్నా అక్కడ చెప్పారా?**

**రాయుడు** : అదొక సర్కస్ లాంటిది (నవ్వు)... ఎవరి ఆరాటం వారిదే. సరదాగా అంటున్నాను... అయితే విడిగా ఒక సమావేశం పెట్టారు. ఒక ఓపెన్ హౌస్ సెషన్‌లా నిర్వహించారు. ఏం చేస్తున్నారు.. ఎలా చేస్తున్నారు... ఇలాంటి అంశాలు చర్చకు వచ్చాయి. దాన్లో ఓ యాభై, అరవై మంది పాల్గొన్నారు. కాపీరైట్‌కు సంబంధించిన అంశాలు చర్చకు వచ్చాయి. మళ్లీ స్కానింగ్‌కు వస్తే స్కాన్ చేస్తున్నప్పుడు రిపిటేషన్ ఉంటుంది. అది కొంచెం జాగ్రత్త పడాలి. ఇప్పుడు రాపాక గారి పుస్తకాలు స్కాన్ చేస్తున్నా. యాభైశాతం రిపిటేషన్ ఉంటుందని అనుమానంగా ఉంది.

***మిసిమి* : సర్వలభ్య సమగ్ర రచనలు ఇంకా ఎంతమందివి వేద్దామనుకుంటున్నారు?**

**రాయుడు** : చాగంటి సోమయాజులు, తిరుపతిలో మధురాంతకం నరేంద్ర, రాసాని సంపాదకత్వం వహించి తెచ్చిన **"కథా వార్షికలు"** వేద్దామని మావాళ్లంటున్నారు. ఒక అనిశ్చితిలో ఉన్న ఆలోచన కందుకూరి వీరేశలింగం రచనలు. వాటికి కాపీరైట్ లేదు. వెబ్‌సైట్ పెడితే సరిపోతుంది కదా అని ఒక ఆలోచన. ఎందుకంటే వీరేశలింగం గారిది విస్తృతమయిన కృషిగా చెప్పాలి.



పారా అశోక్ కుమార్

వీటిలో సమస్య ముందే చెప్పాను. అందుబాటులో ఉన్న రచనలే దొరుకుతున్నాయి. దొరకనివి దొరకడం లేదు. చాలామంది వాల్యూమినస్‌గా రాసినా వెయ్యాల్సిన అవసరం ఉన్నదా అన్నది ఒక ప్రశ్న. ఉదాహరణకు కొవ్వలి నరసింహారావు గారు వెయ్యి నవలలు రాశారంటారు. నిజంగా వాటిని ఒక్కటిగా చేర్చటం అవసరమా. అంతకుముందు ఏం రాశారు! అలాగే విశ్వనాథ రచనలకు మాకు అవకాశం లేదు. ఆయన వారసులే ప్రచురిస్తున్నారు. అలాగే చలం రచనలు ఎవరో ప్రచురిస్తున్నారు. ఇక్కడ ఏమవుతుందంటే విశ్వనాథ కానీ, చలం కానీ డిమాండ్ ఉన్న రచనలు వేస్తున్నారు. అంతగా ప్రాచుర్యం లేని రచనల మాటేమిటి అన్న ప్రశ్న వస్తుంది. విశ్వనాథ వంటి గొప్ప రచయితల వ్యక్తిగత జీవితం తాలూకు విశేషాలు మనకు తక్కువగా లభిస్తాయి. "మాకలీ దుర్గంలో కుక్క" అనే కథను పేరు చెప్పకుండా ఇస్తే ఎవరో రివల్యూషనరీ రచయిత రాశాడనుకుంటారు. కర్నాటకలో ఒక రైల్వేస్టేషన్ పేరు అది. అలాంటివి అందరికీ అందుబాటులోకి రావాలి. ఇవాళ రీప్రింట్ అయ్యే పుస్తకాలు ఎక్కువ భక్తి, ఆధ్యాత్మికత, పౌరాణికం ఇట్లాంటివే ఎక్కువ ఉన్నాయి. అవన్నీ షెల్ఫ్ బుక్స్, చదవటానికి కాదు. అలా బుక్ రాక్‌లో దాచుకోవటానికి.

***మిసిమి* : మీ భవిష్యత్తు ప్రణాళికలు?**

**రాయుడు** : ఏమీ లేవు సార్. ఇప్పుడు చేస్తున్న పనిని జాగ్రత్తగా చేయగలిగితే చాలు. ఇంగ్లీషులో అరుదైన పుస్తకాలున్నాయి. చేస్తారా అని అడుగు తారు "క్షమించండి సార్" అని చెబుతాం. ఇంగ్లీషు పుస్తకాలు మా లక్ష్యం కాదు.

***మిసిమి* : మీరు చేస్తున్న పని థాంక్‌లెస్ జాబ్ కదా?**

**రాయుడు** : థాంక్‌లెస్ అని అనటానికి లేదు సార్. ఎవరో అడిగారు. మీరెందుకు చేస్తున్నారు ఈ పని అని. నేను చెప్పాను. ఒక్కోళ్లు ఒక్కోకటి చేస్తారండీ. కొంతమంది తల్లిదండ్రుల పేరుతో గుడి కట్టిస్తారు. లేదంటే సత్రం కట్టిస్తారు. అలా మేం ఇది చేస్తున్నాం సార్ అని చెప్పాను. అమ్మా నాన్న పేరు పెట్టుకున్నాం కాబట్టి శ్రద్ధగా చేస్తున్నాం. మా దగ్గర పదహారుమంది స్కానింగ్ స్టాఫ్ ఉన్నారు. నలుగురైదుగురు సర్వీస్ స్టాఫ్ ఉన్నారు. నెలకు రెండున్నర లక్షల ఖర్చు అవుతుంది. అంతా మేమే పెట్టుకుంటాం. మాకేమీ కార్పస్ ఫండ్ అంటూ ఏమీ లేదు. మా ఆవిడ, పిల్లలు, తమ్ముడు, మా చెల్లెలిద్దరు వాళ్లందరి పిల్లలు అందరూ సపోర్ట్ చేస్తారు. ఎవరయినా చందాలు ఇస్తామన్నా కూడా తీసుకోకూడదు అన్నది మా నియమం. మా వాళ్లంతా వాళ్ల వాళ్ల పద్ధతుల్లో సహాయం చేస్తారు.

***మిసిమి* : రెండు ప్రభుత్వాలేమీ ఎలాంటి సహాయం చేయలేదా!**

**రాయుడు** : ప్రభుత్వం అంటే వ్యక్తులే కదా! ఎవరైనా వ్యక్తులే సహాయపడాలి. ఒకరోజు బుద్ధప్రసాద్ గారు ఫోన్ చేశారు. మీకు 'కళారత్న' ఇస్తున్నాం వచ్చి తీసుకోవాలని, అన్నారు. అంతే అలా వ్యక్తులే గుర్తిస్తారు ప్రభుత్వంలో కూడా.

***మిసిమి*: ఎప్పుడైనా కోటి పేజీల సాహిత్యాన్ని, సాహిత్యానికి సంబంధించిన అనేక పత్రాలను స్కాన్ చేస్తానని అనుకున్నారా!**

**రాయుడు** : లేదు. ఎప్పుడూ అనుకోలేదు. గణాంకాల మీద దృష్టిలేదు. కానీ ఒకరోజు కూర్చుని తీరుబడిగా లెక్క వేస్తే కోటిన్నర పేజీలయింది. అప్పుడు జాగ్రత్తగా దీనిని ఆర్డర్‌లో పెట్టాలనుకున్నాం. మొన్న డిసెంబర్‌కు (డిసెంబర్ 22) కోటీ ఇరవైలక్షలయింది. 2018లో స్కానింగ్ మొదలు పెట్టిన దగ్గర్నుంచి డేటా సమగ్రంగా మాకు అందుబాటులోకి వచ్చింది. ఏరోజు డేటా ఆరోజు వచ్చేస్తుంది.

***మిసిమి* : వరికుంటపాడులో మీ సిబ్బంది ఇతర వివరాలు చెప్పండి?**

**రాయుడు** : రమేష్ అనే కుర్రాడు అక్కడ మేనేజర్‌గా ఉంటున్నాడు. వరికుంటపాడు మండలం హెడ్ క్వార్టర్స్. నేషనల్ హైవే 5651 పైన ఉంది. అద్దంకి, పొదిలి మీదుగా వస్తే నేషనల్ హైవే 5651కు వస్తారు. ఆ రోడ్డులోనే వరికుంటపాడు వస్తుంది.

***మిసిమి* : మీరు, వి.వి.న. మూర్తి గారు, కవన శర్మ గారు ఒక త్రయంలా అనిపిస్తారు.**

**రాయుడు** : నేను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో


రచన సాయి

చదువుతున్న కాలంలో కవని శర్మ గారు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెన్‌లో సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా ఉండేవారు. వి.వి.న. మూర్తి గారు **"CQAE"** లో పనిచేసి రిటైర్ అయ్యారు. నేను మిడిల్ ఈస్ట్‌లో పనిచేసి ఇండియాకు వచ్చాక సుధాకర్ అని ఒక మిత్రుడు పరిచయం చేశారు. అప్పటినుంచి వి.వి.న.మూర్తి గారు బాగా దగ్గర అయ్యారు. కవన శర్మ గారితో నాకు ఇనిస్టిట్యూట్ రోజుల నుంచి బాగా దగ్గర పరిచయముండేది. ఆయనతో పాటు రజనీకాంత్ అని మరో మిత్రుడుండేవాడు. నేను చదివే రోజుల్లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెన్‌లో అక్కడున్న తెలుగు అసోసియేషన్‌తో బాగా దగ్గర సంబంధాలుండేవి. నాటకాలు, సాహిత్య సమావేశాల్లో పాల్గొంటుండేవాడిని. 74 నుంచి బెంగుళూరులో ఉంటున్నాను. మా ఇంజినీరింగ్ బ్యాచ్ వాళ్లు వచ్చే సంవత్సరం స్వర్ణోత్సవాలు జరపబోతున్నారు.

***మిసిమి* : మీ జీవితంలో మధుర క్షణాలు అంటే ఏం చెబుతారు!**

**రాయుడు :** అది చెప్పడం కష్టమే. ఎప్పటికప్పుడు ఆ పరిస్థితి మారుతుంటుంది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెన్‌లో సీటు రావటం గొప్ప థ్రిల్లింగ్ మొమెంట్‌గా భావిస్తాను.

***మిసిమి* : అది మీ చదువుకు సంబంధించినది. మీరు ఇంతగా కృషి చేస్తున్న ఈ విలువైన సమయాన్ని గురించి మనం మాట్లాడుకుందాం.**

**రాయుడు :** తప్పని సరిగా. నా కుటుంబం నాకు ఇచ్చిన ప్రోత్సాహం, నా జీవితంలో డిఫైనింగ్ మొమెంట్. ఫ్యామిలీ అంటే ఇమీడియట్ ఫ్యామిలీ మాత్రమే కాదు. ఇంతమంది సహాయ సహకారాలు మనసు ఫౌండేషన్‌కు అనూహ్యం. ఆంధ్రభారతి సాయి గారు, అశోక్. అశోక్‌ది చాలా ఇంట్రెస్టింగ్ స్టోరీ. అతను కుర్రాడు. జాషువా పుస్తకం వేస్తున్నప్పుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ గారు ఫోన్ చేశారు. మేం కూడా సహకరిస్తామంటూ. మా తరపునుంచి అశోక్ అనే కుర్రాడు సమన్వయకర్తగా ఉంటాడని చెప్పారు. అతనికి మన పద్ధతులు తెలీదు. కొన్ని పాటలు తెచ్చాడు. శ్రీశ్రీలానే జాషువాకు సంబంధించి కొన్ని పాత పద్యాలు, సర్కులేషన్‌లు ఉన్నాయి. అవే తిప్పుతుంటారు. అది దాటి బయటకు వెళ్లరు. ఎవరయితే జ్ఞానులనుకుంటారో... వారెవరి దగ్గర అవి లేవు. అశోక్‌కు ఆ పుస్తకావిష్కరణ సభలో మొమెంటో ఇచ్చినప్పుడు సిగ్గుపడ్డాడు. "నేనేం చేశాను సర్'' అన్నాడు. ''నువ్వు సిన్సియర్‌గా పనిచేశావయ్యా" అని చెప్పాను. ప్రయత్నలోపం లేకుండా అని కూడా చెప్పాను. అది బాగా అతనిలో నాటుకుపోయింది. ఈ స్కానింగ్ యాక్టివిటీ పెరిగినప్పుడు, పుస్తకాలు చాలా అవసరమయినప్పుడు, ఆ బాధ్యత అతను తీసుకున్నాడు. రాపాక ఏకంబరాచార్యులు గారి పుస్తకాలన్నీ అతను తెచ్చినవే. 600 బాక్సుల పుస్తకాలు స్కానింగ్ కోసం ఎదురు చూస్తూ ఉన్నాయి ఇప్పుడు. వీలయినంత వరకు పుస్తకాలు రిటర్న్ చేస్తున్నాం.

***మిసిమి* : వరికుంట పాడులో ఉన్న మీ ఏడువేల చదరపు అడుగులను ఎలా ఉపయోగిస్తున్నారు?**

**రాయుడు :** కింద మూడువేల ఆరొందలు, పైన మూడు వేల ఆరొందలుగా విభజించాము. బుక్స్ కోసం, స్కానింగ్ కోసం వాడుకుంటున్నాం. రోజు చేసే స్కానింగ్‌లో కూడా హెచ్చుతగ్గులుంటాయి. మొన్నీ మధ్య రచన సాయి గారు నాలుగు వందల బౌండ్ వాల్యూమ్స్ పింపించారు. పాత వీక్లీల కటింగ్‌లలో ఉన్నవి. అవి స్కాన్ చేసేటప్పుడు మా స్పీడు గణనీయంగా తగ్గింది. సగటున నెలకు 4 లక్షల నుంచి 6 లక్షల పేజీలు స్కాన్ చేస్తారు మా వాళ్లు. ఈ నాలుగు నెలల చాలా మందకొడిగా పని సాగింది. రాబోయే నెలలో లోటును భర్తీ చేయాలి (నవ్వు). మా సిబ్బందికి కూడా పాత పుస్తకాలంటే అత్యంత ప్రీతి. అందుకని చాలా జాగ్రత్తగా ఆ పని చేస్తారు.

***మిసిమి*: కొత్త వాళ్లు తమ రచనలు మీకు పంపిస్తున్నారా?**

**రాయుడు :** పంపిస్తున్నారు. ఒకటి, రెండు కాపీలు పంపిస్తారు. ఆమధ్యన కొనకళ్ల వెంకటరత్నం గారమ్మాయి నాగ చంద్ర ఆవిడ తన పన్నెండు పుస్తకాల సెట్టు పంపించారు. అయితే కొనకళ్ల వారివి మాత్రం కొన్ని చేశాం.

***మిసిమి* : మళ్లా End Use గురించి అడుగుతున్నాము. వెబ్‌సైట్‌లో పెట్టడమేనా?**



కారామాష్టారుతో
శ్యామ్‌నారాయణ

**రాయుడు :** వేరే ఇంకో పద్ధతి ఉందనుకోను. దానితో పాటు క్లౌడ్‌లో ఉంటుంది. ఇంకా హార్డ్‌డిస్క్‌లో ఉంటుంది. వెబ్ సైట్‌లో పెట్టినవి క్లౌడ్‌కు లింక్ అయి ఉంటాయి. ఎవరికి ఇవ్వవలసి వచ్చినా లింక్ ఇవ్వటమే.

***మిసిమి* : ఏమి స్కాన్ చేయాలి, ఎందుకు చేయాలి అని ఎలా నిర్ణయిస్తారు?**

**రాయుడు :** మాకో బోర్డు ఉంది. అందులో కుటుంబం పక్షాన నేను, మా తమ్ముడు గోపి. మా పెదనాన్నగారబ్బాయి చంద్రమౌళి ఉంటాము. వి.వి.న మూర్తి గారు శ్యామ్ నారాయణ, ఆంధ్రభారతి సాయిగారు, అశోక్ ఉంటారు. అశోక్ ముఖ్యంగా అందరి నంబర్లు తన దగ్గర పెట్టుకుని కాంటాక్టు చేస్తాడు. పుస్తకాలు సేకరిస్తాడు. మా దగ్గరున్న పుస్తకాలు బాక్సుల్లో ఉంటాయి. ఏ బాక్సులో ఏ పుస్తకం ఉందో ఇండెక్స్ మా దగ్గర ఉంటుంది. దాన్నిబట్టి రెండు నెలల షెడ్యూల్ ఇచ్చేస్తాను ఈ మధ్య చాలా చిన్న పత్రికలు తెలుస్తున్నాయి. 'కార్మికలోకం', స్త్రీశక్తి' ఇలాంటివి ఫుల్ సెట్స్ వచ్చాయి. 20-25 బాక్సులు ఉంటాయి. రాపాక వారి పుస్తకాలలో డూప్లికేషన్ తీసేస్తే పదిహేను వందల పుస్తకాలు తేలాయి. అలా షెడ్యూలు ఇచ్చేస్తాం. 2-3 నెలల దాకా షెడ్యూల్ ఇచ్చేస్తాము.

***మిసిమి* : మీరు స్కాన్ చేసిన పుస్తకాలలో బౌద్ధం, క్రిస్టియానిటీ, ఇస్లాం, హిందూధర్మం ఇలా విడిగా ఉన్నాయా?**

**రాయుడు :** ఇలా విడిగా ఏమీ చేయలేదు. ఉన్నా కొద్ది కొద్దిగా వచ్చాయి. ఒకవేళ మీకు ఫలానా బౌద్ధం పుస్తకం కావాలి... ఎలా అంటే టైటిల్ చెబితే స్కాన్ చేసి ఉందో లేదో చెబుతాం. కేటగిరీగా లేవు. లైబ్రరీలో లాగా కేటలాగింగ్ చేయాలని ఉంది. కాని దానికి సమయం పడుతుంది. ఇప్పుడేం చేస్తున్నామంటే ఒక పక్క స్కానింగ్ చేస్తూనే మరో పక్క క్లారిఫై చేయటానికి వీలుగా ఓ అప్లికేషన్ (యాప్) తయారు చేసుకున్నాం. అందులో ఏంటంటే బుక్ పేరు టైప్ చేయగానే పది పేజీల ప్రివ్యూ కనిపిస్తుంది. ముందు ఆరు పేజీలు, వెనుక ఆరుపేజీలు కనిపిస్తాయి. కాపీరైట్ గొడవలేకుండా. ఇది డెస్క్‌టాప్ యాప్. మావాళ్లకు ఉపయోగపడుతుంది. ఎవరైనా సహాయం చేస్తానంటే వారికో పదివేల పుస్తకాలు ఇచ్చేస్తారు. వారు రచయిత పేరు, టైటిల్, ముద్రించిన సంవత్సరం సరిగ్గా ఉన్నాయో లేదో సరిపోల్చుతారు. తప్పొప్పులు గనక ఉంటే సరిచేసి పంపిస్తారు. భవిష్యత్తులో కంప్యూటర్ యాప్ తయారుచేసి అందరికీ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం.



కవిన శర్మ

***మిసిమి* : పుస్తకాలు కాకుండా ఇంకా మీరు ఏమి స్కాన్ చేస్తారు?**

**రాయుడు :** ఫిల్మ్ నెగెటివ్స్ లాంటివి చేస్తాం. దానికి హై రిసెల్యూషన్‌లో స్కాన్ చేయాలి. 35 ఎమ్.ఎమ్ హెచ్.ఒ 120 ఎమ్.ఎమ్ ఫార్మట్‌లో చేస్తాం. ఆడియో చాలా చేశాం. ఫొటోలు కూడా స్కాన్ చేస్తున్నాం.

***మిసిమి* : రాయుడు గారూ మీరు చేస్తున్న ఈ నిరుపమాన కృషికి మీకు అనేక ధన్యవాదాలు... మీకు పద్మశ్రీ రావాలని కోరుకుంటూ అభివందనాలు! నమస్కారమండీ**

**రాయుడు :** ***మిసిమి*** కి కృతజ్ఞతలు

(రాతప్రతి : సి.ఎస్. రాంబాబు)

## బహుభాషా పండితులు

# ఆచార్య రోణంకి

– *శీలా సుభద్రాదేవి*

ఒకప్పుడు చారిత్రాత్మక మైన విజయనగరం వీధులలో నెత్తిపైన దొరలటోపీ, ఇన్ షర్టు, కాలికి బూట్లు ధరించి ముంజేతికి చేతికర్ర తగిలించి, మరో చేతిలో ఏ విదేశీ భాషాసాహిత్య గ్రంథమో, దేశీయ సాహిత్య గ్రంథమో అపురూపంగా గుండెలకు హత్తుకొని శరీరం బక్క చిక్కినట్లున్నా కళ్ళజోడులోంచి విజ్ఞానతేజం పరిసరాలను కాంతివంతంచేసే కళ్ళతో తిరిగే వ్యక్తిని గుర్తుపట్టి భయభక్తులతో తప్పుకొంటూ వెళ్తారే తప్ప ఎదిరించి నిలిచేవారుండరు. కళాశాలలో ఆంగ్లోపన్యాసం చేసినప్పుడు కవిత్వాన్ని గానం చేస్తూ అభినయిస్తుంటే సాహిత్యం, సంగీతం, నృత్యం ముప్పేటలుగా అల్లుకొని విద్యార్థులకు ఆంగ్లభాష పట్ల అభిమానం పెల్లుబికేది. పాఠం చెప్తున్నంత సేపు ఆయన పాఠానికి పరవశించే నాగులా ఆయన మెడలోని టై నాట్యం చేస్తుండేది. ఆయన పాండిత్యానికి మోహితులై ఆనాటి యువతరం ఆయన చుట్టూ తిరిగేవారు. ఆయనే బహుభాషావేత్త రోణంకి అప్పలస్వామి గారు. నగరం నడిబొడ్డున ఎవరింట్లోనో, తోటలోనో ప్రపంచ కవితాగానం చేస్తుంటే వింటున్న పక్షులు కూడా వంత పాడతాయేమోననిపించేదట. తోటలోని పూలు తన్మయంతో విచ్చుకునేవని ఆచార్యరోణంకి శిష్యులను కలిసి అడుగుతే చెప్తారు. ఆయన శిష్యులు వారిని ఆత్మీయంగా "బాటసారి "అని పిలుచుకునేవారు.



ఆచార్య రోణంకి

మేధావులు, అభిమానులు, విద్యావేత్తలతోనూ ఆప్యాయంగా నడిచే బహుభాషా నిఘంటువు గానో, ఆచార్యునిగానో పిలువబడిన రోణంకి అప్పలస్వామి గారు 1909 సెప్టెంబర్15 వతేదీన శ్రీకాకుళం జిల్లా టెక్కలిమండలం సమీపాన ఇజ్జవరం గ్రామంలో జన్మించారు. రోణంకి వ్యవసాయ కుటుంబంలో పుట్టారు, తాత పశువుల కాపరి. కానీ తండ్రి రోణంకి నారాయణకి విద్య అబ్బింది. రైల్వే గుమస్తాగా ఉండి కూడా వైద్య గ్రంథాలు చదివారు, స్వయంగా బడి ఏర్పరిచి ప్రభుత్వ గుర్తింపు సంపాదించారు.

తండ్రి ప్రోత్సాహంతో రోణంకి అప్పలస్వామి ఎమ్మే వరకూ చదువుకోవటమే కాకుండా గ్రామఫోన్ ప్లేట్లు పెట్టుకుని జర్మన్, లాటిన్, జపాన్, స్పానిష్, గ్రీకు, హీబ్రూ, ఫ్రెంచ్, ఇటాలియన్ వంటి విదేశీ భాషలు నేర్చుకొని అనువాదాలు చేయడంతో సరిపుచ్చుకోక కవిత్వం రాసేటంతటి నైపుణ్యం సాధించిన గొప్ప పండితులు రోణంకి. అదేవిధంగా హిందీ, ఒరియా, కన్నడం, బెంగాలీ వంటి దేశీయ భాషల్లో సైతం అనర్గళంగా ఉపన్యసించేటంతటి నైపుణ్యం సాధించారు. బహుభాషల్లో అంతటి పాండిత్యం సాధించటంతో పాటూ ఆంగ్లభాషలో అంతర్జాతీయ ఖ్యాతి పొందారు. ఇంతటి పండితుడైనా సరే మాట్లాడేటప్పుడు మాత్రం ఉత్తరాంధ్ర మాండలిక సొబగుతోనే మాట్లాడటం రోణంకి వారికి తన జన్మభూమి, మాతృభాష పట్ల గల అనురక్తి తెలుస్తుంది.

విజయనగరం మహారాజా కళాశాలలో ఆంగ్ల ఆచార్యులుగా పని చేసారు. రోణంకి సాంగత్యంలో ఆరుద్ర, శ్రీశ్రీ, నారాయణబాబు వంటి ప్రముఖులు యూరోపియన్ సాహిత్యపు లోతులు తెలుసుకుని స్ఫూర్తి పొందారు. రోణంకి వారింటికి ఆనాటి ప్రముఖ కవులూ,

రచయితలు అందరి రాకపోకలు జరిగేవి. వారందరూ సాహిత్య చర్చలూ, సాహిత్య గోష్టులూ జరిపేవారు. శ్రీశ్రీ తర్వాత అంతా శూన్యం అని అజంతా, శ్రీశ్రీ ని father of modern poetry అని వేగుంట మోహన ప్రసాద్ అన్నప్పుడు రోణంకి వ్యతిరేకించారు. ఐతే శ్రీశ్రీ అంటే రోణంకి వారికి అపారగౌరవం. అందుకే' "నోటికి పట్టే ఛందస్సులతో శ్రీశ్రీ పరుగులు తీస్తాడు. తన లక్ష్యాన్ని, ప్రత్యక్ష పద్ధతిలోనే వ్యక్తం చేస్తాడం"టారు శ్రీశ్రీ కవిత్వం గురించి రోణంకి. కవిత్వపు విలువలు ఎక్కడ ఉన్నా పులకించిపోయే హృదయం ఆయనది. అందుకే ఆత్మాశ్రయకవులలో కూడా ఒక విశిష్టత లేకపోలేదంటారు. కృష్ణశాస్త్రి కావచ్చు, నారాయణబాబు కావచ్చు ఉత్తమ కవిత్వం కాలాతీతమైనదిగా భావిస్తారు రోణంకి. ఆయన అరసం తొలితరం ప్రముఖులు, రాష్ట్రశాఖ అధ్యక్షవర్గ సభ్యులుగా కూడా ఉన్నారు. తొలిరోజుల్లో " SONGS AND LYRICS " పేరిట 1935లో తొలి సంపుటిని వెలువరించారు. అల్లసాని పెద్దన, భట్టుమూర్తి, క్షేత్రయ్య మొదలూ శ్రీశ్రీ, నారాయణబాబు కవితల్నే కాక నండూరి సుబ్బారావు, విశ్వ సుందరమ్మ, చావలి బంగారమ్మ, చాసో మొదలగు వారి రచనల్ని సైతం ఆంగ్లంలోకి అనువాదం చేసినవి కూడా దేశవిదేశీ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. గురజాడ ''పూర్ణమ్మ గేయం, తోకచుక్కలు "ఆంగ్లీకరించారు రోణంకి. మేకియవెల్లీ ఇటాలియన్ భాషలో రాసిన "ప్రిన్స్" గ్రంధాన్ని "రాజనీతి" పేరిట సరళమైన తెలుగులో అనువదించారు. ఈ పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో రోణంకిని సత్కరించి భారతీయ భాషలన్నింటిలోకి అనువదింప జేసింది.

ఆరుద్ర తన తొలి కావ్యం 'త్వమేవాహం'నూ, మానేపల్లి తన తొలి కవితా సంపుటి " వెలిగించే దీపాలు" నూ రోణంకి వారికి అంకితం చేసారు. నారాయణ బాబు గ్రంథం "రుధిర జ్యోతి"కి ముందుమాటగా రోణంకి రాసిన ప్రస్తావన విమర్శనారంగానికి ఒక కొత్తదారిని చూపిందని చెప్పవచ్చు. మానేపల్లి, చిత్రభాను, వేగుంట మోహనప్రసాద్, అరుణ కిరణ్, రంధి సోమరాజు మొదలగు వారి పుస్తకాలకు రోణంకి రాసిన ముందుమాటలు ప్రశంసా పత్రాలుగా చెప్పవచ్చును. ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక, భారతి, అభ్యుదయ, ఆంధ్రప్రదేశ్, కళాకేళి, ప్రజారథం, సృజన తదితర పలు పత్రికల్లో ప్రత్యేక సంచికలు రోణంకి గారు రాసిన అనేక విమర్శనాత్మకమైన సాహిత్య వ్యాసాలు ప్రచురించారు. ప్రముఖ క్రీడాకారుడు కోడిరామ్మూర్తి పై ఒక పుస్తకాన్ని రాశారు. 1972-77 లమధ్య ఆచార్య రోణంకిని జాతీయ ఉపన్యాసకులుగా భారతప్రభుత్వం నియమించింది. ఈ హోదాతో దేశవ్యాప్తంగా ఒకే విద్యావిధానం ఉండాలని, కేంద్రమే విద్యాబాధ్యత తీసుకోవాలని ప్రచారం చేసారు. 1974-78 మధ్యకాలంలో రోణంకి ఆంధ్రా విశ్వ విద్యాలయంలో గౌరవప్రొఫెసర్ గా UGCచే నియమితులయ్యారు. చివరి రోజుల్లో "ది నావ్ అండ్ అదర్ పోయెమ్స్" పేరిట కవితాసంపుటి 1985లో వెలువడింది. చివరిరోజుల్లో అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నప్పుడు నాటి ఆంధ్రభూమి దినపత్రిక 'రోణంకి కన్నుమూత' అని వార్త ప్రచురిస్తే రోణంకి అదిచూసి తన వార్త తానే చూసుకునే అవకాశం దొరికింది అని నవ్వుకున్న ఆశావాది రోణంకి అప్పలస్వామి. 1987 మార్చి 28న టెక్కలి స్వగృహంలో బహుభాషా కోవిదుడు అయిన ఆచార్య రోణంకి అప్పలస్వామి గారు తుది శ్వాస తీసుకున్నారు. కళింగాంధ్ర ఆణిముత్యం అని చెప్పదగిన మహోన్నత వ్యక్తి రోణంకి. ఆయన కృషి గుర్తింపుకు రాలేదు. అందుకే చాసో 'ఆంధ్ర దేశం దౌర్భాగ్యం ఈజ్ ఈక్వల్ టు రోణంకి' అన్నారు.

ఏ విధమైన పురస్కారాలు పొందకపోయినా చివరి రోజుల్లో రోణంకి అప్పలస్వామి గారు నివసించిన ప్రదేశమైన టెక్కలి ప్రజలు అక్కడ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రోణంకి గారి విగ్రహం ప్రతిష్టించటమే కాక ఒక వీధికి రోణంకి అప్పలస్వామి వీధిగా నామకరణం చేసి వారిపై తమ గౌరవాన్ని చాటుకున్నారు.

శీలా సుభద్రాదేవి
ఫోన్ : 8106883099



# ప్రవాసాంధ్ర విలక్షణ కవి పఠాభి

**– డి.కె.ప్రభాకర్**

ఆధునిక తెలుగు సాహిత్యానికి ఎంతోమంది ప్రతిభావంతులైన రచయితలు, రచయిత్రులు తమ రచనల ద్వారా మహత్తరమైన సేవ చేశారు. అటువంటి ప్రజ్ఞానిధుల్లో బహుముఖ ప్రతిభాశాలియైన పఠాభి పేర్కొనదగినవారు. నెల్లూరు జిల్లాలో పుట్టి మద్రాసు, శాంతినికేతన్, కలకత్తా, కొలంబియా నగరాలలో చదువుసాములు నేర్చిన 'తిక్కవరపు పఠాభిరామిరెడ్డి' ప్రయోగశీలి కవిగా ఆధునిక తెలుగు కవిత్వానికి అపారమైన సేవచేసిన మనీషి. పఠాభి గారు రచించిన ఫిడేలు రాగాల డజన్ (1939), నీలగిరి నీలిమలు (1950), కయిత నా దయిత (1978), పఠాభి పన్చాంగం (1980) ఇవి ఆధునికాంధ్ర సాహిత్యంలో కవితా సంప్రదాయాన్ని చిన్నాభిన్నం చేసి కొత్తతీరులకు దారితీసిన వచన కవితలు. ఆంధ్రదేశంలో పుట్టిపెరిగినా మద్రాసు, కలకత్తా, అమెరికా దేశాల్లో చదువు సాగించినా చివరికి కర్ణాటక రాష్ట్ర రాజధానియైన బెంగళూరులో స్థిరపడి ఇక్కడే అసువులుబాసిన ప్రవాసాంధ్ర మహనీయులు "కవి పఠాభి." పఠాభిగారు తెలుగు భాషలోనే కాకుండా కన్నడ భాషలో కూడా సినిమా రంగంలో దర్శకులుగా, నిర్మాతగా పేరుగడించారు. కన్నడంలో చండమారుత, శృంగార మాస, దేవర కాడు, సంస్కార చిత్రాలకు దర్శకత్వం వహించారు. కన్నడ సినీరంగానికి మొట్టమొదటి స్వర్ణకమలం సాధించిపెట్టిన వ్యక్తి 'పఠాభి'గారు. వీరు నిర్మించి దర్శకత్వం వహించిన 'సంస్కార' చిత్రానికి జాతీయ పురస్కారంతో పాటు లోకర్నో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ బహుమతి కూడా లభించడం పఠాభిగారి ప్రతిభకు నిదర్శనం. సాహిత్యం, సినిమాలే కాక సామాజిక, రాజకీయ రంగాల్లో కూడా కృషి చేశారు. పఠాభి బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈ కవి శ్రేష్ఠుని రచనలు వైశిష్ట్య, వైవిధ్యాల మణికాంచన సంయోగం.

**ఫిడేలు రాగాల డజన్ (1939) :** తెలుగులో మొట్ట మొదటి నగర కావ్యం 'ఫిడేలు రాగాల డజన్'. పఠాభిగారు కలకత్తాలో తాను అనుభవించిన జీవితాన్ని, మద్రాసులో తన ఆడ స్నేహితుల వైనాలను మేళవించి రచించిన కావ్యం 'ఫిడేలు రాగాల డజన్'. సాంప్రదాయిక కవిత్వంతో మానసికతంగా కృంగిపోయిన తెలుగు కవిత్వానికి 'ఫిడేలు రాగాల డజన్'తో ఒక షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు పఠాభిగారు. అష్టాదశ వర్ణనలలో పురవర్ణన ఒకటి. తెలుగు ప్రబంధాలలో పొగడ్తలతో కూడుకున్న పురవర్ణన కన్పించినప్పటికి, ఆ నగరములోని ప్రజల జీవితాలపై తమదృష్టిని కేంద్రీకరించలేదు. ఆధునిక విజ్ఞాన ఫలితంగా మన దేశంలోని నగరముల స్థితి పూర్తిగా మారిపోయింది. నగర జీవితము యాంత్రికతా వలయంలోపడి సుడి గుండంలా తిరుగుతున్నది. భౌతిక సౌఖ్య లాలస పెరిగింది. నగర జీవులు కాలానికి బానిసలై, బ్రతుకులు గడియారాల్లాగ నడుస్తున్నాయి. అలాంటి నగర జీవుల స్థితిగతుల్ని, కృత్రిమ జీవితాల్ని నవ్వుల చమత్కారంగా 'ఫిడేలు రాగాల డజన్'లో చిత్రించారు పఠాభిగారు.

*నా ఈ వచన పద్యాలనే దుడ్డు కర్రల్తో*
*పద్యాల నడుముల్ విరుగదంతాను*
*చిన్నయ్‌సూరి బాలవ్యాకరణాన్ని*
*చాల దండిస్తాను.....*
*నా యిష్టం వచ్చినట్లు జేస్తాను*
*అనుసరిస్తాను నవీన పంథా: కానీ*
*భావకవిన్మాత్రము కాన్నేను*

అహంభావ కవిని....అంటూ 'ఆత్మకథ' కవితలో అంటారు. పాతచింతకాయ పచ్చడిలా ఒకరు పయనించిన

పంథాలో నేను పయనించను, తనదైన నూతన పంథాలో ప్రయాణం చేస్తానంటారు పఠాభి. ఇందులో స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కాంక్ష, సంప్రదాయ కవిత్వంపై తిరుగుబాటు ధోరణి  పఠాబిలో కన్పిస్తుంది.

**జాబిల్లి :** వ్యాపార నాగరికత ప్రబలిపోయిన నగరంలో ఎలక్ట్రిక్ బల్బు కాంతికిచ్చే విలువ చందమామకు లేకపోవడం, పతనమైన సాధారణ మానవానుభూతులకు నిదర్శనం పఠాభి రచించిన 'జాబిల్లి'.

*తగిలింపబడియున్నది జాబిల్లి*
*చయినా బజారు గగనములోన, పయిన*
*అనవసరంగా అఘోరంగా*
*ఓహెూ ! ఏమిటీ జీవన ప్రవాహం క్రిక్కిరిసిన*
*పిచ్చి ఉబలాటంతో క్రింద?*
*మనుష్యులు, మోటార్లు, ప్రాణాలు, యంత్రాలు*
*భూజాల రాసుకొంటూ, ఉన్మాదంతో*
*పోతున్నవి త్రోసుకొంటూ, పొత్తుకుంటూ*
*ఏమారిగూడ నీ వంక ఎవ్వరూ*
*కడగంటి చూపయిన పరపరోసీ శశీ !*

ముదిరిన నాగరికతలో రంగురంగుల విద్యుద్దీపాల ముందు చంద్రుడు మున్నగు అత్యంత రమణీయమైన వస్తువులకు ఏవిధంగా విలువ తగ్గిపోయిందో జాబిల్లి కవితలో ధ్వనింపజేశారు పఠాభి.

**మరీనా :** మద్రాసు మరీనా బీచులోని దృశ్యాల్ని నగ్నంగా చెప్పిన సాహసి పఠాభి గారు.

*అహెూ ! జాతికన్నియ చిక్కని నిక్కబొడుచుకొని*
*వచ్చుచున్నట్టి గట్టి రొమ్ము*
*మగనిచే తృప్తిగననట్టి*
*అయ్యంగారి లలామ (గుర్తు) గేటు 'హంగ్రీ' కనులు*
*'క్వీన్మేరీసు'లోని కీరవాణుల*
*పౌడి పాముకొనబడిన (పూసుకొన్న) ముఖాలు చూస్తూ*
*చూస్తూవుంటే*
*నోరూరుచుందా నాకు, లేక నా సమస్తాంగాలు*
*సముద్రంలోని అలల్లాగా*
*రుద్ర నర్తన చేస్తున్నాయా?* అని పఠాభి తనను తానే ప్రశ్నించుకుంటాడు. ఇందులో స్త్రీ స్తన సౌందర్యాన్ని వర్ణించడమే కాక,  పురుషునిలో కలిగే కోర్కెలను కూడా బాహాటంగా బట్టబయలు చేసిన వ్యక్తి పఠాభి.

*అన్నం ముద్దకయి కక్కుర్తిపడి*
*శరీరాన్ని సవారికిచ్చే జవరాళ్ళు*
*తొమ్మిదణాల సినిమా టిక్కటునకు*
*తమ బహిర్దేహము మీద*
*యాత్ర చేయుటకు హక్కునిచ్చే*
*కొందరు ఆంగ్లో ఇండియన్ అభాగినులు...*

వేశ్యల్లో కనిపించే రకాల గురించి చెప్పడం జరిగింది. భుక్తి కోసం కొందరు, డాంభిక జీవితం కోసం ఇంకొందరు వేశ్యలుగా మారటం ఇందులో కన్పిస్తుంది. ఇటీవలి కాలంలో తెలుగు సినీరంగంలో అవకాశాల కోసం చాలా మంది అమ్మాయిలు తమ శరీరాల్ని అప్పగించిన వార్తల్ని కూడా మనం చూశాం. విన్నాం కూడా. ఇది ఒకరకంగా డాంభిక జీవితానికి సంబంధించినదని చెప్పవచ్చు. ఒక సినిమా టికెట్టు కోసం శరీరాన్ని అమ్ముకునే స్త్రీలను గురించి 1939లో  చెప్పడం పఠాభిగారి సూక్ష్మ పరిశీలనకు నిదర్శనం.

**వర్షం :** మహానగరముపై వర్షం కురిసిన దృశ్యాన్ని ఈ విధంగా వర్ణించారు పఠాభి.

*మహానగరము మీద మబ్బుగమ్మి*
*గర్జిస్తున్నది.*
*దేవుని ఏరోప్లేనుల్ భువికి దిగుచున్నట్టుల.....*

ప్రాచీనులు జలగర్జనను రథచక్ర ఘోషతో వర్ణించగా పఠాభి దేవుని ఏరోప్లేను ధ్వనితో పోల్చి ఆధునికతను ప్రదర్శించారు.

**పోలీసు :** వాహనాలు, జనాలతో కిక్కిరిసిన రహదారుల కూడలిలో నిల్చోనుండే ట్రాఫిక్ పోలీసుపై రాసిన కవిత నగర జీవిత చిత్రణకు చక్కని ఉదాహరణ. ఆధునిక పరిపాలనా వ్యవస్థ ఫలితంగా గ్రహించిన వస్తువిధి. చీలుదారుల్లో నిల్చుని దారి చూపించే ఈ పోలీసు భటుడు భరతనాట్యంబాడుచున్న నటర్షి చూడామణిలాగ కన్పిస్తాడని ప్రశంసిస్తారు పఠాభి.

*బల్బు హారన్ల తాళాంతోడి*
*యిలక్ట్రికు హారన్ల రాగానికిన్ని*
*మోటారు సయికిళ్ళ మృదంగానికినీ*
*అనుగుణ్యంగా నర్తిస్తుంటాడు.*

**వసంతం :** ప్రకృతికి మారుపేరైన పల్లె సీమకు నగరానికి వున్న వ్యత్యాసాన్ని 'వసంతం' గేయంలో వర్ణించారు.

*వసంతర్తువు వచ్చిందని నేను*
*విన్నానీ మద్రాస్సిటీలోకి*
*ఏదీ వసంతం ?*

*కోకిలా రావంబేదీ వినుబడలేదే నాకు...*
*విధీ విరామంలేని*
*బస్సు ట్రాముల గోలతప్ప*

నిజంగా వసంతకాలం వచ్చిందా ? అని ప్రశ్నిస్తాడు పఠాభి... వసంత కాలంలో స్త్రీల మనస్సు ఏవిధంగా వుంటుందో కూడా వెల్లడించారు.

*సాహసం లేనిదే సౌఖ్యమ్మంత*
*సులభమ్ముగా రాదీ రోజుల్లోన*
*అదీకాక స్త్రీ చిత్తం కూడా సరళంగ*
*వుంటుంది గదా ! వసంతం వచ్చిందికాన....*

సైన్స్ ప్రకారం వసంత కాలంలో స్త్రీల మనస్సు సరళంగానే వుంటుంది. కాలాన్ని బట్టి మనుషుల్లో కావచ్చు, పక్షుల్లో కావచ్చు, జంతువుల్లో కావచ్చు కోరికలు మారుతూ వుంటాయి. కోకిల వసంత కాలంలోనే కూయడానికి కారణం, కప్పలు ముంగారు వర్షాలు పడినప్పుడు అరవడానికి కారణం కూడా అదే.

**బోగందాన :** బోగ స్త్రీ దయనీయ స్థితి గురించి, వాళ్ళ దగ్గరకొచ్చే సమస్త పురుష జాతి గురించి, స్త్రీ సౌఖ్యాన్ని కోరుకునే విధానాన్ని గురించి 'బోగందాన' కవితలో బట్టబయలు చేశారు. వస్తువులో కూడా వైవిధ్యం కన్పిస్తుంది.

*ఓ బోగందానా ! నీవు*
*సంఘానికి వేస్టు పేపరు బాస్కటువా ?*
*మష్టు మషాణము పడవేయునట్టి దిబ్బవా?* అని పఠాభి ప్రశ్నించడమే కాక బోగం స్త్రీలపై పఠాభికున్న గౌరవాన్ని, అభిమానాన్ని ఇందులోనే వ్యక్తపరుస్తాడు.

*నిన్ను గవురవిస్తున్నా నేను*
*నీలోనే నాకు జీవితం నిజంగా*
*సరిగ్గా ప్రతిఫలిస్తున్నది..*
*ఇతర స్థలాలలోన*
*అంతా బూటకం.. అంతా నాటకం.. గొప్ప అబద్ధం*
*..........సర్వం అబద్ధం*
*కానీ నీవు మటుకు ఓ బోగం దానా !*
*ముసుగులేని నిష్ఠురమగు నిజానివి*
*నీడపడ నటువంటి నిర్మలమగు నిజానివి...*

**నవ్య స్త్రీ :** పాశ్చాత్య సంస్కృతీ ప్రభావంతో భారతీయ సంస్కృతిలో, స్త్రీ వేషధారణలో వచ్చిన మార్పులను, ఆ వేషధారణ అమాంతం పురుషుణ్ణి ఏవిధంగా ఆకర్షిస్తుందో నన్న వాటిని 'నవ్య స్త్రీ' కవితలో వర్ణించారు పఠాభి.

*అదో అదో అదో చూడుము*
*నవ్య స్త్రీ పోతున్నది నాయరోడ్డున*
*సిగ్గిల్లకుండా టక టక టకమంటూ*
*హాయి హీలుయాన !*
*నీ ఆకారమంతా నిజంగా మహా*
*అందంగా వున్నది: నీయందం*
*శాకాహారులగు నావంటి వారిక్కూడా*
*మాంసాహారం మీదికి*
*బుద్ధిపోనిస్తున్నదో.. నవ్య స్త్రీ....* అంటారు పఠాభి గారు. పఠాభిగారు అమెరికాలో ఉన్నప్పుడు (1941) తన చుట్టూ ఆవహించివున్న పరదేశి నాగరికతలోనికి స్వదేశ సందేశంతో వచ్చే 'జమీన్ రైతు' పత్రికను చూసి పులకించి ఆ పత్రికపై కవితలు రాశారు. అందులో ఒకటి......

*ఆంధ్రలక్ష్మీ విరహతాప మనుభవించు*
*నట్టి నా అంతరంగమ్మునకు రహస్య*
*వార్తలందియ్యగా నీవు వచ్చితివి*
*జమీన్ రైతు పత్రికా ! నేడు అమిత సుదినము !*
*(1941 అక్టోబరు 17)*

**ముగింపు :** మొత్తం మీద పఠాభి సాహిత్యాన్ని పరిశీలిస్తే అక్షరాలను తనకు ఇష్టం వచ్చినట్లు మార్చడం, ఛందస్సులపై విముఖత, ఆంగ్ల శబ్దాలను తెలుగు శబ్దాలతో సమసింపజేయడం, చిన్నయసూరి వ్యాకరణ పరిధిని అధికమించి గ్రామ్య, గ్రాంధిక శబ్దాలను తనకు ఇష్టం వచ్చినట్లు ప్రయోగించడం, అర్థానుగుణంగా వర్ణాలను తలక్రిందులుగానో, పక్కగానో రాయడం వంటి అనేక నూతన ప్రయోగాలను చేసి తెలుగు సాహిత్యంలో కొత్త విప్లవానికి దారితీసిన కవి పఠాభి. పఠాభిలో స్వేచ్ఛా విహారం ఎక్కువగా కన్పిస్తుంది. నగరములోని కృత్రిమ వాతావరణంలోని కుళ్ళునే అధికంగా బయట పెట్టడానికి ప్రయత్నం చేశారు పఠాభి. దిగజారిపోతున్న నైతిక సంప్రదాయాలు, పతనమౌతున్న సామాజిక విలువలు, సామాజిక దోపిడి ఇలాంటివన్నీ సామూహికంగా తమ ప్రభావాన్ని పఠాభిపై చూపాయని చెప్పవచ్చు.

డా॥ డి.కె.ప్రభాకర్
సహాయ ఆచార్యులు, తెలుగు అధ్యయన శాఖ
బెంగళూరు విశ్వవిద్యాలయం, జ్ఞానభారతి,
బెంగళూరు - 560056
చరవాణి : 7795444919, 7892155603



# కార్మికుల రక్షకుడు

**– డా. అంబేద్కర్**

ప్రపంచ దేశాలలో భారతదేశం 142. 86 కోట్ల జనాభాతో మొదటి స్థానంలో ఉండగా ఈ జనాభాలో 52.8% కార్మికుల ఉన్నారు ఇందులో 7శాతం మంది సంఘటిత రంగంలోనూ 93 శాతం మంది అసంఘటిత రంగంలోనూ పనిచేస్తున్నారు. ఏ దేశం యొక్క అభివృద్ధి అయినా ఆ దేశ కార్మికులపై ఆధారపడి ఉంటుంది అనటంలో ఏటువంటి సందేహము లేదు భారతదేశంలో స్వతంత్రం రాకముందు కార్మికులు మెజారిటీగా వ్యవసాయ రంగంలో ఉండేవారు వీరందరూ నిరక్షరాస్యులు అమాయకులు అవ్వడంతో బడాభూస్వాములు మోతుబారు రైతులు వీరిని కట్టు బానిసలుగా చూసేవారు వీరికి పని చేయటం తప్ప హక్కులు అనే పదం కూడా తెలియదు తర్వాత కాలంలో ఈస్ట్ ఇండియా కంపెనీ వారు మన దేశానికి రావడంతో మన దేశ వనరులను కొల్లగొట్టి వారి వ్యాపారానికి అవసరమైన కొన్ని పరిశ్రమలను ఏర్పాటు చేసి యజమానులుగా ఉన్న విదేశీ బ్రిటిష్ వారు వారి హక్కులను కాపాడుకోవడానికి కార్మికులను వారి కబంధ హస్తాలలో ఉంచుకుంటూ బ్రిటిష్ వారికి అనుకూలంగా కొన్ని చట్టాలను తీసుకుని వచ్చారు కానీ కార్మికుల దినస్థితిలో ఎటువంటి మార్పు రాకపోగా రోజురోజుకు దిగజారి పోతూ దోపిడీకి గురవుతూ ఉండేవారు.

భారతదేశంలో మెజారిటీగా ఉండి దేశానికి సంపాదన సృష్టిస్తూ దేశ ఆర్థిక రంగానికి వెన్నుముకగా ఉన్న కార్మికుల యొక్క కష్టాలను యాజమాన్యం యొక్క దోపిడీని చదివి అవగాహన చేసుకున్న డా.అంబేద్కర్ అదేవిధంగా 1848లో మహాత్మ జ్యోతిరావు పూలే ఉత్తర భారత దేశంలోని పూనే పరిసర ప్రాంతాలలో వ్యవసాయ రంగంలోని అసంఘటిత రంగ కార్మికుల కోసం వారి హక్కుల కోసం చేసిన పోరాటాన్ని, తన శిష్యుడు నారాయణ మేఘజీ లోకండే ముంబై టెక్స్టైల్ ఫ్యాక్టరీలో కార్మికులను ఐక్యం చేసి వారి హక్కుల కోసం దేశంలో మొదటిగా కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారు అందుకే ఇతనని కార్మిక సంఘాల పితామహుడు అంటారు మరియు 1902 లో దక్షిణ భారతదేశంలోని కేరళ రాష్ట్రానికి చెందిన అయ్యం కాళీ అసంఘటిత రంగ కార్మికుల కోసం చేసిన పోరాటం నుంచి స్ఫూర్తి పొందిన డా. అంబేద్కర్ భారతదేశంలోని యావత్ కార్మిక లోకాన్ని బానిసత్వం నుంచి విముక్తి కల్పించి వారికి కనీస మానవ అవసరాలను హక్కులను కల్పించడానికి వారిని చైతన్య పరచడానికి భారత దేశంలో మొట్టమొదటిగా కార్మికులు,కర్షకులు,మరియు అట్టడుగు వర్గాల కోసం బ్రాహ్మణిజానికి మరియు క్యాపిటలిజానికి వ్యతిరేకంగా ఆగస్టు 15, 1936న ఇండిపెండెంట్ లేబర్ పార్టీని స్థాపించి 1937లో జరిగిన ప్రావెన్షనల్ ఎలక్షన్ లో 17 సీట్లకు గాను 15 సీట్లను గెలుచుకున్నారు ముంబై లెజిస్లేటివ్ అసెంబ్లీలో 1937 నుండి 1942 వరకు సభ్యునిగా ప్రతిపక్ష నాయకుడిగా ఉండి 22 జూలై 1942 నుండి 21 అక్టోబర్ 1946 వరకు వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ లో లేబర్ మినిస్టర్ గా పని చేస్తారు ఈ సమయంలోనే భారత దేశంలోని కార్మికుల హక్కులు పురుడుపోసుకున్నాయి.

అప్పటి ప్రభుత్వం కార్మికులు స్ట్రైక్(సమ్మె) చేయడం చట్ట విరుద్ధమని 1938 వ సంవత్సరంలో ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ బిల్లును ప్రవేశపెడితే బాబాసాహెబ్ డా.అంబేద్కర్ ఇండిపెండెంట్ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో 20 వేల మంది బొంబాయి టెక్స్టైల్ కార్మికులతో పెద్ద ర్యాలీ చేసి స్ట్రైక్ అనేది కార్మికుల చట్టబద్ధమైన హక్కు అని ఉద్యమించి ముంబై లెజిస్లేటు అసెంబ్లీలో ఇది చెడ్డ నెత్తురోడుతున్న రక్త దాహం అని తిరుగుబాటు చేసి కార్మికులకు స్ట్రైక్ అనేది చట్టబద్ధమైన హక్కుగా సాధిస్తారు. న్యూఢిల్లీలో ఆగస్టు 7,1942 న జరిగిన నాలుగవ కార్మిక సదస్సులో డాక్టర్ బాబాసాహెబ్ డా.అంబేద్కర్మూడు లక్ష్యాలు సాధించాలని మొదటిగా దేశవ్యాప్తంగా కార్మిక చట్టాలను ఒకే రకంగా ఉండాలి రెండవది ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ సెటిల్మెంట్

గూర్చి అంటే కార్మికులకు యాజమాన్యానికి మధ్య వచ్చే సమస్యల పరిష్కారం గూర్చి ఒక విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదిస్తూ కార్మికులు యాజమాన్యం ఒకరి పట్ల ఒకరు బాధ్యతాయుతంగా మరియు గౌరవంగా వ్యవహరించాలి అని తెలియజేశారు మూడవదిగా దేశవ్యాప్తంగా ముఖ్యమైనది కార్మికులు మరియు మూలధనం యొక్క ప్రాముఖ్యత కార్మికుల సంక్షేమము మరియు కార్మికుల విలువలను కాపాడటం. సెప్టెంబర్ 15 1943 న్యూఢిల్లీలో లో జరిగిన త్రిపార్టైంట్ లేబర్ కౌన్సిల్ సదస్సులో డా.అంబెద్కర్ మాట్లాడుతూ కార్మికుల పాలసీని రూపొందేటప్పుడు మూడు పార్టీలైన కార్మికులకు యాజమాన్యానికి ప్రభుత్వాలకు సమాన అవకాసం కల్పించి చర్చించిన తరువాత కార్మిక పాలసీలను తయారు చేయాలి అని ప్రతిపాదించారు అంతేకాకుండా ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ పాలసీలు కూడా ప్రతిపాదించి మెడికల్ కేర్ మెడికల్ లీవ్ శారీరక అంగవైకల్యం వచ్చిన కార్మికుల బాగోగులను యాజమాన్యమే చూసుకునేలా పాలసీలను తయారు చేశారు.

కార్మికుల హక్కులను వారి సామాజిక రక్షణలను ఉద్యోగ భద్రత జీతభత్యాల కాపాడుకోవటానికి మరియు మెరుగుపరుచుకోవటనికి సంఘంగా ఏర్పడిన కార్మికులను ట్రేడ్ యూనియన్ అంటారు ట్రేడ్ యూనియన్ చట్టం 1926 ప్రకారం కేవలం రిజిస్ట్రేషన్ మాత్రమే చేసుకునే అవకాశం ఉంది దీనివల్ల కార్మికులకు ఎటువంటి ప్రయోజనం లేదని 1944లో డా.అంబెద్కర్ పోరాడి ప్రతి సంస్థలోని ట్రేడ్ యూనియన్ ను ఆయా సంస్థల యాజమాన్యాలు ప్రభుత్వాలు గుర్తించాలని అప్పుడు మాత్రమే కార్మికులకు వారి హక్కుల రక్షణ కోసం యాజమాన్యాలతో నేగోసియేషన్ చేసుకుని అధికారం వస్తుంది అని చెప్పి దానిని సాధిస్తారు. మైకా మైన్స్ లేబర్ వెల్ఫేర్ ఫండ్ ను 8ఏప్రిల్ 1946లో ఏర్పాటు చేసి ప్రతి కార్మికుడకు ఇల్లు త్రాగునీరు కరెంట్ పిల్లల చదువులకు ఎంటర్టైన్మెంట్ మరియు కోపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేసుకునే సదుపాయాన్ని కల్పించారు. న్యూఢిల్లీలో 27 నవంబర్ 1947 జరిగిన ఏడవ కార్మిక సదస్సు లో రోజుకి 14 పని గంటలు ఉన్న దానిని కొట్లాడి 8 పని గంటలకు తగ్గించిన కార్మికుల రక్షకుడు డా.అంబెద్కర్

దేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే నైపుణ్యమైన కార్మికుల అవసరం ఉన్నది అని గుర్తించి టెక్నికల్ నాన్ టెక్నికల్ నైపుణ్యం ఉన్న కార్మికులను గుర్తించటానికి తక్కువ నైపుణ్యం గల కార్మికులకు శిక్షణ ఇచ్చి నైపుణ్యం గల కార్మికులుగా తయారు చేయడానికి ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిను మే 7&8 నా ముంబైలో జరిగిన స్టాండింగ్ లేబర్ కమిటీలో డా.అంబెద్కర్ భారత ప్రభుత్వ లేబర్ మెంబర్గా పాల్గొని ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి స్థాపనకు పునాది వేశారు తరచుగా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిల పనితీరును పరిశీలించడానికి వివిధ రాష్ట్రాలు తిరిగేవారు ఆ క్రమంలో పశ్చిమబెంగాల్ వెళ్ళినప్పుడు ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ల యొక్క పాత్ర చాలా మెరుగుగా ఉన్నది అని గమనిస్తారు అంతేకాకుండా కార్మికుల యొక్క స్థితిగతులు వారి సంఖ్య జీతాలు మొదలగు సమాచారం కోసం 1942లో ఇండియన్ స్టాటిస్టికల్ యాక్ట్ తీసుకుని వస్తారు. భారత ప్రభుత్వ కార్మిక సభ్యునిగా బొగ్గు గనుల యొక్క పని విధానము మరియు కార్మికుల యాజమాన్యం యొక్క స్థితిగతులను కార్మికుల క్వాటర్స్ కాలనీలను తెలుసుకోవడానికి నిరంతరం సందర్శిస్తూ ఉండేవారు డిసెంబర్ 9న ధన్బాద్ భూగర్భంలో ఉన్న బొగ్గు గనులలో 400 అడుగుల క్రిందకు వెళ్ళి పరిశీలిస్తారు అలాగే రాణిగంజ్ బొగ్గు గనులు జారియా బొగ్గు గనులు తనిఖీ చేస్తారు మహిళా కార్మికుల కష్టాలను బాధలను అర్థం చేసుకుని వారికోసం ప్రత్యేక చట్టాలను తీసుకుని వస్తారు డా అంబేద్కర్ తన రక్తాన్ని సిరాగా మార్చి రాసిన ప్రతి అక్షరం ఈ దేశం కోసం దేశ ప్రజల కోసం దేశ రక్షణ కోసం దేశ అభివృద్ధి కోసం దేశ సంక్షేమం కోసం దేశ మహిళల కోసం దేశ కార్మికుల కోసం మేటర్నిటీ బెనిఫిట్ యాక్ట్, మహిళా కార్మికులు సంక్షేమ నిధి, మహిళలు మరియు బాల కార్మికుల రక్షణ, కార్మికుల మధ్య ఎటువంటి కుల మత ప్రాంతీయ భాష వర్గ లింగ బేదాలు లేకుండా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి అని ప్రతి కార్మికులకు కనీస జీతభత్యాలు చట్టం అమలు చేయాలని డియర్ నెస్ అలవెన్స్ మరియు రివిజన్ ఆఫ్ పే స్కేల్ ను ప్రతి కార్మికులకుడాక్టర్ అంబేద్కర్ సాధించారు అంతేకాకుండా భారతదేశంలోని ఈ వివిధ రకాల పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల కోసం వర్క్ మెన్స్ కంపెన్సేషన్ బిల్, ఇండియన్ మైన్స్ బిల్, ఫ్యాక్టరీస్ రిహబిలిటేషన్ ప్లాన్స్, వెల్ఫేర్ సోషల్ సెక్యూరిటీ ఆఫ్ వర్కర్స్, మైకా మైన్స్ లేబర్ వెల్ఫేర్ ఫండ్ బిల్, ద

ఇండియన్ ఫైనాన్స్ బిల్, ఇండస్ట్రియల్ ఎంప్లాయ్మెంట్ బిల్, స్ట్రైక్ బై వర్కర్స్ ఆఫ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రెస్. అఖిలభారత కార్మిక సంఘాల స్టడీ క్యాంపు సెప్టెంబర్ 8 నుండి 17 వరకు 1943 లో ఢిల్లీలో జరిగిన సదస్సులో కార్మికులు మరియు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనే అంశంపై డా.అంబేద్కర్ మాట్లాడుతూ కార్మిక సంఘాలు కుల మత మరియు క్యాపిటలిస్ట్ రాజకీయ పార్టీలైన కాంగ్రెస్ మరియు హిందూ మహాసభలో కలిసిపోకుండా స్వతంత్రం కోసం పోరాడుతూ సొంత రాజకీయ పార్టీని స్థాపించి కార్మిక వర్గం అంటే పాలకవర్గం అనే విధంగా రాజకీయా అధికారాలను ప్రభావితం చేయాలి అని అంటారు

ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే ఆ దేశ జనాభాకు అవకాశాలను కల్పించి వస్తు సేవల ఉత్పత్తిలో భాగస్వామ్యం చేయాలి మన దేశంలో 15 సంవత్సరాల నుండి 62 సంవత్సరాల వయసు ఉన్న యువకులు 68%గా యువ భారతదేశంగా ఉన్నారు కానీ యువకులు నిరుద్యోగులుగా మారిపోవటం వల్ల నిరుద్యోగం రేటు 7.7% గా ఉంది తలసరి ఆదాయంలో ప్రపంచ దేశాలలో 147 స్థానంలో ఉన్నాం ఆర్థిక అసమానతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి 2012-21 మధ్య కాలంలో సంపదలో 40 శాతం కేవలం అగ్రభాగాన ఉన్న 1% జనాభా వద్ద కేంద్రీకృతమైనది కానీ దేశానికి సంపద వచ్చే వస్తూ సేవలపన్నులో అట్టడుగున ఉన్న 50 శాతం మంది ప్రజల దగ్గర నుండి 64% వస్తుంటే సంపదలో అగ్ర బాగాన ఉన్న10 శాతం దగ్గర నుండి కేవలం నాలుగు శాతం మాత్రమే వస్తుంది దీనిని బట్టి మనకు అర్థమవుతుంది దేశానికి సంపదను సృష్టించేది పెట్టుబడిదారులు కాదు కార్మికులు మరియు అట్టడుగు వర్గాలవారు మాత్రమే.

బాబాసాహెబ్ కార్మికుల కోసం ప్రతిపాదించిన ప్రతి అంశం స్వతంత్ర అనంతరం భారత రాజ్యాంగం ద్వారాచట్టాలుగా మారాయి ప్రస్తుతం 44 కార్మిక చట్టాలు ఉండగా వాటిని కేవలం నాలుగు కోడ్ లగా మార్పు చేసినారు అవి కోడ్ ఆన్ వేజెస్, కోడ్ ఆన్ ఇండస్ట్రియల్ రిలేషన్స్, సోషల్ సెక్యూరిటీ, కోడ్ ఆన్ ఆక్యుపేషనల్ సేఫ్టీ అండ్ వర్కింగ్ కండిషన్స్.ఈ కోడ్ల ప్రకారం కార్మిక లోకం వారి యొక్క ప్రాథమిక హక్కులను కోల్పోతున్నారు డా అంబేద్కర్ ద్వారా వచ్చిన కార్మిక చట్టాలను సంఘటితంగా ఉంటూ ఐక్య పోరాటాలతో కాపాడుకుంటూ వ్యక్తిగతమైన స్వార్థ ప్రయోజనాలను పక్కనపెట్టి సంఘ ప్రయోజనాలకు ప్రాధాన్యతను ఇస్తూ పోరాటాలు చేయడం ద్వారా కార్మికుల యొక్క జీవితాలతో పాటు దేశ ప్రజల సామాజిక రాజకీయ ఆర్థిక పరిస్థితులను సైతం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభావితం చేస్తూ పరిపాలనలో సైతం బాగమయ్యేవారు.

డాక్టర్ అంబేద్కర్ కార్మికులకు ఏదైతే హెచ్చరిక చేసాడో అదే ఇప్పుడు జరుగుతుంది భారతదేశంలో శ్రమ విభజనతో పాటు శ్రామికుల యువజన జరిగినది అని ఆ విభజన కుల మత ప్రాంత వర్గ భాష లింగ బేదలతో జరిగినది ఈ దేశానికి కులం అనేది ప్రధాన శత్రువు దీనివల్లే కార్మికుల ఐక్యత లోపించి కార్మిక సంఘాలు బలహీనపడినవి అందువల్లే కరోనా సమయంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి భారతీయ కార్మిక చట్టాలను సంవత్సరం పాటు కొన్ని రాష్ట్రాల్లో రద్దుచేసి కార్మికులకు కనీస మానవ అవసరాలు అయినా త్రాగునీరు వెలుతురు విశ్రాంతి గదులు టాయిలెట్స్ సదుపాయాలు కూడా కల్పించవలసిన అవసరం లేదంటూ స్వదేశీ కార్మికులైన భారతీయులను బలవంతంగా కట్టు బానిసత్వంలోనికి నెట్టివేస్తూ విదేశీ పెట్టుబడిదారులను నెత్తిన ఎక్కించుకుని మోస్తున్నారు పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో భారత దేశంలో ఉన్న సమిష్టి ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను వ్యక్తిగత ఆస్తులుగా ప్రైవేటు పరం చేస్తూ భారతీయులైన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వ సంపదను ధ్వంసం చేస్తున్నారు ఇప్పటికైనా ఈ దేశ కార్మికుల రక్షకుడైన మరియు కార్మిక జాతి దార్శనికుడైన బాబాసాహెబ్ అంబేద్కర్ సూచించిన బాటలో ప్రయాణించి దేశానికి కులం అనేది ప్రధాన శత్రువుగా గుర్తించి కుల నిర్మూలనకు అడుగులు వేస్తూ కార్మికులందరూ ఏకమై భారత రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ ప్రసాదించిన కార్మిక చట్టాలను, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవడానికి ప్రతి కార్మికుడు సంసిద్ధమై ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మేడే స్ఫూర్తి కావాలి.

డా. బోరుగడ్డ సుబ్బయ్య,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్,
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం,
మొబైల్: 9492704401,

# గాంధార శిల్పకళ

*– బెల్లంకొండ రమేశ్‌చంద్ర*

గాంధార శిల్పకళపై కలకత్తా ఇండియన్ మ్యూజియంలో ఫిబ్రవరి 3, 1991లో ప్రపంచ శిల్పశాస్త్ర పండితుల సభ జరిగింది. ఆ సభలో గాంధార ప్రాంతం పశ్చిమంలో హిందుకుష్ పర్వతాలు, తూర్పున పంజాబ్, ఉత్తరంలో స్వాత్, హజారా, కాశ్మీర్ లోయలు, దక్షిణంలో పెషావర్, రావల్పిండి జిల్లాల మధ్య ఉన్నదని నిర్ణయించడం జరిగింది. గాంధార శైలి ముఖ్యకేంద్రం దక్షిణ ఆఫ్ఘనిస్తాన్, ఉత్తర పాకిస్తాన్ పర్వతాల నడుమ త్రికోణాకారంలో ఉన్న ప్రాంతంలో పరిఢవిల్లింది. గాంధారం తూర్పు, పడమరలుగా 100 కి.మీ., ఉత్తర దక్షిణాలుగా 70 కి.మీ. మధ్య ఎర్రటి నేలతో విస్తరించి వున్నది. వాస్తవానికి భారతదేశమంతటా గాంధార శిల్పశైలి ప్రభావం పడిందని చెప్పవచ్చు. గాంధార శిల్పశైలి పుష్కలావతి కేంద్రంగా అపరగాంధార శాఖగా, తక్షశిల కేంద్రంగా పూర్వగాంధార శాఖలుగా అభివృద్ధి చెందాయి.

**నేపథ్యం :** రుగ్వేదం, అథర్వణ వేదం, ఇతిహాసాలు, జాతక కథలు గాంధార ప్రాంతాన్ని ప్రస్తావిస్తున్నాయి. దీన్నిబట్టి భారతదేశంలో గాంధారకు ఎంత బలమైన బంధం కలిగివుండేదో అర్ధమవుతుంది. గాంధారం అఖమేనియన్ సామ్రాజ్య అంతర్భాగమైన పర్షియన్ ప్రాంతంలో క్రీ.పూ.6–5 శతాబ్దాల మధ్య ఉండేది. అలెగ్జాండర్ భారత్‌పై దండయాత్ర చేసి క్రీ.పూ.327లో తిరిగి వెళ్ళిపోతూ భారత పశ్చిమోత్తర ప్రాంతాల్లో తన సేనాని సెల్యూకస్ నికటర్‌ను అధిపతిగా నియమించి వెళ్ళాడు. మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుడు ఆప్రాంతంపై దాడి చేయగా సెల్యూకస్ తన కుమార్తెనిచ్చి సంధి చేసుకోవడంతో గాంధారం కూడా మౌర్యుల ఆధిపత్యం లోకి వచ్చింది. క్రీ.పూ.2వ శతాబ్దం తొలిభాగంలో బాక్ట్రియన్ గ్రీకులు గాంధారం గుండా తూర్పుకు విస్తరించారు. ఆ తరువాత బాక్ట్రియన్ గ్రీకులను అనుసరిస్తూ విదేశి జాతులైన సింధియన్‌లు, పర్షియన్‌లు, ససానియన్‌లు, కుషాణులు, హూణులు క్రీ.పూ.1 – క్రీ.శ.5 శతాబ్దాల మధ్య గాంధార ప్రాంతంపై ఆధిపత్యం పొందడం జరిగింది.



వాఖ్యానముద్రలో బుద్ధదేవుని శిల్పం

**గాంధార శిల్ప శైలి :** ఒక ప్రత్యేక భౌగోళిక ప్రాంతంలో ఉన్న గాంధారం పశ్చిమ ఆసియాకు ముఖ ద్వారంగా ఉండటమేకాక విభిన్న జాతుల సమ్మేళనానికి కేంద్రంగా నిలబడింది. వారు భారత దేశానికి వచ్చి పోవడంతో గాంధారకళ అనే మిశ్రమ రూపశిల్పకళ ఆవిర్భవించింది. ఈ కళని గాంధార కళ అని, గ్రీకో–బుద్ధిస్ట్ కళ అని, గ్రీకో–రోమన్ కళ అని, గ్రీకో–ఇరానియన్ కళ అని, ఇండో–హెలినిస్టిక్ కళ అని భిన్న నామాలతో పిలిచారు.

**లక్షణాలు :** గాంధారం చుట్టు ఉన్న కొండల నుండి లేత నీలం బూడిదరంగు కలిగిన చిస్ట్ రాతి పలకలను సేకరించి శిల్పాలను మలచారు. అంతేగాక సున్నపు మట్టిని మూసలో పోసి తయారు చేసిన 'స్టకో' బొమ్మలు, ఇంకా కుండలు చేసే మట్టిని ఉపయోగించి బొమ్మలుగా చేసి ఆమలో ఎర్రగా కాల్చడం వల్ల తయారైన టెర్రకొట్ట బొమ్మలు కూడా గాంధార శైలిలోనే రూపొందించారు. అప్పుడప్పుడు లోహపు బొమ్మలను కూడా తయారు చేసారు. ఈ బొమ్మలలో గ్రీకు, బాక్ట్రియన్, రోమన్, సిథియన్, మథుర శైలిలలో బుద్ధ విగ్రహాలను, బుద్ధ జీవిత ఘట్టాలను, సూక్ష్మాతి సూక్ష్మమైన వివరాలతో చెక్కడమేగాక, బుద్ధుని గ్రీకుదేవుడు అపోలోని చెక్కినట్టుగా అలలను పోలిన లేదా గిరజాల జుట్టుతో, శిఖముడితో చెక్కారు. ఒక్కొక్కప్పుడు మీసాలతో కూడా బుద్ధుడు చెక్కబడటం విశేషం. అంతేగాక కనుబొమ్మలు ముడిబడి బొట్టు మాదిరిగా కన్పించే 'ఊర్ణం'తోను, నున్నటి భుజాలను కప్పుతూ మడతలు కలిగిన వస్త్రంతోను, రోమన్‌ల 'తోగా'ను పోలిన పొడవాటి అంగీతోను కూడా చెక్కబడినాడు. ఒక్కోమారు బోధిసత్వుడు చెప్పులు ధరించి కన్పిస్తాడు. విచ్చుకున్న పద్మ దళాలపై కూర్చుని తల వెనుక ప్రభామండలాలతోను, చక్కటి శరీర సౌష్టవంతోను బుద్ధుడు చెక్కబడినాడు.

**గాంధార శిల్ప కళ ప్రభావం :** గాంధార శిల్పకళలో నిలబడి వున్న బుద్ధ విగ్రహం ఎప్పుడూ అభయ ముద్రలో ఉండగా, కూర్చుని వున్న బుద్ధవిగ్రహం భూమిని తాకుతున్న



శ్రీలక్ష్మి

ముద్రలోను, ధ్యానముద్రలోను, ధర్మచక్రప్రవర్తన ముద్రలోను చెక్కబడటం పరిపాటి. అయితే ఒక్కోమారు బుద్ధ దేవుడు ఎడమకాలుపాదం పైకి కన్పించేటట్లుగా మడచి, కుడి కాలుని నిలువుగా మడచి, రెండు అరచేతులను మోకాలుపై చేర్చి, దానిపై వాలుగా కుడి చెంపను ఆన్చి దీర్ఘాలోచనలో మునిగి ఉన్నట్లుగా చెక్కడం గాంధార శిల్పి ప్రత్యేకత. ఈ శిల్పశైలిలో గౌతమ బుద్ధుని సంకేతపరమైన గుర్తులతో చూపించడం అరుదుగానే జరిగింది. అంతేకాక బుద్ధ జాతక కథలు గాంధార శిల్పిని అంతగా ఆకట్టుకోలేదని చెప్పాలి.

ఒక్కొక్కప్పుడు తథాగతుడు గాంధార శిల్పంలో కండలు తిరిగిన శరీరంతోను, నిరాహారంతో ఎముకలు బయటపడి కృశించిపోయిన శరీరంతో కూడా మలచబడటం విశేషం.గాంధార కళలో భారతీయేతర స్త్రీ పురుష ప్రతిమలేకాకుండా సమాజంలోని భిన్న వ్యక్తుల రూపాలను ముఖ్యంగా మరుగుజ్జు రూపంలో ఉన్న పురుషులు పూలదండలను మోస్తూ కన్పించడం పరిపాటే. ఇక దైవ సంబంధమైన రూపాలలో చేతిలో 'పిడుగు'ను ఆయుధంగా ధరించిన భోధిసత్వుని రూపశిల్పం, పిల్లలతో పంచిక, హారితీ దంపతుల శిల్పం, బరువైన రాతి బండలను మోస్తున్న గ్రీకు యోధుని శిల్పం, భారత దివ్యమూర్తుల రూపాల్లో ఇంద్ర (సక్ర), బ్రహ్మ, కార్తికేయ, గరుడ, యక్షుల వంటి శిల్పాలు ఒక ప్రక్క చెక్కుతూనే మరోప్రక్క రాజులు, రాణులు, పాలనాధిపతులు, రాజపరిచారికలు, మునులు, భిక్షువులు, భక్తులు, రాజ



త్రిరత్న ఆరాధన శిల్పం

అంతఃపురదృశ్యాల శిల్పాలను చెక్కారు. గాంధారశిల్పి బుద్ధునికి సంబంధించిన జీవిత ఘట్టాను చెక్కడానికి ఇచ్చిన ప్రాధాన్యత సమకాలీన, పుష్ప, వృక్ష, జంతు జాతులకు ఇవ్వలేదనే చెప్పాలి. అంత మాత్రాన వాటిని పూర్తిగా విస్మరించారని కాదు. పద్మం, రావిచెట్టు, రావి ఆకుల వరుసలు, అకంతస్ ఆకులు, సక్ర పుష్పాలు, నాగ పుష్పాలతోపాటు, జంతువులలో ఏనుగు, గుఱ్ఱం, సింహం. ఎద్దు, జింకలు, నెమళ్ళు వాటితో పాటు పక్షులు, జంతువులు, మానవులతో కూడిన మిశ్రమ రూపాలను కూడా చెక్కడంలో గాంధార శిల్పి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. కోరంథియాన్, పెర్సిపోలిటాన్ స్తంభాలు, కరీటాలలో గాంధార వాస్తు శిల్ప కళ ప్రతిబింబిస్తుంది. భారతీయ బౌద్ధచైత్యం భిన్న రూపాలలో చెక్కడమే గాక గవాక్షాలు, స్తంభ తోరణాలు కూడా అత్యంత సుందరంగా గాంధార శిల్పి మలిచాడు.

**గాంధార శిల్పకళ – విమర్శ :** జీవకళ ఉట్టిపడేలా గాంధారశిల్పం రూపొందించపడలేదనే విమర్శ వుంది. విస్తారమైన బుద్ధ జీవితకథ దృశ్యాలను పదేపదే చెక్కడం వలన శిల్పంలో నిర్లిప్తత గోచరిస్తుంది. అయితే అది కూడా విదేశాలలోని ప్రజల ఆదరణకు పాత్రమయిందేమో కాని భారతీయ చింతనాపరులను సంతృప్తి పరచలేక పోయింది. వైవిధ్యం లోపించిన మూసరూపాలు, జీవకళ లోపించిన శిల్ప విన్నాణం. భారతీయ ఆధ్యాత్మికపరులపై కూడా ప్రభావం చూపలేకపోయింది. గాంధార శిల్పి చెక్కిన ముళ్ళ మాదిరి కొసలు తేరిన పద్మ దళాలపై బుద్ధుని కూర్చుండబెడితే సున్నితత్వం, శాంతభావం లోపిస్తుందనేది వారి వాదన. అలా అని శిల్పంలో తాలవ్యత, కదలిక, వెలుగు, వేగం, మృదుత్వం చెక్కడంలో ఉన్న గాంధార శిల్పి గొప్పదనాన్ని మనం విస్మరించలేము. అయితే దానిని రోమన్ శిల్పులు అందిపుచ్చుకోవడం విశేషం. గాంధార కళాకారులు చెక్కిన, కొన్ని శిల్పాలు పనితనంలో పరాకాష్టకు చేరుకొన్నాయని చెప్పక తప్పదు. అన్ని చేతులు ఒకలా వుండవు కాబట్టి అన్ని శిల్పాలు అద్భుత కళా ఖండాలు కాలేవు. ఆకాలంలో కళాకారునిపై గల పనివత్తిడి అత్యధిక శిల్పాలను మలచవలసి రావడం కొంత మేరకు గాంధార శిల్పంపై పడిందని చెప్పక తప్పదు.

గాంధార శిల్పం రాను రాను తన ప్రత్యేకతను కోల్పో తున్నప్పటికి గాంధార శిల్పులు సృష్టించిన సున్నపు బొమ్మలు (స్టకో), కాల్చిన మట్టి బొమ్మలు (టెర్రకొట్టా)



మహాభినిష్క్రమణ ఘట్టం

ఇందుకు మినహాయింపు. ఈ బొమ్మలను రూపొందించడంలో పాటించిన జాగరూకత, సూక్ష్మాతి సూక్ష్మమైన వివరాలను పొందుపరచడంలో కన్పిస్తుంది. భారత సంస్కృతి పునరుజ్జీవనం పొందిన గుప్తుల కాలంనాటి శిల్పాలతో కన్పించే సహజత్వం, గొప్పదనం, భావ ప్రకటనను గాంధార ప్రాంతంలో వెలుగు చూసిన టెర్రకొట్ట బొమ్మలలో కన్పించ డానికి కారణమేమిటో గ్రహించ గలము. భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవ కాలంలో గాంధార ప్రాంతంలో అందమైన శిల్పాలు రూపు దిద్దుకొన్నాయి అంటే గాంధార శిల్ప శైలి ప్రభావం నిరంతరం కొనసాగుతూ తన ప్రత్యేకతను చాటుతూనే వుంది.

**గాంధార శిల్పం – కాల నిర్ణయం :** గాంధార శిల్పకళ ఉత్థాన పతనాల కాలాన్ని నిర్ణయించడం చర్చనీయాంశం. గాంధార శిల్పాలపై శాసనంతో పాటు శిల్పం చెక్కిన కాలం, సంఖ్యా రూపంలో సూచించబడింది. అవి వరుసగా

1. 5వ సంవత్సరం – బుద్ధప్రతిమ (దొరికిన ప్రదేశం తెలియదు) బ్రస్సెల్స్ మ్యూజియం. 2. 56వ సంవత్సరం – మైత్రేయ బుద్ధ ప్రతిమ, ఇండియన్ మ్యూజియం, కలకత్తా. 3. 89వ సంవత్సరం – ఇంద్రశిల మమనేథేరి, పెషావర్ మ్యూజియం. 4. 110వ సంవత్సరం – బోధిసత్వ, వ్యక్తిగత సేకరణ, యు.ఎస్.ఎ 5. 291వ సంవత్సరం – హరితి స్కరాధేరి, ప్రభుత్వ మ్యూజియం, చండీగడ్ 6.318వ సంవత్సరం – బుద్ధ ప్రతిమ, లొరియతంగై, ఇండియన్ మ్యూజియం, కలకత్తా, 7. 384వ సంవత్సరం – బుద్ధ ప్రతిమ, అసిత్ నగర్, బ్రిటీష్ మ్యూజియం, లండన్. 8. 400వ సంవత్సరం – దృశ్య శిల్ప ఫలకం లొరియ తంగై, ఇండియన్ మ్యూజియం, కలకత్తా.

ఈ శిల్పాలపై ఉన్న సంవత్సరాలను లెక్కించడం ఒక వివాదాస్పదమైన అంశం అయినప్పటికి ప్రొ.బి.ఎన్. ముఖర్జీ ఈ శిల్పాల శైలిని, ఖరోష్ఠి లిపి రూపురేఖలను పరిశీలించి వీటిని మూడు దశలుగా నిర్ణయించాడు. శిల్పాలపై చెక్కబడ్డ పెద్ద సంఖ్యలను క్రీ.పూ.170లో ప్రారంభమైన 'పాత' శక సంవత్సరాలలో అంటే ఇండో, గ్రీకు పాలనా కాలం నాటివిగా పేర్కొన్నారు.

**మొదటి దశ :** 291వ సంవత్సరం = క్రీ.పూ.170 + క్రీ.శ.121 318వ సంవత్సరం = క్రీ.పూ.170 +క్రీ.శ.148 384వ సంవత్సరం = క్రీ.పూ.170 + క్రీ.శ.214 400వ సంవత్సరం = క్రీ.పూ.170 + క్రీ.శ.230

**రెండవ దశ :** బోధిసత్వప్రతిమ తల వెనుక నున్న ప్రభామండలంపై చెక్కిన శాసనం ఏజెస్‌కాలంనాటిదని ఈ శిల్పాన్ని విక్రమ సంవత్సరాలైన క్రీ.పూ.58గా భావించి దీనిని క్రీ.పూ.52వ సంవత్సరం (110–58=52)లో చెక్కి ఉండవచ్చని ప్రొ.ముఖర్జీ భావించారు.

**మూడవ దశ :** 1993లో కనుగొన్న 'రబతక్ శాసనాన్ని బట్టి కుషాణరాజు కనిష్కుడే క్రీ.శ.78లో సింహాసనానికి వచ్చి శక సంవత్సరాల ప్రారంభించాడు. కాబట్టి చిన్న సంఖ్యలను చెక్కిన మూడు శిల్పాలను క్రీ.శ.78వ సంవత్సరం తరువాత చెక్కిన శిల్పాలుగా ముఖర్జీ నిర్ధారించారు.

5వ సంవత్సరం + 78= క్రీ.శ.83

56వ సంవత్సరం+78=క్రీ.శ.134

89వ సంవత్సరం+78=క్రీ.శ.167

**గాంధార శిల్పాలు వెలుగు చూసిన ప్రదేశాలు :** ఎక్కువ మొత్తంలో గాంధార శిల్పాలు వెలుగు చూసిన ప్రదేశాలలో పెషావర్ (పురుషపురం) సాహి–కి–ధేరి, చార్ సద్దా ప్రాంతం, జంతార (ఖైబర్‌పాస్), సాహ్రిభలోల్, తిక్తి–ఇ–బహాయ్, ఖర్వై, మలకండ్, లొరియాతంగై, నాతు, సంఘోల్, వియాబ్‌ఖాన్, సిక్రి, జమాల్‌ఘరి, మర్దాన్, కోమ్‌తంగి, బమియాన్, నగర్‌హర (జలలాబాద్) మొదలైనవి. భారతీయ శిల్పకళపై గాంధార శిల్ప కళ

**ప్రభావం :** వైవిధ్యం కరువైన గాంధార శిల్పకళ ఎందుచేతనో కళాత్మకతలో తక్కువ ప్రభావం చూపినప్పటికి అసంఖ్యాంగా శిల్పా లను అందించడంలో ముందుందని చెప్పాలి. ధర్మచక్ర ప్రవర్తన ముద్రలో ఉన్న బుద్ధప్రతిమలు, బహుళ ప్రచారంలో ఉన్న బుద్ధుని జీవిత గాధ శిల్పాలు. ఎన్నో కళల సమ్మేళనం. తూర్పు, పడమరల సంగపు స్థలిలో దాడులు ప్రతిదాడులు, కుట్రలు, కుతంత్రాలతో నిండి ఉన్న ప్రాంతాల మధ్య సామరస్యం నెలకొన్న కుషాణు సామ్రాజ్య అంతర్భాగం అవడంవల్ల మధుర శిల్పులు,



ధర్మచక్రప్రవర్తన ఘట్టం

గాంధార శిల్పులు పరస్పరం నైపుణ్యాన్ని పంచుకోవడం వల్ల అద్భుతమైన భారతీయ శిల్పం భారతీయం అయిన ప్పటికి గాంధార కళలో కన్పించే అందమైన మడతలు కలిగిన వస్త్ర శైలి చాలాకాలం కొనసాగించిందనే చెప్పాలి.

**మ్యూజియంలలో గాంధార శిల్పం :** బ్రిటీష్ ఇండియా పాలనాకాలంలో నిర్మించబడిన ప్రపంచ ప్రసిద్ధి పొందిన కలకత్తా ఇండియన్ మ్యూజియంకు సుమారు 1000కి పైగా గాంధార శిల్పాలు చేరుకొన్నాయి. మొట్టమొదటి సారిగా 1833-34సం॥లో డా.జె.జి. గెరార్డ్ కాబూల్‌లో త్రవ్వకాలు నిర్వహించగా లభించిన గాంధార శిల్పాలను కలకత్తా మ్యూజియంకు చేరుకోవడం భారతీయుల అదృష్టం. 1970 ప్రాంతంలో అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్, జమాల్‌గర్హి , మర్దాన్, సహ్రి భలోల్, తక్తి - ఇ - బహామ్, ఖర్‌ఖైలలో విస్తారంగా పర్యటించి కొన్ని గాంధార శిల్పాలను సేకరించి, త్రవ్వకాలలో లభించిన గాంధార శిల్పాలన్నింటిని ఇండియన్ మ్యూజియంకు అందచేసాడు. స్వాతంత్ర్యానంతరం ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా త్రవ్వకాలలో బయల్పడిన శిల్పాలు కొన్ని, ఇచ్చి పుచ్చుకోవడం ద్వారా మరి కొన్ని కూడా ఇండియన్ మ్యూజియంకు చేరి ప్రత్యేక గాలరీలో ప్రదర్శించ బడుతున్నాయి.

**1.సిద్ధార్థుని జనన ఘట్టం-దృశ్యశిల్పం:** బుద్ధుని జననాన్ని సూచించే ఈ శిల్పంలో లుంబినివనంలో మాయాదేవి సాలవృక్షం కొమ్మను పట్టుకుని ఉండగా బాలబుద్ధుడు ఆమె కుడి నడుముభాగం నుండి బయటపడుతున్నట్లు చెక్కబడింది. బాలబుద్ధుని ఇంద్రుడు అందుకోగా, ఆ ప్రక్కనే బ్రహ్మదేవుడు ప్రభామండలంతో కన్పింస్తున్నాడు. పైనకన్పిస్తున్న దేవతాగణం మంగళ కరమైన క్షణాలకు హర్షాతిరేకాలు ప్రదర్శిస్తున్నారు. సాలవృక్షం కొమ్మల ప్రక్కన 'చామరం' బుద్ధుని ఘనతను చాటుతున్నది. క్రిందనున్న బాలబుద్ధుడు నిలబడి కుడి చేతిని అభయముద్రలో పెట్టి కన్పిస్తున్నాడు. దీనిని గాంధారశిల్పం చివరి దశకు చెందిన శిల్పంగా పేర్కొనవచ్చు.

**2. మహాభినిష్క్రమణ ఘట్టం-దృశ్యశిల్పం:** యువరాజు సిద్ధార్థుడు భార్యబిడ్డలనే భవబంధాలను విడనాడి అమేయజ్ఞాన సముపార్జన కోసం అంత:పురాన్ని వీడివెళ్ళే ఘట్టాన్ని మహాభినిష్క్రమణగా పేర్కొంటారు. సిద్ధార్థుడు కంటక అశ్వాన్ని అధిరోహించగా, దాని గిట్టల శబ్దం రాకుండా యక్షులు అరచేతులతో పట్టుకోగా, వెనుక చందకుడు గొడుగు పట్టి ఉన్నాడు. యక్షుడు వజ్రాన్ని ఆయుధంగా ధరించియున్నాడు. సిద్ధార్థుని అడ్డగిస్తూ ఎదురుగా మారుడు ఆయుధం ధరించియుండగా, అతడి వెనుక ప్రభామండలంతో దేవతామూర్తి చేతులు కైమోడ్చి శిల్పీకరించబడినాడు. ఈ శిల్పఫలకం పైభాగాన ఉన్న ముగ్గురులో ఒకరు ఆయుధం ధరించి కన్పింస్తుండగా, మధ్యలో ఉన్న స్త్రీ నగరదేవతగా పండితులు భావించారు. దీనిని గాంధారశిల్పాలలో చెప్పుకోదగిన దృశ్య శిల్పంగా శిల్పకళా విమర్శకులు గుర్తించారు.

**3. ధర్మచక్రప్రవర్తన ఘటంా-దృశ్య శిల్పం:** బుద్ధదేవుని జీవితంలో ముఖ్య ఘట్టమిది. సారానాథ్ దగ్గరలోని బోధ్‌గయలోని జింకలవనంలో బుద్ధదేవుడు సమ్యక్ జ్ఞానాన్ని శిష్యులకు తొలి బోధ చేసే ఘట్టాన్ని సూచించే శిల్పమిది. క్రీ.శ. 2 వ శతాబ్దంనాటి ఈ శిల్పంలో బుద్ధ భగవానుడు కూర్చుని ఉండగా కుడి చెయ్యి వాఖ్యాన ముద్రలో ఉంది. బుద్ధుని తొలి శిష్యులలో 5 గురులో ముగ్గురు కుడిప్రక్క ఇద్దరు ఎడమప్రక్కన కూర్చుని ఉన్నారు. బుద్ధుని పీఠానికి ఎదురుగా ధర్మచక్రస్తంభం చెక్కబడింది. ఈ స్తంభం క్రిందిభాగాన మృగదావనానికి సంకేతంగా రెండు జింకలు కూర్చుని ఉన్నాయి. స్తంభం కిరీట భాగంలో తరత్నం, దానిపై ధర్మచక్రం మలచబడింది. బుద్ధునికి వెనుక భాగాన పట్టణ ప్రముఖులు, దేవతాగణం కలువపూలతో ఆరాధించడానికి సిద్ధపడుతున్నారు. వారిలో గడ్డంతో వజ్రపాణి చెక్కడం జరిగింది. గాంధారశిల్పి ధర్మచక్రస్తంభాన్ని అర్థవంతంగా మలుచుటలో కృతకృత్యుడు కాలేదనిపిస్తుంది. ఎంచేతంటే చక్రంలో ఉండాల్సిన అకులకు బదులుగా పద్మదళాలను చెక్కడం జరిగింది. అయితే బుద్ధుని రూపశిల్పానికి బదులుగా సంకేత రూపంలో శిల్పాలను చెక్కే సాంప్రదాయాన్ని గుర్తు చేసుకుంటూ బుద్ధుని మానవ రూపానికి ముందు భాగంలో సంకేత రూపాన్ని కూడా మలచడం విమర్శకులను ఆలోచనలో పడవేసింది.



జ్యోతిష్క జన్మవృత్తాంతం

**4. త్రిరత్న ఆరాధన శిల్పం:** గాంధార శిల్పంలో బుద్ధుని సంకేత రూపంలో కొలిచే శిల్పాలు చాలా ఎక్కువ. ఈ త్రిరత్న చిహ్నం ఒక గూటిలో రెండు జింకలున్న పీఠంపై చెక్కబడింది. ఎంతో మంది బౌద్ధారాధకులు దోసిళ్ళతో పూలు కుమ్మరిస్తున్నారు. కుడి పైపున కోరంథియన్ స్తంభం ఎకంథస్ కిరీటంలో ఉబ్బెత్తుగా చూపబడింది. అంతేకాక పై అంచున ఎకంథస్ ఆకుల వరుస చెక్కబడింది. ఈ మూడురత్నాల చిహ్నం బౌద్ధ ఆదర్శాలైన బుద్ధం,ధమ్మం, సంఘాలకు గుర్తుగా మలచబడింది. క్రీ.శ. 1-2 శతాబ్దాలకు చెందిన ఈ గాంధారశిల్పం జమల్‌గరిలో లభించింది. ఈ త్రిరత్న చిహ్నాన్ని ప్రముఖ కళావిమర్శకులు సి.శివరామమూర్తి గారు త్రిశూలంగా గుర్తించడం దానిని చాలా మంది పరిశోధకులు అనుసరించడం జరిగింది.

**5. వాఖ్యానముద్రలో బుద్ధదేవుని శిల్పం:** పద్మాసనారూఢుడైన బుద్ధుని రెండు చేతులు వాఖ్యానముద్ర పట్టి ఉన్నాయి. తలవెనుక ఉన్న ప్రభామండలం అలంకరణ రహితంగా వుంది. మడతలు కలిగిన పలుచటి వస్త్రం ఎడమ భుజాన్ని మాత్రమే కప్పుతున్నది. అలలు అలలుగా ఉన్న జుట్టు ముడివేయబడి ఉన్నది. జ్ఞాన చిహ్నమైన 'ఉర్ణం' రెండు కనుబొమల నడుమ గుండ్రటి బొట్టుని తలపిస్తుంది. ఈ శిల్పంలో బుద్ధదేవుడు చిరునవ్వులు చిందిస్తూ, కలువరేకుల వంటి అర్ధనిమిలి నేత్రాలతో అంతర్వీక్షణం కావిస్తున్నాడు. అద్భుతంగా మలచబడిన ఈ గాంధారశిల్పం గుప్తుల కాలం నాటి శిల్పులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని చెప్పవచ్చు.

**6. జ్యోతిష్క జన్మవృత్తాంతం:** చిష్ట్‌రాతితో తయారైన ఈ శిల్పం లొరియతంగై నుండి తీసుకు రాబడింది. బుద్ధదేవుడు రాజగృహంలో విడిది చేసినపుడు సుభద్రుడనే జైన వర్తకుడు వెళ్ళాడు. తమకు పుట్టబోయే బిడ్డ యొక్క భవిష్యత్తు తెలియజేయవతసిందిగా సుభద్ర భార్య కోరికను తథాగతునికి విన్నవించు కున్నాడు. దానితో బుద్ధుడు మంగళకరుడైన వంశోద్ధారకుడు జన్మిస్తాడని చెప్పాడు, దీన్ని విభేధించిన జైనమత వర్గంవారు అసూయాద్వేషంతో మీ కుటుంబానికి ఈ బిడ్డ వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. వారి చెప్పుడు మాటలు విన్న సుభద్రుడు భార్య గర్భవిచ్ఛిత్తికి మందులు ఇవ్వడంతో ఆమె మరణించింది. బుద్ధుడు మగధపాలకుడైన బింబిసారుడు, రాజ వైద్యుడైన జీవకునితో కలసి ఆమెను దహనం చేస్తున్న ప్రదేశానికి వెళ్ళాడు. జీవకుడు దహన మవుతున్న తల్లిగర్భం నుండి బిడ్డను బయటకు తీసుకు వచ్చాడు. తథాగతుడు బిడ్డ సంరక్షణ భాద్యతను బింబిసారునికి అప్పగించగా, అతడు ఆ పిల్లవానికి జ్యోతిష్క అని పేరు పెట్టి పెంచి పెద్ద చేశాడు. క్రీ.శ. 2 వ శతాబ్దికి చెందిన ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్న ఈ శిల్పఫలకం లాంటిది దేశంలో మరెక్కడ లభ్యపడలేదు. ఈ శిల్పంలో కుడిపైపున అభయముద్రలో గౌతముడు నిలబడగా మంటల నుంచి జోతిష్కను రాజు బింబిసారుడు అందుకుంటున్నాడు. బాలుని వెనుక జీవకుడు కన్పిస్తుండగా, ఈ దృశ్యాన్ని పురప్రముఖులు దేవతాగణం వీక్షిస్తున్నారు. కాని వారున్న శిల్పభాగం కొంత వరకు పాడయింది. ఈ కథలో బౌద్ధ జైన మతాల మధ్య ఉన్న వైషమ్యాలు వెల్లడవుతున్నాయి. ప్రపంచంలోనే మొట్టమొదటి శస్త్రవైద్యుడైన జీవకుడు చనిపోయిన తల్లిగర్భం నుండి శస్త్ర చికిత్స చేసి బిడ్డను జీవంతో వెలికి తీయడం అసామాన్యమైన విషయం.పాచీన భారతదేశ వైద్యుల ఘనతకు ఇంతకంటే నిదర్శనం ఏంకావాలి.

ఇలాంటి కథే మౌర్య అశోకుని తండ్రి బిందుసారుని జననం విషయంలో కూడా ప్రచారంలోవుంది. ప్రధాన మంత్రి చాణుక్యుడు మౌర్య చక్రవర్తి చంద్రగుప్తునిపై విషప్రయోగం జరిగినా మరణించకుండా ఉండుటకు ప్రతిరోజూ రహస్యంగా ఆహారంలో కొద్దిమోతాదులో విషం ఇవ్వడం జరిగేది. ఒకరోజు తనకు తెలియక చంద్రగుప్తుడు రాణితో విషాహారాన్ని పంచుకోవడంతొ ఆమె మరణించింది. వెనువెంటనే వచ్చిన చాణుక్యుడు ఆమె గర్భంనుండి బిడ్డను వెలికితీయడం జరిగింది. ఆ బిడ్డడే బిందుసారుడు. ఈ కథలో వాస్తవమెంతో నిర్ధారణ చేయలేము కాని దీనివల్ల క్రీ.పూ. 5-4 శతాబ్దాల నాటికి భారతావనిలో వైద్యశాస్త్రం ఎంతో అభివృద్ధి గాంచింది.

*(ఇంకా ఉంది)*

డా. బెల్లంకొండ రమేశ్‌చంద్ర
రేపల్లె, ఫోన్ : 9441519781

# తెలంగాణలో వైష్ణవభక్తి శతకాలు

*- గడ్డం సత్యపాల్ రెడ్డి*

**ప్రవేశం:** తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట కావ్య ప్రక్రియగా శతక ప్రక్రియ రూపొందింది. ఈ శతకము సర్వజనాదరణను పొంది ఒక శక్తివంతమైన సాహిత్య ప్రక్రియగా రూపాంతరం చెందింది. పద్య సాహిత్యంలో అడుగుపెట్టే ప్రతి నూతన కవికి ఈ శతక ప్రక్రియనే ఆదరించి, అక్కున చేర్చుకుంది. ఛందస్సు నేర్చుకున్న పద్యకవులందరికి మొదట కావ్యసాధనగా ఉపయోగ పడింది ఈ శతకప్రక్రియనే. సజీవప్రవంతివలె శతక సాహిత్య ప్రక్రియ అవిచ్ఛిన్నంగా నేటికీ కొనసాగుతూనే ఉన్నది. శతకసాహిత్యంపై పరిశోధన చేసిన కె. గోపాల కృష్ణారావుగారు తన “ఆంధ్రశతక సాహిత్య వికాసము” అనే పరిశోధక గ్రంథంలో “సంస్కృత, ప్రాకృత భాషలలోని శతకమే తెలుగులో కొన్ని విశిష్ట లక్షణములతో అవతరించినదని” పేర్కొన్నారు. సంస్కృత, ప్రాకృత శతకములలోని సంఖ్యా నియమం, మకుట నియమం, ఛందో నియమం, రస నియమం, ఆత్మాశ్రయరీతి అనే లక్షణాలు తెలుగు శతకాలలో రూపుదిద్దినవని వారు వివరించారు. శతకసాహిత్యాన్ని వస్తువును అనుసరించి పలువిధాలుగా వర్గీకరించవచ్చు. అవి భక్తి, నీతి, హాస్య, శృంగార, వైరాగ్య శతకాలు, దేశభక్తి శతకాలు. ఈ శతకాలలోని వస్తువుననుసరించి మళ్ళీ అనేక విభజనలు చేయవచ్చు. ఉదాహరణకు భక్తిశతకాలను తీసుకుంటే అందులో వైష్ణవభక్తి. శైవభక్తి, దేవిభక్తి, ఇతర దేవతాభక్తి శతకాలుగా విభజించవచ్చును. భగవంతుడిని శరణాగతి వేడుతూ రాసినవి, స్తుతిపూర్వకములుగా రాసినవి భక్తి శతకాలు. కవి అభీష్టదేవతాస్తుతి రూపంలో అనేక భక్తి శతకాలు కన్పిస్తాయి. తెలుగు సాహిత్యంలో భక్తిశతకాల పరిధి విస్తృతమైనదే.విష్ణుభక్తిని ప్రతిపాదించే శతకాలు వైష్ణవ భక్తిశతకాలు. విష్ణువు దశావతారాలను ప్రస్తుతిస్తూ ప్రధానంగా నృసింహ, రామ, కృష్ణ, వేంకటేశ్వర అవతారాలపై గొప్ప గొప్ప శతకాలు వచ్చాయి. వైష్ణవ క్షేత్రములలో వెలసిన దేవతామూర్తులపై కూడా చాలా శతకాలు వచ్చాయి. ఇలా వచ్చిన శతకాల్లో తెలంగాణ ప్రాంతాన్ని ప్రత్యేక దృష్టితో చూసినట్లైతే 2001 నుండి 2010 మధ్యలో వచ్చిన వైష్ణవ భక్తిశతకాలు చాలానే కనిపిస్తాయి. వాటిని పరిచయం చేయడం ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం. తెలంగాణలో వేంకటేశ్వరస్వామిని స్తుతిస్తూ రాసిన శతకాలు: తెలంగాణలో 21వ శతాబ్ది మొదటి దశకంలో కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామిపై అనేక శతకాలు వచ్చాయి. కడపలో వెలసిన వేంకటేశ్వరస్వామిపై శ్రీ కడపరాయ “వేంకటేశ్వర శతకము”ను మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన చెరుకుపల్లి వేంకటదాసు 2001లో ప్రచురించారు. ఇందులో భక్తితో పాటు దశావతారాల వర్ణన, లోకరీతిని వర్ణించారు. హైదరాబాద్‌కు చెందిన అల్లాడి దినమణి చందానగర్‌లో ఉన్న వేంకటేశ్వర స్వామిపై 2001 సంవత్సరంలో “శ్రీ వేంకటరమణ శతకము” వెలువరించారు. కంద పద్యాలలో అందంగా రాసిన ఈ శతకం భక్తి, జ్ఞాన, వైరాగ్యమనే మూడు వత్తులను కలిపి వెలిగించిన దీపంలా కనిపిస్తుంది. 2002 సంవత్సరంలో చిలుకూరు ప్రాంతానికి చెందిన జనువాడ రామస్వామి “శ్రీ చిలుకూరు వేంకటేశ్వర శతకము”ను వెలువరించారు. ఆటవెలది పద్యాలలో రాసిన ఈ శతకములో భక్తితో పాటు లోక వ్యాఖ్యానం కనిపిస్తుంది. మంగపేటలో వెలసిన వేంకటేశ్వర స్వామిపై “వేంకటేశ్వర స్వామి శతకము”ను కూర్మాచలం వెంకటేశ్వర్లు 2004 సంవత్సరంలో వెలువరించారు. సీస పద్యాలలో రాయ బడిన ఈ శతకములో నైతిక విలువలను తెలియజేస్తూ, కర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. 2005లో రామోజు లక్ష్మీరాజయ్య “తిరుమలేశ శతకం”ను వెలువరించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఈయన భక్తిభావన, సామాజిక

స్పృహ కల్గిన పద్యాలను ఆటవెలదులలో రాశారు. 2006లో వేంకటేశ్వర స్వామిపై మూడు శతకాలు వచ్చాయి. నల్లగొండకు చెందిన ముడుంబ లక్ష్మణాచార్యులు "శ్రీ వేంకటరమణ శతకము"ను కంద పద్యాలలో రాయగా, ఇదే జిల్లాకు చెందిన ఎర్రోజు బాలనర్సయాచారి ఎర్రోజు "వేంకటేశ్వర శతకము"ను వృత్త పద్యాలలో రాశారు. ఇవి రెండూ భక్తితో పాటు సామాజిక స్పృహను వ్యక్తపరచాయి. ఇదే ప్రాంతానికి చెందిన నాగపురి శ్రీనివాసులు ''శ్రీ వేంకటేశ్వర శతకము''ను తేటగీతులలో ప్రచురించారు. దీనిలో స్వామివారి లీలలు, స్థలపురాణం, సామాజిక సమస్యల నివేదన కనిపిస్తుంది. 2007లో చిలుకూరు ప్రాంతానికి చెందిన జనువాడ రామస్వామి శ్రీ చిలుకూరు "శ్రీనివాస శతకము"ను వెలువరించారు. క్షేత్ర మహత్యాన్ని, లోక స్వభావాన్ని తేటగీతులలో వర్ణించారు. ఖమ్మం జిల్లాకు చెందిన కాండూరి శేషాచార్యులు ''శ్రీ వేంకటేశ్వర శతకము"ను 2007లో వెలువరించారు. భక్తితో పాటు సామాజిక సమస్యలను సీసపద్యాలలో ఎత్తిచూపారు. ఈ శతకంలో శ్రీనివాసుని సకల దేవతాస్వరూపునిగా వర్ణించారు. గద్వాల ప్రాంతానికి చెందిన మేడిచర్ల హరినాగభూషణం పాగుంట "వేంకటేశ్వర శతకం" అనే భక్తి శతకాన్ని 2008లో వెలువరించారు. ఇదే సంవత్సరం శ్రీ మహావిష్ణువును అధిక్షేపిస్తూ, స్తుతిస్తూ ఆత్మనివేదనతో కూడిన సీసపద్యాలతో కృష్ణ కౌండిన్య 'శ్రీనివాస శతకము'ను ప్రచురించగ భక్తి, విష్ణుమూర్తి లీలతో కూడిన 'శ్రీ వేంకటేశ్వర పెరుమాళ్ళ శతకము'ను రాధశ్రీ వెలువరించారు. హైదరాబాదుకు చెందిన శ్రీ కసిరెడ్డి వెంకటరెడ్డి అమెరికా వెళ్ళినపుడు పిట్సుబర్గులోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి అతనిపై ''పిట్సుబర్గ వేంకటేశ శతకము'' వెలువరించారు. ఇందులో భక్తితో పాటు పదకొండు అంశాలను భాగాలు చేసి ఆటవెలది పద్యాలను రాశారు. 2009లో జనువాడ రామస్వామి భక్తిభావం, సామాజిక చేతనంతో కూడిన ''శ్రీ తిరుమలేశ శతకము''ను సీసపద్యాలలో ప్రచురించారు.

తెలంగాణలో నృసింహావతారంపై వచ్చిన శతకాలు: విష్ణువు దశావతారాలలో మరో అవతారమైన లక్ష్మీనరసింహస్వామిపై విరివిగా శతకాలు వచ్చాయి. ధర్మపురి ప్రాంతానికి చెందిన కొరిడె రామయ్య "శ్రీ లక్ష్మీనారసింహ శతకము"ను 2001లో వృత్త పద్యాలలో వెలువరించారు. ఇందులో స్థలపురాణం, క్షేత్ర వైభవం, దశావతారాల వర్ణన, సాంఘిక దురాచారాలు తదితర అంశాలను వివరించారు. 2002 సంవత్సరంలో ఖమ్మం వాసి కల్వల సుగుణప్రసాద్ కొడవటంచ "శ్రీలక్ష్మీనృసింహ శతకం"ను సీస పద్యాలలో వెలువరించారు. భక్తిభావనతో పాటు నేటి కాలపు సాంఘిక స్థితిగతులపై చక్కటి పద్యాలు రాశాడు. 2003 సంవత్సరములో నిజామాబాదుకు చెందిన మహాకవి గణపతి రామచంద్రారావు "శ్రీమద్ధర్మపురి లక్ష్మీనారసింహ శతకము" వెలువరించారు. వీరు తన శతకంలో ద్వివిధ, త్రివిధ, చతుర్విధములైన కవిత్వం గల పద్యాలను రాశారు. వీరిని చతుర్విధ కవితాపితామహుడు అని పిలుస్తారు. సిద్ధిపేటకు చెందిన దాశరథుల బాలయ్య బెజ్జంకి "శ్రీ లక్ష్మీనరసింహ శతకము"ను మధ్యాక్కర పద్యాలలో వెలువరించారు. బెజ్జంకిలో వెలసిన నరసింహుడిపై తన భక్తిని చాటుకున్నారు.

2004లో కరీంనగర్ వాసి వేమూరి లక్ష్మీనరహరి శాస్త్రి ధర్మపురి "శ్రీ నృసింహేశ్వర శతకము" రాశారు. ధారాశుద్ధి కలిగిన పద్యాల్లో స్వామివారి వర్ణన గావించారు. నిర్మల్ ప్రాంతానికి చెందిన చక్రపాణి వాసుదేవాచార్యులు 2005 సంవత్సరములో "శ్రీ లక్ష్మీనృకేసరీ శతోతల్పమ్" పేరిట ఉత్పలమాల వృత్తంలో శతకాన్ని ప్రచురించారు. ఇందులో కాల్వ గ్రామ శివారులో వెలసిన నృసింహస్వామి క్షేత్ర మహిమ, నృసింహావతారం, దశావతారాలపై చక్కని పద్యాలు రాశారు. 2005లో నల్లగొండ ప్రాంతానికి చెందిన నాగపురి శ్రీనివాసులు యాదగిరి క్షేత్రమహిమలు వర్ణిస్తూ ఉత్పల, చంపకమాలల్లో "శ్రీ నరసింహ శతకం" వెలువరించారు. "వైభవనారసింహం" పేరుతో నల్లగొండ ప్రాంతానికి చెందిన వారణాసి భిక్షమయ్యశర్మ శార్దూల వృత్తంలో తాత్త్విక విషయాలపై శతకాన్ని వెలువరించారు. చెప్యాల రామకృష్ణారావు 2010లో "శ్రీ యాదగిరి నరసింహప్రభు" శతకాన్ని వెలువరించారు.

తెలంగాణలో శ్రీరామచంద్రుని స్తుతిస్తూ వచ్చిన శతకాలు: త్రేతాయుగంలో విష్ణువు ఏడవ అవతారమైన శ్రీరామచంద్రునిపై చాలా శతకాలు వచ్చాయి. ఖమ్మంకి చెందిన బనిగండ్లపాటి వేంకటప్పారావు "జానకీపతీ

శతకాన్ని" 2002లో వెలువరించారు. కాంతాసమ్మితంగా, భక్తిప్రపత్తులతో రామాయణ ఘట్టాలను, దశావతారాలను ఉత్పల, చంపకమాల వృత్తాలలో చక్కగా వర్ణించారు. నిర్మల్ జిల్లా పొనకల్ గ్రామవాసి రామరాజకవి నాలుగు వందల సంవత్సరాలకు ముందే పొనకంటి రామచంద్ర శతకాన్ని రాసినట్లు చెప్తారు. కాని దీనిని 2006లో వెలువరించారు. కాలవిన్యాసం, దైవశక్తిప్రభావం, నైతికవిలువల ఫలితం, మానవ సంబంధాలు-అవకాశవాదాలు తదితర అంశాలపై సీసపద్యాలు రాశారు. ఖమ్మం జిల్లా జంటకవి దంపతులు లక్ష్మీనరసరాజు, శ్రీకృష్ణ కుసుమకుమారిలు "దశరథరామ శతకము"ను వెలువరించారు. వీరు రామకథను శతకంగా రాశారు. బాలకాండతో ప్రారంభమై సీతారాముల కళ్యాణంతో ఈ శతకం ముగుస్తుంది.

కరీంనగర్ వాసి శేషం వేణుగోపాలశర్మ శ్రీరామగిరి "కోదండరామ శతకము"ను 2006లో కందంలో రాశారు. పోతన గజేంద్రమోక్షంలోని ఆర్తి, నవవిధ భక్తి పద్యాలు ఈయన శతకంలో కన్పిస్తాయి. 2007 సంవత్సరంలో సముద్రాల రంగాచార్యులు "జానకీపతీ శతకము"ను వెలువరించారు. ఇందులో ఆర్తి, ఆత్మనివేదనతో కూడిన మంచి ధారాశుద్ధి కలిగిన పద్యాలు ఉత్పలమాల వృత్తంలో మనకు కన్పిస్తాయి. 2010 సంవత్సరంలో శ్రీరామ చంద్రునిపై మూడు శతకాలు వచ్చాయి. కావూరి పాపయ్యశాస్త్రి శ్రీరాముని వృత్తాంతాన్ని మత్తకోకిల ఛందస్సులో "జానకీరామా! భద్రగిరీశ్వర శతకము"గా మలిచారు. కరీంనగర్ వాసి సముద్రాల వేణుగోపాలాచార్య తట్లవాయి "శ్రీరామశతకము"ను వెలువరించారు. భక్తి, సామాజిక స్పృహతో కూడిన తేటగీతి పద్యాలు ఇందులో ఉన్నాయి. హైదరాబాదుకు చెందిన తూర్పు మల్లారెడ్డి రామాయణ ఔన్నత్యాన్ని చక్కని కంద పద్యాలలో "శ్రీరామశతకము"గా మలిచారు.

తెలంగాణలో విష్ణువును వివిధ రూపాల్లో స్తుతిస్తూ వచ్చిన శతకాలు: ఈ దశాబ్దంలో విష్ణువును వివిధ రూపాల్లో స్తుతిస్తూ చాలా శతకాలు వచ్చాయి. 2003లో చేపూరి లక్ష్మీనరసింహారావు విష్ణు లీలలను వృత్తపద్యాలలో "కేశవశతకము"గా వెలువరించారు. వీరు తన శతకంలో శివకేశవ అభేదభావాన్ని వ్యక్తపరిచారు. నిజామాబాద్‌కి చెందిన చిత్కళ శ్రీనివాసశర్మ ''శ్రీ రమానహిత సత్యనారాయణ శతకము"ను 2003లో ప్రచురించారు. శ్రీమన్నారాయణుని గొప్పదనాన్ని, శరణాగతిని చక్కని ఆటవెలది, తేటగీతులలో వర్ణించారు. 2004లో హన్మకొండకు చెందిన వర్ఝల రంగాచార్య "కళ్యాణ మంగాధిపా" శతకాన్ని వెలువరించారు. ఇదే సంవత్సరం పాలమూరుకు చెందిన ఫోతేదార్ కేశవాచార్య "శ్రీరంగ శతకము" అనే భక్తి శతకాన్ని వెలువరించారు. 2005లో పాలమూరుకు చెందిన కపిలవాయి లింగమూర్తి సంపాదకులుగా "కృష్ణనమస్కార శతకము" వెలువడింది. విష్ణుస్తుతితో ప్రారంభమై, కృష్ణావతారం, కృష్ణుని లీలలు తదితర అంశాలు చక్కని వృత్తపద్యాలలో వర్ణించాడు. కర్నాటి లింగయ్య "శ్రీరంగనాథ శతకం" పేర తన విష్ణుభక్తిని ప్రకటిస్తూ శతకాన్ని వెలువరించారు. 2006లో నారాయణపేటకు చెందిన అంబర్‌నాథమాళవదకర్ "శ్రీశ్రీశ్రీ సద్గురు నరసింహ అవధూత శతకము''ను వెలువరించారు. ఇందులో అవధూత స్వాములవారి పుట్టుపూర్వోత్తరాలు, మహిమలు సీసపద్యాలలో చక్కగా వర్ణించారు. షాద్‌నగర్‌కి చెందిన కె.వి. నరసింహాచార్యులు సత్యనారాయణస్వామి వ్రతకథా సారాంశాన్ని "రమాసహిత సత్యదేవ శతకము"గా మలిచారు. 2008లో నల్లగొండకు చెందిన మెఱుగు వెంకటదాసు శ్రీకృష్ణజన్మ విశేషాలతో, శ్రీకృష్ణ లీలలతో కూడిన ''శ్రీకృష్ణ శతకము''ను వెలువరించారు.

2009లో కరీంనగర్‌కు చెందిన కంజర్ల రామాచార్యులు "మాధవశతకము"ను వెలువరించారు. భక్తిభరిత భావాలతో, లోకవృత్తంతో, ఆత్మాశ్రయ కవిత్వంతో వృత్తపద్యాలను మనోజ్ఞంగా రచించారు. నల్లదీగ కొండమాచార్యులు వృత్తపద్యాలలో "శ్రీ వరదరాజ శతకము" అనే భక్తి శతకాన్ని వెలువరించారు. 2010లో గద్వాలకు చెందిన వెలుదండ సత్యనారాయణ సద్దలోనిపల్లి స్థలచరిత్రను, భక్తి, లోకరీతులను ఆటవెలదులలో "ముద్దుకృష్ణ శతకం"గా వెలువరించారు. డింగరి నరహరి ఆచార్య ''శతకసుధ'' పేర మూడు శతకాలను ఒక సంకలనంగా వెలువరించారు. అందులో వారి తండ్రిగారు డింగరి వెంకటాచార్య భక్తి, ఆర్ద్రత కలిగిన వృత్తపద్యాలలో రాసిన "నామపల్లి నృకేసరీ శతకము" ఒకటికాగ, మిగతా రెండు "రంగశతకము", "తెలుగుబిడ్డ శతకము" వీరు రాసినవి. 'రంగశతకము' భక్తిని తెలిపే కందపద్యాలు

కాగా, తెలుగుబిడ్డ శతకం మాత్రం 'సూక్తిసుధ'గా కొనసాగుతుంది. హన్మకొండకు చెందిన ఆరుట్ల భాషాచార్య ఈ కాలంలో మూడు శతకములను వెలువరించారు. 'అర్చన' పేరుతో 2005లో 'శ్రీ మత్స్యగిరీశ శతకము'ను కంద పద్యాలలో అందించారు. ఇందులో భక్తిభావంతో పాటు లౌకికానురక్తి కన్పిస్తుంది. 2008లో 'పాంచాల రాయ' మకుటంతో "పాంచాలరాయ శతకము"ను తేటగీతిలో వెలువరించారు. ఇందులో పాంచాలరాయ చారిత్రక ప్రశస్తితో పాటు సమకాలీన సాంఘిక పరిస్థితుల చిత్రణ కన్పిస్తుంది. ఇదే సంవత్సరము "మంగళ మహశ్రీ" పేరుతో పదకొండు భిన్నవృత్తాల్లో పదకొండు భాగాలుగా నూటపది పద్యాలతో ఒక శతకాన్ని వెలువరించారు. శతకం సాధారణంగా ఏకవృత్తమై ఉంటుంది. కాని ఇది పదకొండు భిన్నవృత్తాలతో వచ్చిన మొదటి శతకం అని నిర్ధారించవచ్చు. భిన్నవృత్తాలలో రావడం వలన ఒకే అర్థంతో కూడిన భిన్న మకుటం ఈ శతకంలో కనిపించింది.

**ముగింపు:** 2001-2010 మధ్యకాలంలో తెలంగాణ నుంచి వచ్చిన వైష్ణవ భక్తి శతకసాహిత్యమంతా భక్తితో పాటు, ఈ కాలము నాటి సామాజిక స్థితిగతులను అంతర్లీనంగా స్పృశిస్తూ, సమాజానికి నీతిని బోధించేవిగా ఉన్నాయి. ఛందోవైవిధ్యం పరంగా చూసినట్లైతే తేటగీతి, ఆటవెలదులు కొద్దిగా అటుఇటుగా కందము, సీసము, మధ్యాక్కరలతో పాటు వృత్తపద్యాలైన ఉత్పలమాల, చంపకమాల, శార్దూలాలతో వైవిధ్యభరితమై ప్రౌఢమైన శతకాలు వచ్చాయి. నా పిహెచ్.డి. సిద్ధాంత పరిశోధనాంశమైన తెలంగాణ పద్య కవిత్వము - పరిశీలన 2001-2010 పుస్తక సేకరణలో భాగంగా నేను సేకరించిన శతకాలు ఇవి. దాదాపు ప్రతీ గ్రామం నుండి శతక రచన చేసిన కవులు ఉన్నట్లు తెలుస్తుంది. వాటి గురించి స్థాలీపులాకన్యాయంగానే వివరించగలిగాను. నేటి ఆధునిక కాలంలో కూడా పద్యప్రక్రియకు ఊపిరిలందిస్తున్న ఈ శతకాలపై లోతైన అధ్యయనం జరగాల్సిన అవసరం ఉంది.

**ఆధార గ్రంథాలు**

*1. గౌరీశంకర్. జూలూరు (సం), 2022, తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర, తెలంగాణ సాహిత్య అకాడమి. 2. డా॥ సుజాతారెడ్డి. ముదిగంటి, 2015, తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర, తెలంగాణ సాహిత్య పరిషత్తు, హైదరాబాద్. 3. డా॥ నాగయ్య. జి, 2009, తెలుగు సాహిత్య సమీక్ష, నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి. 4. తెలంగాణలో 2001-2010 మధ్యలో వచ్చిన వైష్ణవభక్తి శతకాలను పరిశీలించాను.*

గడ్డం సత్యపాల్ రెడ్డి
**పరిశోధక విద్యార్థి, తెలంగాణ విశ్వవిద్యాలయం**
**తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల**
**దిలావర్‌పూర్, నిర్మల్, మొబైల్: 99636 68822**

---

*"... అక్టోబర్ సంచికలో ప్రచురితం అయిన వ్యాసాలు చాలా బాగున్నాయి.*




*'వారణాసిలో వారకాంతలు' వ్యాసంలో రచయిత డాక్టర్ కిల్లాడ సత్యనారాయణ గారు తెలియని విషయాలు తెలిపారు. వారకాంతలలో కూడా ఆణిముత్యాలు వంటివారు కూడా అనేక మంది ఉన్నారని ఈ వ్యాసం వలన తెలుస్తోంది. 'రెండు వంశాలు -రెండు జమీందారీలు' అన్న వ్యాసంలో రచయిత గార రంగనాథం గారు చాలా లోతైన చారిత్రాత్మక విషయాలు ప్రస్తావించారు. వావిలవలస జమీందారీ గురించి ఎన్నోరోజులుగా తెలుసుకోవాలి అని ప్రయత్నిస్తున్న నాకు ఈ వ్యాసం ద్వారా మంచి సమాచారం అందింది.*

*ఇక 'అసమర్థుని జీవయాత్ర' పుస్తక సమీక్షలో రచయిత నవల వ్రాసిన ఉద్దేశం ఏమిటో అన్న విషయాన్ని పుస్తక సమీక్షలు రామవరపు లక్ష్మీ సునీత గారు వివరించిన విధానం చాలా నచ్చింది.*

***మిసిమి** మాసపత్రికలో ముందు, వెనుకాల పేజీలలో మీరు ముద్రించే చిత్రాలు వాటికి అవే సాటి. ప్రతీనెలా మొదటి వారంలో **మిసిమి** మాసపత్రిక కోసం వేయి కళ్ళతో ఎదురు చూడటం మాకు ఒక అలవాటుగా మారిపోయింది.*

**- రామవరపు వేంకట రమణమూర్తి**
*విశాఖపట్నం. ఫోన్:: 9440798301*



గుస్టావ్ క్లిమ్ట్

# గుస్టావ్ క్లిమ్ట్ - ముద్దు ముచ్చట

*- తంగెడ విశ్వేశ్వరప్రసాద్*

ద కిస్ ` The Kiss ` కాన్వాసు మీద తైలవర్ణాల్లో సృష్టించబడిన మనోహర శృంగార దృశ్యకావ్యం. ఆస్ట్రియా దేశ ప్రతీకవాది గుస్తాన్ క్లిమ్ట్ దీని సృష్టికర్త. 1907-08ల మధ్య చిత్రీకరించిన ఈ పెయింటింగుకు పెట్టిన పేరు Lieb Spear (The Lovers) గుస్టావ్ ఉచ్ఛస్థితిలో వున్నప్పుడు (స్వర్ణయుగం) దీన్ని ప్రదర్శించాడు. ప్రేమికుల జంట ఒకరినొకరు అల్లుకుపోయినట్లుగా, నాటి ఫాషన్ - అందమైన - ఖరీదైన దుస్తుల్లో చిత్రించిన పెయింటింగు ఇది. వియన్నా బెల్వెడీర్ మ్యూజియంలో పదిలపరచబడి వుంది. వియన్నా నూతన కళారంగంలో తిరుగుబాటు ఉద్యమంలో పుట్టిన కళాఖండం. ప్రజాదరణ పొందిన క్లిమ్ట్ చిత్రాలలో అగ్రస్థానంలో వుంటుంది. క్లిమ్ట్ ఇతర చిత్రాలు: అడిల్ బ్లాక్ బౌవర్ తొమ్మిది కార్లాన్లు, జూడిత్ - హెూలోఫెర్నిస్ వధ, ప్రింట్ హెూమ్, ద వర్జిన్, ఫ్లవర్ గార్డెన్, డెత్ అండ్ లైఫ్, లేడీ విత్‌ఫాన్, విష్ - I, II, III, ద డాన్సర్, ద త్రీ ఏజెస్ ఆఫ్ వుమన్ మొదలైనవి మొత్తం 161 పెయింటింగులు సృజించాడు. సుందర, సుకుమార, నూతననిర్మాణ వైభవంతో పోర్ట్రెట్లు రూపొందించడంలో క్లిమ్ట్ మేటి చిత్రకారుడు. క్లిమ్ట్ చిత్రాలన్నీ గొప్ప కళాఖండాలుగా గుర్తింపు పొందినప్పటికీ 'ది కిస్' (ముద్దు) ది పెయింటింగులో ప్రథమస్థానం.

బంగారు రంగు, అందమైన రూపం, గాఢమైన మనోభావాలతో పెద్ద ఆకర్షణగా మంత్రముగ్దుల్ని చేస్తూ, 1908లో సృష్టించబడిన దగ్గరినుండి ఈ కళాఖండం వెనిస్ ప్రతిష్ఠాత్మక (ఆర్టుగాలరీ) వారసత్వ సంపదగా ప్రదర్శింప బడుతూ వుంది. గుస్టావ్ ప్రతీకవాదుల్లో మూలస్తంభం లాంటివాడు. సమకాలీన నూతన కళా వుద్యమానికి సూత్రధారి, మార్గదర్శి, బంగారు పూత పూసిన నూతన శైలిలో పెయింటింగులు రచించడం గుస్టావ్ ప్రత్యేకత. 'స్వర్గయుగం' అనే పేరు రావడానికి అదీ కారణం అయి వుండొచ్చు. బైజెంటైన్ మెజాయిక్‌ల బంగారుపూత మెరిసేగుణం వల్ల ప్రభావితుడు. క్లిమ్ట్ చాలా చిత్రాల్లో మెరిసే బంగారు పూత కనిపిస్తుంది. ద కిస్, అడీల్, జూడిత్ హెూలోఫెర్నిస్, నీటి సర్పాలు, అలా మెరిసే చిత్రాలలో కొన్ని. "నా గురించి తెలుసుకోవడానికి మరో మార్గం నా చిత్రాలను చూడడం. నేను ఏమిటో, నాకు కావలసిన దేమిటో అని చెప్తాయి" అని క్లిమ్ట్ చెప్పుకున్నాడు. 'ముద్దు' చిత్రం లాలిత్యానికి, ప్రేమలోని గాఢతకు, పెయింటరు అభిరుచికి ప్రతిరూపం. ప్రేయసీప్రియులు ఒకరి పరిష్వంగంలో ఒకరు తన్మయులై వుండి ముఖాలు అస్పష్టంగా కన్పించినా, శృంగార భావంతో ఆకర్షణీయంగా పురాణ గాథలను గుర్తు చేస్తూ వుంటారు.

**పెయింటింగ్ రూపొందిన సందర్భం :** క్లిమ్ట్ కళాజీవితంలో పీడకలలాంటి అత్యంత క్లిష్టదశలో రూపొందిన చిత్రం. వియన్నా యూనివర్సిటీ సీలింగ్ పైన వేదాంత, వైద్య, ధర్మ శాస్త్రాల చిత్రాలను క్లిమ్ట్ పెయింట్ చేస్తాడు. వాటిని గురించిన సదవగాహనతోనే క్లిమ్ట్ పెయింటింగులు సృజించినప్పటికీ, విమర్శకులు వాటిని కామోద్దీపనలుగా, శృంగార చిత్రాలుగా ముద్ర వేస్తారు. దాంతో క్లిమ్ట్ గౌరవ మర్యాదలు పేరు ప్రతిష్టలు మంటగలిసిపోతాయి. పైగా వియన్నా నూతన కళా వుద్యమం నుండి విడిపోయిన సందర్భం అది. వియన్నా కళా తిరుగుబాటుకు (Secession) తానే స్థాపకుడు. మొదటి అధ్యక్షుడు కూడా. వియన్నా సాంప్రదాయ కళాకారులు చిత్రాల్లో శృంగారాన్ని చూపడానికి విముఖులు. వారి ఛాందసానికి తిరుగుబాటుగా స్పర్శ,

కౌగిలి, చుంబనం, శృంగార సన్నివేశ దృశ్యాలతో చిత్రాలు రూపొందించడం నూతన కళా వుద్యమ ఆశయం. తర్వాత భావాలు ఏకీభవించనందున క్లిమ్ట్ ఉద్యమం నుండి వైదొలగుతాడు. ఐనా శృంగారం ఇతివృత్తంగా చిత్రాలు రూపొందించడం మాత్రం కొనసాగిస్తాడు. 'సిస్సేషన్' ఉద్యమం నుండి విడిపోయిన తర్వాత తీవ్ర నిరాశతో ఒక ప్రదర్శనలో గుస్టావ్ 'ముద్దు' పెయింటింగు మొదటిసారిగా ప్రదర్శిస్తాడు. అదికూడా విమర్శకులు బారిన పడుతుంది. దాన్ని వారు పచ్చి శృంగార చిత్రంగా భావించి తృణీకరిస్తారు. సందర్శకులు మాత్రం ముద్దు దృశ్యానికి పరవశులైపోతారు. ప్రదర్శన ఊహించ లేనంతగా విజయం సాధిస్తుంది. ప్రదర్శన ముగియక ముందే ప్రభుత్వం 'ముద్దు' పెయింటింగును ఖరీదు చేసి, దాన్ని జాతీయసంపదగా ప్రకటిస్తుంది.

**మెరుపులు, అలంకారం :** పెయింటింగులోని ప్రేమికుల జంట బంగారు దుస్తులు ధరించి వుంటారు. అవి వారికి అలంకారంగానే కాక, రక్షణ కవచాలుగా కాపాడుతాయి. వారి ప్రేమకు అమరత్వం కలిగిస్తాయి అన్పిస్తాయి. వారి దుస్తుల్లో తేడా కన్పిస్తుంది. పురుషుని దుస్తులు నలుపు, తెలుపు దీర్ఘచతురస్రాల, సుడిగుండాల ఆకారాల మోటిఫ్‌లు కన్పిస్తే అవన్నీ పురుషత్వానికి, సంతానోత్పత్తికి ప్రతీకలుగా; స్త్రీ దుస్తులు పూలు, వృత్తాలతో నిండివుండి స్త్రీత్వానికి, మాతృత్వానికి ప్రతీకలుగా నిలబడతాయి.

**ప్రేమికుల జంట :** చిత్రం అంతా స్త్రీ పురుషుల జంట ఆక్రమించి, స్థలకాలాల కతీతంగా తన్మయత్వంలో మునిగి వుంటే పురుషుడు భారీ ఆకారంతో స్త్రీని పూర్తిగా ఆక్రమించి వుండగా స్త్రీ మోకాళ్ళమీద వంగి ప్రియుని కౌగిట్లో యిమిడి వుంటుంది. నిలబడితే ఆమె ప్రియునికన్నా పొడవుగా వుండి అతణ్ణి నియంత్రించగలదేమోననే భావాన్ని కలిగిస్తుంది. క్లిమ్ట్ స్వీయానుభవానికి ఇది చిత్రరూపం కావచ్చు. చిత్రంలో కన్పించే స్త్రీ అతని ప్రియురాలు 'ఫ్లూజ్'ది అయి వుండొచ్చు. క్లిమ్ట్ జీవిత కాలంలో ఎందరో స్త్రీలను అమితంగా ప్రేమించాడు.




మరెందరితోనో ప్రేమ కలాపాలు సాగించాడు. స్త్రీ సౌందర్యాన్ని సూటిగా, నిర్భయంగా శృంగార కామోద్దీపన చిత్రాలల్లో చూపించాడు. యువతి ముఖం పారవశ్యం, సంతృప్తి, ప్రేమ, ఆప్యాయత స్పర్శలోని దివ్యానుభూతిని ఆస్వాదిస్తున్నట్లుగా వుంటుంది. పూల పాన్పు మీద పెనవేసుకుని వున్నవారు పక్కనే వున్న అగాధంలోకి అదృశ్యమౌతారేమోనన్న శంకనూ కలిగిస్తారు.

**పెయింటింగు బంగారు దశ :** క్లిమ్ట్ ఉచ్ఛస్థితి, స్వర్ణయుగంలో రూపొందించిన చిత్రాలన్నీ బంగారు పూతతో మెరిసిపోతుంటాయి. వాటిలో తలమానికం లాంటిది ముద్దు పెయింటింగు. తండ్రి స్వర్ణకారుడు అవడం చేత క్లిమ్ట్ బంగారు రజనుతో, పెయింటింగులకు మెరుగులద్దడంలో నైపుణ్యం చూపిస్తాడు. అయితే ముద్దు పెయింటింగు ప్రత్యేకత, గొప్పదనం బంగారుపూత వల్ల వచ్చినదా? లేక యితివృత్తం వల్ల వచ్చినదా? అన్నది సందిగ్ధం. మితిమీరిన శృంగారానికి క్లిమ్ట్ చిత్రాలు ప్రతీకలు అన్న విమర్శను ఎదుర్కున్నా అదే శృంగార రసానికి పట్టం కడ్తూ 'ముద్దు' పెయింటింగును రచించడం క్లిమ్ట్ ధైర్యసాహసాలకు నిదర్శనంగా చెప్పుకుంటారు.

**క్లిమ్ట్ ముద్దు (ది కిస్)ను గురించి కొన్ని ఆసక్తికర విషయాలు :** శ్రీ ఇది క్లిమ్ట్ రూపొందించిన పెయింటింగుల్లో అత్యంత ప్రఖ్యాతి గాంచింది. నిలువెత్తు పరిమాణంలో 6 × 6 అడుగుల చతురస్రాకారంలో వుండడం, చిత్రంలోని దుస్తులు బంగారు పూతతో మెరిసిపోవడం దీని ప్రత్యేకత. చిత్రంలోని ప్రేయసీప్రియులు పూర్తిగా నిండు దుస్తుల అచ్ఛాదనలో వున్నప్పటికీ, అది అశ్లీల శృంగార చిత్రమని విక్టోరియా అనంతర సమాజం భావించి తిరస్కరిస్తుంది. ఎంత విమర్శకుల దాడికి గురైనా ప్రదర్శన పూర్తి

కాకముందే ఈ పెయింటింగు అమ్ముడుపోతుంది. అంతేకాదు, అప్పటికి చిత్రం అసంపూర్ణమే! 25000 ఇరవై ఐదు వేల క్రౌన్ల ఖరీదుచేసిన ఈ చిత్రం వియన్నాలో అప్పటివరకూ అమ్ముడుపోయిన చిత్రాల కన్నా నాలుగురెట్లు విలువైంది. క్లిమ్ట్ గౌరవార్థం ఆస్ట్రియా ప్రభుత్వం 2003లో 14 గ్రాముల బంగారు నాణేన్ని ముద్రించింది. నాణెంపై ఒకవైపు క్లిమ్ట్ ముఖం, మరోవైపు ముద్దు దృశ్యం వుంటాయి. క్లిమ్ట్ స్వర్ణయుగదశలో చివరి చిత్రం 'ముద్దు', మధ్యయుగాలనాటి మతప్రాతిపదికన రూపొందిన కళకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఓవిడ్ మోటామోర్ఫసిస్‌లో వర్ణించిన అపోలో డాఫ్నేను చుంబించే సన్నివేశానికి ఇది క్లిమ్ట్ కల్పించిన దృశ్యరూపం అనీ అంటారు. వియన్నా యూనివర్సిటీ ఉదంతం తర్వాత పూర్తిగా నిరాశలో మునిగిపోయిన దశలో రూపొందిన పెయింటింగు 'ద కిస్'. సంపన్న అభిమానుల చలవతో 30,000 క్రౌన్లు వెచ్చించి తన చిత్రాలన్నింటినీ కొత్త రూపంలో మళ్ళీ పెయింటు చేసి వియన్నా యూనివర్సిటీ ఊబినుంచి బయటపడతాడు.

క్లిమ్ట్ మిగిలిన ఏ చిత్రం లోనూ స్త్రీ పురుషులు కలిసి వుండి కన్పించరు, ఎవరికి వారు విడివిడిగా కనిపిస్తారు, 'ది కిస్'లో తప్ప. 'ముద్దు' పెయింటింగు అనేక శైలుల మిశ్రమం – బైజంటైన్ మెజాయిక్‌ల ప్రభావం, జపాన్ పూతీగల అలంకరణ, వియన్నా నూతన కళా వుద్యమ ప్రభావం, సాంప్రదాయవాదులపై తిరుగుబాటు ధోరణి దీనిలో కన్పిస్తాయి. రెండో ప్రపంచయుద్ధ చివరిదశలో తిరిగి వెళ్తూ జర్మనీ సేనలు వియన్నా యూనివర్సిటీ పై కప్పులు ధ్వంసం చేయగా క్లిమ్ట్ చిత్రాలన్నీ నాశనమై పోతాయి. 'ద కిస్' చిత్రంమాత్రం బెల్వెడీర్ ఆర్టు గాలరీలో వుండబట్టి బతికిపోతుంది. 1862లో జన్మించిన క్లిమ్ట్ 1918లో 55వ యేట మరణించాడు. వందేళ్ళ తర్వాత ఇప్పుడు 'ముద్దు' ప్రపంచ ప్రఖ్యాత పది పెయింటింగుల్లో స్థానం కోసం పోటీపడుతోంది.



ఇంప్రెషన్ చిత్రం

## ముద్దుకు పోటీగా క్లిమ్ట్‌దే మరో చిత్రం విసనకర్రవనిత (Lady With A Fan)

ఇరవయ్యవ శతాబ్దపు అలంకార చిత్రకళలో అత్యంత ప్రముఖులైన పెయింటర్లలో ఒకడిగా గుర్తింపు పొందిన క్లిమ్ట్‌కు ఖ్యాతి తెచ్చిపెట్టిన చిత్రం ముద్దు. అంతకు మించిన ఖ్యాతిని తెచ్చి పెట్టిన మరో క్లిమ్ట్ పెయింటింగు విసన కర్రతో వనిత. జర్మన్ భాషలో Dame Miz Facher, ఆంగ్లంలో Lady With A Fan ఒకే చిత్రకారుని రెండు చిత్రాలు ఒక దానితో ఒకటి పోటీపడటం చిత్ర కళారంగంలో మరో విచిత్రం. 2023 జూన్ చివరి వారంలో విసన కర్రతో వనిత పెయింటింగు కనీవినీ ఎరగనంత ధరకు అమ్ముడుపోయి ఐరోపా చిత్ర కళాచరిత్రలో రికార్డు సృష్టించడం గొప్ప సంచలనం. సథబీజ్ వేలంపాటలో ప్రకటించిన పది నిమిషాల వ్యవధిలోనే చైనా కళాభిమాని దీన్ని 108.4 మిలియన్ డాలర్లకు సొంతం చేసుకుంటాడు.

పెయింటింగులో ఆహ్లాదకరమైన లేత దుస్తుల్లో యువతి అలంకరణలో, జుత్తు ముడితో మన ఎదుట నిలబడి వుంటుంది. ఎడమ భుజం నుండి జారి పోతున్న డ్రెస్‌తో ఛాతీ కొంత భాగం నగ్నంగా కన్పిస్తుండగా, మిగతా భాగాన్ని చేతిలోని విసన కర్రతో కప్పి వుంచి ఎంతో ఆత్మీయంగా కన్పిస్తుంది. లేకపోతే తన వక్షభాగాన్ని ఆచ్ఛాదన లేకుండా చూపించేది కాదు అన్న భావన ఏర్పడుతుంది. పెయింటింగుకు 'లేడీ విత ఫాన్' పేరు పెట్టడానికి ఆమె చేతిలోని విసనకర్ర కారణం కావచ్చు. ఆ అందమైన యువతి ఎవరో తెలీదు. క్లిమ్ట్‌కు అభిమాన పాత్రురాలైన బాలే డాన్సర్‌గానీ, సంగీత శాలలో పాటలు పాడే గాయని గానీ అయివుండవచ్చు. క్లిమ్ట్ సౌందర్యాభి రుచికి తగిన రూప లావణ్యం, అందం ఆమె సొంతం. బాలే డాన్సర్లు అవసరాన్ని బట్టి స్టేజీ మీద అర్థనగ్న ప్రదర్శన కూడా చేయవలసి వుంటుంది. సౌందర్యానికి ప్రాముఖ్యత నిచ్చే ధనిక కుటుంబ స్త్రీలను, కవ్వించే వియన్నా అందాల

భామలను క్లిమ్ట్ మోడళ్ళుగా చేసుకుని పోర్ట్రేట్లు చిత్రించే వాడు. వాటిలో పాత్ర స్వభావానికి, వ్యక్తిత్వానికి ప్రాధాన్యత కన్పించదు. కేవలం సౌందర్యానికే ప్రాముఖ్యత నివ్వడం క్లిమ్ట్ లక్ష్యంగా కన్పిస్తుంది. క్లిమ్ట్ చిత్రాల్లో శృంగార భావాన్ని, స్త్రీ సౌందర్యాన్ని కొత్త కొత్త మార్గాల్లో వైవిధ్యంగా ప్రదర్శిస్తాడు. 1910 తర్వాత క్లిమ్ట్ చివరి దశ చిత్రాల్లో చైనా ప్రభావం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. పెయింటింగు పృష్ఠభాగం (Back ground)లో అలంకరణతో అనేక సంకేతాలను వాడతాడు. ఫీనిక్స్ అదృష్టానికి, శాశ్వ తత్వానికి, క్రేన్, లోటస్ పూలు, పూల మొక్కలు, మేఘాలు స్వేచ్ఛకు అందానికి ప్రతీకలుగా–అన్నీ చైనా కళా ప్రభావంతో ఉత్తేజితుడై చూపించి నవే వుంటాయి. చిత్రం అంతటా లేత పసుపు రంగు వ్యాపించి వుంటుంది. ఇవన్నీ చైనా కళా కృతుల్లో కన్పించే లక్షణాలే. అలాగే యువతి చేతిలోని విసనకర్రలో, ధరించిన దుస్తుల్లో, వాటిపై నున్న డిజైన్స్‌లో చైనా, జపాన్ హస్తకళల సాంప్రదాయం ప్రతిఫలిస్తుంది. ఉన్నత వర్గ వేశ్యల పోర్ట్రేట్లు క్లిమ్ట్ అలంకార శైలిని మెరుగు పరుచు కోవడానికి తోడ్పడ తాయి. క్లిమ్ట్ కళాశైలి సౌందర్య కళాను గుణంగా రేఖల్లో, ఆకారాల్లో కన్పిస్తుంది. అతని పెయింటింగులు వివరణాత్మకంగా కాకుండా అందమైన కవితా మాధుర్యాన్ని అనుభవంలోకి తెస్తాయి. జపాన్ ఉకో–ఈ కళాస్రష్టల్లాగా క్లిమ్ట్ తన మోడళ్ళ మీద ఎక్కువగా ఆధారపడ్డాడు.

1918లో క్లిమ్ట్ గుండెపోటుతో మరణించే నాటికి విసనకర్రతో వనిత చిత్రం అసంపూర్ణంగా మిగిలిపోతుంది. ఐనా పరిపూర్ణంగా కన్పించే ఈ చిత్రాన్ని పరీక్షగా చూస్తేనే గాని అందులోని లోపాలు – త్వరత్వరగా రంగు పులిమినట్లు, యువతి దుస్తులు, పృష్ఠ భాగంలోని డిజైన్‌లో కొంత భాగం అసంపూర్తిగా మిగిలిపోయినట్లు తెలియవు. క్లిమ్ట్ అసంపూర్తి చిత్రాల్ని ప్రదర్శించినా కళాభిమానులు ఆ విషయం పట్టించుకోకుండా కొనుక్కునేవారు. ప్రదర్శించీ ప్రదర్శించకుండా తన చిత్రాల్లో క్లిమ్ట్ శృంగారాన్ని చూపిస్తాడు. లేడీ వితెఫాన్ చిత్రం కన్నా ముందే అదే సంవత్సరంలో వేసిన రెండు చిత్రాలు అగ్ని ప్రమాదంలో కాలిపోతాయి. ప్రాచ్య దేశాల కళ పట్ల వున్న అభిమానంతో తూర్పు ఆసియా దేశాల నుండి సేకరించి పెట్టుకున్న దుస్తులెన్నో 1945 నాటి బాంబు దాడిలో నాశనమై పోతాయి. నిలువుగా దీర్ఘ చతురస్రాకారంలో చిత్రించే సాంప్రదాయ పద్ధతికి విరుద్ధంగా ఒక మీటర్ చదరపు



విసనకర్ర వనిత

కాన్వాస్‌పై పెయింట్ చేయబడిన లేడీ వితె ఫాన్ క్లిమ్ట్ సౌందర్య దృష్టికి అందమైన శైలికి చక్కని నిదర్శనం.

పెయింటింగు విశేషాలు జూన్ 27, 2023 నాటి సథబీజ్ వేలంలో చైనా కళా ప్రియుని ఏజంట్ పట్టీవాంగ్ దీనిని కొద్ది నిముషాల వ్యవధిలోనే కొనుగోలు చేస్తాడు. ఐరోపా చిత్రకళా చరిత్రలో 85.3 మిలియన్ పౌండ్లకు అమ్ముడుపోయి రికార్డు సృష్టించడం దీని గొప్పదనం. ఇది 108.4 మిలియన్ అమెరికా డాలర్లకు సమానం. కళా వ్యాపార దిగ్గజం సథబీజ్ యూరప్ ప్రతినిధి హెలెనా న్యూమన్ పెయింటింగు నేపథ్యంలోని శాశ్వతత్వానికి ప్రతీక ఐన ఫీనిక్స్ పక్షిని గుర్తిస్తుంది.

1918లో క్లిమ్ట్ మరణించే నాటికి అతని వియన్నా స్టూడియోలోని ఈజిల్ మీద లేడీ వితే ఫాన్ పెయింటింగు అసంపూర్తిగా మిగిలిపోవడాన్ని, దాని మీద క్లిమ్ట్ సంతకం లేకపోవడాన్ని సథబీజ్ ప్రత్యేక నిపుణుడు సైమన్ స్టాక్ గుర్తిస్తాడు. లేడీ వితె ఫాన్ పెయింటింగు కన్నా ముందు అధిక ధరకు అమ్ముడుపోయిన చిత్రాల్లో మార్లిన్ మన్రో – అమెరికా కళాకారుని సృష్టి, పేరులేని చిత్రం – జాన్ మైఖేల్ బస్కియత్ పెయింటింగు, ఎంపైర్ ఆఫ్ లైట్ – రినీ మాగ్రిట్ పెయింటింగు, డియాగో అండ్ ఐ – ఫ్రిదాకాలో పోర్ట్రేట్ మొదలైనవి కొన్ని.

మి

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
(టి.వి.ప్రసాద్), ఫోన్ నెం. 7981398250

# తెలుగు సాహిత్య పరిశోధన

- బుక్కే ధనక నాయక్

తెలుగులో సాహిత్యానికీ భాషాశాస్త్రానికీ ఎక్కువ సామీప్యం ఉందని గ్రహించలేదు మనం. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో మొట్టమొదట లింగ్విస్టిక్సు పాఠం చెప్పడం మొదలు పెట్టిన రోజుల్లో అంటే, గంటిజోగిసోమయాజులు గారు లింగ్విస్టిక్సూ, పింగళి లక్ష్మీకాంతం గారు సాహిత్య విమర్శా చెప్తున్న రోజుల్లో ఒక విభాగానికీ ఇంకో విభాగానికీ చుక్కెదురు ఉందనే అభిప్రాయం కూడా ఒకటుండేది. మీరు భాషాశాస్త్ర విద్యార్థి అయినట్లయితే సాహిత్యశాస్త్ర విద్యార్థి కావడానికి వీల్లేదు. సాహిత్యశాస్త్ర విద్యార్థి అయితే భాషాశాస్త్ర విద్యార్థి కావడానికి వీల్లేదు. ఈ తేడా సోమయాజులుగారూ లక్ష్మీకాంతంగారూ ఆంధ్రా యూనివర్సిటీలో అకస్మాత్తుగా తెచ్చి పెట్టింది కాదు. అంతకు ముందు సాంప్రదాయిక విద్యలో భాగాలకు పొడిగింపే తేడాలు. వాటి కొనసాగింపే తెలుగుదేశంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏర్పడ్డ తెలుగు డిపార్టుమెంటు యొక్క రూపం. పూర్వం సంస్కృత పాఠశాలల్లో వ్యాకరణ శాస్త్రం చదువుకునేవాణ్ణి వ్యాకరణ విద్యార్థి అనేవారు. అలంకారశాస్త్రం చదువుకునేవాణ్ణి అలంకార విద్యార్థి అనేవారు. ఆ అలంకార విద్యార్థి అనేమాట వెనుక ఒక వ్యంగ్యం ఉంది. అంటే అలంకార ప్రాయంగా ఉండే విద్యార్థి అని. బుద్ధిమంతులూ కుశలమైనటు వంటి ఆలోచన కలవాళ్లూ వ్యాకరణం చదువుకుంటారనీ, ఊరికే పద్యాల్లో అందాలు చెప్పి సరదాగా జీవితాన్ని గడపాలను కునేవాళ్ళు, అంత గాఢమైనటువంటి పరిశీలనాశక్తి లేనివాళ్ళు సాహిత్యశాస్త్రం చదువుకుంటారని ఒక అభిప్రాయం ఆ రోజుల్లోనే ఉండేది.

ఇంకొంచెం పూర్వానికి వెళ్ళి చూస్తే భారతదేశంలో చెప్పుకోదగ్గ ప్రధానమైన అలంకారశాస్త్ర సిద్ధాంతం ఏదీ కూడా వ్యాకరణంతో సంబంధం లేకుండా వచ్చింది కాదు. సంస్కృత వ్యాకరణ మర్యాదలూ, సంస్కృత వ్యాకరణ నియమాలూ, సంస్కృత వ్యాకరణ సిద్ధాంతాలూ సాహిత్య శాస్త్రానికి ఒక రకమైన పదునునీ ఒక నిక్కచ్చితనాన్నీ తెచ్చిపెట్టాయి. ఈ పదునూ నిక్కచ్చితనం పోయి సంస్కృత అలంకార శాస్త్రమంటే రససిద్ధాంతం గజిబిజిగా మాట్లాడట మనేటటువంటి ఒక తేలిక రకమైన అభిప్రాయం మనకి లక్ష్మీకాంతంగారి రోజుల్లోనే మొదలైందని నా అనుమానం. అంటే అలంకారాల సంఖ్య, అలంకారాలు నిర్ణయించ గలగడం, వక్రోక్తి గురించి మాట్లాడగలగడం, వక్రోక్తి ఎన్ని రకాలుగా ఉందో చెప్పగలగడం, ధ్వనిని గురించి చెప్ప గలగడం, ధ్వనిని శాస్త్రీయంగా స్థాపించగలగడం, ధ్వనిని వివరంగా అన్వయించగలగడం, ఈ క్లిష్టమైన అలంకార శాస్త్ర భాగాలు చదవడం మానేసి, నాలుగైదు సరదా మాటల్లో, ఏదో నాలుగో ఐదో శ్లోకాలు ఉదాహరణకు తీసుకొచ్చి రసాన్ని గురించి ఓ మోస్తరైన అస్పష్టతతో మాట్లాడ్డం లక్ష్మీకాంతంగారి రోజుల్లో ఆరంభమైంది.

అయితే ఇందుకు కారణం లక్ష్మీకాంతంగారు కాదు. ఆయన మీద అభాండం వెయ్యడం నా ఉద్దేశం కాదు. ఈ పరిస్థితి ఆ కాలంలో ఏర్పడిందంటున్నానంతే. అలంకారశాస్త్రంలో ఉండే గ్రంథాలు పఠనపాఠనంలోంచి పోవడం అందుకు కారణం. ఆ తరవాత పశ్చిమ దేశాల నుంచి కొన్ని సాహిత్యశాస్త్ర మర్యాదలు మనకు వచ్చాయి. ఇవి శాస్త్రీయంగా పశ్చిమ దేశాల్లోని సాహిత్య సిద్ధాంతాలు నేర్చుకోడం మూలంగా వచ్చినవి కావు. అక్కడో వ్యాసం ఇక్కడో పుస్తకం చదవడం మూలంగా వచ్చినవి. వీటిని ఇట్లా చదవటం మొదలు పెట్టినవాళ్లు చేసిన మంచి పని ఒకటుంది. అదేమిటంటే కొత్త అభిప్రాయాలు తెచ్చిపెట్టారు. కాని వీళ్ళు చేసిన పనిలో లోపం ఏమిటంటే ప్రాచీన అలంకారశాస్త్రం శ్రద్ధగా చదువుకోవడం మానెయ్యటం. మానేసిన తరవాత ఏమైందీ మీకు తెలిసే వుంటుంది. హడ్సన్ (Hudson) అనే ఒకాయన Introduction to the Study of Literature అనే ఓ పుస్తకం రాశాడు. పశ్చిమ దేశాల్లో అది గొప్ప పుస్తకం అంటే ఎవరైనా నవ్వుతారు.

ఏదో ఒక హైస్కూల్ టెక్స్ట్‌బుక్ లాంటి పుస్తకమది. ఆ హైస్కూలు టెక్స్ట్‌బుక్కు ఇక్కడ మనకి ప్రామాణిక గ్రంథమైంది. అది ఎలాంటి ప్రమాణ గ్రంథమైందీ అంటే, కావ్య ప్రకాశిక మన అలంకార శాస్త్రానికి ఎంత ప్రామాణిక గ్రంథమో అలాంటి ప్రమాణ గ్రంథమై మన నెత్తిన కూర్చుంది. అందులోంచి ఉదాహరణలు మాట్లాట్టం, అది తప్ప ఇంకే పుస్తకం చదవక పోవటం, మహా అయితే ఆరిస్టాటిల్ Poetics చదవటం, అది కూడా బుచర్ (S.H. Butcher) అనువాద మోమరొకటో కాస్త చదవటం, ఈ రెండు పుస్తకాల ఆధారంగా పశ్చిమ దేశాల సాహిత్య శాస్త్రాన్నంతట్నీ కూడా పాఠం చెప్పడం ఆనేది మనకు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అమల్లోకి వచ్చింది. లక్ష్మీకాంతంగారి మీద నాకు విపరీతమైన గౌరవం ఉంది, ఆయన మహా ప్రతిభావంతుడు. కాని ఆయన ఇంత ప్రతిభ తోటీ ఈ రెండు పుస్తకాలకీ ప్రామాణ్యం తెచ్చి పెట్టాడు. దానివల్ల ఏమయ్యిందీ అంటే సాహిత్యశాస్త్రానికీ భాషాశాస్త్రానికీ మధ్యన వైరుధ్యం ఏర్పడింది.

అంతకు ముందు సాహిత్యశాస్త్రంలో ఎవరు పాండిత్యాన్ని సంపాదించినా, దాన్ని గురించి ఏమి రాసినా (పరిశోధన అనే దాన్ని గురించి తరువాత మాట్లాడు కుందాం.) వారు ఆనాటి సాహిత్య ప్రమాణాలు క్షుణ్ణంగా నేర్చుకున్నవాళ్లు, ఆ విషయాల్ని స్పష్టంగానూ, నిష్కర్షగానూ, శాస్త్ర ప్రమాణంతోను రాసినవాళ్లు. ఉదాహరణకి వేదం వేంకటరాయశాస్త్రిగారిని తీసుకుందాం. ఆయన ఆముక్తమాల్యదకి వ్యాఖ్యానం రాశారు. ఆ వ్యాఖ్యానం రాసిన మర్యాదలు చూడండి. అప్పటికున్నటువంటి సాంప్రదాయిక సాహిత్య శాస్త్ర విమర్శ పద్ధతులన్నీ కూడా జాగ్రత్తగా ఆయన అమలుపరిచారు. ఒక పద్యంలో అలంకారం ఏమిటి? దీనిలో వ్యాకరణ విశేషం ఏమిటి? దీనిలో ఉండేటటువంటి మిగతా విశేషాలేమిటి? ఇవి చెప్పేటప్పుడు మల్లినాథసూరి లాంటి వాళ్ళు అంతకు ముందు ఏరకమైన పద్ధతిని అనుసరించారో ఆ పద్ధతుల్ని అనుసరించారు వేదంవారు. మనకి ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తెలుగు శాఖ ఏర్పడే నాటికి ఏమయ్యింది? ఆ రకమైన రచన చేయడానికి సామర్థ్యం ఉన్నవాళ్లు ఆ శాఖలో లేకపోయారు. బయట ఒకవేళ వున్నా, వాళ్ళకి విశ్వవిద్యాలయాలలో ఉద్యోగాలు రాలేదు. అయితే సాంప్రదాయిక పండితులకి అప్పటికి లేనిది ఏమిటీ అంటే పరిశోధనబుద్ధి. పరిశోధకుడికి పూర్వగ్రంథాల మీద ప్రామాణిక బుద్ధి ఉండదు, పూర్వగ్రంథాలను ప్రశ్నించే బుద్ధి ఉంటుంది. మన సంప్రదాయ సాహిత్యశాస్త్రం ఎట్లాంటిదంటే పూర్వగ్రంథాల మీద ప్రామాణికతను పెంపొందించేది. అప్పకవీయం చదివిన విద్యార్థి అప్పకవీయంలో ఉన్న విషయాన్ని వీలున్నంత వరకు అంగీకరించడానికి ప్రయత్నిస్తాడు. కావ్య ప్రకాశికలో ఉన్న విషయాన్ని బోధపరచుకొని, కావ్యప్రణాళిక నాకు బాగా వొచ్చునని చెప్పుకోవడం పాండిత్యానికి లక్షణం గాని, కావ్య ప్రకాశికను కాదనడం సాంప్రదాయిక విద్యార్థి లక్షణం కాదు. ఒకవేళ ఎప్పుడైనా పెద్ద పండితులైన వాళ్ళు ఖండన గ్రంథం రాస్తే దాన్ని మళ్ళీ పరిశీలించి బోధపర్చుకోడం వరకే విద్యార్థి పని. చాలా పెద్ద పండితులైన వాళ్లకి మాత్రమే శాస్త్రగ్రంథాలుగా పేరు పడిన వాటిని కాదనగలిగే శక్తి ఉండేది. మిగతా వాళ్ళందరూ కూడ బోధపర్చుకోవడం, తిరిగి అన్వయించడం, చెప్పడం మాత్రమే జరిగేది. ఇప్పుడది కాదుగా. పరిశోధన విషయంలో మనం ఏం నేర్పుతామంటే గ్రాడ్యుయేట్ స్టూడెంట్ అయినవాడికి ప్రశ్నించే అలవాటు నేర్పుతాం, 'అది ఎందుకు కాదు, అది ఇంకోరకంగా ఎందుకు చెయ్యకూడదు?' అన్న ప్రశ్న నేర్పుతాం. పాండిత్య సంప్రదాయానికీ ఆధునిక వైజ్ఞానిక సంప్రదాయానికీ ఉండే ప్రధానమైన తేడా ఇది.

ఇంతవరకూ సాహిత్య విమర్శలో ఏర్పడిన ఏ సిద్ధాంతమూ కూడా ఆ పని చెయ్యలేదు. ఉదాహరణకి వేమన పద్యాలు కొన్ని వందలూ వేలూ వున్నాయి. అందులో కొన్ని ఎక్కువ ప్రచారం పొందాయి. మరి కొన్ని ఎవరికీ తెలీకుండా పుస్తకాల్లో పడున్నాయి. జనం నోళ్ళల్లో నలిగిన పద్యాలు వాళ్ళకి నచ్చినవని, అంచేత అవి అందమైనవనీ మనం ఒప్పుకుంటాం. అవి ఎందుకు జనానికి నచ్చేయో పరిశోధకులు / విమర్శకులు రకరకాల కారణాలు ఇవాళ చెప్పవచ్చు. కానీ నాలుగు వేల వేమన పద్యాలు ముందు పడేస్తే ఆందులో– ఇదిగో ఈ ఫలానా పద్యాలు జనానికి నచ్చుతాయి. మిగతావి నచ్చవు. ఎందుకంటే ఫలానా పద్యగతమైన కారణాలవల్ల– అని నిర్ణయించడానికి ఏ సిద్ధాంతమూ తోడ్పడదు. పోతే జనాభిప్రాయాన్ని పరిశీలించిన పరిశోధకుడు, ఆటవెలది పద్యంలో ఒక రకమైన లక్షణాలుంటే అది ఎక్కువ అందమైన పద్యం అని నిర్ణయించొచ్చు. ఆ నిర్ణయానికి

ప్రయోజనం ఎందుకుందంటే, జనాభిప్రాయానికి అంతర్గతంగా ఉన్న హేతుబద్ధత, దీనివల్ల వ్యక్తమవుతుంది కాబట్టి. రాసేటప్పుడు ఒకరు రాసేది మరొకరికిఅర్థం కావడానికి కొన్ని ఆనవాయితీలు అవసరం. ఆ ఆనవాయితీల సంపుటినే style sheet అంటారు. ఇలాంటి ఆనవాయితీలు సాధారణంగా ఒక్కొక్కజనసమూహంలో ఒక్కోరకంగా ఏర్పడతాయి. ఉదాహరణకి, దస్తావేజులు రాయడం తీసుకోండి. అందులో కొంటున్న లేదా అమ్ముతున్న భూమికి సరిహద్దులు చెప్పే పద్ధతిలో ఆనవాయితీగా కొన్ని మాటలు అమలులో వుంటాయి. అది వాళ్ళ style. ఇలాంటి ఆనవాయితీలన్నీ దస్తావేజుల మతలబులు అనే పుస్తకంలో అచ్చువేశారు. అది గ్రామ కరణాల style sheet అని చెప్పొచ్చు.

తెలుగులో పిహెచ్ డి. వ్యాసాలు రాయడం చాలా కాలంగా జరుగుతూ వస్తున్నా, అవి రాయడానికి నియతమైన మతలబు ఏదీ ఏర్పడలేదు. మొత్తం పుస్తకాలన్నీ కలిపి వందో రెండు వందలో ఉన్నప్పుడు, పాండిత్యలోకంలోఉన్నవాళ్ళందరూ వాటిని కంఠస్థం చేసినప్పుడు, వాటిని వ్యాసాల్లో ఉదాహరించేవాళ్ళు. ఏ పద్యం, ఏ శ్లోకం, ఎవరు రాసిన ఏ గ్రంథంలో వుందో ఆచూకీ చెప్పాల్సిన అవసరం ఉండేది కాదు. ఇప్పుడు పరిస్థితి మారింది కాబట్టి, సమాచారానికి ఆచూకీలు ఇవ్వవలసిన పద్ధతిలో మనం అందరం కలిసి ఉమ్మడిగా కొన్ని నియమాలు ఏర్పాటు చేసుకోవాలి. Style sheet ఇలాంటి నియమాలతోపాటు ఇంకా కొన్ని ముఖ్యమైన సూచనలు కూడా చెయ్యాలి. అది పరిశోధన వ్యాసాలలో రాయవలసిన వచనం ఎలా వుండాలి అనే ప్రశ్నకి సంబంధించినది. తెలుగులో పరిశోధన అంటే అంత సాధారణమైన విషయం ఏమీ కాదు. పరిశోధన అంటేనే సాక్ష్యాలు చూపించడమని అర్థం. సాక్ష్యాలు సంపాదించడానికి ముఖ్యంగా తెలుగు పరిశోధనలో మౌఖిక అంశాలు ఎక్కువగా ఉంటాయి వీటికి సాక్ష్యాధారాలు చూపించాలంటే పరిశోధకుడు సాహసం చేయాల్సి ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే పరిశోధన చేయడానికి నేపథ్యాన్ని చూపించడం ఎంతో ప్రధానమైన అంశమో పరిశోధన అనంతరం దాన్ని ప్రతిఫలాన్ని సాధించి చూపడం అంతే ముఖ్యమైన అంశం.

బుక్కే ధనక నాయక్
**పరిశోధకులు, తెలుగు శాఖ**
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం**



**రోహిణి**

రోహిణి కలం పేరుతో 2015 నుంచి సుమారు 100 కార్టూన్లు వేశారు. జంటి కోరాడ జిల్లా (ఒరిస్సా), లో నివసిస్తున్న వీరు టీచర్స్ డే అయిన సెప్టెంబర్ 5న జన్మించారు. పెయ్యల రోహిణి లెక్కల టీచరుగా ఉద్యోగం చేస్తున్నారు.

*(మన కార్టూనిస్టుల రూపురేఖలు–శంకర్ నారాయణ)*



**రాగతి పండరి**

తెలుగునాట తొలిమహిళా కార్టూనిస్టుగా ఎనలేని కీర్తి ప్రతిష్టలు పొందిన కుమారి రాగతి పండరి పాఠకులకే కాదు పత్రికా సంపాదకు లెందరికో అభిమాన కార్టూ నిస్టు– పండగల ప్రత్యేక సంచికలకి, విడి కార్టూన్స్ ఫుల్‌పేజీ కార్టూన్స్, ఫీచర్ కార్టూన్స్, కార్టూన్ కథలూ ఆమె చిత్రీకరిం చారు. తాను నిరంతర సాధకురాలి ననే వినయ సద్గుణశీలి, రాగతిపండరి ప్రముఖ కార్టూనిస్టు జయదేవ్‌గారి ఆశీస్సులు పొందారు. వీరు మృత్యు ముఖంలో ఉండికూడా కార్టూన్స్ వేసి అబ్బుర పరిచారు–ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి కళారత్న (హంస) అవార్డు అందుకున్న రాగతిపండరి ఎందరో నారీమణులకి కార్టూనింగ్ పట్ల ఆసక్తి కలగటానికి స్ఫూర్తి నిచ్చారు–ఆగనికీర్తిజ్యోతి కుమారి రాగతిపండరి.



# బిడ్డల యాదిలో గద్దర్

– ఆచార్య అనుమాండ్ల భూమయ్య

గద్దర్ రాసిన పాటల్లో అమరవీరులను తలచుకొంటు రాసిన విషాద గీతం "వందనాలు వందనాలమ్మో మా బిడ్డలు" పల్లెటూరు వాతావరణాన్ని చిత్రిస్తూ రాసిన ఈ పాట కవితాత్మకంగా ఉంది. ఒక కాకి, ఊర పిచ్చుక, మేక, కోడి, ఆవును పేర్కొన్నాడు. ఇంటి మీదికి వచ్చిపోయేది కాకి. ఇంటి చూరులో గూడు కట్టుకొని కాపురముండేది పిచ్చుక. ఇంటి ముందు పెంచుకొనేది మేక. మరొకటి కోడి. మరొకటి ఆవు. రైతు ఇంటి ముందు పెరట్లో పండించుకొనేది జొన్న. తెలంగాణంలో ప్రముఖంగా జరుపుకొనేది దసరా పండుగ. ఒకొక్కదాన్ని ఒక్కొక్క చరణంలో వర్ణించాడు కవి.

మరో రెండు చరణాల్లో విప్లవవీరుని విషయం తెలుపబడింది. ఏదో రాత్రి (పోలీసుల కంటబడకుండ) నిశ్శబ్దంగా వచ్చి అన్నం తినిపోయే విషయమొకటి. విప్లవ సిద్ధాంతం మేరకు 'దొరల'తో యుద్ధం చేసే విషయం మరొక చరణంలో ఉంది. పాటలో ఇది చివరి చరణం. మొత్తం తొమ్మిది చరణాలు. మొదటిది పల్లవి – పోరాటంలో మరణించిన రాడికల్సను గురించిన విషయమిందులో ఉంది.



బిడ్డ మరణం

*"వందనాలు వందనాలమ్మో మా బిడ్డలు*
*వీరులార వీరులార రాడికల్ల శూరులార*
*రాడికల్ల శూరులార రైతుకూలీల బిడ్డలార*
*ఒక్క రొక్కరు వొరిగిపోయి సుక్కలల్లో కలిసినారు*
*సుక్కలల్లో కలిసి మీరు సూర్యులల్ల మొలిసినారు*
*ఏ దిక్కూ లేనోళ్ళకూ మా బిడ్డలు*
*మీరు దిక్కుసూపే సుక్కలయ్యిండ్రో మా బిడ్డలు"*

పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వారిని తన బిడ్డలుగా సంబోధిస్తున్నాడు కవి. చనిపోయిన వారు ఈ లోకం వీడి ఊర్ధ్వలోకాలకు వెళ్ళినారని చెప్పటమన్నది సాధారణం. వీళ్ళు చచ్చి సూర్యులుగా మొలిసినా రంటున్నాడు. సూర్యులై ఉదయించటం సరే కాని, కవి సూర్యులై 'మొలిసినా'రంటున్నాడు. ఇక్కడ కవి హృదయాకాశంలో కవితా చంద్రుడుదయించాడు. చీకటి రాత్రివేళ చుక్కలు దారి చూపిస్తాయి. అమరవీరులు ఆకాశంలో చుక్కలై దిక్కులేని వారికి దిక్కు చూపిస్తున్నా రంటున్నాడు. వీరుల మరణం పొడిచే సూర్యుని వంటిది, చుక్కల వంటి దనటం, కవి అమరులకెత్తిన దివిటి.

ఇంటి మీదికి కాకి వచ్చి కావు కావు మని అరిస్తే మనింటికి ఎవరో అతిథులు వస్తున్నారనటానికి సూచనగా గ్రామ ప్రజలు భావిస్తుంటారు. ఇది వారి నమ్మకం. ఈ నమ్మకాన్ని ఆధారం చేసుకొన్నాడు కవి. అతిథులెవరో కాదు. మరణించిన వీరి కోసం ఎదురుచూస్తుండటం. అమరులైన వారినే కాకులుగా రమ్మంటున్నాడు గద్దర్ – "ఆ గుడ్డులో మా బిడ్డలౌతారా?" అని గూడు కట్టుకోవటానికి వచ్చిన పిచ్చుకలను కొందరు వారిస్తుంటారు. మేము వారించమని, జంట విడిపోకుండ కనిపెడత"మని అంటున్నాడు. కవికి గల భూతదయ ఇది. ప్రాణిపట్ల గల ప్రేమ ఇది.

మనుషుల వలెనే పక్షులు కూడ సుఖంగా జీవిస్తూ తమ సంతతిని పెంచుకోవాలన్న కవి భావనకిది నిదర్శనం.

మూడవ చరణంలో మేకపిల్ల విషయం చెప్పి, మేకపిల్ల చేతులై షేకండ్ ఇచ్చి పోతారా! అంటున్నాడు. మేక పిల్లను తల్లిలేనిదని చెప్పి దాన్ని పెంచి పెద్ద చేస్తామని, కరుణ భావాన్ని, ప్రేమ భావాన్ని వ్యక్తం చేస్తున్నాడు. మీ వంతు బువ్వ పెట్టి మరువకుండ మీరు పెట్టినట్లే దాని వంతుది దానికి పెడుతామనటంలో ఆ మేక పిల్లను తమ కన్న బిడ్డగానే చూసుకుంటున్నారన్నది స్పష్టం –

*"తల్లిలేని మేక పిల్లను పెంచి దానిని పెద్ద జేస్తము*
*మీ వొంతు బువ్వ మరువకుండ*
*దాని వొంతు దాని కెడతాం*
*ఆ మేకపిల్ల సేతులౌతారా మా బిడ్డలు*
*మాకు షేకండ్ ఇచ్చిపోతావా?"*

ఆ తరువాత కోడి విషయాన్ని ఎత్తుకొని కోడి పిల్లలను తల్లికోడివలె రెక్కల్లో దాచుకొని ప్రమాదాల నుండి కాపాడుతామని, మీ మీదున్న మమతను తీర్చుకొంటా మంటున్నాడు –

*"జోడు కోడిపుంజులకు తోడు కోడిపెట్ట తెస్తం*



*తొలుసూరు గుడ్డు పెడితే*
*మీ పేరు మీద పొదిగేస్తం*
*గుడ్డు తొలుసపుకోని పుట్టిన*
*కోడి పిల్లకు నీరు పెడుతూ*
*గద్ద దేగలు తన్న వొస్తే*
*తల్లి కోడై కాపలుంటాం*
*మా డొక్కలల్లో దాచుకుంటాము మా బిడ్డలు*
*తల్లి మమత తీర్చుకుంటాము మా బిడ్డలు"*

తొలుసూరు గుడ్డు, పొదిగెయ్యటం గుడ్డు తొలుచుకొని కోడిపిల్ల బయటకు రావటం, పిల్లలను తన్నుకొని పోవటానికి గద్దవస్తే ఆ తన పిల్లలను కాపాడుకోవటానికి తల్లికోడి తన రెక్కల దాచుకోవటమనే ప్రకృతి సహజమైన విషయాలను కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు కవి.

రైతుకు ప్రాణమైన ఆవు విషయాన్ని ఆ తరువాతి చరణంలో వర్ణిస్తూ, పోయిన బిడ్డల పునర్జన్మను కోరుకుంటున్నాడు.

*"కట్టినా ఆ పిల్ల ఆవును*
*కంటి పాపల చూసుకుంటాం*



*పచ్చగడ్డి, పిండిపెట్టి*
*ప్రాణమోలె పెంచుకుంటం*
*పురిటి నొప్పులు దానికొస్తే*
*కాన్పుజేసి కావలుండి*
*తల్లిలేగను నాకుతుంటే*
*తల్లిప్రేమ గురుతుకొచ్చు*
*మా పురిటి నొప్పులయ్యి వొస్తారా మా బిడ్డలు*
*మీరు మళ్ళీ జన్మై మాకు పుడుతారా మా బిడ్డలు"*

పిల్ల ఆవును 'కంటిపాప'వలె చూసుకొనటం, పచ్చగడ్డి పిండిపెట్టి ప్రాణం వలె పెంచుకోవటమన్నవి ప్రేమను తెలిపే అంశాలు. కట్టిన ఆవు ఈనటం, పుట్టిన పిల్ల ఆవునకు కాపలుండటం, లేగను నాకటం తల్లి ఆవు పరంగా సహజమైన విషయాలు. ఈ సన్నివేశాన్ని చూస్తుంటే తల్లి ప్రేమ గుర్తు రావటమన్నది సహజంగా కలిగే భావం. పిల్ల ఆవులై వస్తారా అకుండ తన పురిటినొప్పులై వస్తారా అనటం విశేషం. ఇది గద్దర్ ప్రత్యేకత. నొప్పులు రావటం ప్రసవానికి సూచన. మళ్ళీ మీరే మాకు పుట్టాలన్నది ఈ తల్లి కోరిక.

పక్షుల విషయం, జంతువుల విషయాలను ఈ విధంగా వర్ణించటంలో అంత విశేషమేం లేదనిపిస్తుంది – జొన్నకంకులై పుడతారా అని అన్నప్పుడు

*"ఇంటి ముందు పెరడులోనా*
*జొన్నసేనై మేము పుడుతం*
*వొంటికాలు మీద నిల్చి*



*కొడుకు నిమ్మని వ్రతం పడతం*
*మీరు జొన్న కంకులయ్యి పుడతారా మా బిడ్డలు,*
*మా సంకలల్లో, బిడ్డలౌతారా మా బిడ్డలు"*

కొడుకు పుట్టాలని వ్రతం పట్టటం, పుట్టిన బిడ్డలను చంక నెత్తుకోవటం సాధారణమైన అంశాలు. జొన్న కల్లకు కంకి వేయటాన్ని చూస్తే కవికి, బిడ్డనెత్తుకొన్న తల్లి వలెనే కనిపించింది. ఈ పోలిక ప్రశంసావహం.

దసరా పండుగనాడు పాలపిట్టను చూడటం, జమ్మిచెట్టును పూజించి ఆకులను ప్రసాదంగా భావించి తీసుకోవటమన్నవి తెలంగాణ ప్రత్యేకతలు. పాలపిట్టలుగా వచ్చి పొమ్మంటున్నాడు –

*"పాల పిట్టయి చూసి పోతారా మా బిడ్డలు*
*మీరు జమ్మి ఆకై కలిసి పోతారా మా బిడ్డలు"*

పండుగ ప్రత్యేకతలను తమ బిడ్డలకు ఈ విధంగా



సమన్వయం చేసి తన కవితాభివ్యక్తి ప్రత్యేకతను చాటుకొన్నాడు కవి.

విప్లవ ఉద్యమాల మీద ప్రభుత్వం నిషేధం విధించినప్పుడు ఉద్యమంలో జేరినవారు పోలీసుల కంటబడకుండ జాగ్రత్తలు తీసుకోవలసి వస్తుంది. కార్యకలాపాలన్నీ రహస్యంగానే... ఇంటికి వచ్చి భోజనం చేసి పోవటం కూడ. అట్లా పిల్లలు రాత్రి వేళల్లో తిండికి వస్తారని వారికోసం అన్నం సిద్ధంగా ఉంచి, గొళ్ళెం బేడెం వేయకుండా దిడ్డి దర్వాజా దగ్గరేసి పెట్టినారట. అడుగుట చప్పుడు కాకుండ పిల్లివలె వచ్చి తినిపోవటానికి తగిన ఏర్పాటు ఇది –

*"మీ అయ్య అన్నకు చెప్పకుండా*
*నీ వొంతు అన్నం దాపెట్టిన*
*దిడ్డి దర్వాజ దగ్గరేసి*
*గొళ్ళెము బేడెము వేయలె*
*మీరు పిల్లి అడుగులై వొస్తారా మా బిడ్డలు"*

ఉద్యమ కార్యకలాపాలను రహస్యంగా కొనసాగించటానికి తల్లి తన బిడ్డకిస్తున్న సహకారామిది.

విప్లవోద్యమ వీరులు చేసే పోరాటం 'దొరల' మీద. విప్లవోద్యమ చిహ్నం ఎఱ్ఱజండ. ప్రాణమున్నంత వరకు ఆ జండాను వాళ్ళు వదలరు. ఆ జెండా ఎరుపు నెత్తురుకు ప్రతీక. మరణానంతరం తాము పట్టిన జండాను తాము వారు పట్టుకొని ఉద్యమంలో చేరితే వారి ఆత్మకు శాంతి, ఆనందం. ఈ ఆనందాన్ని మీ కిస్తామంటుంది తల్లి. ఈ విషయాన్ని పాట చిట్ట చివరి చరణంలో చెప్తున్నాడు కవి.

*"వొద్దురా వొద్దురా కొడుక*
*దొరలతోని యుద్ధామొద్దని*
*నెత్తినోరు మొత్తుకున్న*
*ఎంత సెప్పిన వినకపోతివి*
*మొండివాడవు దండివాడవు*
*సెమలు నిండిన గుండెవాడవు*
*పట్టిన ఆ ఎఱ్ఱజెండను*
*ప్రాణ ముండగ వదలలేదు*
*మీ నెత్తురూ జెండిచ్చి పోతారా మా బిడ్డలూ*
*మేము ఎత్తుకుంటే*
*మురిసి పోతారా మా బిడ్డలూ"*

స్మృతి గీతాన్ని ఈ విధంగా సహజ సుందరమైన గ్రామీణ వాతావరణంలో కవితాత్మకంగా చిత్రించిన గద్దర్ విప్లవోద్యమ విధానాన్ని స్పష్టం చేస్తు పాటను ముగించాడు.

ఇది గద్దర్ పాట రచనా విశేషం.

ఆచార్య అనుమాండ్ల భూమయ్య
ఫోన్ : 8897073999



# భువిలో దివి వియన్నా

*– నిమ్మగడ్డ శేషగిరి రావు*

2018, 2019 సంవత్సరాలలో వరుసగా రెండు సార్లు ప్రపంచంలో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా ఆస్ట్రియాలోని వియన్నా నగరం ఎంపిక చేయబడింది. లండన్ నుండి వెలువడే 'ది ఎకానమిస్ట్' అనే వార్తాపత్రిక దేశవిదేశాల సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాలను నిష్పాక్షికంగా విశ్లేషిస్తుందని వినికిడి. అటువంటి పత్రిక చేత అత్యుత్తమ నివాసయోగ్యమైన నగరంగా ప్రకటించబడటమంటే అది ఆ నగరానికి ఒక నిజమైన తాఖీదు. మధ్యలో 2020,2021 సంవత్సరాలు తప్ప, మళ్ళీ 2022, 2023 సంవత్సరాలకు కూడ వియన్నా నగరమే అత్యుత్తమ నివాస యోగ్యమైన నగరంగా నగర్వంగా నిలచింది. ఈ నగరం సకారణంగానే 'కలల నగరం' గా, 'సరిగమల సరాగ సీమ' గా పేరు పొందింది. నాలాంటి విదేశీ యాత్రికులకు డాన్యూబ్ నదీ తీరంలో నిర్మించ బడిన ఈ నగరం విలక్షణమైన సాంస్కృతిక వాతావరణంతో నిత్యం శోభిల్లుతూ ఆహ్లాదం కలిగిస్తుంది. నగరమంతా భవంతులు, రాజభవనాలు, చర్చ్‌లతో నిండి ఉంటుంది.



వియన్నా ప్యాలెస్

నేను వియన్నా వెళ్ళొచ్చి ఇప్పటికి నాలుగు సంవత్సరాలవుతోంది. నిజానికి నేను ఇక్కడికి వెళ్ళటం అది రెండవ సారి. మొదటిసారి నా భార్యతో కలిసి, పందొమ్మిది సంవత్సరాల క్రిందట ఇక్కడికి వచ్చాను. ఆ రోజుల్లో మాకు, యునైటెడ్ కింగ్‌డమ్‌లో కొంతకాలం మాత్రమే ఉండటానికి అనుమతించే భారత దేశపు పాస్‌పోర్టు ఉండేది. మొదటిసారి భారతదేశం వదలి విదేశాలకు వచ్చిన నాలాంటి వారికి, ప్రతిదీ ఎంతో ఆశ్చర్యంగా, అద్భుతంగా ఉండేది. కాలంలో వెనుదిరిగి చూసుకుంటే, ఇరవై నాలుగు సంవత్సరాల క్రితం యు.కె.లో డాక్టరుగా ఉండటానికి లైసెన్సు సంపాదించుకోవటానికి, వృత్తి పరమైన, భాషా పరమైన అర్హతను పరీక్షించే ప్లాబ్ పరీక్షలో ఉత్తీర్ణుడనవటం, ఉద్యోగం సంపాదించుకోవటం, నిలదొక్కుకుని, అంచెలం చెలుగా ఎదగటానికి చేసిన ప్రయత్నాలన్నీ కళ్ళ ముందు కదలాడతాయి. అప్పట్లో అప్పులు తీర్చటం, వీలైనంత త్వరగా కుటుంబ జీవితాన్ని ఏర్పరచుకోవటాలే ముఖ్య ఆశయాలు. వీటిని సాధించుకున్న తరువాత నెమ్మదిగా చుట్టూ చూడటం. ముందు యు.కె.లో లండన్, ఎడిన్ బరో లాంటి నగరాలు, లేక్ డిస్ట్రిక్ట్, పీక్ డిస్ట్రిక్ట్ మొదలైన సుందర ప్రదేశాలు చూడటం; అటు తరువాత నెమ్మదిగా ఐరోపా ఖండం వైపు దృష్టి సాగారేది. ముఖ్యంగా సామాన్య భారతీయ యువత కలలలో తరచూ చోటు చేసుకునే ప్రదేశాలు..పారిస్, ఆమ్‌స్టర్ డామ్, ఇంకా స్విట్జర్‌లాండ్ అంతా. నేను కూడ వాళ్ళల్లో ఒకడినే. నాకు కూడ విదేశాలంటే పోస్ట్ కార్డుల్లో కనిపించే మంచు నిండిన స్విట్జర్‌లాండ్ దృశ్యాలు, యాష్ చోప్రా తీసిన దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే లాంటి బోలీ వుడ్ సినిమాలలో పాటలు చిత్రీకరించిన ప్రదేశాలే.

అప్పుడు మాకున్న ఇండియా పాన్‌పోర్టుతో యూరప్ వెళ్ళాలంటే షెన్‌జెన్ వీసా తీసుకోవాలి. దీనితో చాలా ఐరోపా దేశాలకు వెళ్ళవచ్చు. అయితే ఆ వీసాకు ఉన్న కాల పరిమితి చాలా తక్కువ. అందువలన ఒక ట్రిప్‌లోనే వీలైనన్ని ఎక్కువ దేశాలు తిరిగి రావాలనుకునేవాళ్ళం. 'కాస్మోస్' అనే కంపెనీ ఐరోపా దేశాలకు రోడ్డు మార్గాన వెళ్ళటానికి, గైడ్ సహితమైన బస్ (కోచ్) ఏర్పాటు చేసేది. మొత్తం 21 రోజుల యాత్ర. ఎనిమిది దేశాలు, ఆ కోచ్ యాత్రను ఇప్పటికీ నేను మరచిపోలేదు. దానిలో భాగంగా వియన్నాలో రెండు రోజులు ఉన్నాము. అప్పుడు మేము చూసిన షోన్‌బ్రన్ రాజభవనం ఆస్ట్రియా – హంగేరీ సామ్రాజ్యానికి చెందిన రాజ కుటుంబీకుల నివాసం. దీనిని చూసినప్పుడు, ఫ్రెంచ్



వియన్నాలో రాత్రి

వారు పారిస్ సమీపంలో ఘన కేతనంగా నిర్మించిన వర్సెయ్ రాజభవనానికి, పోటీగా ఏ మాత్రం తగ్గకుండా ఆస్ట్రియావారు దీనిని నిర్మించారా అనిపిస్తుంది.

కెఫే శాక్కర్‌కి వెళ్ళటం కూడా నాకు బాగా గుర్తే. ఆస్ట్రియాలో విలక్షణమైన వాతావరణంతో సందడిగా ఉండే వందలాది కెఫేలలో ఇదొకటి. ఇక్కడ తయారు చేసే శాక్కర్‌టార్ట్ (చాక్లెట్ కేక్) చాలా ప్రసిద్ధం. చాక్లెట్ రంగులో ఆప్రికాట్ పండు వాసనతో ఉండే దాని జన్మస్థలం ఇక్కడే. వియన్నా వెళ్ళినవారు దీనిని రుచిచూడకుండా రాకూడదు. అయితే దీని వలన ఒక్కటే సమస్య. మన శరీరానికి రోజువారీ అవసరమైన కాలరీలలో సగానికి పైగా ఒక చిన్న కేక్ ముక్క ఇచ్చేస్తుంది. ఈ జ్ఞాపకాలను నెమరేసు కుంటూ రెండున్నర గంటల విమాన ప్రయాణం తరువాత వియన్నాలో దిగాను. అది మార్చి 2019.

ది ఎకానమిస్ట్ తో పాటు, మెర్సర్ అనే ఒక సంస్థ ప్రపంచంలో 200 నివాసయోగ్యమైన నగరాలలో, మనిషి సుఖంగా నివశించటానికి దోహదపడే 39 అంశాల స్థితిగతుల గణాంకాలను గమనిస్తూ, వాటిని ఒక సూచికగా క్రోడీకరించి వాటిని ఏటా శ్రేణీకరిస్తుంది. ప్రపంచంలోని అతి పెద్ద బహుళ జాతి కంపెనీలకు మానవ వనరుల సలహాదారుగా వ్యవహరించే మెర్సర్, నిష్పాక్షికంగా వ్యవహరించే ఒక స్వతంత్రమైన సంస్థ. నేను గత కొద్ది సంవత్సరాలుగా మెర్సర్ సూచికలను కూడ గమనిస్తూ ఉన్నాను. గత పదేళ్ళుగా వియన్నా మెర్సర్స్ ఇండెక్స్‌లో మొదటి స్థానంలోనే ఉంది. ఈ ఇండెక్స్‌లో ఎప్పుడూ కనిపించే ఇతర నగరాలు, వాంకూవర్, జూరిక్ మెల్‌బోర్న్, సిడ్నీ, కొపెన్‌హాగన్, జెనీవా, మ్యూనిక్, ఆక్‌లాండ్. పారిస్, లండన్, న్యూయార్క్ నగరాలు వరుసగా 39, 40, 41 స్థానంలో ఉన్నాయి. వాటిల్లో ఉన్న మన దేశపు నగరాలైన బెంగుళూరుకి 149, ముంబైకి 154, ఢిల్లీకి 162వ స్థానాలు ఇచ్చారు. ఒక్క సింగపూర్, ఒకటో రెండో జపాన్ నగరాలు తప్ప మరే ఇతర ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఖండాలకు చెందిన నగరాలూ మొదటి 50 స్థానాలలో లేవు. ఇంతలా పదే పదే సుఖవంతమైన నగరంగా ప్రకటించబడిన వియన్నా, నాలాంటి యాత్రికులను ఎప్పుడూ ఆకర్షిస్తూనే ఉంటుంది.

ప్రపంచ చరిత్రలో కూడ వియన్నాకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. మధ్యయుగాల్లో ఒట్టోమాన్ టర్క్‌లు చేసిన రెండు దాడుల్ని ఎదుర్కొని, విజయవంతంగా తిప్పికొట్టి, ఐరోపాలో క్రైస్తవ మతాన్ని నిలబెట్టిన నగరం ఇది. తరువాత కాలంలో ఇది హాప్స్‌బర్గ్ ఆస్ట్రో - హంగేరియన్ సామ్రాజ్యానికి రాజధాని. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు వియన్నా ఎంతో కీర్తి ప్రతిష్టలు ఉన్న దేశమే కాకుండా కళాకారులకి, కవులకి, మేధావులకి నిలయంగా విరాజిల్లింది. 1913 లో వారి మేధా సంపత్తులతో అప్పటి ప్రపంచ గతులను ప్రభావితం చేసిన అడోల్ఫ్ హిట్లర్, సిగ్మండ్ ఫ్రాయిడ్, జోసెఫ్ స్టాలిన్, లియోన్ ట్రాట్స్కీ, మార్షల్ టిటో లాంటి గొప్పవారందరూ వియన్నాలో జీవించారనేది ఊహించుకుంటేనే ఆనాటి ఆ సమాజపు మేధౌన్నత్యం అవగతమౌతుంది. అప్పటికే సిగ్మండ్ ఫ్రాయిడ్ అందరికీ బాగా తెలుసు. మిగిలిన వారందరూ ఇంకా చిన్నవారు. ప్రపంచాన్ని ప్రభావితం చేయగలిగే గొప్ప పనులు వారు చెయ్యబోతున్నారని బహుశా వారికి కూడ తెలియదను కుంటాను. మోజార్ట్, బీథోవెన్, హేడెన్, షూబర్ట్, జాన్ స్ట్రాస్ 2 లాంటి గొప్ప సంగీత కళాకారులు జీవించి, సంగీతోపాసన చేసిన నగరంగా వియన్నా సంగీతజ్ఞులకు స్వర్గతుల్యం. ఐరోపా సంగీతంలో ధృవతారలుగా నిలిచిపోయిన బీథోవెన్ సింఫనీలు, జాన్ స్ట్రాస్ 2 , 'బ్లూ డాన్యూబ్'లు వియన్నాలోనే స్వరపరచబడ్డాయి. బీథోవెన్ వియన్నాలో 35 సంవత్సరాలు జీవించాడు. 19వ డిస్ట్రిక్ట్‌లో ఉన్న ఆయన గృహం ప్రస్తుతం అతని జీవితంలోని అనేక ఘట్టాలను గుర్తుచేసే మ్యూజియంగా మార్చబడి ఉంది. ఇది నగర శివార్లలో ఉంది. ప్రత్యేకంగా టాక్సీలో వెళ్ళి దానిని సందర్శించటం ఒక మంచి అనుభవం.

బీథోవెన్, మోజార్ట్ లిరువురూ పాశ్చాత్య శాస్త్రీయ సంగీతానికి మూలస్థంభాలుగా పరిగణించబడతారు. మోజార్ట్ 1757లో ఆస్ట్రియాలో ఉన్న సాల్స్‌బర్గ్ నగరంలో జన్మించి, వియన్నాలో ఆస్ట్రియన్-హంగేరియన్ ఆస్థాన గాయకుడిగా ఖ్యాతి గడించాడు. బీత్‌వెన్ 1770లో జర్మనీలో జన్మించాడు. అతను యువకుడిగా ఉన్న కాలానికే మోజార్ట్ పేరు పొందిన సంగీత కళాకారుడు. బీథోవెన్ తన 17వ సంవత్సరంలో మోజార్ట్ వద్ద సంగీతాన్ని నేర్చు

కోవటానికి వియన్నాకు వచ్చి, కుటుంబ పరిస్థితుల వలన అది సాధ్యం కాక తిరిగి జర్మనీ వెళ్ళిపోయాడు. మరో 5 సంవత్సరాలకు, 1792లో మళ్ళీ మోజార్ట్ వద్ద సంగీతసాధన కోసం రాగలిగే సరికి, అతను 35 సంవత్సరాలకే మరణించటం వలన అది కుదరలేదు. ఆ దశలో బీథోవెన్‌కు జోసెఫ్ హేడెన్ గురువౌతాడు. చివరి దశలో బీథోవెన్ అంధుడౌతాడు. కాని సంగీత ప్రపంచంలో చిరస్థాయిగా నిలచిపోయే, అతని అయిదవ సింఫనీ లాంటి ఆణి ముత్యాలను స్వరపరచి ప్రపంచానికి అందించే యోగదీక్షకు అతని అంధత్వం అడ్డు కాలేదు. నేను, నాలాంటి యాత్రికులకు, నా అనుభవాల నుండి కొన్ని సూచనలివ్వగలను. ఒక కొత్త ప్రాంతాన్ని తెలుసుకోవాలంటే, అక్కడ నడుస్తూ తిరగటం కంటే మంచి పద్ధతి లేదు. అలా మనం నడుస్తున్నప్పుడు, ఆ వీధులు మనతో మాట్లాడుతూ, ఆ నగరం గురించి మనకు ఎన్నో విషయాలు చెపుతాయి. అలా నడవలేనప్పుడు, స్థానిక ప్రయాణ మాధ్యమాలను వినిమోగించుకోవటం మరిక మంచి పద్ధతి. చివరిగా, ఎవరైనా ఆ ప్రాంతం గురించి క్షుణ్ణంగా తెలిసిన వారు దొరికితే, గైడ్ పుస్తకాలలో కంటే విభిన్నమైన, నిష్పాక్షికమైన సమాచారం సేకరించుకొవటానికి ఇదొక విలువైన అవకాశం. దానిని పోనివ్వకుండా వినియోగించుకోవాలి. అలా నాకొక వియన్నా మొత్తం తిప్పి, చూపించే టూర్ గురించి తెలిసింది. వెంటనే అందులో చేరిపోయాను. ఇందులో భాగంగా, గైడు పుస్తకాలో లేని...వియన్నా రుచులు పరిచయం చేస్తారని తెలిసింది. నాకు ఇంత కంటె ఏం కావాలి? సాయంత్రం నాలుగు గంటలకి అందరం కార్ల్‌ప్లాజ్‌లోని కార్ల్‌కిర్చ్ అనే ప్రదేశంలో గైడ్‌ను కలసుకోవాలి. అక్కడ చూడదగిన విశేషాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా; ఓపేరా హౌస్, మ్యూజియమ్‌లు, నాష్ మార్కెట్. అదృష్టవశాత్తూ ఆ రోజు టూర్‌లో, నేను తప్ప ఇంకెవరూ లేరని తెలిసింది. అదొక ప్రైవేట్ టూర్‌గా మారింది.


మోజార్ట్

గైడ్ పేరు వోల్ఫ్‌గాంగ్ కాఫ్‌మెన్. అతను, "నన్ను వోల్ఫీ అని మాత్రమే పిలవండి'' అంటూ నాకు దగ్గరైపోయాడు. మేము కలుసుకొన్న సెయింట్ కార్ల్ చర్చ్, బారోక్ శైలిలో నిర్మించబడి ఉంది. చర్చ్ పైభాగంలో మధ్యలో ఎత్తుగా ఆకుపచ్చ రంగులో, గుమ్మటంలా కనిపించే ఒక పెద్ద స్థూపం ఉంది. చర్చ్ ముందు భాగం..హైదరాబాదు కోటి ఉమన్స్ కాలేజీ భవనాన్ని పోలిన గ్రీకు నిర్మాణ విశేషం ఉంది. నిజానికి..ఇటువంటి శైలిని పోలిన భవనాలు ఆసియా, ఐరోపాలలో చాలా చోట్ల కనపడతాయి. ఒక సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాలు, అ సంస్కృతి వ్యాపించిన తీరుతెన్నులను, ఆ చరిత్రను అర్థం చేసుకోవటానికి ఉపమోగపడతాయని నేను నమ్ముతాను. భవనం ముందు భాగంలో దాదాపు, మధ్యలో ఉన్న స్థూపమంత ఎత్తూ ఉన్న రెండు పాలరాతి మినార్ల మీద వియన్నా చరిత్ర గురించిన విశేషాలు మలచారు. ఈ భవన నిర్మాణంలో పాటించిన రేఖా సౌష్టవం అద్భుతంగా, కనువిందుగా ఉంది. అంటే భవనం మధ్యగా ఒక నిలువు గీత గీస్తే, దానికిరువైపులు ఒకదానికొకటి ప్రతిబింబాలుగా కనపడతాయి. ప్రపంచంలో అన్నిటి కంటే ఇదే ఎత్తైన బారోక్ చర్చి అని వోల్ఫీ చెప్పాడు. ఆ సాయంత్రమంతా, వోల్ఫీ గైడుగా కాకుండా నాకొక మంచి స్నేహితునిగా మెలిగాడు. వోల్ఫీ ఆ టూర్ కంపెనీకి యజమాని కూడనట. ఒక హోటల్లో కూడా అతను పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నాడట. అతను ప్రపంచవ్యాప్తంగా హొటళ్ళలో పనిచేస్తూ చాలా దేశాలు తిరిగాడట. ఇప్పుడు అతనికి తోడుగా మరో నలుగురు పార్ట్ టైం పని చేస్తారట. "ఈ పని నేను కేవలం డబ్బు కోసమే కాకుండా, నా సొంత నగరం మీద ప్రేమతో చేస్తున్నాను" అని అతను చెప్పాడు.

వియన్నాలో ఉన్న 23 జిల్లాలు, ప్రతిదీ ఒక చిన్న నగరంగా, ఒక ప్రత్యేకతతో ఉంటాయని వోల్ఫీ వివరించాడు. కొద్ది మైళ్ళ దూరంలో ఉన్న కారల్ ప్లాజ్, స్టీఫెన్ ప్లాజ్ అనేవి కేంద్రంగా ఉన్నది మొదటి జిల్లా. మిగిలిన జిల్లాలన్నీ ఈ జిల్లా కేంద్రంగా, వీటి చుట్టూ ఆవృతమై ఉంటాయని తెలిసింది. టెక్నికల్ యూనివర్సిటీ భవన సముదాయం దాటిన తర్వాత 'ఫైన్ ఆర్ట్స్ అకాడమీ' భవనాన్ని చూపించాడు వోల్ఫీ. ఈ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ వారి ఒక నిర్ణయం ప్రపంచ చరిత్రని శాశ్వతంగా మార్చివేసిందని చెప్పి వోల్ఫీ మౌనం వహించాడు. అదేమిటో

తెలుసుకునే వరకు, నాకు ఉత్సాహం ఆగలేదు. వోల్ఫీ చెప్పిన దాని ప్రకారం: 1906వ సంవత్సరంలో ఒక ఆస్ట్రియన్ యువకుడు, చిత్రకారుడవుదామనే ఆశతో ఈ అకాడమీలో అప్లికేషన్ పెట్టుకొన్నాడు. అతని అప్లికేషన్ ఒకటికి రెండు సార్లు తిరస్కరించబడటంతో అతను రాజకీయాలవైపు మళ్ళాడు. అతడెవరో కాదు; అడోల్ఫ్ హిట్లర్. చిత్రకారుడిగా వియన్నా నగరంలో ఎక్కడో ఒక సామాన్య జీవితం గడపవలసిన వాడు, జర్మన్ రాజకీయాలలో చేరి, నాజీ పార్టీని స్థాపించి, ప్రజల్ని ఎంతో హింసించి, వారి సాంప్రదాయక భావాల మీద కొరడా ఝుళిపించి, రెండో ప్రపంచ యుద్ధం వైపుగా మళ్ళించాడు హిట్లర్. అతని వ్యక్తిత్వంలో చిత్ర కారునికి ఉండకూడని ఈ కోణాన్ని ముందుగానే పసికట్టే కాబోలు, రెండుసార్లు అతని దరఖాస్తును తిరస్కరించారు ఇక్కడి ఆచార్యులు. 'అలా కాకుంటే' ఎలా ఉండేది? అనే ఊహ, ఎన్నో ఆలోచనలను ప్రతిపాదిస్తుంది. ఈ అకాడమీలో ఆ నాడు హిట్లర్‌ను చేర్చుకుని ఉంటే... అనే ఊహ...ప్రపంచ చరిత్రను తిరగ వ్రాసేది. రెండవ ప్రపంచ యుద్ధం వచ్చేది కాదేమో? ఎంత చక్కటి ఊహ ఇది? యాదృచ్ఛికంగా మొదటి ప్రపంచ యుద్ధం కూడా ఒక ఆస్ట్రియా దేశవాసి వలనే జరిగింది. 1914 సంవత్సరంలో ఆస్ట్రో హంగేరీ సామ్రాజ్య వారసుడు, ఆర్చిడ్యూక్ ఫ్రాంక్ ఫెర్డినాండ్, సరయేవో నగరంలో (ప్రస్తుతం బోస్నియాలో ఉంది) సంచరిస్తున్నప్పుడు, అతడినీ, అతడి భార్యనీ సెర్బియాకి చెందిన ఒక జాతీయవాది తుపాకీతో కాల్చి చంపేశాడు. ఆ తరువాత వరుసగా రగిలిన కొన్ని సంఘటనలు మొదటి ప్రపంచ యుద్ధానికి దారి తీశాయి. "ఇంత చిన్న దేశం రెండు ప్రపంచ యుద్ధాలకి మూలం ఎలా అయిందో?" అన్న ఆలోచనతో నా మనసు నిండిపోయి, అదే ప్రశ్న వోల్ఫీని అడిగాను. 'అది ఒకప్పటి చరిత్ర. ఇప్పుడు ఆస్ట్రియా అంతా ఒక శాంతికాముకమైన దేశం' అని అతను చెప్పాడు. ఆ సందర్భంలోనే, ఐక్యరాజ్య సమితిలో, శరణార్థులు, అణుశక్తి, రోదసీ రంగాలకు సంబంధించి, ఆస్ట్రియా నిర్వహిస్తున్న విశేషమైన బాధ్యతలను అతను నాకు విశదీకరించాడు.



బెతోవెన్

ఇలా మాట్లాడుకొంటూనే మేము, స్థానికులు, యాత్రికులు అందరూ అభిమానించే నాష్ మార్కెట్‌కి చేరుకున్నాము. ఇక్కడ వియన్నాలోని బహుళజాతి, బహుసంస్కృతులను ప్రతిబింబించే విధంగా, రకరకాల ఆహార పదార్థాలను, పానీయాలను అమ్ముతున్నారు. సాంప్రదాయ ఆస్ట్రియా దేశపు ఆహార పదార్థాలు మొదలుకొని, టర్కీ, ఇంకా తూర్పు ఐరోపా దేశాల ఆహారపదార్థాల తాలూకు రంగులు, సువాసనలతో, సందడి చేస్తూ ఆ వీధంతా జిహ్వాకు ఆనందం కలిగిస్తూ, ఉవ్విళ్ళూరిస్తూ ఉంటుంది. అక్కడున్న కొన్ని బార్‌లు, రెస్టారెంట్లు, మామూలు కంటె ఖరీదుగా ఉన్నా, హుషారు కలిగించే అక్కడి వాతావరణం కోసం స్థానికులు ఇక్కడికే వస్తారని వోల్ఫీ చెప్పాడు. అక్కడి నుండి, జోట్టర్ అనే చాక్లెట్ షాపులోకి దారి తీశాడు వోల్ఫీ. జోట్టర్ అనేది దాని సంస్థాపకుని పేరేనట. చాక్లెట్ తయారీ కోసం ఇక్కడ వాడే పదార్థాలన్నీ న్యాయసమ్మతమైన వాణిజ్యం ప్రకారమే రప్పించబడతాయట. సరి కొత్త రుచులకోసం, రకరకాల పదార్థాలను కలిపే ప్రయోగాల ఫలితంగా ఈ చాక్లెట్ ఈ నాడు ఆ దేశానికొక గుర్తింపు నిచ్చింది. చీజ్, అగావే అనే చెట్టు నుండి తీయబడే టెక్విలా అనే ఆల్కహాలు మేపుల్ చెట్ల నుండి తీయబడే సిరప్, ఉప్పు, నిమ్మ రసం, రాస్ప్ బెర్రీ, కొబ్బరి, ట్రౌట్ అనబడే చేప మొదలైనవి ఇక్కడ ఎక్కువగా వాడబడే పదార్థాలు. అక్కడ కొన్ని చాక్లెట్లను రుచి చూసిన తరువాత, ఉప్పు నిమ్మరసం కలయికతో ఉన్న ఒక చిన్న చాక్లెట్ కొన్నాను. అక్కడి నుండి వోల్ఫీ నన్ను, 'హోల్‌పెన్షన్' అన బడే కెఫేకి తీసుకెళ్ళాడు. దీనిని వృత్తి బాధ్యతలనుండి విరమించుకున్న వృద్ధులు నడుపుతారు. ఇక్కడ జనాదరణ పొందిన 'టాప్‌ఫెన్‌స్ట్రుడ్'ను రుచిచూశాము. క్రీమ్ ఛీజ్, కస్టర్డ్ ఇందులో ప్రధానంగా వాడతారు. ఇక్కడున్న వారు కూడా ఎక్కువగా వయో వృద్ధులే. ఒక కప్పు కాఫీ తీసుకొని హాయిగా కాలక్షేపం చేస్తున్నారు.

అక్కడ నుండి మెట్రో రైలు మీద 16వ జిల్లాకు వెళ్ళాము. ఈ ప్రదేశానికి ఎక్కువ మంది టూరిస్టులు రారనీ, దాన్ని 'లిటిల్ ఇస్తాంబుల్' అని స్థానికులు పిలుస్తారనీ తెలియజేశాడు గైడు. అక్కడ 'ఎ హార్స్ అండ్ జిప్ఫర్' అనే

చిన్న కాకా హోటల్ లోకి దారి తీశాడు వోల్ఫీ. ఈ షాపుని కార్ల్, థామస్ అనే తండ్రీ కొడుకులు యాభై సంవత్సరాలుగా నడిపిస్తున్నారట. అక్కడ రెండే రెండు వంటకాలు తయారు చేసి అమ్ముతారు. అవి, 'క్లైన్ గౌలష్', 'క్యుమెల్‌బ్రాటెన్'. వాటిని అలా నోట్లో పెట్టుకోగానే రుచిగా ఇలా కరిగిపోయాయి. స్థానికులతో కలిసి మాట్లాడుతూ, ఆ పదార్థాలను ఆరగిస్తూ ఉంటే, 'మనం వారిలో ఒకరిమి' అనే భావన కలుగుతుంది. ఆ కాసేపు వారితో కలిసి కొన్ని క్షణాలు పంచుకొన్నాం అనే ఆనందమూ మిగులుతుంది. వోల్ఫీ సలహా మేరకు, అక్కడ 'వీజెల్‌గర్గర్' అనే స్థానిక బీర్ కూడా రుచి చూశాను. నా వరకు నాకు ఇదొక మరపురాని భోజనం. అటు తరువాత, స్థానిక మార్కెట్‌లో, టైరోల్ ప్రాంతంతో తయారయ్యే ఆస్ట్రియన్ కామెంబర్ట్, మౌంటెన్ చీజ్‌లను కూడ రుచి చూసిన అనుభవం కూడగట్టుకున్నాను.

అక్కడ నుండి ట్రాము, బస్‌ల మీద ప్రయాణించి 7వ జిల్లా చేరుకున్నాము. తన అతిథుల్ని వియన్నాలో అన్ని రకాల వాహనాల మీద ప్రయాణం చేయించి, నగరాన్ని చూపటమే కాకుండా, ఆ ప్రదేశాల ఉనికిని మనం అనుభవించేలా చేయటం వోల్ఫీ పత్యేకత. అతను మనతో ఉన్న ప్రతి క్షణం, తన నగరాన్ని మనకి మరింత చేరువ చెయ్యాలని తపిస్తాడు. తరువాత మజిలీ ఒక ఎస్‌ప్రెస్సో కాఫీ హౌసు. 1950ల నాటి వాతావరణం ఉందక్కడ. అక్కడ మేము వైన్ తీసుకొంటుండగా, అక్కడ పార్ట్ టైమ్ వెయిటర్‌గా పనిచేస్తున్న 'విల్' అనే మరో గైడ్ మా వద్దకు వస్తూ పోతూ ఎన్నో విషయాల గురించి మాట్లాడాడు. అతను వోల్ఫీకి స్నేహితుడే. ఇక్కడికి చాలా మంది కళాకారులు కూడా వస్తుంటారట. ఇవి పేరుకు కాఫీ హౌసులే కానీ, రకరకాల తినుబండారాలూ, అల్పాహారం, వైన్ కూడా దొరుకుతాయి. చివరికి మేము సెయింట్ స్టీఫెన్ కథీడ్రల్ వద్ద ఆగిపోయాం. ఇది చాలా పెద్ద భవనం. వియన్నాలో ఏ ప్రాంతం నుండైనా కన్పించేటంత ఎత్తైన శిఖరం ఉన్న భవనం. వియన్నాను ఉదారమైన, కళాత్మకమైన, ప్రశాంత ప్రదేశంగా నాకు పరిచయం చేసినందుకు, వోల్ఫీకి ధన్యవాదాలు చెపుతూ వీడ్కోలు తీసుకున్నాను.

కెఫె సెంట్రల్ వియన్నాలో, యాత్రికులకే కాకుండా, స్థానికులలో కూడ జనాకర్షణీయమైన కాఫీ హౌస్. 140 సంవత్సరాల నుండీ ఉన్న ఈ కాఫీ హౌస్‌కి కళాకారులు, కవులు, తత్త్వవేత్తలు, రాజకీయ మేధావులు వచ్చి తమ భావాలను పంచుకుంటుంటారు. ఇలా వచ్చిన వారిలో ప్రముఖంగా వినిపించే పేర్లు: ఫ్రాయిడ్; లెనిన్, ట్రాట్స్కీ, హిట్లర్, స్టాలిన్, టిటో మొదలైనవారివి. రెండు రోజులలో నేను వియన్నాని వదలిపోతున్నాను. గత మూడు రోజులలో కెఫె సెంట్రల్‌కు రాలేదు. ఏమైనా సరే రేపు ఇక్కడకు వెళ్ళాలని గట్టి నిర్ణయం తీసుకున్నాను. ఒక్కో సారి, ఒక ప్రదేశం గురించి ఎంతో విని తీరా అక్కడకు వెళ్ళాక, అంత గొప్పగా ఏమీ కనపడక నిరాశ చెందే అవకాశం ఉంది. కాని, కెఫె సెంట్రల్‌కు ఉన్న విఖ్యాతి దృష్ట్యా, నిరాశ చెందే అవకాశాలు తక్కువ. అందువలన కూడ, అక్కడకు వెళ్ళాలనే తపన ఎక్కువ యింది. మర్నాడు గ్రాండ్ ఓపేరా హౌస్ నుండి పదిహేను నిమిషాల నడక తర్వాత కెఫె సెంట్రల్ చేరుకున్నాను. దూరంనుండి చూసి, తప్పు ప్రదేశానికి వచ్చానా అనే సందేహం కలిగింది. ఆ కెఫె ముందు చాలా మంది గుమికూడి ఉన్నారు. దగ్గరకు చేరే సరికి వాళ్ళందరూ లోపలకు వెళ్ళటానికి లైనులో నిలబడ్డ వారే అని తెలిసి గుండె దడదడలాడింది. క్షణం ఆగితే ఆ క్యూ ఇంకా పొడుగయ్యే అవకాశం ఉందనిపించి, ఆలోచించకుండా వెంటనే నేను కూడా ఆ క్యూలో చేరిపోయాను. క్యూలో నా ముందు అరవై మంది ఉన్నారు. మంచి సూట్‌లో ఉన్న వ్యక్తి ఆ గేట్ వద్ద నిలబడి, లోపలికి వెళ్ళటాన్ని నియంత్రిస్తున్నాడు. పది నిముషాలలో పది మంది లోపలికి పంపబడ్డారు. ఈ లెక్కన నేను ఇంకా 50 నిముషాల పాటు ఆగాలి. బాగా చలిగా ఉంది. సరైన దుస్తులు వేసుకున్నాను కాబట్టి ఫరవాలేదు. ఈ క్యూ, ఇంతమంది వేచి ఉండటం చూస్తే, ఎలాగైనా లోపలకు వెళ్ళాలనే కోరిక పెరిగి పెద్దదయింది.



వియన్నాలో ఒక వీధి

నా వెనుక లైను కొండవీటి చాంతాడులా పెరిగిపోతూనే ఉంది. ముందు మాత్రం పెద్ద కదలిక లేదు. ఎందుకో ఆ లైనులో ఉన్న వాళ్ళందరూ విదేశీ యాత్రికులే అయి ఉంటారని నాకనిపించింది. ఇరవై నిముషాల తర్వాత చిన్న తుంపర మొదలైంది. వర్షం పడినా నాకు ఇబ్బంది లేదు. కాని తడుస్తున్నా సరే ఎవరూ క్యూ వదలి వెళ్ళకపోవటం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఆ తర్వాత ఇరవై నిముషాలకి నేను హాయిగా లోపలకి వెళ్ళి, కూర్చొన్నాను. బయట అంత రద్దీగా ఉన్నా, లోపల ప్రశాంతంగాఉంది. లోపలి నిర్మాణం, ద్వారబంధాల వద్ద క్రమానులతో (ఆర్చిలు), స్తంభాలతో కూడి ఉంది. అవన్నీ వంద సంవత్సరాల నాడు కూడ ఇలాగే ఉండి ఉంటాయి. అది డిన్నర్ సమయం కాబట్టి, వీనర్ స్నిడ్జల్ రుచి చూడాలనుకున్నాను.. హైదరాబాద్‌కు బిర్యానీ, ఇంగ్లండ్‌లో ఫిష్, ఛిప్స్, ఎలాగో...వియన్నాకు వీనర్ స్నిడ్జల్ అలా. దానిని రుచి చూడకుండా తిరిగి రాలేము. వీనర్ స్నిడ్జల్ జర్మన్ పదం. దీని అర్థం వియన్నా కట్లెట్ అని. ఒక పలచటి లేత మాంసపు ముక్కను, ఎండబెట్టిన బ్రెడ్‌ముక్కల పొడితో కప్పి, వేయించి దీనిని తయారు చేస్తారు. ఇది చాలా రుచిగా ఉండి, పొట్ట ఇట్టే నింపేస్తుంది.

చివరి రోజున నాకు ఇంకా రెండు గంటల సమయం మిగిలింది. నా 72 గంటల ఉభాన్ (మెట్రో) టికెట్ ఇంకా కొంచెం సేపు చెల్లుతుంది. ఎయిర్‌పోర్టుకి వెళ్ళే స్టేషన్‌కు వెళ్ళే దారిలో రాతౌస్ అనే స్టేషన్ కనిపించింది. 19 సంవత్సరాల క్రితం నేను ఇక్కడికి వచ్చినప్పుడు, ఆ స్టేషన్ నాకు తెలుసు. ఒక సాయంత్రం, నా భార్య, నేను రాతౌస్ సెల్లార్‌లో డిన్నర్ చేస్తుండగా, సాంప్రదాయ సంగీత కచేరీ కూడా అక్కడ జరిగింది. అది గుర్తు వచ్చిన వెంటనే, మరొక్కసారి ఈ పరిసరాల్ని, ఆ జ్ఞాపకాలను తడిమి చూసుకోవాలనిపించి ఆ స్టేషన్‌లో దిగిపోయాను. అక్కడున్న రాతౌస్ కెఫె చూడగానే, ఉదయం నుండీ ఏమీ తినలేదని గుర్తొచ్చింది. దీనిని 1827వ సంవత్సరంలో నిర్మించారట. ఈ బోర్డు చూడగానే ఇక ఆగదలచుకోలేదు. లోపల కొద్దిమంది తీరికగా వార్తా పత్రికలు చదువుకుంటూ ఉదయపు అల్పాహారం చేస్తున్నారు. రోడ్డువైపుకు విశాలమైన పెద్ద కిటికీలు, వాటికి ఎదురుగా ఉన్న గోడ పొడవునా పెద్ద అద్దాలు, గోడల మీద పాత ఫోటోలు ఉన్నాయి. నాలుగైదు రకాల బ్రేక్‌ఫాస్టులు పరిశీలించిన తరువాత సాల్మన్ (ఒక రకమైన చేప) తెమ్మని చెప్పాను. దీని ధర మిగిలిన వాటి కన్నా రెండు యూరోలు ఎక్కువ. పది నిముషాల తర్వాత వచ్చిన నా ఉపాహారం చూసి నమ్మలేకపోయాను. ఒక దీర్ఘచతురస్రాకారపు పళ్ళెం నిండుగా సన్నని పొగమీద వండిన సాల్మన్ చేప ముక్కలను కొంచెం మిరియాల రుచితో ఉండే రాకెట్ అనే ఆకుల సలాడ్‌తో సహా తీసుకొచ్చింది. తీరికగా నా ఉపాహారాన్ని, వియన్నా కాఫీతో ముగించాను.

రాతౌస్ స్టేషన్ భవనం చాలా విలక్షణంగా ఉంది. దాని ముందు భాగం పునరుద్ధణ జరుగుతోంది. అందు వలన ఇంకా సరిగ్గా చూడటం కుదరలేదు. అక్కడి నుండి బయలుదేరి 'వీన్ మిట్టే' స్టేషన్ చేరుకొన్నాను. అక్కడ నుండి 16 నిముషాల్లో ఎయిర్‌పోర్టుకి చేర్చింది అతివేగమైన రైలు. ఎయిర్‌పోర్టుకి నిదానంగా పాసింజర్ రైల్లో వెళితే అర గంట పడుతుంది. సగం ధరకే టిక్కెట్ దొరుకుతుంది. 72 గంటల మెట్రో టిక్కెట్ తీసుకోవటం వలన నాకు టాక్సీలపై తిరగనవసరం లేకుండా పోయింది. వియన్నాలో అసలు రైలు టిక్కెట్ల తనిఖీ ఎప్పుడో ఒకసారి కాని జరగదట. అలాగని టిక్కెట్ కొనకుండా ఎవరూ ఉండరు. అంతా నిజాయితీ, నమ్మకాల మీదే నడుస్తుంది. వియన్నా అత్యంత నాగరిక నగరమని చెప్పటానికి ఇక్కడి ప్రజలకున్న సులభమైన రవాణా సౌకర్యం చాలు. ఈ నగరం మళ్ళీ మళ్ళీ 'నివసించటానికి' నెంబర్ వన్ నగరంగా ప్రకటించ బడుతున్న కారణాలలో ఇది ముఖ్యమైనదేమో.

ఇక్కడ ఉన్న అయిదు రోజులలో ఒక రోజు నేను ఫ్రాయిడ్ 'మానసిక విశ్లేషణ' సాధన చేసిన అతని ఇల్లు, ఆసుపత్రిని కూడ చూసి వచ్చాను. అది ఇప్పుడు జనసామాన్యం దర్శించుకోగలిగే మ్యూజియమ్. సిగ్మండ్ ఫ్రాయిడ్ గురించి చెప్పకుండా, వియన్నా గురించి వ్రాయటం పూర్తి కాదు కనుక ఆ విషయాలన్నీ మరొక సారి.

మి

**ఇంగ్లీషు మూలం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)**
e-mail: srnimmagadda@googlemail.com
**అనువాదం : జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)**

# రాజస్థాన్ కోటలు
# చిత్తౌ డ్ గఢ్

***- యన్. లక్ష్మీ అయ్యర్***

**చి**త్తౌడ్ గఢ్ రాజస్థాన్ యొక్క అత్యంత సుందరమైన కోటల రాజధానులలో ఒకటి. దాని పేరులోనే గఢ్ అంటే కోట లేదా దుర్గము అని అర్థము ఇమిడి వున్నది సుమారు 10850 వర్గ కిలోమీటర్ సముద్రపు మట్టానికి 394 మీటర్ల దూరంలో చరిత్ర కారులకు ,రారాజులకు స్త్రీల శీలానికి ప్రతీకగా కొన్ని వేల సంవత్సరాల నుండి ఈ నాటి వరకు రాజపూత రాజుల శౌర్యానికీ ,వీరానికి రాజస దర్పానికి ప్రతీకగా నిలబడి ఉంది . చిత్తౌ డ్ గఢ్ యొక్క ఎల్లలు ఉత్తరాన బీల్ వాడ జిల్లా. ఉత్తర తూర్పున బూంది జిల్లా దక్షిణములో ప్రతాప్ గడ్ జిల్లా పశ్చిమంలో ఉదయపూర్ జిల్లా ఉత్తరంలో రాజస మండ్ జిల్లాలు వున్నాయి. ఈ కోట రాజపూత వీరుల సాహసగాథలతో ఇతర వాస్తు కళా నైపుణ్యంతో దేశానికి ముప్పు తెచ్చిన విదేశీ ముసల్మాను తరిమి కొట్టి ప్రాణ బలి ఇచ్చిన దేశ భక్తుల తత్పరత. తమ తమ శీలాలను అత్యాచారి కామాంధులైన అల్లావుద్దీన్ ఖిల్జీ అక్బర్ బహదూర్షా వంటి వాళ్ళ నుండి చారిత్రక స్థలంలోని పవిత్రత అన్నిటికీ మూలమై నిలబడి ఉంది ఇక్కడ కోటలోని వాస్తు కళా అత్యంత నైపుణ్యంగా మలచిన చిత్రాలతో మందిరాలతో జలాశయాలతో దర్శనమిస్తాయి. చిత్తౌ డ్ గఢ్ విజయ స్తంభ కోట కీర్తి స్తంభ కోట. రాణా కుంభ మహల్ గోముఖ జలాశయము ఇవన్నీ ముఖ్యమైన చాలా గొప్ప దర్శనీయ స్థలాలు. విజయ స్తంభం అనేది టవర్ మా ల్ వా సుల్తాన్‌ను ఓడించి మహారాణా కుంభ గారు దీన్ని నిర్మించి తన విజయ స్తంభాన్ని నాటుకొని మొగల్‌లో పై తన విజయానికి గుర్తుగా ఉంచుకున్నారు. ఇది తొమ్మిది మేడలతో కూడి ఉన్న అతి సుందరమైన శిల్పాలతో చెక్కిన భవనము. ఇక కీర్తి స్తంభానికి వస్తే అది కూడా లోపల ఒక పెద్ద స్థూపంలాగా పొడుగ్గా ఉంటుంది. జైన వాస్తు కళా నైపుణ్యంతో నిర్మించబడి ఉంది. రాణా కుంభ మహల్ అనేది మేవాడ్ ప్రాంతం యొక్క శాసకుడు నిర్మించినది. చాలా అందమైన భవన ప్రాంగణంతో ఉండి వాస్తు శిల్ప కళలకు చమత్కారానికి ప్రత్యేకతగా రాణింప బడుతున్నది. రాణి పద్మిని మహల్ అనేది రాజపూత రాజుల వాస్తు సౌందర్యానికి ప్రతీక .

**రాణి పద్మిని మరియు కావ్యం :** హిందీ భక్త సాహిత్యంలో మలిక్ మొహమ్మద్ జాయసీ అనబడే సూఫీ కవి ద్వారా రచింపబడ్డ చారిత్రాత్మక ప్రేమ కావ్యం “పద్మావత్ హిందీ నిర్గుణ కవులైన జ్ఞాన మార్గపు కవులు ప్రేమ మార్గపు కవులలో జ్ఞాన మార్గ పు కవులు ఆత్మను స్త్రీగా పరమాత్ముని పురుషునిగా స్వీకరించి విశుద్ధ భారతీయ తాత్వికతో మోక్షాన్ని సాధించారు . ఇక రెండవ తెగ అయిన సూఫీలు భారత దేశపు పురాణాలలో వున్న ప్రేమ కథలను (నలదమయంతి, ఉష అని రుధ్ లాంటివి) వాటిని తమదైన ఫారసీ మసనవీ శైలిలో తమ కావ్యాన్ని అల్లారు. ఈ కావ్యాలలో నాయిక పరమాత్మకు ప్రతీక . నాయకుడు ఆత్మ. ఆత్మ పరమాత్మను వెంటాడుతూ వెళ్ళి కలుస్తుంది. పద్మావత్ కావ్యాన్ని కవి అతి సుందరంగా చిత్తౌ డ్ గఢ్ రాజధానిలో జరిగిన కావ్యాన్ని చారిత్రాత్మక విశేషాలతో కల్పనలతో జయసి వర్ణించారు .

**కావ్య వర్ణన :** చిత్తౌ డ్ గఢ్ కు చెందిన రాజు రతన్ సేన్ తన భార్య నాగమతితో రాజ్యాన్ని పరిపాలించేటపుడు సింహళ ద్వీపానికి చెందిన రాజ కుమారి పద్మావతి పెంపుడు చిలకను ఓ బ్రాహ్మణుడు కొని చిత్తౌడ్ గఢ్ రాజుకు తెచ్చి అమ్ముతాడు. ఓ నాడు రాజు లేని సమయాన రాణి నాగమతి చిలకతో “నా కంటే సౌందర్యవతి స్త్రీ ఈ లోకమున ఉందా? అని అడుగుతుంది. దానికి చిలుక “మీదీ ఓ సౌందర్యమా? మా సింహళ రాజ కుమారి సౌందర్యం ముందు ఎవరూ సాటి రారు” అని చెబుతుంది. అది విని చిలుకను చంపివేయమని నాగామతి తన చెలితో చుబుతుంది. కానీ మాట్లాడే చిలుకను చెలి దాచి పెడుతుంది. ఓ నాడు రాజుగారు చిలుకను తెమ్మని చెప్పి పద్మావతి అందచందాలు విని తన సైన్యంతో జోగుల వేషంతో సింహళం వెళ్లి ఆ రాజును ఒప్పించి ఆయన కూతురు పద్మావతిని వివాహమాడి చిత్తౌ డ్ గఢ్ కు తీసుకు వస్తాడు. అప్పటినుండి అసలు కథ మొదలవుతుంది.

అల్లవుద్దేన్ ఖిల్జీ చిత్తౌ డ్ గఢ్ కు అతిథిగా వస్తాడు. రాజా రతన్ సేన్ అతనికి అన్ని మర్యాదలు చేసి సాగానంపుతాడు. పోయే ముందు నీ రాణిని చూపించు అని అడుగుతాడు ఆ దుష్టుడు. రాజపూత స్త్రీలు ఇతరుల ముందుకు రారు అని చెప్పి కోటా పై గల ఓ పెద్ద దర్పణం ద్వారా క్రింద కొలనులో ప్రతిబింబం పడేలా పద్మావతిని చూపిస్తాడు రాజు. తర్వాత ఖిల్జీ వెళ్ళి యుద్ధం ప్రకటించడం రతన్ సేన్‌ను బంది చేయడం, సమయ స్ఫూర్తితో తన భర్తను విడిపించడం జరుగుతుంది. తర్వాత ఆ దుష్టుడు పగబట్టి దండెత్తి రతన్ సేన్ ను ఖైదీగా పట్టుకొని తన కామానికి లొంగమని చిత్తౌ డ్ గఢ్ కు సందేశం పంపిస్తాడు. అది విని పద్మావతి వాడికి బదులు ఉత్తరం పంపిస్తుంది" చిత్తౌ డ్ గఢ్ స్త్రీల బూడిదను కూడా తాకే అర్హత నీకు లేదని! తన సమస్త సేనాధిపతులను కోటకు నాలుగు వైపులా కాపలా పెట్టి పదహారు వేల స్త్రీలతో సహా ఆ సాధ్వి జోహార కొనడంలో దూకి తన 27వ ఏటనే అగ్నికి ఆహుతి అయిన కన్నీటి గాథ చిత్తౌ డ్ గఢ్ జోహార్ కుండ్ మనకు ఈ రోజు చెబుతుంది. ఇది రాసినా ఆ కోటను చూసినా కన్నీళ్ళు ఆగవు. అందుకే పద్మావత్ కావ్యానికి చిత్తౌ డ్ గఢ్ కు ఓ జన్మ జన్మల అవినాభావ సంబంధం వుంది. పద్మావతి దక్షిణ భారత దేశపు రాజ కుమారి కావడం ఇంకో విశేషం. ఇప్పుడూ పద్మావతి మహల్, ఆమె దర్పణం, జోహార్ కుండ్ కాలానికి సాక్షిగా దర్శన మిస్తాయి.



చిత్తౌ డ్ గఢ్

ఇక రెండవ ప్రాముఖ్యత శ్రీ కృష్ణ భక్త మీరా మెట్టింటి వాళ్ళు ఈ చిత్తౌ డ్ గఢ్‌లోనే వుండి పరిపాలించారు. 15వ శతాబ్దిలో మీరా వివాహమయి రావడం ఈ కోటా పక్కన వున్న కులదేవి మందిరానికి పోమని చెప్పినపుడు కృష్ణుడు తప్ప ఎవరూ తనకు కులదేవి లేరని మీరా చెప్పిన గుడి, రాణా భోజ రాజ్ తన భార్యకి కట్టించిన కృష్ణ మందిరము, మీరా మరిది రాణా విక్రమాదిత్యుడు మీరాను సాంప్రదాయాలకు ధిక్కరించిందని మీరాను రకరకాలుగా హింసించి శూల్ సెజ్ (ముల్లుతో చేసిన పడక) ఇలాంటి వన్నీ ఇక్కడ చూడ వచ్చు. రాణాప్రతాప్ అక్బర్ ను తరిమి కొట్టి చిత్తౌ డ్ గఢ్‌ను కాపాడిన వీరోచిత కావ్యాలు ఇక్కడ ఈ రోజు వినబడుతుంది. అదేలాగ మీరా మందిర్ శ్రీకృష్ణ కవి భక్త మీరా యొక్క సమర్పణము భగవంతుని పై ఆవిడ భక్తీ, సేవలు దానికి గుర్తుగా ధార్మికతో కూడిన మందిరములు గోముఖ జలాశయం అనేది చిత్తౌ డ్ గఢ్ కోట లోపల ఉన్న జలాశయము ఇవన్ని జలాశయాలకు మూలంగా నిలబడి ఉంది. చిత్తౌ డ్ గఢ్ రాజస్థాన్ వీరుల యొక్క సనాతన హిందుత్వానికి, విదేశీ ముసల్మానుల చవక బారు రసికత్వానికి బలికాకుండా 16000 మంది స్త్రీలు జోహార్ కుండ్‌లో దూకి తమ స్త్రీత్వాన్ని రక్షించుకున్న అత్యంత సమర్పణమైన శీలాన్ని కాపాడు కునేందుకై అగ్నికి ఆహుతియైన పవిత్ర నగరంగా భావింప బడింది చిత్తౌ డ్ గఢ్. ఎంతోమంది ఈ దుర్భేద్య కోటను చుట్టుముట్టారు, కొట్లా డారు, ఎన్నో కొట్లాటలు జరిగాయి. 1335లో గుజరాత్ బహదూర్ షా ఈ కోటను చుట్టుముట్టి కొట్లాటలతో జరిగిన యుద్ధాలు ప్రముఖ మైనవి. రాణి పద్మావతి తన శీల రక్షణానికి అల్లావుద్దీన్ ఖిల్జీ యొక్క కామ వాంఛకు లోబడకుండా తనను తాను అగ్ని సమాధి అయిన పవిత్రమైన కో చిత్తౌ డ్ గఢ్ రాణి పద్మిని తర్వాత మహారాణా ప్రతాప్ గారి సంరక్షణలో సాహసంగా వీరంగా ఆ కోటి ఎదిగింది. కొంతమంది చిత్తౌ డ్ గఢ్ 8వ శతాబ్దికి చెందిన మౌర్య రాజకుమారుడు చిత్రాంగదుడు నిర్మించాడని చెప్తున్నారు కానీ ఇంకా కొంతమంది ఏడవ శతాబ్దిలో గడిసి సోదియా అనే రాజవంశానికి మేవాడు సామ్రాజ్యానికి రాజధాని భప్పా రావల్ అనే రాజపుత్ర యోధుడు శాసకుడు దీన్ని

పరిపాలించాడని చెప్పబడుచున్నది. ఏది ఏమైనా చిత్తౌ డ్ గఢ్ అన్నప్పుడే గుర్తుకు వచ్చేవి మూడే విషయాలు ఆ కోటలో తనను తాను సమర్పించుకొని అగ్నికి బలి అయిన మహాసాధ్వి ఇల్లాలు పద్మావతి మరియు శ్రీ కృష్ణ భక్తిలో తనను తాను చేర్చుకున్న మీరాబాయి వీరత్వానికి నాంది పలుకుతున్న రాణా ప్రతాప్ సింగ్ ఈ ముగ్గురు లేకుండా చరిత్ర చిత్తౌ డ్ గఢ్ లేనిది అనేది సాక్షానికి ఆధారాలకు సంబంధించిన విషయము.

సుమారు 2500 సంవత్సరాల నుండి చిత్తౌ డ్ గఢ్‌లో అకోలా ప్రింట్ సాడి డ్రెస్ మెటీరియల్ చాలా ప్రముఖము. చిత్తౌ డ్ గఢ్ – ఉదయపూర్ యొక్క మధ్యలో దబ్బు పెయింటింగ్స్ అనబడే ఎడారి క్షేత్రములో ఇవి తయారవ్వబడుతున్నాయి పారంపర్యంగా సాంప్రదాయ కంగా ఇక్కడ ఉండే అక్కోలా ప్రింట్‌కు ఎప్పుడు డిమాండ్ ఉంటుంది. ప్రకృతికి సంబంధించిన బొమ్మలు మన్ను ఇండిగో రంగు అనబడే నీలాన్ని కలిపి చిన్న చిన్న చెక్కలపై వీటిని పూసి బ్లాక్లు తయారు చేస్తారు వీటిలో కఃమా లాల్ తిత్రి డోలిక కాంతేదర్ మొదలగుని ప్రసిద్ధము ఇలాంటి చీరలు ఇక్కడ ఉన్న చిప్ప అనే పేరుగల సముదాయం వాళ్ళు తయారు చేస్తారు ఈ సముదాయం వాళ్లు ఈ చీరలు ఇలాంటి వస్త్రాలు వేయడంలో నేర్పరి దాన్ని చాలా ఇష్టపడి ఇక్కడ ఉండే జాట్ సమూహం ధరిస్తుంది చిత్తౌ డ్ గఢ్ ఒక కోట మాత్రమే కాదు అందులో ఎన్నో వేల స్త్రీల ఆత్మల కహానీలు దాగి ఉన్నాయి, మొత్తం మూడుసార్లు ఇక్కడ జోహార్ కుండ్‌లో ఆత్మ బలిదానం చేసుకున్నారు. భారతదేశంలోనే ఎక్కడా ఇలాంటి జోహార్ కుండ్ అన్న మాత కూడా ఎవరికీ తెలియదు. మొదటి జోహార్ రాజ రతన్ సేన్ యొక్క శాసనకాలంలో అల్లావుద్దీన్ ఖిల్జీ యొక్క ఆక్రమణ సమయంలో 1330లో రాణి పద్మిని యొక్క నేతృత్వంలో సుమారు 16 వేల మంది స్త్రీలు ఈ జోహార్ కుండ్ లో దుముకి అగ్నికి ఆహుతి అయ్యారు. ఇక రెండవ జోహార్ రాణా విక్రమాదిత్య శాసన కాలంలో 1534లో గుజరాత్ యొక్క శాసకుడు బహదూర్ష ఆక్రమించినప్పుడు రాణి కర్ణవతి తన చెలులతో సహా ఎనిమిది మార్చి 1534లో అగ్నికి ఆహుతి అయ్యారు ఇక మూడవ జోహార్ అక్బర్ యొక్క ఆక్రమణ వల్ల 25 ఫిబ్రవరి 1568లో ప్రతాప్ సోది యొక్క ధర్మపత్ని రాణి ఫుల్ కంవర్ దేవి నేతృత్వంలో ఎంతోమంది స్త్రీలు జోహార్ కుండ్‌లో దుమికి అగ్నికి ఆహుతి అయ్యారు. ఇలా చిత్తౌడ్ గఢ్ వీరానికి సాహసానికి స్త్రీత్వానికి ఒక సాటి లేని మేటి రాయిలా ఇప్పటివరకు నిలబడి ఉంది.

18 జూన్ 1576లో మేవాడ్ మొగలుల మధ్య హిందూ శిరోమణి మేవాడ్ సూర్యుడ యిన మహా రాణా ప్రతాప్ నేతృత్వంలో హల్దీ ఘాటీ అన్న చోట జరిగిన యుద్ధం అత్యంత ప్రసిద్ధ. అక్బర్ రాణా ప్రతాప్ తో పోరు సల్పక ఎన్నో సార్లు మొగలులతో చేయి కలపమని హిత భోధ చేస్తూ వచ్చాడు. కానీ రాణా ప్రతాప్ స్వీకరించలేదు. ఆమేర్ రాజు మాన్ సింగ్ అసఫ్ ఖాన్ ఈ ఇద్దరు మొగలులకు నేతృత్వం వహించి మేవాడ్ సూర్యుడ యిన రాణా ప్రతాప్‌తో పోరుకు తలపడ్డారు. కేవలం 3000 మంది అశ్వా రూఢులు,400 వందల భీల్ ఆటవిక జాతి జనాల సహాయంతో యుద్ధం చేసి మొగలులను తరిమి కొట్టిన రా రాజు ఆ హల్దీ ఘాటీలో తన గుర్రాన్ని చేతక్‌ను పోగొట్టుకొని దానికై స్మారకాన్ని నిర్మించి ప్రేమ గుర్తుగా ఈ నాటి వరకు మిగిల్చా డు ప్రతాప్. ప్రతాప్ పేరు వింటేనే మొగలుల తల దిమ్మ తిరుగుతుంది అన్న సామెత కూడా ఇక్కడ వుంది. ఆ హల్దీ ఘాటీ లో ఈ నాడు కూడా ఇసుక పసుపుగా కొండ గుట్టల్లో కనబడుతుంది. సుమారు 17000 మంది రక్తంతో తడిసిన భూమి గా పేరొందింది. చిత్తౌ డ్ గఢ్ చూడాలంటే కనీసం 10 రోజులన్నా కావాలి. లోకంలో పుట్టాం తిన్నాం చచ్చాం అని జీవించడం కంటే మాతృదేశానికై ప్రాణాలిచ్చాము మేము అని చెప్పకనే చెబుతాయి ఈ కోటలు. చిత్తౌ డ్ గఢ్ లోని ముఖ్యమైన నదులు గంభీరి. చంబల్ బనాస్, బేదచ్, బ్రాహ్మణి .... ఈ కోట అన్ని కోటల కంటే తలమానికమైన పెద్దకోటగా పిలవబడుతున్నది. ఈ ప్రదేశాన్ని చూడాలే కానీ వర్ణన చేయడం అసంభవం. రాజస్థాన్ తన వీరానికి సాహసానికి త్యాగాలకు మాతృభూమి పరి రక్షణకై అప్పటి నుండి ఇప్పటి వరకు తనకెదురు లేకుండా రాజసంతో తన కీర్తిని నియబెట్టుకుంటూ వస్తున్నది.

ప్రొ. లక్ష్మీ అయ్యర్
జైపూర్, రాజస్థాన్, ఫోన్ : 9680276038

### చిత్రగీతాలు
# హిందూస్థానీ బాణీలు

– ఎమ్. పురుషోత్తమాచార్య




నా మది పాడిన

చిత్రం : పవిత్రహృదయాలు (1971)
రచన : సి.నారాయణరెడ్డి
సంగీతం : టి.చలపతిరావు
గానం : ఘంటసాల

పట్‌దీప్–తీన్‌తాల్

*నా మది పాడిన ఈ వేళలో*
*నవజీవనవాహిని పొంగెనులే* ॥నా॥
1. *కోయిల గొంతున కొసరే రాగం*
*కొండవాగులో కులికే రాగం*
*వేలికొసలలో నటియించగా నా* ॥వేలి॥
*నీలాల గగనాలు నినదించవా* ॥నా॥
2. *మీరా బ్రతుకున నిండిన రాగం*
*రాధ మనసులో పండిన రాగం*
*నా రసగీతికి ప్రాణము కాగా*
*నాదాల వేదాలు పలికించనా* ॥నా॥

*స్వరం: 1. సా, సాసనిస గగరిస నిసదప*
*,గామపా,గామపా,గామపా* ॥నా॥
*2. పాపాపాపా ,గగగగారిస నీనీ*
*పనిసగా పనిసమా సగమప గామప*
*గామప* ॥నా॥
*3. నీనీ నినినిని దపగా నిదపగా దపగా*
*మగసనీ* ॥నా॥

చిత్రంలో కథానాయకుడు సితార్ కచేరీ చేస్తూ గాత్రంతో పాడతాడు. ఈ ఆచారం సినిమావారిదే కాని, నిజజీవితంలో వాద్యసంగీతకచేరీ చేసే ఏ కళాకారులూ నోరు విప్పి పాడరు. ఎందుకంటే,గాత్రధర్మం వేరు,వాద్యధర్మం వేరు. అయితే ఇది సినిమా. అంతే.... 'పూజాఫలం' లో కథానాయకుడు వయొలిన్ విద్వాంసుడైనా,వాయించాడే కాని,పాడుతూ వాయించలేదు. జమున పియానోను కార్డేషన్ చేస్తూ ఆలపించినట్లు చూపారు. 'సీతారామకల్యాణం','భూకైలాస్' లలో రావణపాత్రధారి వీణ వాయిస్తూండగా మండోదరి పాడినట్లు చూపారు. అదీ ఆ దర్శకుల సదవగాహన. 'భార్యాభర్తలు, మురళీకృష్ణ, చక్రవాకం, అమాయకురాలు, విచిత్రదాంపత్యం, డా॥చక్రవర్తి మొదలైన బహుళచిత్రాలలో వాయిస్తూ పాడినట్లుగానే చిత్రించారు. దానికి మనమంతా అలవాటుపడిపోయాం. అంతే.....

సినారె కలానికి రెండు మొనలుంటాయి. ఒకటి చిగురుదనం, మరొకటి కరకుదనం. అంగారాన్ని, శృంగారాన్ని మనోహరంగా మలచిచెప్పడంలో ఆయన దిట్ట. ఇదే లక్షణం దాశరథిలో కూడా కనిపిస్తుంది. 'ఇద్దరుమిత్రులు' కదా! వారి మాట,పాట,బాట ఒకే తీరుగా ధ్వనించడం విశేషం. ఆనందంగా పాడుతున్న సన్నివేశం కనుక 'జీవనవాహిని పొంగెనులే' అన్నారు. సితార్ వాయిస్తున్న వేళ్ల అంచుల్లో కోయిలపాట,కొండవాగు రాగాలు పలుకుతున్నాయిట. ఆ స్వరాలు ఆకాశమంతటా ధ్వనిస్తున్నాయట. ఎంత మంచి భావుకతను పాటలో నింపారో కదా! మీరా జీవనగీతం,రాధ హృదయరాగం రెండూ కలిసి కథానాయకుని సంగీతానికి ప్రాణం పోసాయట. తద్వారా నాదాలు వేదాలై నినదించాయిట.

యతిప్రాసలతో పాట రాయడం ప్రయత్నం వల్ల వచ్చింది కాదాయనకు. అలవోకగా అవే వచ్చి పాటలో కుదురుకుంటాయి. అదే జరిగింది ఈ పాటలో. ఏ రచనకైనా,కావ్యానికైనా ఔచిత్యమనేది ప్రాణంగా ఉండాలంటారు క్షేమేంద్రాది లాక్షణికులు. కోయిల గొంతులో రాగం కొసరుతుందట. 'కొసరడం' పదం ఎంతో ఔచిత్యవంతంగా ఉంది. ఏదీ మరోసారి పాడు అని అడగడవే కొసరడం. అది కోయిల స్వభావం. అడిగించుకుని మరీ పాడుతుంది కోయిల. కొండవాగు "కులుకుతుంది". అవును,ఎన్నో వంకలతో మెలిదిరిగి ప్రవహించే వాగుకు ఆ కులుకే ఒక సింగారం. దాని చప్పుడే ఒక లయబద్ధగీతం. ఎక్కడ,ఏ సందర్భంలో,ఏ పదం వాడాలో ఖచ్చితంగా తెలిసినవారే సాహిత్యస్థితప్రజ్ఞులు. ఇది మనకు పోతనగారి వారసత్వంగా సంక్రమించిన ఒక విలక్షణ లక్షణం. సినారె లో ఈ లక్షణం సంపూర్ణంగా కనిపిస్తుంది. తాతినేని చలపతిరావుగారు ఈ పాటను పట్‌దీప్ రాగంలో స్వరపరచారు. తీన్‌తాల్‌ను సాహిత్యానికి పొదిగిన తీరు ఎంతో చాతుర్యాన్ని ప్రకటిస్తుంది. పట్‌దీప్ రాగం కాఫీథాట్‌కు చెందినదని కొందరు చెబుతారు. కాని కాఫీరాగంలో ఉన్న కోమల్ నిషాద్ బదులు ఈ రాగంలో శుద్ధ్‌నిషాద్ పలుకుతుంది. అయితే, కర్ణాటకసంగీతంలోని

'గౌరీమనోహరి' రాగలక్షణాలు కలిగిన థాట్ హిందూస్తానీలో లేకపోవడం వలన శుద్ధనిషాద్‌ను అన్యస్వరంగా చెప్పి ఈ పట్‌దీప్‌తో అనుసంధించారని కొంతమంది విద్వాంసులు భావిస్తున్నారు. మరికొంత మంది సంగీతజ్ఞులు ఈ రెండు నిషాద్‌లను పట్‌దీప్‌లో ప్రయోగిస్తారని చెబుతున్నారు.

ఆరో : నిసగమపనిసా

అవ : సనిదపమగరిసనీసగరిస

'కుమారి గౌరి' అనే దీక్షితార్ కృతి;'శంకరావల్కి' అనే వేంకటమఖి గీతం;'సంచారి చతురశ్ర' అనే సుబ్బారాయ దీక్షితార్ కృతి ఎంతో ప్రసిద్ధిని పొందాయి.

సినిమాపాటలు చాలా ఉన్నాయి. కొన్ని చూద్దాం.

1. కన్నుల దాగిన అనురాగం........రంగులరాట్నం
2. ఎవరో రావాలి ఈ వీణను.........ప్రేమ్‌నగర్
3. మధురం మధురం ఈ సమయం.....భార్యాభర్తలు
4. నీ జిలుగుపైట నీడలోన.............పూలరంగడు
5. వెన్నెల్లో గోదారి......................సితార

ప్రారంభంలో మిట్టా జనార్దన్ గారి 'తరబ్' తో సమ్మోహనకరంగా చిన్నపాటి రాగాలాప్‌ను అందించింది. తరువాత మాస్టారు అస్థాయిని ప్రారంభించారు. 'నీనిస దాపప' అంటూ శుద్ధనిషాద్ నుండి 'వేళలో' పదంలోని 'ళ' అక్షరం మీద తబల 'తిరికిట దీం' తో ప్రవేశించింది. అసాధారణంగా అస్థాయిని మూడు అక్షరాల జాగా వదిలి ఎత్తుకున్నారు. కనుక 'లో' నుంచి నడక సమంగా నడిచింది. 'పొంగెనులే' పదాన్ని చిన్న గమకంతో 'పొంగిన' భావాన్ని మాస్టారు పలికించారు. రెండోసారికి 'నా మది' ని మూడవ అక్షరం మీది నుండే ఎత్తుకున్నారు. 'ఈ వేళలో' తరువాత శుద్ధనిషాద్ నుండే సితార్ బిట్టును క్లుప్తంగా ఆర ఆవర్తంలో ఇచ్చారు. వెంటనే ఒక అక్షరం వదిలి మొదటి అంతరా 'కోయిల గొంతున' అంటూ గంధార్ మీద ప్రారంభించారు. మొదటి రెండు పాదాలను రెండుసార్లు పాడుతూ 'కులికే రాగం' దగ్గర కమ్మని అనుస్వరాన్ని వినిపించారు. 'నినదించనా' తరువాత 'మపనిద పమగమపా' అనే సంపుటిని పాడి రాగసౌందర్యాన్ని ప్రకటించారు. దీని తరువాత అస్థాయిని ఎత్తుకుని 'నామది నామది' అని రెండుసార్లు పాడి తాళాక్షరాలను జాగ్రత్తగా పొదివి పట్టుకున్నారు. ఈ అంతరాను పాడుతున్నప్పుడు తబలాపై 'పంజాబీఅద్దా' పద్ధతిని వినిపించారు.

వెంటనే అర ఆవర్తం నుండి సితార్ బిట్ ప్రారంభమైంది. మధ్యమధ్య వయొలిన్స్ బిట్స్‌ను కలుపుకుంటూ నాలుగు ఆవర్తాలలో బిట్‌వర్క్‌ను వినిపించారు. పంచమ్ దగ్గర ఆ బిట్‌ను ముగించారు. తరువాత మొదటి అంతరా వలెనే 'మీరా బ్రతుకున' అనే రెండవ అంతరాను ఒక అక్షరం వదిలి అదే గంధార్ నుండి అందుకున్నారు. ఈ అంతరాను అంతా మొదటి అంతరా బాణీలోనే పాడారు. ఈ అంతరా పాడుతున్నప్పుడు తబలా భజన్‌ఠేకాతో అనుసరించింది. ఈ అంతరాలోని రెండో భాగంలో తిరిగి 'పంజాబీఅద్దా'ను వినిపించారు. తరువాత అస్థాయిని యథాతథంగా పాడాక తబల నడక వేగాన్ని కొంచెం పెంచి ఒక ఆవర్తంలో వినిపించింది. తరువాత మాస్టారు 5వ అక్షరం నుండి స్వరాలాప్‌ను ప్రారంభించి ఒకటిన్నర ఆవర్తాలలో పాడి అస్థాయిని అందుకున్నారు. పిదప మరో రకమైన స్వరసంపుటిని తీసుకుని మూడు ఆవర్తాలలో పాడి పంచమ్ దగ్గర వదిలేయగా అక్కడినుంచే సితార్ వాదన ప్రారంభమై మూడు ఆవర్తాలుగా సాగింది. మాస్టారు ఇచ్చిన స్వరాల ముక్తాయినే సితార్‌లో వినిపించారు. మాస్టారు తిరిగి మరో రకమైన స్వరసంపుటిని ఎత్తుకుని రెండు ఆవర్తాలలో వినిపించారు. ఈ స్వరాలలో 'నీనీనినిని' స్వరాలను పాడే విధానాన్ని పూర్తిగా హిందూస్తానీ సంప్రదాయధోరణిలోనే పాడడం చెప్పుకోదగ్గ విశేషం. తరువాత సితార్ బిట్ కూడా రెండు ఆవర్తాలలో సాగింది. వెంటనే మాస్టారు ఒక ఆవర్తంలో ఆలాప్ పాడి వదిలేశారు. ఆ తరువాత సితార్ విస్తృతంగా స్వరసంచారం చేస్తూ రెండు ఆవర్తాలు వినిపించి, మూడవ ఆవర్తంలో ముక్తాయిని పలికింది. మాస్టారు అస్థాయిని ఎత్తుకుని పాడినాక చివరకు 'ఈ వేళలో' పదాన్ని మూడుసార్లు ఉచ్చారణ చేస్తూ చివర చిన్న ఆలాప్‌ను పొదిగి, పాటను ముగించారు.

పాట మొత్తమ్మీద గాత్రానికి,సితార్ వాద్యానికి సమప్రాధాన్యం ఇస్తూ చలపతిరావుగారు సుశ్రావ్యమైన బాణీని ఈ పాట ద్వారా అందించారు. పాట ఎత్తుగడలోనే సూక్ష్మాంశాలను నిక్షిప్తం చేసి తనలోని హిందూస్తానీ సంగీత సంప్రదాయ పరిజ్ఞానాన్ని సముజ్జ్వలంగా చాటుకున్నారు.

**గోపీమునిజన హృదయవిహారీ**

**చిత్రం : శ్రీకృష్ణసత్య (1971)**

**రచన : సి.నారాయణరెడ్డి**

**సంగీతం : పెండ్యాల**

**గానం : ఎస్.జానకి**



**శ్యామ్‌కల్యాణ్-కహర్వాఠేకా**

*గోపీమునిజన హృదయవిహారీ*
*గోవర్ధనగిరిధారీ* *॥గోపీ॥*

*1. సర్వవేదముల సారము నీవే*
*జపతపమ్ముల రూపము నీవే*

*పరమపదమునకు మార్గము నీవే*
*భవబంధముక్తికి మూలము నీవే ॥గోపీ॥*
*2. ఏనాడు ధర్మము గతి తప్పునో*
*ఆనాడే నీవవతరింతువు*
*దుష్టశిక్షణ, శిష్టరక్షణ*
*పరమావధియైన పరమాత్మా ॥గోపీ॥*

శ్రీకృష్ణసత్య సినిమా కె.వి.రెడ్డిగారి చిట్టచివరి చిత్రమని చెప్పుకుంటారు. సత్యభామకు గర్వభంగం జరిగి భక్తిజ్ఞానాలు కలిగాక వైరాగ్యం తలెత్తినట్లు దర్శకుడే కల్పించి,అందుకు తగిన పాటను మీరాభజన్ ధోరణిలో కావాలని కోరి ఈ పాటను సినారె చేత రాయించుకున్నారు. అందుకు తగ్గట్లుగా చిత్రకథానాయిక జయలలితకు 'మీరా' వేషం వేసి చేతిలో తంబుర పెట్టి ఈ పాటను చిత్రించారు. అందుకే ఏ ఆలాప్‌లు, స్వరసంచారాలు లేకుండా సాఫీగా భజన్ ధోరణిలో ఈ పాట సాగిపోయింది. దాన్ని సూచిస్తున్నట్లుగా సినారె గారు మీరాబాయి రచనాముద్ర అయిన 'గిరిధారి' శబ్దాన్ని ఉపయోగిస్తూ ఈ పాటను సులభశైలిలో కృష్ణ తత్త్వాన్ని బోధిస్తూ పాటను రాశారు. 'సత్యభామా హృదయసంచారీ' భావాన్ని తొలగించు కుంటూ సత్యభామ గోపికల,మునుల హృదయంలో సంచరించేవాడు అన్నది. రామాయణకాలంలోని మునులే గోపికలు అనే విశేషార్థాన్ని ధ్వనింపజేస్తూ ప్రారంభంలోనే 'గోపీమునిజన'ను ప్రయోగించి ప్రస్తావించిన సినారె చమత్కారం సినారె కే సాధ్యం. సర్వవేదాల సారం శ్రీకృష్ణుని మురళీనాదం, జపతపాల రూపం శ్రీకృష్ణుని అవతారం. పరమపదమార్గం కృష్ణుని గీతబోధ, భవబంధముక్తికి కృష్ణుని పరమాత్మతత్త్వం, అని బలంగా ప్రతిపాదించారు.

"పరిత్రాణాయ సాధూనామ్
వినాశాయ చ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ
సంభవామి యుగేయుగే"

అన్న పరమాత్మ దీక్షాదక్షతను వివరిస్తూ రెండో అంతరా సాగుతుంది. హరి అవతారపరమావధిని మరోసారి మనకు కవిగారు గుర్తుచేశారు. పాట చివరి రెండు పాదాలలో తప్ప మిగతా పాటనంతా యతిప్రాసల నియమాలను చక్కగా పాటిస్తూ రచించినారు.

ఈ పాటను పెండ్యాలగారు 'శ్యామకల్యాణి' రాగంలో క్రొత్తగా స్వరపరచారు. ఈ రాగం కల్యాణ్ థాట్‌కు చెందింది. అయితే యమన్ కల్యాణ్ లో లాగానే శుద్ధమధ్యమ్ అన్యస్వరంగానే పని చేయడంతో పాటు, కోమల్ నిషాద్ స్పర్శ కూడా ఉండడం ఈ రాగం ప్రత్యేకత. దీన్నే కర్ణాటకసంగీత సంప్రదాయంలో 'యమన్' అని పిలుస్తారు. ఇది సమశ్రుతిలో కాక మధ్యమశ్రుతిలో పాడవలసిన రాగం.

ఆరో : నిసరిగమపమదనిస
అవ : నిదపమగరినిరిస

ఈ రాగం కర్ణాటక సంగీత రంగంలో 'యమన్' గా చెలామణి కాగా ప్రముఖ సంగీతమహోదయులు జి.ఎన్.బాలసుబ్రహ్మణ్యంగారు ఈ రాగంలో కోమల్ నిషాద్‌ను అందమైన రంజకస్వరం చేసి 'రాధాసమేతా కృష్ణా' కీర్తనను రచించారు. ఇది బహుళప్రచారాన్ని పొందింది.

అసలు ఈ 'శ్యామ్‌కల్యాణ్' రాగాన్ని పండిట్ రవిశంకర్ గారు సృష్టించారని చాలమంది విశ్వసిస్తారు. ఆయన సంగీతదర్శకత్వం వహించిన ఒక హిందీ సినిమా కోసం 'జానే కైసే' అనే పాటను ఈ రాగంలోనే స్వరపరచారు. దీన్నే అనుసరిస్తూ చక్రవర్తిగారు తన మొదటి చిత్రం 'జేమ్స్‌బాండ్-007' కోసం 'లోకులంత చూసేరురా' పాటను స్వరపరచగా సుశీల పాడారు. 'గోపీమానస' పాటకు ముందు 'గారీసదా నిసగారీ నిసా' అనే క్లుప్తమైన బిట్ ఒక ఆవర్తంలో వేణువుపై వినిపించారు. జానకి అస్తాయిని ఒక మాత్ర వదిలి గంధార్ మీద ఎత్తుకున్నారు. మొదటి పాదాన్ని రెండు మార్లు మార్పు లేకుండా పాడారు. రెండో పాదంలో 'హరే'ను మొదటిసారి పంచమ్‌నుండి అవరోహణ గమకంతో పాడారు. రెండోసారి మంద్రస్వరాల గమకంతో పాడారు. ఏ బిట్టూ అవసరం లేకుండానే మొదటి అంతరా 'సర్వవేదముల' ను సాభిప్రాయంగా అంటే,షరజ్‌లోనే ప్రారంభించారు. 'సారము నీవే' దగ్గర ఒకే ఒక్క ఆవర్తంలో ఆలాప్ చేసి మళ్ళీ 'సర్వవేదముల' అందుకున్నారు. 'పరమపదమునకు' ను శుద్ధమధ్యమ్ నుండి ప్రారంభించారు. బాణీకి ప్రాధాన్యమివ్వడం వలన 'ముక్తికి' ని 'మూక్తికి' అని పాడకతప్పలేదు. 'మూలము' దగ్గర రాగలక్షణముద్రను అందంగా పలికారు. దీని తరువాత అస్తాయిని ఎత్తుకుని 'గిరిధారీ' ని దీర్ఘీకరించి 'రి' అక్షరాన్ని అన్యస్వరమైన కోమల్‌నిషాద్‌తో కలిపి 'నీసాగా' అనే సంగతిని మనోహరంగా పాడారు. ఇంతవరకు కహర్వా తాళాన్ని సరిగానే అనుసరించారు.

కాని రెండవ అంతరాకు ముందు బిట్‌వర్క్ దగ్గరినుంచి 'శేకా' పద్ధతిలోకి మారి చతురశ్రగతిని అనుసరించారు. వేణువు వాద్యంతో బిట్వర్క్‌ను నాలుగవ అక్షరం నుండి ప్రారంభించి,ఏడు ఆవర్తాలలో వినిపించగా 'ఏనాడు ధర్మము' అంతరాను గంధార్ నుండి ఎత్తుకున్నారు. మొదటి రెండు పాదాలను రెండుసార్లు పాడారు.

పాట చివర అస్థాయిలో 'గోవర్ధనగిరిధారి' ని నాలుగు రకాల వైవిధ్యమైన సంగతులతో ఆలపించారు. మూడవ సంగతిలో స్వరాలను చంక్రమణవిధానంలో ఆకర్షణీయంగా పాడారు. నాలుగో సంగతిలో శుద్ధమధ్యమ్ ను అందంగా కలిపి మనోహరంగా పాడి ముగించారు.

**నేనె రాధనోయి**

**చిత్రం : అంతా మనమంచికే (1972)**

**రచన : దాశరథి**



**సంగీతం : భానుమతి, సత్యం**

**గానం : పి.భానుమతి**

**మాల్‌కౌంస్–తీన్‌తాల్/ఠేకా**

*నేనె రాధనోయి గోపాల //నేనె//*
*అందమైన ఈ బృందావనిలో //నేనె//*

1. *విరిసిన పున్నమి వెన్నెలలో*
*చల్లని యమునా తీరములో*
*నీ పెదవులపై వేణుగానమై*
*పొంగిపోదు నేనీవేళ //నేనె//*

2. *ఆడే పొన్నల నీడలలో*
*నీ మృదుపదముల జాడలలో*
*నేనే నీవై,నీవే నేనై కృష్ణా*
*అనుసరింతురా నేనే వేళ //నేనె//*

సోహమ్ అనే తాత్త్వికసూత్రం మన నిత్యజీవితాల్లో చాల సందర్భాలలో అన్వయం చెందుతూ ఉంటుంది. సత్యం, తేజం, చైతన్యం, అగ్ని అన్నీ భగవత్స్వరూపాలేనన్న జ్ఞానం కలగడమే ఒక పరిణామం. జీవాత్మ, పరమాత్మ ఒక్కటే అనే అద్వైత తత్త్వాన్ని కూలంకషంగా తర్కించు కున్నప్పుడు జీవుడు, దేవుడు మొదట వేరువేరుగా కనిపిస్తారు. క్రమంగా జ్ఞానం పరిపక్వదశకు వచ్చినప్పుడు రెండు ఒకటిగా దర్శించే శక్తి ఏర్పడుతుంది. సఖ్యం, సేవనం లాంటి భక్తిమార్గాలలో జీవుడు దాసుడై భగవంతుని సేవిస్తే క్రమంగా భగవత్తత్త్వంలో కలిసిపోయే ఒక తాదాత్మ్య స్థితి ఏర్పడుతుంది. దీనికి మొదటి దశ తాను జీవుడనన్న ధ్యాస ఏర్పడడం. అప్పుడే లక్ష్మణుడు, హనుమంతుడు, శబరి లాంటివాళ్ల భక్తితో సాదృశ్యం తెచ్చుకునే ఆలోచన ఏర్పడుతుంది. ఆ వరుసలోనే ఇప్పుడు గాయని 'రాధ'ను ఆవహింపజేసుకున్నారు. రాధలాగా సర్వస్వం పరమాత్మాధీనం చేసి, సమర్పణ భావంతో స్మరించుకుంటే ముక్తి కలుగుతుందన్న స్పృహ ఈ పాటలో కనిపిస్తున్నది. ఒక భక్తురాలు తాను, తన పుట్టుక సంగతి వదిలేసి రాధనైపోతా నంటున్నారు. రామకృష్ణ పరమహంస కూడా ఒక దశలో స్త్రీవేషం వేసుకుని 'నేను రాధను' అని భగవద్రతిని అనుభవించినవారే. ఆ పోకడలోనే సాగుతున్న రచన ఇది. లోకాన్ని బృందావనంగా భావించిన ఆమె తాను రాధనన్న స్పృహలో పరవశిస్తున్నది. యమునానదీ సైకతశ్రేణుల్లో విహరించే రాధాకృష్ణుల అలౌకికానందపారవశ్యంలో తాను మునిగిపోయి, ఆ విలాసాల వెన్నెలను ఊహించు కుంటున్నది. కృష్ణుని పెదవులపై వేణువుగా మారిపోయి ఆ పారవశ్యంలో మునిగిపోయింది. మొదటి అంతరాను పాడుతున్నప్పుడు గోపెమ్మ, బాలకృష్ణుల విహారాల తీరులను చిత్రించారు. ఇప్పటిదాక ఈ భక్తురాలు రాధ అయింది, వేణువైంది. రెండో అంతరాలో కృష్ణుని అడుగుజాడలను అనుసరిస్తూ కృష్ణునిలో కలిసిపోయింది. ఇక ఇప్పుడు 'నీవే నేనై' అనే స్థితికి చేరుకుంది. కృష్ణుడు, తాను వేరువేరుగా కనిపించడం మానేశారు. ఇది భక్తికి పరాకాష్ఠ. ఇలా భక్తితత్త్వాన్ని దశలవారీగా అలతి అలతి పదాలతో మన కళ్ళముందుంచిన ప్రజ్ఞానిధి,దాశరథి. యతిప్రాసల గొడవ లేవీ లేకుండా స్వేచ్ఛావిహారంతో గానానుకూలమైన పాటను రాశారాయన. దీన్ని ప్రధానంగా చిత్రకథానాయిక భానుమతిగారి మీద చిత్రించారు. మొదటి అంతరాను ఆంతరదృశ్యంగా చిత్రించగా బాలకృష్ణునిగా బేబీరాణి, రాధగా టి.పద్మిని నటించారు. పాట అంతా హిందూస్తానీ సంగీతకచేరీ సంప్రదాయంలో సాగుతుంది. భానుమతి ఈ చిత్రంలో తంబుర వాయిస్తూ ఆలపిస్తున్నట్లుగా చిత్రించారు. ప్రక్కన పద్మనాభం వట్టిగా కూర్చున్నారు. మరి ఇంత పటిష్ఠమైన కచేరీ సంప్రదాయ గీతం పాడుతున్నప్పుడు ప్రక్కన ఒక తబలిస్టు పాత్ర కూడా ఉంటే మరింత రక్తికట్టేదికదా! ఆమెకీ ఆలోచన రాలేదో, కావాలని వద్దనుకుందో ఏదైనాఆశ్చర్యమే. ఎందుకంటే, చిత్రానికి తానే నిర్మాత, దర్శకురాలు కనుక.

ఘంటసాల, పి.బి.శ్రీనివాస్, సుశీల, జానకి, లీల, పక్కా శాస్త్రీయధోరణిలో గానం చేసి ప్రసిద్ధి పొందినారు. తనకలాంటి ఘట్టం రాలేదే అని భానుమతిగారికి ఏదో వెలితిగా అనిపించివుంటుంది. దాన్ని ఈ పాటతో పూరించు కున్నారేమో అనే ఊహ అందరికీ కలిగే అవకాశం ఉంది. అయినా ఇది ఎంతో ఆనందకర విషయం. ఇతరులెవ్వరూ సాహసించని వాగ్గేయకార రచనలను తన సినిమాల్లో ప్రవేశపెట్టడం, వాటిని పాడడం అంతా ఆమెదే ఘనత అని చెప్పవచ్చు. అయితే, అవన్నీ కర్ణాటక శాస్త్రీయాలు. ఇప్పుడిది హిందూస్తానీ సంగీతధోరణి కల రచన. ఆమె లోని రెండో పార్శ్వమిది.

మాల్‌కౌంస్ రాగాన్ని ఎన్నుకుని అనేక మనోహరమైన సంగతులతో పాడారు. అయితే ఈమెలో ఎక్కువగా బిస్మిల్లాఖాన్‌గారి శహనాయ్ వాదనాస్ఫూర్తి ఎక్కువగా కనిపిస్తున్నది. ఎన్నో సంగతుల కులుకులు, రవ్వల హొయలు ఆయన ప్రేరణతోనే భానుమతి తమ వ్యక్తిగత ప్రతిభను, తన ముద్రను, తన ధోరణిని సంపూర్ణంగా ఈ పాటలో ప్రతిధ్వనింపజేశారనవచ్చు. అంతేకాదు, ఈ పాటకున్న మూలాన్ని గూర్చి చెబుతూ సుప్రసిద్ధ కళా విమర్శకులు, నాట్యకళాకోవిదులు శ్రీ వి.ఎ.కె. రంగారావుగారు ఇలా అన్నారు. "జి.రామనాథన్ కృతమైన ఇన్బం ఇన్బం ఇన్బం (మణిమేకలై-1959) పాట వరసను స్వీకరించి 'నేనె రాధనోయి' పాటకు వాడుకున్నారు" ('రాగమాలిక'-పుట44) ఇలా వాడుకోకుండా ఆమె సొంతంగా అంతటి వరస చేయగల సమర్థురాలే భానుమతిగారు. అయినా ఏవో కారణాలతో ఇది జరిగివుంటుంది. బిస్మిల్లాఖాన్‌గారి మాల్‌కౌంస్ ఈమెకే కాదు, ఎందరినో ప్రభావితం చేసింది. 'సమగమా సనిసదా నిదమగస' అనే సంచారం మొదలుకుని ఎన్నో సంగతులు గాత్రవాద్య కళాకారులను ప్రభావితం చేశాయి. వారిలో జి.రామనాథన్ కూడా ఉన్నారేమో! గుండమ్మకథలో ఎల్.విజయలక్ష్మి నృత్యప్రదర్శనకు ఘంటసాలగారు ఎన్నుకున్న వాద్య సంగీతంలో ఈ ప్రభావాన్ని ఎక్కువగా గమనింపవచ్చు. భానుమతి తనదైన శైలిలో ఎంతో క్లిష్టమైన సంగతులను జోడించి ఈ పాటను ఆలపించారు. పూర్తిగా కచేరీలోనే ఉండిపోతే సామాన్యులు దూరమవుతారేమోనని అనుకున్నారేమో, మొదటి అంతరాకు రాధాకృష్ణుల నృత్యాన్ని జోడించారు. అదీ దర్శకత్వ ప్రతిభ. ప్రారంభంలో మాల్‌కౌంస్ రాగాన్ని ఆలాప్ విధానంలోనే వినిపించారు. మధ్యలో 'మదనిస మాదని సానిదమ' అనే సంగతిని పాడుతున్నప్పుడు ఛాయా మాత్రంగా పంచమస్పర్శ వినిపించి క్రొత్త రంగును తెచ్చింది. ఆధార్‌షరజ్ నుంచే అస్తాయిని ప్రారంభించారు. రెండోసారి 'గోపాలా' ను అవరోహణగమకంతో అందంగా పాడారు. 'మమదనిస' అనే బిట్టును సితార్ అందించగా 'అందమైన' అనే పంక్తిని మొదటిసారి పాడుతున్నప్పుడు 'బృందావని' లో 'దా' దగ్గర పంచమస్పర్శ సూక్ష్మంగా వినిపించింది. రెండోసారి 'బృందావని' ని సంగతి మార్చి పాడారు.

మొదటి అంతరాకు ముందు సితార్,వైబ్రోఫోన్‌ల సంయుక్తమైన బిట్ ఎనిమిదవ అక్షరం నుండే ప్రారంభమై మూడు ఆవర్తాలలో సాగింది. నాలుగో ఆవర్తం నుండి శహనాయ్ వాద్యంతో నాలుగు ఆవర్తాల బిట్టు ఇచ్చారు. తరువాత మరో రెండు ఆవర్తాలలో సితార్, వైబ్రోఫోన్ లను వినిపించి తార్‌షరజ్‌లో వదిలేశారు. ఇంత సమయాన్ని బాలకృష్ణుడు, గోపికల నృత్యం కోసం వినియోగించారు. 'విరిసె పున్నమి' ని తార్ షరజ్ నుంచి ఎత్తుకున్నారు. 'వెన్నెలలో' ను షరజ్‌లో వదిలేసి హఠాత్తుగా ఆధార్‌షరజ్‌కు వచ్చి 'చల్లని' పంక్తిని పాడారు. దీన్ని రెండుసార్లు పాడినా 'వెన్నెలలో, చల్లని' పదాలకు పొడిపొడి లింకునే ఇచ్చారు. అంటే, స్వరంతో వంతెన వేయలేదన్న మాట! ఇది ఒక సొగసే కదా! 'వేణుగానమై' దగ్గర వేణువు బిట్టును ఇచ్చారు, కాని అర ఆవర్తంలో ముగించడం వల్ల 'కహర్వా' దెబ్బతిని రేకాగా మారిపోయింది. ఇది రెండవ అంతరా బిట్‌వర్క్‌దాకా నడిచింది. 'నేనీవేళ' లో 'నీ' దగ్గర మళ్ళీ పంచమస్పర్శ గమ్మత్తుగా వినిపించింది. అస్తాయి ఎత్తుగడ స్థానం 5వ అక్షరం మీదికి వచ్చింది.

రెండవ అంతరాకు ముందు బిట్‌వర్క్ కూడా 5వ అక్షరం మీదనే ప్రారంభమైంది. ఇలా బిట్వర్క్ ఐదున్నర ఆవర్తాలలో ముగిసి రెండవ అంతరా ఎత్తుగడ సమానికి చేరింది. ఈ బిట్‌వర్క్‌లో సితార్,వైబ్రోఫోన్,వేణువు వాద్యాలను వినియోగించారు. ఈ అంతరాను కూడా బాలకృష్ణుడు,గోపెమ్మలమీద చిత్రించారు. బిట్‌వర్క్‌ను మధ్యమ్ దగ్గర వదిలేయగా 'ఆడే పొన్నల' అంతరాను మధ్యమ్ నుంచే ప్రారంభించారు. 'నేనే నీవై కృష్ణా' దగ్గర ఆలాప్‌ను మూడు ఆవర్తాలలో అందంగా వినిపించారు. 'నే నేవేళ' ను పాడుతున్నప్పుడు కూడా పంచమ్ సన్నగా ధ్వనించింది. తనువాత అస్తాయిని ఎత్తుకుని రాగాలాప్‌లో తన ప్రతిభనంతా బహుముఖాలుగా చాటుకున్నారు.

మొదట ఒక ఆవర్తంలో ఆలాప్ చేసి అస్తాయిని అందుకున్నారు. తరువాత పైకాలంలో కొంచెం ద్రుత్‌ను పెంచి ఆరోహణాగమకాన్ని అందంగా రెండు ఆవర్తాలలో వినిపించారు. మూడోసారి ఆలాప్‌ను నాలుగు ఆవర్తాలుగా తీసుకున్నారు. ఈ విభాగంలోనే మనకు బిస్మిల్లాఖాన్ శహనాయ్ కొద్దిగా తొంగిచూడడాన్ని గమనింపవచ్చు. మూర్ఛనాగమకంతో దీన్ని అందంగా ముగించారు. నాలుగోసారి పది ఆవర్తాలు తీసుకుని తనదైన శైలిలో ప్రతిభా, వ్యుత్పత్తులను తన ముద్రలతో ప్రదర్శించి, చంక్రమణగమకంతో పాడారు. చివరలో 'నేనె రాధనోయి'ని మూడు సార్లు ముక్తాయి ధోరణిలో ఆలపించి సంప్రదాయ ప్రకారం ముగించారు.

జాతీయ పురస్కార గ్రహీత
డా. ఎమ్. పురుషోత్తమాచార్య
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.

# సూక్తి సురభి

*- రెంటాల సాంబశివరావు*

*పాతాళ మావిశతు యాతు సురేంద్ర లోకం*
*ఆరోహతు క్షితిధరాధిపతిం చ మేరుమ్।*
*మంత్రౌషధ ప్రహరణై శ్చ కరోతు రక్షాం*
*య ద్భావి తద్భవతి నాత్ర విచార హేతుః॥*

పాతాళం-పాతాళ లోకాన్ని గూర్చి, ఆవిశతు వెళ్ళవచ్చును గాక, సురేంద్ర లోకం-దేవ లోకాన్ని గూర్చి, యాతు-వెళ్ళవచ్చునుగాక, చ-మరియును, క్షితిధరాధిపతిం-పర్వతాలలోని శ్రేష్ఠమైన, మేరుం-మేరు పర్వతాన్ని, ఆరోహతు-ఎక్కనూ వచ్చుగాక, చ-మరియును, మంత్ర-మంత్రాలయొక్కయును, ఔషధ-ఔషధాలయొక్కయును ప్రహరణైః-ప్రయోగాలచేత, రక్షాం-రక్షణను, కరోతు చేయవచ్చునుగాక, యత్-ఏదైతే, భావి-జరగాలో, తత్-అదే, భవతి-జరిగి తీరుతుంది. అత్ర-ఈవిషయంలో, విచార-ఆలోచించడానికి, హేతుః-కారణము, న-లేదు॥

ఈలోకంలో ఎవ్వరైనా సరే -పాతాళలోకంలో దాగి యుండవచ్చును గాక, దేవలోకానికి వెళ్ళనూ వచ్చునుగాక, మిక్కిలి పెద్దదైన మేరుపర్వతముపైన ఎక్కి దాగుండ వచ్చుగాక, మంత్రాలు, ఔషధములు కూడా రక్షణకోసం ప్రయోగించవచ్చుగాక, కానీ జరగవలసినది తప్పక జరిగియేతీరుతుంది.

ఈవిషయంలో ఎంత ఆలోచించినా,విచారించినా కూడా ఏమీ ఫలితం ఉండదు కదా॥

*లోకేషు నిర్ధనో దుఃఖీ*
*ఋణగ్రస్త స్తతోధికమ్।*
*తాభ్యాం రోగయుతో దుఃఖీ*
*తేభ్యః కుభార్యా దుఃఖా సా॥*

లోకేషు-లోకాలలో, నిర్ధనః-పేదవాడు, దుఃఖీ-బాధితుడు, ఋణగ్రస్తః-అప్పు చేసి లొంగిపోయిన వాడు, తతః-ఆ పేదకంటే, అధికం-ఎక్కువ బాధపడతాడు, తాభ్యాం-ఆ యిద్దరికంటే, రోగయుతః-రోగబాధితుడు, దుఃఖీ-(ఎక్కువ) దుఃఖం పొందిన వాడు, దుఃఖీ-దుఃఖపడతాడు, తేభ్యః-ఆ ముగ్గురికంటే, కుభార్యా-గయ్యాళి భార్యయైన, సా-ఆ స్త్రీ ,దుఃఖా-దుఃఖకారకురాలు ఔతుంది॥

లోకంలో ధనహీనుడు బాధపడుతూ ఉంటాడు. వానికంటె అప్పులకు లొంగినవానికి ఆ బాధ యింకా ఎక్కువ. వారిద్దరికంటె దీర్ఘరోగి మరింత దుఃఖాన్ని పొందుతాడు. ఆ ముగ్గురికంటె గయ్యాళి భార్య అత్యంత దుఃఖకారక మౌతుంది॥

*ఉద్యమేన హి సిద్ధ్యంతి*
*కార్యాణి న మనోరథైః।*
*న హి సుప్తస్య సింహస్య*
*ప్రవిశంతి ముఖే మృగాః॥*

కార్యాణి-పనులు, ఉద్యమేన-ప్రయత్నం చేతనే, సిద్ధ్యంతి-సఫలమౌతాయి, (కానీ) మనోరథైః-కేవలం కోరికలచేతనే, న హి-సిద్ధించవు సుమా. (అది ఎలాగంటే) సుప్తస్య నిద్రించిన, సింహస్య-సింహముయొక్క, ముఖే నోటి యందు, మృగాః-జంతువులు, న ప్రవిశంతి హి-ప్రవేశించవు గదా॥

ఈలోకంలో ఏపని సాధించడానికైనా గట్టి ప్రయత్నం చెయ్యాలి. కానీ కేవలం అనుకుంటే చాలదు. అది ఎలాగంటే నిద్రించిన సింహానికి ఆకలి తీర్చడానికి, ఆ అడవిలోని మృగాలు తమంత తాముగా దాని నోటిలోకి వెళ్ళవు గదా॥

*అనుష్ఠితం చ యద్దేవై*
*ర్ఋషిభిర్యదనుష్ఠితమ్।*
*నానుష్ఠేయం మనుష్యైస్తు*
*తదుక్తం కర్మ ఆచరేత్॥*

దేవైః-దేవతలచేతను, యత్-ఏదైతే, అనుష్ఠితం-ఆచరించబడిందో, చ-మరియును, ఋషిభిః-ఋషుల చేతను, యత్-ఏదైతే, అనుష్ఠితం-ఆచరించ బడిందో, మనుష్యైః -మనుష్యులచేత, న అనుష్ఠేయం-అనుష్ఠింప బడనే రాదు. తు-కానీ, తత్-వారిచేత, ఉక్తం-చెప్పబడిన, కర్మ-పనినే, ఆచరేత్-ఆచరించవలెను॥

దేవతలు గానీ, ఋషులు గానీ ఏం చేస్తారో మనుష్యులు మాత్రం అది ఆచరించరాదు. కానీ వారు చెప్పినదియే చేయవలెను॥

*జరా రూపం హరతి హి ధైర్య మాశా*
*మృత్యుః ప్రాణాన్ ధర్మచర్యా మసూయా*।
*కామో హ్రియం వృత్త మనార్యసేవా*
*క్రోధః శ్రియం సర్వ మేవాభిమానః*॥

జరా-ముసలితనము, రూపం-అందాన్ని, హరతి హి హరించివేస్తుంది. ఆశా-ఆశ, ధైర్యం-ధైర్యాన్ని, (హరతి-హరిస్తుంది). మృత్యుః-మృత్యుదేవత, ప్రాణాన్ ప్రాణాలను(హరిస్తుంది). అసూయా-ఓర్వలేమి, ధర్మచర్యాం-ధార్మికతను(హరిస్తుంది). కామః-కోరిక, హ్రియం-సిగ్గును(హరిస్తుంది).అనార్య సేవా-కానివాని సేవ, వృత్తం-నడతని(హరిస్తుంది). క్రోధః-కోపము, శ్రియం-సంపదను(హరిస్తుంది). అభిమానః అభిమానము, సర్వం ఏవ-అన్నిటినీ(హరిస్తుంది)..

ముసలితనం అందాన్ని నశింపజేస్తుంది. ఆశ ధైర్యాన్ని పోగొడుతుంది. మృత్యువు ప్రాణాలను తీస్తుంది. అసూయ ధార్మికతను నాశనము చేస్తుంది. కామం సిగ్గుని పోగొడ్తుంది. నీచుని సేవ శీలాన్ని నశింపజేస్తుంది. కోపం సంపదను హరిస్తుంది. అభిమానమైతే అన్నింటినీ పోగొడుతుంది॥

*సుజనో న యాతి వైరం*
*పరహిత నిరతో వినాశకాలేపి*।
*ఛేదే పి చందనతరుః*
*సురభయతి ముఖం కుఠారస్య*॥

పర-ఇతరులకు, హిత-మేలు చేయడమే, రతః-ముఖ్యంగా గల, సుజనః-సజ్జనుడు, వినాశ కాలే అపి-కష్టకాలంలో కూడా, వైరం-(ఎవ్వరితోనూ)-విరోధము, న యాతి-పొందదు. (అది ఎలాగంటే)- చందన తరుః మంచి గంధపు చెట్టు, ఛేదే అపి-నరకబడుతున్నప్పటికీ, కుఠారస్య-గొడ్డలి యొక్క, ముఖం-మొనను, సురభయతి-సువాసన భరితంగా చేస్తుంది గదా॥

ఈలోకంలో ఇతరులకు మేలు చేయడమే లక్ష్యంగా గల సజ్జనుడు ఎప్పుడూ ఎవ్వరితోనూ విరోధించడు. అది ఎలాగంటే మంచిగంధపుచెట్టు తనను నరకుతున్న గొడ్డలి యొక్క మొనను కూడా సువాసనభరితం చేస్తుంది గదా॥

*గుణవంతః క్లిశ్యంతే ప్రాయేణ*
*భవంతి నిర్గుణా స్సుఖినః*।
*బంధన మాయాంతి శుకాః*
*యథేష్టసంచారిణః కాకాః*॥

ప్రాయేణ-సాధారణంగా, గుణవంతః-మంచి వాళ్ళు, క్లిశ్యంతే-బాధపడుతూ ఉంటారు. నిర్గుణాః-గుణహీనులు, సుఖినః-సుఖవంతులుగా, భవంతి-ఔతున్నారు. (అది ఎలాగంటే), శుకాః-రామచిలుకలు, బంధనం-చెరలో, ఆయాంతి-బంధింపబడుతున్నాయి. కాకాః-కాకులు, యథా ఇష్ట -స్వేచ్ఛగా, సంచారిణః-తిరుగుతాయి గదా॥

ఈలోకంలో సాధారణంగా బాధ లన్నీ మంచి వాళ్ళకే కలుగుతాయి. చెడ్డ వాళ్ళు ఎప్పుడూ సుఖసంతోషాలతోనే ఉంటారు. అది ఎలాగంటే చక్కని రంగు కలిగి పలుకులు పలికే రామచిలుకలను పంజరంలో బంధిస్తాము. అదే కాకు లైతే స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటాయి గదా॥

*వనేపి సింహాః గజమాంసభక్షిణః*
*బుభుక్షితాః నైవ తృణం చరంతి*।
*ఏవం కులీనాః వ్యసనాభిభూతాః*
*న నీచకర్మాణి సమాశ్రయంతి*॥

వనే-అడవిలో, గజమాంస-ఏనుగు మాంసాన్ని, భక్షిణః తినడానికి అలవాటు పడిన, సింహాః-సింహాలు, బుభుక్షితాః అపి-ఆకలితో బాధపడుతున్నప్పటికీ, తృణం-పచ్చ గడ్డిని, న చరంతి ఏవ-తిననే తినవు. ఏవం-ఇదే విధంగా, కులీనాః-ఉత్తమ కులంలో జన్మించిన వారు, వ్యసన అభిభూతాః-కష్టాలలో మునిగి యున్నప్పటికీ, నీచ కర్మాణి-చెడు పనులను, న సమాశ్రయంతి-చేయనే చేయరు॥

అడవిలో ఏనుగు మాంసం మాత్రమే తినడానికి అలవాటు పడిన సింహాలు, ఆకలితో ఎంత బాధ పడుతున్నప్పటికీ పచ్చగడ్డిని తిననే తినవు. అలాగే ఉత్తమ వ్యక్తులు ఎలాంటి కష్టాలలో ఉన్నప్పటికీ నీచప్రవర్తనకి సిద్ధపడరు గదా॥

*భాగ్యోదయేన బహుజన్మసమార్జితేన*
*సత్సంగమేవ లభతే పురుషో యదా వై*।
*అజ్ఞాన హేతుకృతమోహమదాంధకార-*
*నాశం విధాయ హి తదోదయతే వివేకః*॥ (పద్మపురాణం)

పురుషః-మానవుడు, బహుజన్మ-అనేక జన్మలలో, సమార్జితేన-సంపాదించిన, భాగ్య ఉదయేన-కలిసి వచ్చిన అదృష్టముచేత, యదా-ఎప్పుడైతే, సత్సంగం ఏవ వై-ఉత్తమ స్నేహమునే, లభతే - పొందుతాడో, అజ్ఞాన-అజ్ఞాన మనే, హేతు-కారణముగా కృత-చేసిన, మోహ-వ్యామోహమును, మద-గర్వమును అనే, అంధకార-చీకటిని, నాశం విధాయ-నశింపజేసి, వివేకః-విజ్ఞానము, తదా-అప్పుడే, ఉదయతే హి-పుడుతుంది సుమా॥

రెంటాల సాంబశివరావు
కొవ్వూరు, ఫోన్ : 7893855174



# దార్శనికుడు డా. అక్కినేని నాగేశ్వరరావు

*– మండలి బుద్ధప్రసాద్*

"కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహా పురుషులవుతారు" అన్న మహాకవి భావనకు ప్రత్యక్ష సాక్ష్యం డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు. కృష్ణాజిల్లాలో ఒక కుగ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించి ఎవరికీ అందనంత ఎత్తు కెదిగారంటే దాని వెనుక ఎంత కృషి – ఎంత సాధన ఉందో అర్థం చేసుకోవచ్చు. మట్టిలో నుంచి మాణిక్యంగా ఎదిగిన మహా మనిషి అక్కినేని.

తెలుగు సినిమా పరిశ్రమకు మూలస్తంభమైన అక్కినేని యొక్క నట ప్రస్థానం ఓ అధ్యాయం. ఆయన నటించిన సినిమాలు తెలుగు చిత్ర సీమకు పునాది రాళ్ళు, ఆయన తెలుగు చిత్ర పరిశ్రమ దార్శనికుడు. నటుడుగా ఉత్తముడనిపించుకోవడమే కాక వ్యక్తిగా జీవితంలో ఉత్తముడనిపించుకున్న సజ్జనుడు శ్రీ అక్కినేని. ఆయన దాతృత్వం గుప్తంగాను, అభివ్యక్తంగాను ప్రసిద్ధి పొందింది. చిన్న నాటి నుండి నటనకు అలవడి అందులో మెళుకువలు నేర్చుకొని నాటకాలలో స్త్రీ పాత్రతో ప్రారంభమైన తన నట జీవితాన్ని వినయవిధేయతలతో జిజ్ఞాసతో నటనాభినయ విద్య నభ్యసించి చలనచిత్ర నటశేఖరత్వంతో పెంపొందించుకొన్న క్రియాశీలి అక్కినేని. ఆయన చలనచిత్ర రంగంలోనే ఉంటూ పరిశ్రమలు, వ్యవసాయం కూడా నడిపిన సాధకుడు. వివిధ పాత్రలలో కనిపించిన అక్కినేని 'పాత్రలో లీనమయి, పాత్రను నడిపిస్తాను'' అనేవారు. ఇది నటజీవితంలో రాణించాలనుకొన్న వాళ్ళు నేర్చుకొనదగిన విషయం. అలాగే "హీరో డిక్టేట్ చేసే రోజులు పోవాలి. పోతాయి కూడ. దర్శకులు, నిర్మాతలు హుందాగా హీరోను డిక్టేట్ చేసే రోజులు వస్తాయి" అనే అక్కినేని ఆశయాలు ఆదర్శంగా కళాకారులు స్వీకరించదగినవే. ''నటించటం నా జీవిత అభిరుచి. మంచివాడుగా చెడ్డవాడుగా నటించటం నా జీవితం. నా అభిరుచి. కానీ జీవితంలో నటించటం నాకు రుచించదు" అనే అక్కినేని ''జీవితంలో కూడా నటించే వాళ్ళు తారసపడుతుంటే నటనకు లక్ష్యం లేకుండా పోతుంది. జీవితానికి విలువలేకుండా పోతుంది" అని హెచ్చరించిన సంగతి గమనించదగిన హితబోధ. సుప్రసిద్ధులైన శ్రీ అక్కినేని గురించి ఆంధ్రులకు తెలియనిదేముంది. అక్కినేని కదిలే విజ్ఞాన సర్వస్వం. ఏ విషయం కదిపినా తనదైన ఆలోచనా ధోరణిని వ్యక్తం చేయగల మేధా సంపన్నుడు. వెండి తెరపై తన నటనా వైదుష్యంతో దశాబ్దాల పాటు తెలుగువారిని అలరించిన 'నటసామ్రాట్', 'దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్' గ్రహీత డా. అక్కినేని నాగేశ్వరరావు గారు 2014, జనవరి 22 వ తేదీన పరమపదించారు. గాంధీక్షేత్రం మాసపత్రిక సంపాదకునిగా మే 1988 లో అక్కినేనితో నేను జరిపిన ఇష్టాగోష్టిలో వారి ఆలోచనలను పాఠకుల ముందుంచే ప్రయత్నం చేస్తున్నాను.

ప్రశ్న : సమకాలీన సమాజ పరిస్థితుల పై మీ అభిప్రాయాలు?

అక్కినేని : సమాజ పరిస్థితులు ప్రస్తుతం ఏమీ బాగుండినట్లు నాకు అనిపించుటలేదు. ఏ రంగంలో చూసినా బాగుండినట్లు నాకు అనిపించుటలేదు. పాపులర్ రంగాలు రాజకీయ రంగం, సినిమా రంగం కదా! ఈ రెండూ కూడా బాగున్నట్లు అనిపించుటలేదు. వాటిలో సిన్సియారిటీ లోపం బాగా కనిపిస్తుంది. ప్రజాసేవ కంటే స్వంత సేవ ఎక్కువగా కనిపిస్తుంది. ముఠా రాజకీయాలు. ఒక ఊళ్ళో మూడు నాలుగు పార్టీలు. కాంగ్రెసులో పనిచేసే వారిలో వర్గాలు ఇట్లా కూడా అనిపిస్తుంది. మరి ఏ పార్టీ చూసినా అట్లాగే ఉంది. ఎంతో పెద్ద సంస్థ కాంగ్రెసు పార్టీలోనే ఇట్లా ఉంటే ఇతర పార్టీల్లో ఎందుకు ఉండవు? అసలు అందరూ కాంగ్రెస్ పార్టీలో ఈ ముఠా తగాదాలతో

బయటకు వచ్చిన వాళ్ళే కదా! ఏ పార్టీ వాళ్ళయినా వాళ్ళే కదా! అందుకని ఆ పార్టీల్లో అట్లా ఉండటం సహజం. ఒక కుటుంబంలో డిఫరెన్స్ ఆఫ్ ఒపీనియన్స్ ఉండవచ్చు. ఉండటానికి ప్రతివానికి హక్కు కూడా ఉంది. ఉండకూడదని అనుటలేదు. కాని ఇదివరకైతే డిఫరెంట్ అప్రోచెస్ ఉన్నా కుటుంబంలో పదిమంది అన్నదమ్ములు ఉన్నప్పుడు వారికి యూనిటీ అండ్ డైవర్సిటీ ఉండేది. ఇప్పుడు డైవర్సిటీ ఈజ్ డామినేటింగ్ ది యూనిటి. అందుచేత అన్ని రంగాల్లోనూ, అన్నిచోట్ల ఇండివిడ్యుయాలిటి టూ మచ్ గా పెరిగి పోయింది. కలిసికట్టుగా ఉంటే బలం ఉందనే సంగతి మరచిపోయి నేనే బలం అనుకొంటున్నారు. నీవు లేని నేను కాదనుకునే వాడొకప్పుడు మానవుడు, నేను లేని నీవు నీవే కాదంటున్నాడు ఇప్పుడు"

ఎప్పుడో 30 సంవత్సరాలు క్రితం వ్రాశాను. 'అ' 'ఆ' (అక్కినేని ఆలోచనలు) లలో అలా అనిపిస్తుంది నాకు. ఇది రాజకీయరంగం, ఎందుకీ మాటలు మాట్లాడుతున్నా నంటే మీరు రాజకీయ నాయకుల అబ్బాయి కాబట్టి, మీరు ఇంటర్వ్యూ చేస్తున్నారు. కాబట్టి మాట్లాడుతున్నాను. లేకపోతే రాజకీయాలు మాట్లాడే అలవాటు నాకెప్పుడూ లేదు. ఇక మా రంగం అంటారా – మా కళారంగంలో సిద్ధి, శుద్ధి, డివోషన్, సిన్సియారిటీ ఒకప్పుడు ఉండేవి. ఒకప్పుడు ఆల్ ది సిన్సియారిటీ ఉయ్ విల్ కమిట్ మిస్టేక్స్ ఆల్సో. తప్పులు చేసి కూడా ఉండవచ్చు. కానీ శుద్ధి ఉండేది. ఇప్పుడు ఉండుటలేదు. ఎదుటవారి వీక్‌నెస్‌ని ఎలా ఎక్స్‌ప్లాయిట్ చేసుకుందామా అనే పరిస్థితి తప్పితే. సిమిలర్లీ ఈ రెండు రంగాల్లో వీనిని ఎలా ఉపయోగించుకుంటున్నారో చాలా బలవత్తరంగా కనిపిస్తుంది. మన పక్క ఇల్లు తగలబడిపోతుంటే మన ఇళ్ళు కూడా రేపు గాలివాటుకి తగలబడే అవకాశముంది అనే జ్ఞానం లేకుండా పోతుంది మనిషికి. ఏ రంగంలోనైనా సరే, వాళ్ళ ఇల్లు తగలబడిపోతే పోనీ, మన ఇల్లు మాత్రం జాగ్రత్తగా ఉంటే చాలు అని అనుకుంటున్నారు. ప్రక్క బిడ్డలతో పాటు మన బిడ్డలు కూడా చదువు కుంటున్నారన్న కామన్ సెన్స్ లేకుండా పోతుంది. ప్రక్క బిడ్డలు చెడిపోయినప్పుడు మన బిడ్డలు ఎందుకు చెడిపోరూ? వారితో కల్సి చదువుకొని, ఆహా! ఏరా, ఏరా – అనుకుని హలో హలో అనుకునే వారే కదా! అది చాలా తక్కువగా కనిపిస్తుంది.


పద్మవిభూషణ్ అక్కినేని నాగేశ్వర రావు.

ప్రశ్న :–దీనికి మార్గాలేమంటారు?

అక్కినేని :– మార్గాలేమీ లేవు. ఈ పాపం కాస్త త్వరగా పండాలని నేను అనుకుంటున్నాను... నా అప్రోచ్ ఈజ్ ఆల్ టుగెదర్ దిస్. తాగేవాడిని తాగవద్దురా బాబూ! వ్యభిచరించేవాడిని ఆ పని తప్పురా బాబూ అంటే ఎవరు ఊరుకుంటున్నారు. పెద్దవాళ్ళు తప్పులు చేసినా అనుభవంతో చెప్పుతున్నారని అనుకోవడం లేదు. పెద్దవాడొకడు బాగా తాగి చెడిపోయాడు. వాడు చెప్పడానికి అర్హుడు. తాగి నేను చెడిపోయాను. నా నరాలు బలహీనమై పోయాయి. నేను ఎందుకు పనికిరాకుండాపోయాను. నీవు కూడా నా బిడ్డవు. నీవు కూడా చెడిపోతావు. నీవు వృద్ధిలోకి రావలసినవాడవు. నీకెంతో మంచి టైమ్ ముందుందని చెప్పవచ్చు. అది ఒక ధోరణి, లేదు 'నేను తాగలేదు – నాకు ఎన్నో అవకాశాలు వచ్చినా నేను తాగకుండా నిభాయించికొని ఉన్నాను. నీవు ఎందుకని తాగకుండా ఉండలేవు' అని చెప్పవచ్చు. ఇలా రెండు రకాలుగా చెప్పే హక్కు ఉంది. అలాగే రాజకీయ నాయకునికి హక్కు ఉంది. ఇప్పుడు రాజకీయ నాయకులకు వడ్డించిన విస్తరి. అంతా. ఇదివరకైతే వారి జీవితాలు వారి ఆస్తులు త్యాగంచేసి – త్యాగంచేసి వారు స్వరాజ్యం సంపాదించి పెట్టినారు. వాళ్ళు ఇప్పుడు చాదస్తుల క్రింద లెక్క. వాళ్ళు చెప్పిన నీతులన్నీ మాటల్లోనే నిలిచిపోతున్నాయి గాని చేతల్లోకి రావడం లేదు. ఇప్పుడు చేతల్లోకి వచ్చేవన్నీ మన స్వార్థం. మనకి కుర్చీ ఎప్పుడు? అనే ఆలోచన. ఇప్పుడు కుర్చీ వచ్చే వరకు ఒక ఏడుపు. వచ్చిన తరువాత దిగకుండా ఉండేందుకు మరియొక ఏడుపు. జనం కూడా అలాగే ఉన్నారు. మొత్తం రాజకీయాలు కూడా అలాగే ఉన్నాయి. కుర్చీ ఎక్కించిన వారిని మంచి పని ఏమైనా చేయిస్తున్నామా మనం? చేయనీం. చేయనీకుండా వాడిని ఎంతసేపూ దింపడానికి ప్రయత్నిస్తున్నాం. వాడికి ప్రోగ్రెస్ మీద ఆలోచన పోయి కుర్చీని గట్టిగా పట్టుకుని ఉండటానికి సరిపోతుంది టైమంతా. అంచేత సమకాలీనమంటే ఇది ఎప్పటికప్పుడు సమకాలీనమే. ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉంది. ఇది ఒకటే కాదు – మిగతా రంగాలు కూడా ఉప్పరపని చేసే వాడి దగ్గర నుంచి ఇంటలెక్చువల్‌గా ప్లానింగ్ చేసేవాడి దగ్గర వరకు వెంటనే చేంజస్ రానే వచ్చినవి. ఫర్ ఎవ్రీ తాట్ దేర్ ఈజ్ ఎ సెల్ఫిష్‌నెస్. ఇఫ్ దేర్ ఈజ్ నో సెల్ఫిష్‌నెస్ ఎనీ

వేర్ ఇస్ ది హ్యూమన్ బీయింగ్. వారు చాంధసుడు క్రింద ట్రీట్ చేయబడు తున్నాడు. వాడికి లారెస్స్ లేవు. కాకాలు పట్టే వాడికి నీవు గొప్ప – నీవు దేవుడవు అని పాదాభివందనం చేసే వాడికి ఇప్పుడు లాభాలు కురిపిస్తున్నాయి గాని నీతి, నిజాయితీలుగా మీరు చేసేది తప్పండి, మీ పేపరు తప్పుగా నడుపుతున్నారండీ అని నేను అన్నాననుకోండి – మీ పేపరులో నా ఇంటర్వ్యూయే ఉండదు. ఈ కాలం యింత ఇదిగా వుంది. నేను ఇటువంటి అభిప్రాయాలు ఉన్నవాడిని. అందుచేత ఆశావాదిని కాబట్టి నేను ఏమనుకుంటున్నానంటే ఆశావాదులందరూ చేరి హ్యూమన్ వాల్యూస్ కొనైన్ననా అట్టిపెట్టుకున్న వాళ్ళు భగవంతుడిపై నమ్మకం ఉన్నా, లేకపోయినా అవసరం లేదు. సాటి మానవుని పట్ల అభిమానం, భక్తి, గౌరవం ఉండి వాడు కూడా మనలాగే బ్రతకాలి. వాడు కూడా సుఖజీవనం చేయాలి అనుకునే టటువంటి ఊహలు, ఉన్న వారెవరైనా, మనమేకాదు మనతో ఉన్నవాళ్ళు అందరి బ్రతుక్కీ ప్రయోజనం ఉంటే తప్పితే మన బ్రతుకుకి అర్థం లేదు అని అనుకున్న రోజున – ఎవ్రీ మ్యాన్ ఈజ్ రియల్లీ హ్యూమన్, ''ప్రతీది సులభముగా సాధ్యపడదులెమ్ము. నరుడు నరుడౌట ఎంతో దుష్కము సుమ్ము'' అని మీర్జాగాలిబ్ ఎప్పుడో 400 సంవత్సరాల క్రితం అన్నాడు. ప్రతి మనిషి అనుకున్నది సాధించటం ఎంత కష్టమో – మనిషి నిజమైన మనిషి కావడం అంతే కష్టం. అంచేత నిజమైన హ్యూమన్ వాల్యూస్ పెట్టుకుని ఆ లైక్ మైండెడ్ పీపుల్ అంతా ఏకమై దీనినంతా ప్రక్షాళన చేయగలిగితే తప్పితే ఇప్పుడున్న దీనికి మోక్షం లేదనుకొనే వాళ్ళలో నేనొకడిని.

ప్రశ్న : సామాజిక చైతన్యం తీసుకురావడానికి సినిమాలు ఉపకరిస్తాయి కదా.

అక్కినేని : ఎందుకు ఉపకరించవు? నీతులు చెప్పవలసిన, పాటించవలసిన వాళ్ళే పాటించకుండా ఉంటే వ్యాపారము చేసుకొనే వాళ్ళము మేమెక్కడ పాటిస్తామండి? గవర్నమెంటు చేయవచ్చు కదా! శ్రీరంగ నీతులు అక్కడ పలుకుతూ లోపలేవో పొట్టలు నింపుకుంటారు. ఎలా? ఆ గొప్ప గొప్ప వాళ్లే యిలా చేస్తే మేము ఏదో సామాన్యులం, సంగీతము పాడి, కవిత్వము చెప్పి, యాక్టు చేసి ఆ కబుర్లు ఈ కబుర్లు చెప్పి నలుగుర్నీ ఎంటర్ టైన్ చేసి బతుకుదామనుకునే వాళ్ళము. మేము నీతులు ఎక్కడ చెపుతాము. నీతులు చెప్పడానికి దేవాలయాలున్నవి. విద్యాలయాలున్నవి. రాజకీయ నాయకులున్నారు. మేము ఎంటర్ టైన్ చేయడం, ఏ డ్రామా ఆర్ మ్యూజిక్ ఆర్ పొయిట్రీ ఫర్ ఎంటర్‌టైన్‌మెంట్. కాకపోతే మేము మాకు ఎంత సామాజిక స్పృహ ఉండాలంటే చెడగొట్టగుండా ఉండేంత వరకు మాత్రమే మా బాధ్యత. ఆ బాధ్యత కూడ మేము నిర్వర్తించటం లేదు. నీతి గల పిక్చర్లు ఎవరు చూస్తారు. నేను ''సుడిగుండాలు'' తీసాను. ఏమైంది. ''మరో ప్రపంచం'' తీసాను. ఏమైంది. అలాగ యింకా కొన్ని పిక్చర్లు కూడా ఉన్నాయి. వాటిని ఎవరు చూస్తారు. ఫెయిలై కుర్చున్నాయి. యిప్పుడు మీ తమ్ముడు, నా తమ్ముడు, మీ కొడుకు, నా కొడుకు ఏమి చూస్తున్నారు – యిప్పుడు ఏదో కబుర్లు చెపుతారులే ముసలివాళ్ళు అని, ముసలివాళ్ళు చాదస్తులు అనుకొని వాళ్ళు వెళ్ళి బాగా బట్టలు లేనివి, ఏమన్నా కనిపిస్తాయేమో అన్న ఆశతో అవి చూస్తారు. యివి తీసేవాళ్ళు ఎవరు? ఆ ఫీలింగ్సు ఉండేవాళ్ళు, వైలెన్సు ఉండేవాళ్ళు ఈ బాడీని ప్రకోపింప చేసే వాళ్ళు మాత్రమే. వీక్‌నెస్‌ని క్యాష చేసుకొనేవాటిని మాత్రమే చూస్తున్నారు. లేకపోతే వాటికి కోట్లు కోట్లు ఎందుకు వస్తున్నాయి. మంచి పిక్చర్లకి రావే? డీసెంట్ కథలు చెప్పితే రావే? అందుచేత యిది జనములో కూడా వచ్చిన మార్పు. యిది మా తప్పా. సంఘము తప్పా అంటే ఎక్కువ సంఘము తప్పు. మా తప్పు ఎంతవరకు అంటే చెడు చూపించకుండా ఉండటము వరకు. అది కూడా చెయ్యటము లేదు కాబట్టి అది మా తప్పు. మరి చెడు చూడవద్దని అనవచ్చు కదా? అమ్మగాని, భార్యగాని, చెల్లెలుగాని, వంట సరిగ్గా చెయ్యకపోతే ఎవరు తింటారు? మీరు తింటారా? నేను తింటానా? చెయ్యి కడుక్కుని పోతాము హోటలుకి వెళ్ళి భోజనము సరిగ్గా రుచిగా ఉండకపోతే వాళ్ళతో మనము పోట్లాడుతున్నామే. అలా పిక్చరు యిది బాగాలేదు. యిది వల్గరుగా ఉంది. సెక్స్ ఉంది. వయిలెన్స్ ఉంది. యిది చెడగొడుతుంది. అన్నాచెల్లెలు చూడలేకపోతున్నాము. తల్లీకొడుకు, తండ్రీ కూతురు చూడలేక పోతున్నాము. సిగ్గు పడుతున్నాము. కుటుంబసమేతముగా కలసి చూడతగిన సినిమా రావటము లేదు అని నిరసించకూడదు! జనము నిరసించటం లేదే, వాళ్ళు కావాలని చూస్తేనే మావాళ్ళు తీస్తున్నారు. విత్తు ముందా చెట్టు ముందా అంటే సమాధానం దేనికదే, ఏమి చెబుతాము మనము. కాని చెయ్యటనికి అవకాశాము ఉన్నది. కాని ది ఫిల్మ్ మీడియా ఆర్ డ్రామా మీడియా ఈజ్ ఫర్ ఎంటర్ టైన్‌మెంట్.

భరతుడు నాట్య శాస్త్రంలో –

*దుఃఖార్తానాం శ్రమార్తానాం శోకార్తో*
*నాం తపస్వినామ్*
*విశ్రాంతి జననమ్ కాలే నాట్యమే*
*తద్భవిష్యతి.*

నాట్యమనే దానిని కష్టపడ్డవాళ్ళకి, దుఃఖబాధితులైన వాళ్ళకి, శోకతప్తులైన వాళ్ళకి సేదతీర్చడానికి వినోదము కోసము నేను ఈ నాట్యశాస్త్రాన్ని రచిస్తున్నాను అంటాడు. కాని వీళ్ళను ఉత్తేజపరచడానికి, వీళ్ళనేదో ఎడ్యుకేట్ చేయడానికి, వీళ్ళకు నీతులు చెప్పడానికి నాట్యశాస్త్రాన్ని వ్రాస్తున్నాను అని భరతుడు కూడా అనలేదు. ఓన్లీ ఫర్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా. కాబట్టి అందులో చెడు చూపించకూడదు. యిది నా అభిప్రాయం. మంచి చెప్పడానికి రాజకీయ నాయకులున్నారు. విద్య ఉంది. దేవాలయమున్నది. తప్పు చెయ్యకూడదు. ఒకళ్ళని చంపకూడదు. త్రాగకూడదు. వ్యభిచరించకూడదు. మరొకరి భార్యవంక చూడకూడదు. యివన్నీ నీతులు ఉండనే ఉన్నవి కదా, మనకు శాసనాలలో ఉన్నవి కదా. వాటిని పాటించరు. అవన్నీ చెయ్యవచ్చు. సినిమాలు మాత్రము బాగా ఉండాలంటే ప్రయోజనమేమున్నది.

ప్రశ్న : నటుల వ్యక్తిగత జీవితాలను ప్రజలు ఆసక్తితో గమనిస్తుంటారు కదా! అలాంటప్పుడు నటులు తమ జీవితాలను ఎలా మలుచుకోవాలంటారు! స్వానుభవంతో చెప్పండి?

అక్కినేని : ఆ స్వానుభవము నాకేమీ లేదు. మొదట నుంచి నేను సెపరేట్ చేసుకొని జీవించాను. నటుడు కూడా అది ఒక క్రొత్త. ప్రక్రియ తప్పితే, కొడుకు, భర్త ఫ్యామిలో పెద్దకొడుకు అయితే పెద్దకొడుకు, చిన్నకొడుకు అయితే చిన్నకొడుకు. మరిది అయితే మరిది. తమ్ముడు అయితే తమ్ముడు అలా బిహేవ్ చేయు సంఘంలో We are very populr. Popularity is sin... అని పాపులారిటీ ఎంత గొప్పదో పాపులారిటీ అంత పాపము కూడా. అంటే నిస్వార్థ ప్రయోజనాలన్నీ తీసి అవతల పెట్టాలి. స్వార్థసుఖాలన్నీ తీసి అవతల పెట్టాలి. That maintains Norms. ఎవరికీ నలుగురుకీ తెలియని వాడు అటు, యిటు ఉన్నా పెద్ద తప్పు లేదు. ఒకడు వ్యభిచరిస్తున్నాడనుకోండి ఎవరికో పదిమందికి తెలుస్తుంది. సినిమా నటుడు ఆ పని చేస్తున్నాడనుకోండి మిలియన్సుకు తెలుస్తుంది. Cinema man should have this responsibility as he becomes individual responsible as he be popular and becomes a public person. A public person should not commit a mistake so that others follow him. యిదన్న మాట. దీనికి సిద్ధంతం వుండాలి. నాకు సంబంధించినంత వరకు నేను కూడా గొప్పవాడినని చెప్పటము నా ధ్యేయం కాదు గాని నేను ఫీలున్నంత వరకు వృత్తిని, జీవితాన్ని రెండూ క్షీర నీర న్యాయంలాగా రెంటిని విడివిడిగా తయారుచేసుకుని ఒక భర్తగా ఒక కుటుంబ పెద్దగా, తండ్రిగా, తాతగా, కొడుకుగా, తమ్ముడిగా నా కారెక్కుతాను. ఒక హ్యూమన్ వాల్యూస్ లాగా బిహేవ్ చెయ్యడానికి నా చిన్నప్పటి నుంచి నేను ప్రయత్నించాను. యాక్టరుగా, త్రాగుబోతుగా, వ్యభిచారిగా, శ్రీరామచంద్రుడిలాగా, విష్ణువులాగా, ఒక పాపులర్ హీరోలాగా అందులో అనేక రూపాలుగా నేను నటించాను. That section is always different to this section. అది దీని మీద ఇన్‌ఫ్లూయన్స్ చేయడం, ఇది దాని మీద ఇన్‌ఫ్లూయన్స్ చేయడం చేయలేదు. ఇవి రెండు సెపరేట్, ట్విన్ పర్సనాలిటిస్. Actor Nageswara Rao is all together different to Akkineni Nageswara Rao. This is the approach from his beginning that everybody knows. నేను వీలైనంత వరకు అలాగే ఉన్నాను, అందరూ అలాగే బతకాలని కోరుకుంటున్నాను. కాని ఈ వీక్‌నెస్ నుంచి కొందరు బయటపడలేదు. అలాంటివాడు ప్రతి కుటుంబంలోనూ వుంటారు. ప్రతిరంగంలోనూ ఉంటారు.

ప్రశ్న : మీరు వ్యక్తిగత జీవితంలో ఖద్దరు దుస్తులను ప్రిఫర్ చేయడంలో జాతీయోద్యమ ప్రభావ మేమైనా ఉందా?

అక్కినేని : జాతీయోద్యమ ప్రభావం కాదది. Khaddar is wonderful cloth for Andhra Pradesh especially very comfortable, though it is little bit costly. చిన్నప్పటి నుంచి మా కుటుంబం కాంగ్రెస్ కుటుంబం. అంటే పెద్ద కార్యకర్తలు కాదుగాని, మా అన్నలు కాంగ్రెసుకు సంబంధించిన వాళ్ళే, చిన్నప్పుడు నేను సినిమాలలోకి రాక ముందు జవహర్ ఖాదీ బండారాన్ని ఒక ముగ్గురు కలసి మూడు అయిదులు పదిహేను వేలు పెట్టి ఒక వ్యాపారము జరుపుతుంటే నాటకాలలో రూ. 2/– లు చొప్పున సంపాదించిన రూ. 1000/– లు ఉండేవి. ముగ్గుర్ పార్టనర్స్ ఏమిటి అనుకుంటుంటే నేను కూడ ఆ రూ. 1000/– లతో పార్టనర్‌గా ఉంటానని చేరాను. గుడివాడలో జవహర్ ఖాదీ భండార్ కోనేరు చెరువుకి ఎదురుగుండా ఉండేది. అప్పటి నుండి ఖద్దరు కట్టడము అలవాటైపోయినది.

అందుకనే ఎప్పుడూ నేను ఖద్దరు కడ్తాను. తరువాత ఎప్పుడూ ఈ సినిమాలలో షోకులు, గీకులు ఎప్పుడూ ఫాంటులు వేసుకోవటమే అలవాటు. నా జీవితమంతా దానిలోనే సరిపోయినది. విడిగా నా బట్టలు కట్టుకునే అవకాశము, అదృష్టము ఎక్కువగా లేదు. యిప్పటికి కూడ లేదు. అందుచేత నేను బయటకు ఎప్పుడు వచ్చినా చక్కగా పొందూరులో నేయించుకొని, పొందూర్‌లో నా అంచులు నేను, నా ఖద్దరు, ఎటువంటిది కావాలో, ఏ జరీయో మళ్ళీ అందులో కల్తీతనము ఎక్కడున్నదో నాకు బాగా తెలుసు, పడుగులోను, పేకలోను కల్తీ కలుపుతారు. శుద్ధ ఖద్దరులో కూడా కల్తీ వచ్చింది. కొన్ని చోట్ల 'పొందూరు ఖద్దరు పంచెకట్టి' అని పాటలు పాడుతుంటే వాళ్ళందరు మెచ్చుకొని నాకు ఉత్తరాలు వ్రాశారు. ఇదిగో కావాలంటే మీకు ఉత్తరము చూపిస్తాను. పొందూరు ఖద్దరు కంపెనీ వారు మీరిచ్చిన ఆర్డరంతా పంపిస్తున్నాము. నాలుగైదు రోజులలో పట్టుకువస్తున్నాము పెద్దతానులు అని వ్రాశారు. ఖద్దరు ప్రాపగాండ చేస్తానని వారి ఉద్దేశ్యం. పాపులర్‌మేన్ ఎప్పుడు ఖద్దరు చక్కగా అంచులు కట్టుకుంటూంటే అందరు మెచ్చుకుంటుంటారు. అందుచేత ఏ ఫంక్షనుకు వెళ్ళినా, బయటకు ఎక్కడకు వెళ్ళినా పెళ్ళికి వెళ్ళినా ఖద్దరు కట్టాల్సిందే. ఖద్దరు కట్టడం and its comfort and I feel that there is some personality in it. what అంటే నేను చెప్పలేను. ఏదీ అంటే నేను చెప్పలేను గాని ఏదో ఉంది. నాకు అలవాటై అలా అనిపిస్తుందో ఏమో మరి అందులో వేసవికాలానికి చాలా బాగుంటుంది.

ప్రశ్న : తమ మీద గాంధీగారి ప్రభావమేమైనా ఉందా?

అక్కినేని : ఎప్పుడో మద్రాసులో దూరంగా చూశాను గాంధీగారిని. నాకు కుర్రతనంలో మద్రాసు హిందీ ప్రచారసభ మీటింగులలో. అప్పటికే నేను సినిమారంగంలో ఉన్నాను. ఇంకా పాపులర్ స్టార్‌ని కాలేదు. అందుకనే దూరంగా చూశాను. అటువంటి Ideal Personality. They have sacrificed whole life మరి ఆయన ఒక పెద్ద ప్రక్రియ సాధించాడు. అన్నిటికంటే ముందు ఏమిటంటే ఈ రోజు ఆటంబాంబు కంటే బలవత్తరమైనది సత్యాగ్రహము, యింత పెద్ద దేశంలో సత్యాగ్రహము లేకుండా గనుక రక్తపాతము జరగవలసివస్తే ఎన్ని లక్షలమంది జనము చచ్చిపోయి ఉండేవారు? అటువంటి దానిని, యింత జనాభాని సేవ్ చేసిన మహా మేధావి లక్షణం ఆయనలో ఉంది. అందుచేత ఎక్కడో దేవుడు న్నాడనుకోవటము...

*త్యాగబుద్ధితో దేశానికి సేవచేసేవా*
*డొకప్పుడు మానవుడు,*
*బుద్ధినే త్యాగంచేసి దేశాన్ని దోచుకు*
*తింటున్నాడు ఇప్పుడు*
*దీనికి విముక్తి ఎప్పుడు?*
*మన మనస్సులు మారినప్పుడు,*
*మరో ప్రపంచం వచ్చినప్పుడు.*

30 సంవత్సరముల క్రితం నా దృష్టిలో ఉన్నారు గాంధీ మహాత్ముని లాంటివారు. నాకు వారి ప్రభావము పెద్దగా నా దగ్గర లేకపోయినా But (కాని) ఉన్నది. మంచిని గుర్తించుకోకుండా మనిషి ఎవరైనా ఉంటే వారిని గురించి మనము ఆలోచించకుండా ఉండటమే మంచిది. కనీసము మనము మంచి చెయ్యకపోయినా చేసిన మంచిని గుర్తించటమన్నా తెలియాలి గదా! మనకి. అందుచేత స్వాతంత్ర్య సముపార్జన కోసము సత్యాగ్రహము చేసేవాడొకప్పుడు మానవుడు సత్యాగ్రహము చేసి స్వార్థ ప్రయోజనాలను సాధింప చూస్తున్నాడు యిప్పుడు. దీని విముక్తి ఎప్పుడు? మన మనస్సు మారినప్పుడు, మరో ప్రపంచము వచ్చినప్పుడు. ఇవన్నీ ఇన్‌ఫ్లూయన్సెస్ లేకుండా ఉండవు. కాని నా వద్ద గాంధీ గారి ఉత్తేజము ఉన్నది. ఉద్బోధన ఉన్నదని చెప్పడానికి నేను ఆయన్ని ఎక్కడో ఫర్లాంగు దూరాన్నుంచి చూసిన కుర్రాడ్ని. అవన్ని చెప్పడం అధిక ప్రసంగం. కాని ఒక మనిషి బుద్ధుడు గాని, శ్రీరాముడు గాని, శ్రీకృష్ణుడు గాని వాళ్ళు ఉన్నారా? లేరా? అన్నది వదిలిపెట్టి ఎగ్జాగరేటేడ్ థింగ్స్ కూడా ఉండవచ్చు. వాళ్లు దేవుళ్ళు అన్న సబ్జెక్టు వదలిపెట్టేసి ఎప్పుడు, ఎక్కడ చిక్కు సమస్యలలో చాకచక్యంగా ప్రవర్తించారు అని ఆలోచించాలి. శ్రీరాముడు అంత "సాఫ్ట్‌మాన్" కూడా యుద్ధము చేయవలసి వచ్చినప్పుడు ఎలా చక్కగా ప్రవర్తించాడు. ముహూర్తము పెట్టమన్నప్పుడు రావణాసురుడ్ని ముహూర్తము ఎందుకు పెట్టమన్నాడు? వాడ్ని చంపవలసి వచ్చినప్పుడు ఎలా చంపాడు? మన స్టోరీస్‌లో కొన్ని నీతులు ఉన్నాయి కదా? ఇవన్నీ కనీసము చేయగలిగినా, చేయలేకపోయినా వాటిని ఫాలో కావటం కొంత న్యాయము కదా! కనీసము మననము చేసుకోవటము కొంత న్యాయము కదా!" ఇవీ ఆనాడు నాతో పంచుకున్న అక్కినేని ఆలోచనలు, అభిప్రాయాలు, జీవితాదర్శాలు. ఆ మహనీయునికి ఇదే నా అక్షర నివాళి.

మండలి బుద్ధప్రసాద్
పూర్వ శాసనమండలి అధ్యక్షులు , ఫోన్ : 9059480872

# ఉషోదయం

– శ్రీమతి కె. వరలక్ష్మి

శ్రీమతి కె. వరలక్ష్మి మంచి కథా రచయిత్రి. ఆవిడ నవలలూ రాశారు. ఆమె కూతురు కె. గీత మంచి కవి. విదేశంలో ఉంది. అక్కడ ఉన్నా తెలుగు భాషాభిమానంతో 'నెచ్చెలి' అన్న అంతర్జాల పత్రిక నడుపుతున్నారు. ఆ పత్రిక నిర్వహణలో శ్రీమతి కె. వరలక్ష్మి భాగస్వామ్యం ఉంది.

కె. వరలక్ష్మి గారు రాసిన నవల ఉషోదయం 1986 అక్టోబరు జ్యోతి మాసపత్రికలో ఈ నవల ప్రచురణ జరిగింది. ఆ రోజుల్లో తెలుగు వార, మాస పత్రికలు ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, యువ, జ్యోతి, స్వాతి లాంటి వాటిల్లో సాంఘిక నవలలు, అందులోనూ ప్రముఖంగా కుటుంబ నవలలే ఎక్కువగా వచ్చేవి. వేరే జానర్ నవలలు చాలా తక్కువ. 'ఉషోదయం' అపరాధ పరిశోధన నవల. ఇటువంటి నవలలు ప్రచురించటానికి 'అపరాధ పరిశోధన' లాంటి డిటెక్టివ్ పత్రికలు వేరుగా ఉండేవి. అప్పటి తెలుగు మాస పత్రికలు చాలా వరకు మంచి మంచి కథలు ప్రచురించేవారు. దీపావళి ప్రత్యేక సంచికలు ముచ్చటగా ఉండేవి. దీపావళి, సంక్రాంతి లాంటి పండగలకే కాక, వివిధ సందర్భాలలో కథల పోటీలు పెట్టేవారు. ఆ పోటీలకి పెద్ద కథా రచయితలు న్యాయ నిర్ణేతలుగా ఉండి నిష్పాక్షికంగా నిర్ణయం చేసేవారు. అంతా ఎంతో నిజాయితీగా ఉండేది. నవలల్ని తమ పత్రిక వ్యాపారాభివృద్ధికి తోడ్పడేలా ఎంపిక చేసుకునేవారు. కొన్ని కథలు, ఒకటి రెండు నవలలు, జాతక వార మాస ఫలితాలు, సినిమా కబుర్లు, పుస్తక సమీక్షలు, ఇలా కుటుంబంలోని అందరి అభిరుచికి అనుగుణంగా ఉండేవి పత్రికలు. వ్యాపార పోటీ వల్ల పత్రికలలో మార్పు కోసం కొంతమంది సంపాదకులు కొన్ని ప్రయత్నాలు చేసేవారు. బహుశా అటువంటి ప్రయత్నమే ఈ 'ఉషోదయం' నవల జ్యోతిలో ప్రచురించటం. స్వాతి మాసపత్రిక వచ్చి నాన్ ఫిక్షన్‌కి సేలబిలిటీ ఉందని కనిపెట్టి, వివిధ శీర్షికలకి పెద్దపీట వేసేవరకూ, పత్రికలు పైకోవలోనే సాగాయి.

ఇంక నవల వరకూ వస్తే, ఇది చక్కటి ప్లాట్‌తో ఎంతో పకడ్బందీగా సాగింది. నవల త్రిపురా పబ్లిక్ స్కూలుతో ఆరంభం అవుతుంది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ చెరువు పూడ్చిన స్థలంలో కట్టిన పెద్ద స్కూలది. ఊళ్ళోకి పెద్దది, చాలా మంచిదని ఆ స్కూలుకి పేరు. హాస్టలు వసతి ఉంది. బైటనుంచి వచ్చి చదువుకునే పిల్లల్ని స్కూలుకి తీసుకు రావటానికి, స్కూలు అయిపోయాక తిరిగి దింపటానికి స్కూలు బస్సులు చాలా ఉన్నాయి. త్రిపురా స్కూలని పేరున్న ఆ త్రిపురాదేవి జమిందారీ కుటుంబానికి చెందిన ఆవిడ. భర్త, జమిందారీ గతించాయి. తమ ఊళ్ళో ఉన్న పొలాల్ని, ఆస్తుల్ని ఆవిడ అన్నవరసైన శోభనాద్రి రావు అండతో జాగ్రత్తగా నిర్వహించుకుంటూ వస్తోంది. ఆవిడ ఏకైక సంతానం స్వప్న. స్వప్నని చాలా గారంగా, ప్రాణంగా పెంచటమే కాక బాగా చదివించింది. స్వప్న లండన్‌లో ఎమ్.బి.ఏ చేసింది. తిరిగి వచ్చాక ప్రయోజన కరంగా ఏదైనా చెయ్యాలని ఆ స్కూలు పెట్టింది. స్కూలుకి తల్లిపేరు పెట్టుకుంది.

స్వప్నకింకా పెళ్లి కాలేదు. స్కూలు పిల్లల్ని తల్లిలా, ప్రాణంగా చూసుకుంటుంది. చాలా చక్కటి మేనేజ్‌మెంట్. ఆ స్కూలుకి ఏ చిన్న చెడు పేరు లేదు. అలాంటి ఆరోజు ఓ ఘోరం జరిగింది. ఆ స్కూలులో చదువుతున్న ప్రవీణ్ రోజూ వచ్చే స్కూలు బస్సులో ఇంటికి రాలేదు. మిస్సింగ్. ప్రవీణ్ తల్లి రోహిణి, తండ్రి సురేంద్ర పిల్లాడి కోసం వెతుకుతూ పడిన బాధ, టెన్షన్ వర్ణనాతీతం. చివరికి సురేంద్ర స్వప్న దగ్గరకొచ్చి విషయం చెప్పాడు. స్కూలు, హాస్టల్ అంతా వెతికారు. ప్రయోజనం లేకపోయింది. స్వప్న మనసు పాడై పోయింది. మరోదారిలేక పోలీస్ రిపోర్ట్ ఇచ్చారు. ఈ ఘటనని కె. వరలక్ష్మి గారు చాలా బాగా రాశారు. నవల చదివే వారు గుండెలు బిగబెట్టుకు చదువుతారు. అదేకాదు ఆ తర్వాత రెండు రోజులు వరసగా మరో ఇద్దరు పిల్లలు మిస్సింగ్. త్రిపుర స్కూలు

నుంచి పిల్లలు అదృశ్యమవటం పేపర్ల కెక్కింది. తప్పి పోయిన పిల్లల తల్లితండ్రులు జీవశ్చవాల్లా మారారు. వాళ్ల బాధ, పిల్లలు ఏమయ్యారు అసలు బతికున్నారా? అన్న ఆందోళన, ఈ మిస్టరీని రచయిత్రి చాలా నేర్పుగా నడిపారు. అందుకు ఆవిణ్ణి ప్రశంసించాలి.

నాలుగైదు రోజుల తర్వాత, ఊళ్లో ఉన్న త్రిపురాదేవికి ఓ ఉత్తరం వచ్చింది. తరతరాలుగా వస్తున్న జమిందారీ జవహరీ కోసం పిల్లల్ని కిడ్నాప్ చేసినట్టు ఆ ఉత్తరంలో ఉంది. ఆవిడ ఆ జవహరి తను చెప్పినట్టు అప్పగించాలని లేకపోతే స్వప్ననీ కిడ్నాప్ చేసి చంపుతానని బెదిరింపూ ఆ ఉత్తరంలో ఉంది. భయపడిపోయిన త్రిపురాదేవి జవహరీతో సహా హైదరాబాద్‌లో స్వప్న దగ్గరకి వచ్చేసింది. ఆ తర్వాత ఈ నవలలో, అన్ని అపరాధ పరిశోధన నవలల్లో ఉండే రకరకాల సంఘటనలు, పాత్రలు, పుష్కలంగా సస్పెన్సు ఉన్నాయి. ఎవరో ఒక పాత్రమీద, తనే నేరం చేస్తున్నట్టు అనుమానం కలిగించటం, చివరికి తనుకాదని, అనుకోని పాత్రల్ని నేరస్తుల్ని చెయ్యటమూ అన్ని డిటెక్టివ్స్‌లా ఈ నవలలోనూ ఉన్నాయి. అనుమానం శోభనాద్రిరావు మీద కలిగేలా చేశారు రచయిత్రి. ఆయన నేరస్తుడు కాదు. ఆయనకి ఒక కొడుకున్నాడు. అతను బెంగుళూరులో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. అతని పేరు మనోజ్. మనోజ్ జమిందారీ జవహరీ గురించి తన క్లాస్‌మేట్ నరేన్‌కి చెప్పాడు. నరేన్‌ది క్రిమినల్ తత్వం. మనోజ్‌ని ఒప్పించి హైదరాబాద్ తీసుకొచ్చాడు. పిల్లల్ని కిడ్నాప్ చేసి స్కూలు నేలమాగిళిలో దాచారు. చివరికి పదిరోజులుగా పిల్లలు తల్లీతండ్రి మీద బెంగతో బక్కచిక్కిన పిల్లల్ని చూసి మనోజ్ మారి మంచివాడయ్యాడు. నరేన్‌ని ఈ పని మానెయ్యమని బతిమాలాడు. నరేన్ వినలేదు. పిల్లల్ని బ్లేడుతో కోసి ఆ రక్తం అంటిన ముగ్గురి చొక్కాలు స్వప్నకి అందేలా చేసి భీభత్సం చేశాడు.

ఆఖరికి స్వప్న స్నేహితులు రోజీ, చిత్ర (పోలీస్ ఆఫీసర్) పోలీసులు కలిసి పిల్లల్ని రక్షించి, నరేన్‌ని పట్టుకున్నారు. పిల్లలు వారు తప్పిపోయి కనపడకపోతే కలిగే హృదయ విదారక బాధ, పసిపిల్లల యాతనా లాంటి అత్యంత మానవత్వ విషయం ఈ నవలకి ముఖ్య ముడి సరుకు కాపోతే, 'ఉషోదయం' అతి సాధారణ అపరాధ పరిశోధన నవల అయ్యుండేది. అలాకాకపోటం, అంతా సుఖాంతం అయి ఉషోదయం అన్నపేరు సరిపోవటం, మంచి సస్పెన్సు, పట్టుతో సాగి, చక్కటి రీడబిలిటీ ఉండటం ఈ నవల ప్రత్యేకత. అలా అని ఈ నవలలో లోటుపాట్లు లేవని కాదు. స్కూల్లో నేలమాళిగ, టాయిలెట్ నుంచి సొరంగం, దారి, ఇవి ఎవరు ఎందుకు తవ్వారో నవలలో సూచనగానైనా లేదు. అలాగే నరేన్‌కి తుపాకులు, డైనమిట్ అందుబాటు లోకి ఎలా వచ్చాయో లేదు. ఏది ఏమైనా ఇలాంటి అపరాధ పరిశోధన నవల జ్యోతి లాంటి పత్రికలో రావటం విశేషం.

వి. రాజా రామమోహన రావు
ఫోన్ : 9394738805



కొసరాజు రాఘవయ్య చౌదరి

కొసరాజు గారు గుంటూరు జిల్లా అప్పికట్ల గ్రామంలో జన్మించారు. వీధి బడివరకే చదివినా ఆంధ్ర, సంస్కృత గ్రంథాలు చదివి పాండిత్యం సంపాదించారు. 'కొండ వీటి వైభవం' అనే కావ్యం, 'శంబుకర్షి' అనే శతకం, 'గండికోట యుద్ధం' అనే మంజరీ ద్విపద కావ్యం రచించారు. 'మిత్రనీతి, భానుగీత, వీరశేఖర శతకం, సినిమా డైరెక్టర్స్, రాష్ట్రగీతికలు మొదలైన రచనలు చేశారు. 'రైతు జన విధేయ రాఘవయ్య' అనే మకుటంతో వీరు రాసిన 'రాఘవయ్య శతకం' రైతు జనాభిమానానికి నిదర్శనం. సినిమారంగంలో ప్రవేశించి జానపద సంగీత బాణీలలో దాదాపు మూడువేల సినిమా పాటలు రాశారు. కనకాభిషేక సత్కారం, 'కవిరత్న, జానపద కవిసార్వభౌమ, ప్రజాకవి' మొదలైన గౌరవాలు పొందారు.

*(కలం రేఖలు –శంకర్ నారాయణ)*

### నవలా పరిచయాలు

# మాలతి చందూర్

*– పి. హరిపద్మరాణి*

26 డిసెంబర్1928 న పుట్టి, 21 ఆగస్టు 2013 లో మరణించిన ప్రముఖ తెలుగు రచయిత్రి మాలతి చందూర్ మరణించి పది సంవత్సరాలు నిండింది. ఈ రచయిత్రి మరణానంతరం ఆమె కుటుంబ సభ్యులు, పలు విశ్వవిద్యాలయాల్లో ఆమె జ్ఞాపకార్థం ఒక ధర్మనిధిని ఏర్పాటుచేసి, ఆ నిధిపై ఏటా వచ్చే వడ్డీతో, ప్రతి సంవత్సరము ఆమె వర్ధంతి అయిన 21 ఆగస్టున ఆమె స్మారక సదస్సును నిర్వహించుకునే విధంగా ఏర్పాటు చేశారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖ, 2017 నుంచి మాలతి చందూర్ స్మారక ధర్మనిధి సదస్సును క్రమం తప్పకుండా ప్రతి ఏటా నిర్వహిస్తూ వస్తుంది. ఈ ఏడాది ఆగస్టు 21న జరిగిన ధర్మనిధి సదస్సులో ఈ వ్యాసరచయిత్రి సమర్పించిన పత్రం ఇది. దాదాపు పాతిక,ముప్ఫయ్ఏళ్ల పాటు ప్రతినెలా స్వాతి మాసపత్రికలో 'పాత కెరటాలు' అనే శీర్షికలో, మాలతి చందూర్, ఆంగ్లంలో లభ్యమయ్యే సుమారు 350 నవలలు పరిచయం చేశారు. వీటిలో కొన్నిటిని, పాత కెరటాలు అనే పేరుతోనే రెండు సంకలనాలుగా తీసుకొచ్చారు. ఈ రెండు సంకలనాలలో చేర్చని ఓ 160 నవలల పరిచయాలను 'నవలా మంజరి' అనే పేరుతో ఆరు సంపుటాలుగా 2013లో క్వాలిటీ పబ్లిషర్స్, విజయవాడ వారు ప్రచురించారు. తరువాత ఈ నవలా పరిచయ సంకలనాలు మూడుసార్లు పునర్ముద్రణ కూడా అయ్యాయి. "పాత కెరటాలు" శీర్షిక నిర్విరామంగా పాతికేళ్ల పైన స్వాతి పత్రికలో కొనసాగటం,: మాలతి చందూర్ రాసిన నవలా పరిచయాలకున్న పాఠకాదరణకు నిదర్శనం.



మాలతి చందూర్ రాసినవి నవలా పరిచయాలే కానీ నవలా సమీక్షలు అనలేము. సమీక్షలో ఒక నవలలో ఉన్న మంచి,చెడు, బాగున్న అంశాలు,బాగా లేని అంశాలూ రెండూ ప్రస్తావిస్తారు. అలా కాకుండా మాలతి చందూర్ తను చదివిన వాటిలో తనకు బాగా నచ్చిన నవలలను మాత్రమే పరిచయం చేశారు:

"నాకు బాగా నచ్చితే గాని ఏ రచన నేను పరిచయం చెయ్యలేను" మాలతి చందూర్ నవలా పరిచయాలలో ఎక్కడా తను పరిచయం చేస్తున్న రచనలలోని లోపాల ప్రస్తావనే ఉండదు. ప్రతి నవల పరిచయంలో రచయిత పేరు, పుస్తకం ఎవరు ప్రచురించారు? లాంటి సమాచారంతోపాటు, తనకు తెలిస్తే, రచయిత ఇతర నవలలు, రచయిత ప్రత్యేకత, పుస్తక ప్రత్యేకత, పుస్తక పరిచయ ఉద్దేశ్యం, పుస్తక నేపథ్యం, పుస్తక సందేశం, సాహిత్య ప్రపంచంలో ఆ పుస్తకానికున్న ఆదరణ లాంటి అంశాలను కూడా ప్రస్తావిస్తారు. ఉదాహరణకు ఒక నవలా పరిచయనిడివి సగటున తొమ్మిది పేజీలు ఉంటే అందులో రెండు పేజీలు ఈ అంశాల ప్రస్తావనకే కేటాయిస్తారు మాలతి చందూర్. ఆమె ఈ అంశాలను తన పరిచయాలలో ఎలా ప్రస్తావిస్తారో కొన్ని ఉదాహరణల ద్వారా చూద్దాం:

1.మార్గరెట్ మిచెల్ స్త్రీ అయినా ఆమె పురుషుడిలా ఆలోచించగలదు అనిపిస్తుంది. స్త్రీ రచయిత పురుషుడిలా ఆలోచించటం గ్రంథాలు రాయటం చాలాచోట్ల ఉంది. కానీ, ఒక స్త్రీ పురుషుడి లాగానూ, స్త్రీ లాగానూ కూడా ఆలోచించి రాయడం చాలా అరుదు. అట్లా రాసిన రచయిత్రి మార్గరెట్ మిచెల్.

2. మేరీ ఇవాన్స్, జార్జ్ ఇలియట్ అన్న కలం పేరుతో రాసింది. ఇప్పటికి 150 ఏళ్ల క్రితమే ఈ సమాజపు కట్టుబాట్లనీ, శుష్కవివాహ వ్యవస్థనీ ఎదురించి తనను ప్రేమించిన వారితో పెళ్లి కాకుండానే పాతికేళ్లపాటు సుఖంగా జీవితయానం సాగించి, ఆంగ్ల సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే రచనలు చేసింది. కాలానికి ఎదురీది, ఆ ఎదురీతలో విజయం సాధించిన వ్యక్తి జార్జ్ ఇలియట్. ఈమె గురించి ఇంత ఎందుకు చెప్పానంటే, మానసిక శక్తి ఒక మగవారి సొత్తే కాదు- ఆడవారిలో కూడా ఉంది అన్నదానికి. తను పరిచయం చేస్తున్న పుస్తకాన్ని ఎందుకు చదవాలి అన్న ప్రశ్నకు మాలతి చందూర్ ఎలాంటి వివరణ ఎలా ఇస్తారో చూద్దాం:

1. ముఖ్యంగా ఒంట్లో బాగా లేనప్పుడు, బుర్ర సరిగా పని చేయనప్పుడు, ఇలాంటి నవలలు చదివితే టానిక్ లాగా పనిచేస్తాయి... దేహారోగ్యానికి టానిక్ పనిచేసినట్లే - మానసిక ఆరోగ్యానికి అప్పుడప్పుడు ఇలాంటి రచనలు చదివితే మంచిదనిపించింది. నేను చదివాక పాఠకులతో ఆ సంతోషం పంచుకోవాలని - వారికి పరిచయం చెయ్యాలని, ఇదివరలో చదవని వాళ్ళు ఈ పరిచయం తరువాతనైనా చదువుతారనీ రాస్తున్నాను. 2. అలాగే ఎమ్మాస్మిత్ రచించిన "ది ఫార్ క్రయ్" పుస్తకాన్ని గురించి ఇలా చెబుతారు:

పాశ్చాత్యుల దృష్టిలో మన దేశం ఎంత అందంగా ఉంటుందో తెలుసుకోవడానికి "ది ఫార్ క్రయ్" ప్రతి ఒక్కరూ చదివి తీరాలి. పెరల్ బక్ చైనా భాష నుంచి ''ఆల్ మెన్ ఆర్ బ్రదర్స్'' అనే ప్రఖ్యాత గ్రంథం ఇంగ్లీషులోకి తర్జుమా చేసింది. ఇవిగాక "ది మదర్", "డ్రాగన్ సీడ్"," ది ప్రామిస్" మొదలైన ఇతర నవలలు చాలా రాసింది. ఈమె ప్రతి నవలాపాఠకులను అలా కూర్చోపెట్టి ఒక్క బిగిని చదివింప చేస్తుంది. దిస్ ప్రౌడ్ హార్ట్ అనే నవల ఒక అమెరికన్ శిల్పి జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకొని ఆమె రాసిన మొదటి నవల ఇది. ఈ నవల కూడా చాలా బాగుంటుంది. పెరల్ బక్ పుస్తకాలు ఇవి అవి అని కాదు. ఏవి దొరికితే అవి చదవవచ్చు. అన్నీ వజ్రాలే. ఈ ప్రఖ్యాత రచయిత్రి మూడు నాలుగేళ్ల క్రితం మరణించారు.

1.మనిషికి దేని వల్ల తృప్తి కలుగుతుంది?ధనమా? పదవా? ప్రేమా? కుటుంబమా? దేనివల్ల అన్న దానికి జవాబే మేరీ జీవితం. మనిషికి అత్యంత తృప్తినిచ్చేది- ఒక లక్ష్యం. ఆ లక్ష్యం ఉన్నప్పుడు మనిషి స్త్రీ పురుషులన్న భేదం లేకుండా నిర్భయంగా ముందుకు నడవగలడు అన్న సార్వజనీయమైన సత్యాన్ని మరొకసారి జ్ఞాపకం చేస్తుందీ నవల. 2. కళాకారుల్లో పోటీ ఉండవచ్చు. ఒకరి కంటే మరొకరు మిన్నగా ఉండాలని- ప్రయత్నించవచ్చు. అయితే, అది ఎదుటి వ్యక్తిని నాశనం చేసేదిగా, అక్రమమూ, క్రూరమూ అయిన విధంగా ఉండకూడదు. కళాకారుడు ఎప్పుడైతే హృదయ స్పందన కోల్పోతాడో అప్పుడు అతనికీ రాక్షసునికీ మధ్య తేడా ఉండదు. కళ దైవదత్తమైనది. దివ్యత్వం గల ఆ కళని అసుర ప్రవర్తనతో నాశనం చేయాలనుకున్నప్పుడు, ఆ కళాకారుడు అసురుడు అవుతాడు. నవలా రచనకి సాహిత్యానికి సంబంధించిన విషయాలుతను పరిచయం చేసే నవలల గురించే కాక, నవలా రచనకి, సాహిత్యానికి సంబంధించిన అనేక జనరల్ విషయాలు మాలతి చందూర్ తన పరిచయాలలో ఎలా వుటంకిస్తారో తెలుపుతాయి ఈ క్రింది ఉదాహరణలు:

1. ఒక కాలంలో సాహిత్యంలో నిడివి గురించి ఎవరూ గమనించేవారు కాదు. ఎందుకంటే గ్రంథపఠనం బుద్ధి జీవనుల జీవితంలో ఒక భాగంగా ఉండేదవడం వల్ల. ఇప్పుడు లాగా ప్రతిదీ 'మినీ' సైజులో చూడాలని అనుకునేవారు కాదు ఆ రోజుల్లో. అందుచేతనే సుదీర్ఘమైన నవలలు చాలా వస్తుండేవి. 2. నవలకి సాహిత్యంలో విలువ ఉన్నదా? లేదా? అన్న ప్రశ్నకు, సూటిగా జవాబు చెప్పడం కష్టం. నవల సాహిత్యంలో ఒక భాగం. అయితే ప్రతి నవలలో సాహిత్యపు విలువలు ఉంటాయి అని ఖచ్చితంగా చెప్పలేం. మంచి నవల-చెడ్డ నవల అని ఆ నవలల్లో గల వస్తు ప్రాధాన్యాన్నిబట్టి నిర్ణయిస్తారు విమర్శకులు. నవలలు మంచి చెడు అని నిర్ణయించడం సరికాదు. బాగా రాసిన నవల, చెత్తగా రాసిన నవల అని తప్ప, ఇతివృత్తం ఏమీ లేకుండా పాఠకుని చదివింప చేయగల నవలలు కూడా ఉన్నాయి. నవలలో సాహిత్యపు విలువలు ఉన్నాయా? లేదా? అని తర్కించేకంటే నవలలో ప్రయోజనం ఉందా? అది పాఠకుని ఆలోచింప చేస్తుందా? పాఠకునికి ఒక సందేశం ఇచ్చి అతడిని వివేకవంతుని చేస్తుందా? అలా అయితే అది మంచి నవలే.

3. కాలంతోపాటు సాంఘికపరిస్థితులూ, జీవన విధానమూ, దృక్పథమూ, సాహిత్యమూ అన్నీ మార్పు చెందుతూ ఉంటాయి. మనిషి ఆలోచన విధానం, మానవ

విలువలూ, ఎంత విచిత్రంగా మారిపోతున్నాయో - సాహిత్యంలో స్పష్టంగా ప్రతిఫలిస్తూ ఉంటుంది.

ఈ మధ్య వచ్చిన నవలలు- ఏ భాషలో నవలలైనా సరే చదువుతుంటే, అందులో పగ, ప్రతీకారం, హింస- ఇవి కథా వస్తువులుగా తరచు కనిపిస్తుంటాయి. లేకపోతే అభూత కల్పనలు, పరిశోధనాత్మక నవల- 'ఇన్వెస్టిగేటింగ్' అన్న పేరుతో రాజకీయపు అపవాదులు, అక్రమ సంబంధాలు, అవినీతి, లంచాలు- వీటితోపాటు హత్యలు వగైరాలతో కనిపిస్తున్నాయి తప్ప- వ్యక్తి ఆశయాలకి కట్టుబడి ఆత్మశక్తితో నిలబడగలదు అని - చూపించగల నవలలు గగనమైపోతున్నాయి. సినిమాలుగా తీయబడిన నవలలు:తను పరిచయం చేస్తున్న నవలలు సినిమాలుగా వచ్చి ఉండి వాటిని తను చూసి ఉంటే ఆ సినిమాల గురించి కూడా రెండు మాటలు చెప్పి,' కుదిరితే మీరు కూడా చూడండి' అని పాఠకులకు సిఫారసు చేస్తూనే మన భారతీయ సినిమా తీరుపై తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వ్యక్తపరుస్తారు మాలతిచందూర్. 'ది డైరీ ఆఫ్ యాని ఫ్రాంక్' అనే పుస్తకపరిచయంలో భాగంగా, ఆ పుస్తకాన్ని ఆధారంగా చేసుకుని నిర్మించిన సినిమాగురించి చెబుతూ ఇలా అంటారు:

1. ఒక సినిమా తీయాలంటే ఇటు కశ్మీర్ నుంచి అటు ఊటీ దాకా తారలతో సహా పరిగెత్తి, హెలికాప్టర్ మీద అన్ని అడవులను ఫిలిం తీసి, చివరికి అర్థం లేని సంగీతంతో వికృతమైన డాన్సులతో మనల్ని ఏడిపించే మన డైరెక్టర్స్ ఈ సినిమా నుంచి నేర్చుకోవలసినవి ఎన్నో ఉన్నాయి. కథ పట్టుత్వము కలదైతే ఒక గదిలో కాదు అరగదిలో అయినా సరే, పిక్చర్ అంతా నడిపించవచ్చు- కథ పేలవమైతే బ్రహ్మాండమైన సెట్టింగ్సూ, ప్రకృతి దృశ్యాలూ, భయంకర నృత్యాలు కావాలి. ఈ సినిమాలో కనబడే ప్రకృతి దృశ్యం నీటి కాకులు, రాబందులు,దూరాన ఉన్న టవర్ క్లాక్. నవలా పరిచయాలలో మాలతి చందూర్ వాడిన తెలుగు ఎంతో స్పష్టంగా ఉండటమే కాక, వివరించే విషయాలు ఆంగ్ల నవలలలో ఉన్న పాశ్చాత్య దేశాలకు సంబంధించిన విషయాలే అయినా, తెలుగు జాతీయత, నుడికారం ఉట్టిపడేలా ఎంతో సరళంగా, రమ్యంగా అనిపిస్తుంది: విమానాశ్రయంలో 'నేల ఈనినట్లు' ఎక్కడపడితే అక్కడ ప్రయాణికులూ, 'గుట్టలు గుట్టలుగా' సామాన్లు పడి ఉన్నాయి. 2. 'ఇంగువ కట్టిన బట్ట' లాగా సంప్రదాయ వాసన వదులుకోక శిథిలమైపోతున్న కుటుంబాలు... 3. రోహిణి కార్తెలో కొండశిఖరం నుంచి మంచుగడ్డమీద బోర్లా పడిపోయినంత భయంకరంగా ఉంటుంది ఆమె పరిస్థితి. నవలా మంజరి ఆరు సంపుటాలలో కలిపి 160 రచనలు ఉన్నాయి. ఒకటి, రెండు, ఐదు, ఆరు సంపుటాలలో ఒక్కొక్క దానిలో 25 చొప్పున, మూడు, నాలుగులలో 30 చొప్పున మొత్తం 160. ఈ నూట అరవై రచనల పరిచయాలను ఒక కార్పస్ గా పరిశీలిస్తే మనకు కొన్ని ఆసక్తికరమైన అంశాలు బయటపడతాయి:

160 నవలాపరిచయాలలో 50 స్త్రీల రచనలు ఉన్నాయి. అంటే మూడు నవలలు తక్కువగా దాదాపు మూడో వంతు. 15 భారతీయ రచనలు ఉండగా మిగతావన్నీ, ప్రధానంగా బ్రిటిష్, అమెరికన్ రచనలు. 50 స్త్రీల రచనలలో ఒకటి 'ప్రజా హృదయరాణి' అనే శీర్షికతో మాలతి చందూర్ ప్రిన్సెస్ డయానాపైన రాసిన వ్యాసం కూడా ఉంది ఇది ఏ నవలకూ పరిచయం కాదు. ప్రిన్సెస్ డయానా యాక్సిడెంట్లో ఎవరూ ఊహించని విధంగా చనిపోయిన సందర్భంలో,ఆమె గురించి పాఠకులకు తెలియచెప్పే ఉద్దేశంతో రాయబడిన వ్యాసం ఇది. మిగిలిన 49 స్త్రీల రచనలలో ఎలిజిబెత్ బౌని అనే ఆమె రాసినదిగా పేర్కొన్న "ఆఫ్రికన్ హృద్గీతి", మేరీ హాకెట్ అనే ఆమె రాసిందిగా పేర్కొన్న ''ద క్లిఫ్ట్ ఎడ్జ్'', ఉర్సుల కె. రాసిందిగా పేర్కొన్న 'ఓవర్ యువర్ డెడ్ బాడీ' అనే మూడు నవలల జాడ తెలియలేదు. అంతర్జాలంలో ఎంత శోధించినా ఎన్నిసార్లు వెతికినా ఈ నవలల పేర్లకు దగ్గరగా ఉన్నవి కూడా ఆ రచయితల రచనల జాబితాలలో ఎక్కడ లేవు. నవలల పేర్లతో రచయితల కోసం వెతికితే, ఆ పేర్లు ఈ రచయిత్రుల పేర్లతో పొంతన లేకుండా ఉన్నాయి. బ్రిటిష్ రచయిత్రి డయానే పియర్సన్ రాసిన "వాయిసెస్ ఆఫ్ సమ్మర్" అనే నవలా శీర్షికని పొరపాటుగా "సమ్మర్ సాంగ్" అని పేర్కొనడం జరిగింది. అలాగే పై మూడు నవలల విషయంలో కూడా ఏదో పొరపాటు జరిగి ఉంటుంది అనిపిస్తుంది. 49 స్త్రీలు రచనలలో, జాడ తెలియని నవలలు మూడు వదిలేస్తే, మిగిలేది 46 రచనలు. ఈ 46 లో "14 ఏళ్ల బాలిక కథ" అనే రచన, నవల కాదు. ఇది రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో, "డైరీ ఆఫ్ యాని ఫ్రాంక్ "అనే 14 ఏళ్ల యూదుల బాలిక రాసుకున్న డైరీ. ఇక మిగిలిన 45 స్త్రీల నవలలని ఒక కార్పస్ గా

పరిశీలిస్తే అనేక ఆసక్తికరమైన విషయాలు మనకి తెలుస్తాయి 45 నవలల్లో భారతీయ రచనలు రెండు. అట్టియా హుస్సేన్ రాసిన "సన్ లైట్ ఆన్ ఏ బ్రోకెన్ కాలమ్", అరుంధతి రాయ్ రాసిన "ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్" అనేవి. బెంగాలీలో రాయబడి ఇంగ్లీష్ లోకి అనువదించబడిన తస్లీమా నస్రీన్ రాసిన "లజ్జ"తో కలిపి మొత్తం మూడు ఆసియా ఖండపు నవలలు ఉన్నాయి. జేన్ ఆస్టిన్ అనే బ్రిటిష్ రచయిత్రి 1813లో అంటే సరిగ్గా 210 సంవత్సరాల క్రితం రచించిన "ప్రైడ్ అండ్ ప్రెజుడిస్" అనే నవల ఈ 45 నవలల్లో మొదట రాయబడిన నవల. 1997లో అరుంధతి రాయ్ రాసిన "ద గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్" అనే నవల అన్నిటికన్నా చివర్లో పరిచయం చేశారు. 45 నవలా శీర్షికల్లో ఐదు నవలల పేర్లను కూడా తెలుగులోకి తర్జుమా చేశారు: ఎలిజిబెత్ గాస్కల్ రచించిన "నార్త్ అండ్ సౌత్" ని "ఉత్తర దక్షిణాలు" గా క్రిస్టిన్ హాచ్ కిన్ రచించిన "హోమ్ టు పోలండ్" అనే నవలను "పోలెండులో మా ఇల్లు" గా, ఈవలిన్ యాంథని రచించిన "స్ట్రేంజర్ ఎట్ ది గేట్స్", "గుమ్మంలో కొత్త మనిషి"గా, మారిలిన్ సెగల్ రాసిన "రన్ చైల్డ్ రన్" ని "పాపా పరిగెత్తి పారిపో"గా హెలెన్ మాక్ ఇనిస్ రాసిన "డెసిషన్ ఎట్ డెల్ఫీ" "డెల్ఫీ వద్ద నిర్ణయం"గా అనువదించబడ్డాయి. మిగతా 40పేర్లను ఆంగ్లంలో ఎలా ఉంటే అలా యధావిధిగా ఉంచారు.

ప్రధానంగా మనకు వీటిలో క్లాసిక్స్ ఎక్కువగా కనబడతాయి. ఉదాహరణకు "నవలా మంజరి"లో పొందుపరచబడ్డ జార్జ్ఇలియట్, ఎలిజిబెత్ గ్యాస్కెల్, పెరల్ బక్, లూయిసా మే ఆల్ కాట్, హార్పర్ లీ, అయిన్ రాండ్, కేథరిన్ ప్రిచార్డ్, తస్లీమా నస్రీన్, అరుంధతి రాయ్ వంటి వారి రచనలన్నీ క్లాసిక్సే. అమెరికాకు చెందిన షార్లాట్ ఆర్మ్ స్ట్రాంగ్ అనే రచయిత్రి 1946 లో రాసిన "ది అన్ సస్పెక్టెడ్" అనే నవల మాత్రం ఒక థ్రిల్లర్. స్వీయ చరిత్ర ఛాయలు ఉన్న నవలలు కొన్ని. ఉదాహరణకు జార్జ్ ఎలియట్ రాసిన "మిల్ ఆన్ ది ఫ్లాస్", ఎలిజిబెత్ గ్యాస్కెల్ రాసిన "ఉత్తర దక్షిణాలు", అరుంధతీరాయ్ రాసిన "ద గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్" అట్టియా హుస్సేన్ రాసిన " సన్ లైట్ ఆన్ ఏ బ్రోకెన్ కాలమ్" లాంటివి. ఈ నవలల్ని మనం చదివినప్పుడు వీటిలో మనకు రచయిత్రుల స్వీయ చరిత్రలతో సరిపోయే వాస్తవాలు కొన్ని కనిపిస్తాయి. ఇవి పరిపూర్ణ స్వీయ చరిత్రా నవలలు కావు. కల్పించిన కథలో మిళితమైన పాక్షిక స్వీయ చరిత్రలు. మిరియం ఆలీ రచించిన "విథౌట్ మెర్సీ"(1995), క్రిస్టిన్ హచ్ కిన్ రచించిన "పోలెండ్లో మా ఇల్లు"(1958), మారిలిన్ సెగల్ రచించిన" పాపా పరిగెత్తి పారిపో" (1966), మోనిక బాల్డ్ విన్ రచించిన "ఐ లీప్ ఓవర్ ది వాల్"(1949), గ్వెన్ టెరసాకి రచించిన "బ్రిడ్జ్ టు ద సన్"(1957) పరిపూర్ణ స్వీయరచనా నవలలు. వీటిలో కల్పితం పాలు బాగా తక్కువగా ఉంటుంది. ఇవి రచయిత్రుల జీవితాలకు సంబంధించిన యదార్థగాథలు.

జీవిత చరిత్ర ఆధారిత నవలలు పెరల్స్, బక్ రచించిన "ది ఎగ్జైల్"(1936) అనే నవల, ఆమె తల్లి క్యారోలిన్ స్టల్టింగ్ జీవితాన్ని ఆధారంగా చేసుకుని రాయబడింది. అలాగే కె హంటర్ రచించిన "డ్యూయెట్ ఫర్ ఎ లైఫ్ టైం"(1964) అనే నవల, ఇప్పటి థాయిలాండ్ లోని సయాం లో 1811లో పుట్టిన ఒరిజినల్ సయామీస్ కవలల జీవిత కథని ఆధారంగా చేసుకుని రాసిన నవల. "నవలా మంజరి" ఆరు సంపుటాలలో ఉన్న 45 స్త్రీల రచనలను కాలక్రమానుసారం అమర్చి పరిశీలిస్తే మరికొన్ని ఆసక్తికరమైన అంశాలు మనకు తెలుస్తాయి: "నవలా మంజరి"లో ఉన్న 45 స్త్రీల రచనలకి, రచయిత్రులు 38 మాత్రమే. అంటే కొంతమంది రచయిత్రుల నవలలు ఒకటి కంటే ఎక్కువ పరిచయం చేశారు. ఉదాహరణకు డాఫ్నే డు మోరియే రచించిన "రెబకా", "మైకజిన్ రేచల్" "బర్డ్స్" " ది ఫ్లైట్ అఫ్ ద ఫాల్కన్" అనే నాలుగు రచనలు ఉన్నాయి. అలాగే పెరల్ బక్ రచించిన "ది గుడ్ ఎర్త్", " ది ఎగ్జైల్", "పియోని", "మండల" అనే నాలుగు రచనలు ఉన్నాయి. జార్జ్ఇలియట్ రచించిన" సైలస్ మార్నర్", "ద మిల్ ఆన్ ది ఫ్లాస్" అనే రెండు రచనలూ, ఇవలిన్ యాంథని రచించిన "స్ట్రేంజర్ ఎట్ ది గేట్స్ ", "ఫ్రెంచ్ బ్రైడ్" అనే రెండు నవలలు ఉన్నాయి.

19వ శతాబ్దంలో వచ్చిన నవలలు ఆరు:

1. ప్రైడ్ అండ్ ప్రెజుడిస్ (1813) – జేన్ ఆస్టిన్ 2. ఉత్తర దక్షిణాలు ( 1855) –ఎలిజిబెత్ గ్యాస్ కెల్ 3. మిల్ ఆన్ ద ఫ్లాస్(1860)– జార్జ్ ఇలియట్ 4. సైలస్ మార్నర్(1861)– జార్జ్ ఇలియట్ 5. లిటిల్ విమెన్ (1863 )– లూయిసా మే ఆల్ కాట్ 6. థెల్మా (1887)– మేరీ కరొలి 20వ శతాబ్దపు పూర్వార్ధంలో అంటే 1900 నుంచి 1950 మధ్యకాలంలో వ్రాయబడ్డ 12 నవలలు ఈ సంపుటాలలో పొందుపరచబడ్డాయి:

1. ది ఫార్ క్రయ్ (1949)– ఎమస్మిత్ 2. సమ్మర్ హోఫ్ (1937)– ఏంజెలా తిర్ఖల్ 3. పియోని (1948) –పెరల్ బక్ 4. కూనార్డు ( 1929)– కేథరిన్ ప్రిచార్డ్ 5. ది అన్ సస్పెక్టెడ్ (1946)– షార్లాట్ ఆమ్ స్ట్రాంగ్ 6. ది వాలీ ఆఫ్ డెసిషన్ (1942)– మార్సియా డెవన్ పోర్ట్ 7. రెబకా(1938)– డాఫ్నె డు మోరియే 8. ది గుడ్ ఎర్త్ (1931)– పెరల్ బక్ 9. ది ఎగ్జైల్ (1936)– పెరల్ బక్ 10. ది ఫౌంటెన్ హెడ్ (1943)– అయన్ రాండ్ 11. ఐ లీప్ ఓవర్ ది వాల్ (1949) మోనిక బాల్డ్ విన్ 12. గాన్ విత్ ద విండ్ ( 1930)– మార్గరెట్ మిచల్

20వ శతాబ్దపు ఉత్తరార్థంలో అంటే 1951–2000 మధ్య రాయబడిన రచనలు 27.

కాలక్రమానుసారంగా పరిమాణంలో అంటే సంఖ్యాపరంగా 19వ శతాబ్దికి చెందినవి ఆరు రచనలు ఉంటే, 20వ శతాబ్దపు పూర్వార్థం నుంచి 12నవలలు ఉత్తరార్థం నుంచి 27 నవలలు ఉండడం చాలా ఆసక్తి కలిగించే అంశం. ఎందుకంటే స్త్రీల నవలా సాహిత్య చరిత్రను మనం గమనిస్తే వాళ్లు నవలలు రాయటం మొదలుపెట్టింది ప్రధానంగా 19వ శతాబ్దపు మొదటి భాగం నుండే. ముందు శతాబ్దం మొత్తంతో పోల్చితే20వ శతాబ్దపు మొదటి అర్థభాగానికి వచ్చేసరికి నవలలు రాసే మహిళల సంఖ్య రెట్టింపు కన్నా ఎక్కువయింది. అలాగే 20వ శతాబ్దపు రెండవ సగానికి వచ్చేసరికి నవలలు రాసే స్త్రీల సంఖ్య మొదటి అర్థంతో పోలిస్తే రెట్టింపు అయింది. ఈ రకంగా రెట్టింపు అవుతూపోవడాన్ని ఆంగ్లంలో 'ఎక్స్ పొనెన్షియల్ గ్రోత్' అంటారు. గత రెండు శతాబ్దాల స్త్రీల నవలా సాహిత్య చరిత్రలో స్త్రీలు నవలలు రచించడం ఎక్స్ పొనెన్షియల్ గా పెరిగింది. ఈ పరిణామానికి అద్దం పట్టినట్లుగా మాలతి చందూర్ నవలల ఎంపిక అబ్బురాన్ని కలుగజేస్తుంది. ఇది ఆవిడ ఉద్దేశ్యపూర్వకంగా చేశారా లేదా యాదృచ్ఛికమా అనే చర్చ అనవసరం. ఇక మాలతి చందూర్ ఎంచుకున్న నవలల భౌగోళిక విస్తృతి విషయంలో, 19వ శతాబ్ది నుంచి తీసుకున్న ఆరు నవలలలో ఐదు బ్రిటిష్ స్త్రీలు రాసినవైతే ఒకటి మాత్రమే అమెరికన్ రాసినది. లూయిసా మే ఆల్కాట్ మాత్రమే అమెరికన్ రచయిత్రి. జేన్ ఆస్టిన్, ఎలిజిబెత్ గ్యాస్కెల్, జార్జ్ ఇలియట్, మేరీ కరోలి బ్రిటిష్ రచయిత్రులు.

స్త్రీల నవలా చరిత్రను అంతర్జాతీయకోణంలో చూసినప్పుడు 19వ శతాబ్దంలో ప్రబలంగా రాసింది బ్రిటిష్ మహిళలే. అమెరికాలో కూడా రాస్తూ ఉన్నప్పటికీ సంఖ్యాపరంగా, ప్రాచుర్యం పరంగా తక్కువనే చెప్పుకోవాలి. అదే 20వ శతాబ్దపు మొదటి అర్థంలో అమెరికాలోని స్త్రీ రచయితలు బాగా పుంజుకొని రాయటం మొదలుపెట్టారు. ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో కూడా మహిళలు నవలా రచనలు చేసి కొద్ది కొద్దిగా ప్రాచుర్యంలోకి రావడం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో మనం మాలతి చందూర్ "నవలా మంజరి"కి ఎన్నుకున్న నవలలను పరిశీలిద్దాం. 20వ శతాబ్దపు మొదటి అర్థానికి చెందిన 12 నవలలలో 7 అమెరికన్ రచయిత్రలవి, మూడు బ్రిటిష్, రెండు ఆస్ట్రేలియన్ రచయిత్రులవి.

పెరల్ బక్ రాసిన "ది గుడ్ ఎర్త్", "ది ఎగ్జైల్ ", " పియోని", ఆయన్ రాండ్ రచించిన "ది ఫౌంటెన్ హెడ్" షార్లాట్ ఆమ్ స్ట్రాంగ్ రాసిన"ది అన్ సస్పెక్టెడ్", మార్సియా డెవన్పోర్ట్ రాసిన "ది వాలీ ఆఫ్ డెసిషన్ " మార్గరెట్ మిచెల్ రాసిన "గాన్ విత్ ది విండ్"– ఇవన్నీ అమెరికన్ నవలలు. ఎమ్మాస్మిత్ రాసిన "ది ఫార్ క్రయ్ " డాఫ్నె డు మోరియ రచించిన "రెబకా"మోనిక బాల్డ్విన్ రచించిన "ఐ లీప్ ఓవర్ ది వాల్"ు ఈ మూడు బ్రిటిష్ రచనలు. కేథరిన్ ప్రిచార్డ్ రచించిన "కూనార్డు" యాంజలా తిర?ల్ రచించిన "సమ్మర్ హోఫ్" లు–ఆస్ట్రేలియా కి చెందిన నవలలు. ఇక 20వ శతాబ్దపు రెండవ అర్థంలో వచ్చిన నవలల్లో అమెరికన్, బ్రిటిష్,ఆస్ట్రేలియాకు చెందిన రచయిత్రులతో పాటు తస్లీమా నస్రీన్,అరుంధతి రాయ్ వంటి ఆసియా కి చెందిన రచయిత్రులు, అట్టియ హుస్సేన్, క్రిస్టిన్ హోచ్ కిస్ వంటి దయాస్పోరాకు చెందిన రచయిత్రులు కూడా ఉన్నారు.

ఈ విధంగా మాలతి చందూర్ "నవలా మంజరి"లో పొందుపరిచిన స్త్రీల నవలల పరిచయాల ఎంపిక, ప్రపంచ స్త్రీ నవలా సాహిత్య చరిత్రకు సంఖ్యాపరంగా, విస్తృతిపరంగా పలువిధాలుగా అద్దం పడుతుందనటంలో ఎటువంటి సందేహము లేదు.

డా. పి. హరిపద్మరాణి
ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లీష్, పద్మావతి విశ్వవిద్యాలయం,
ఫోన్ : 9492861441

# సిక్కోలు రాజకీయ చరిత్ర

*- నాగబోయిన నాగేశ్వరరావు*

కళింగాంధ్రలో భాగంగా, ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో గంజాం, ఉత్తర విశాఖ జిల్లాల్లో ఒక రెవెన్యూ డివిజన్‌గా, తర్వాత ఒక జిల్లాగా అవతరించిన సిక్కోలు (శ్రీకాకుళం)... తొలినాళ్ల నుంచే ఎంతో చైతన్యవంతమైన పాత్ర, రాజకీయాల్లో పోషిస్తుంది. ఇక్కడి నుంచి ఎన్నికైన నేతలు 1921 నాటికే రాష్ట్రమంత్రులుగా, 1932 నాటికి ముఖ్యమంత్రులుగా, 1952 నాటికి కేంద్ర మంత్రులుగా, రాష్ట్ర శాసనసభల్లో ప్రతిపక్షనేతలుగా, స్పీకర్లుగా, వివిధ ప్రాంతీయ పార్టీలకు అధ్యక్షులుగా వ్యవహరించిన ఘనత ఉమ్మడి సిక్కోలు జిల్లా సొంతం. ఆంధ్ర రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన సమయాల్లో అనేక కీలక అంశాల్లో ఈ ప్రాంత రాజకీయ నేతలు ముఖ్య భూమిక పోషించారు. వీటి చారిత్రాత్మక నేపథ్యాన్ని వివరిస్తూ, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 1920 నుంచి 2020 వరకూ జరిగిన పలు ఎన్నికలు, ఫలితాలు, విజేతలు, విశేషాలు వంటివి క్రోడీకరిస్తూ డా. బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం (శ్రీకాకుళం) జర్నలిజం అండ్ మాస్‌కమ్యూనికేషన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. గుంట లీలావరప్రసాదరావు వెలువరించిన 'సిక్కోలు రాజకీయ చరిత్ర' పుస్తకం నేటితరం పాత్రికేయులకు, రాజకీయ నేతలకు ఒక పెదబాలశిక్ష అని చెప్పవచ్చు.




కళింగాంధ్ర చరిత్రతో పాటు గంజాం జిల్లా నేపథ్యం, ఒడిస్సా రాష్ట్రం ఏర్పాటు, జిల్లాగా శ్రీకాకుళం ఆవిర్భావం వంటివి తొలి ఛాప్టర్లలో వివరించిన ఈ పుస్తకంలో దాదాపు 20 ఛాప్టర్లు పూర్తిగా రాజకీయ, సామాజిక అంశాలకు రచయిత పెద్దపీట వేశారు. రాష్ట్రపతిగా వి.వి.గిరి, ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆర్.ఎస్.ఆర్.కె రంగారావు, ఆరుసార్లు లోక్‌సభ సభ్యునిగా బి.రాజగోపాలరావు, పలు పార్టీలకు అధ్యక్షునిగా, ప్రధాన ప్రతిపక్షనేతగా గౌతు లచ్చన్నలతో పాటు ఈ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో ఖ్యాతిగాంచిన హెచ్. అప్పయ్యదొర, కె.ఎర్రంనాయుడు, వి. కిశోర్‌చంద్రదేవ్, డా.కె. కృపారాణి తదితరులు గురించి సోదాహరణంగా వివరించారు. తొలినాళ్లలోనే, ఒక పార్టీ నుంచి గెలిచి మరోపార్టీలోకి చేరినపుడు పదవులకు రాజీనామా చేసి మళ్లీ ప్రజల ఆశీర్వాదం పొందిన వారిలో ఈ ప్రాంతీయులు గురించి, కొన్ని సందర్భాల్లో తమ పార్టీ అధినేతలను ఎదురించి విలువులకు కట్టుబడి ప్రజల తరుపున నిలబడి పోరాడిన వారి గురించి ప్రస్తావించారు. నాటి రాజకీయ నేతలను, వారి త్యాగాలను, వారి అలంకరించిన పదవులు, దశాబ్ధాలుపాటు వారు చూపిన ప్రభావాలు వంటివి క్షుణ్ణంగా వివరించారు రచయిత. కాంగ్రెస్‌తో పాటు జస్టిస్ పార్టీ, కృషికార్‌లోక్ పార్టీ, స్వతంత్ర పార్టీ, సోషలిస్టు పార్టీ, జనతాపార్టీల తరుపున తొలినాళ్లలో సిక్కోలు నుంచి చట్టసభలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులతో పాటు స్వాతంత్ర్యంకు ముందు ఈ ప్రాంతం నుంచి ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర శాసనసభకు ప్రాతినిధ్యం వహించిన వారి వివరాలు ఫొటోలతో సైతం ఈ పుస్తకంలో పొందు పరిచారు.

మరోవైపు స్వాతంత్ర్య సమరంలో పాల్గొని తర్వాత చట్టసభలకు ఎన్నికైన వారిని, ఆయా పార్టీలకు అధ్యక్షులుగా వ్యవహరించిన వారిని ఈ పుస్తకం ద్వారా తెలియజేశారు. ఉమ్మడి సిక్కోలు పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, అరుకు , చీపురపల్లి, పాతపట్నం తదితర లోక్‌సభ స్థానాల నుంచి గెలుపొందిన ప్రముఖుల వివరాలు, వారి సాధించిన మెజార్టీలు, వారి పార్టీలను వివరించారు. అదేవిధంగా ఉమ్మడి సిక్కోలులోని 15 శాసనసభ నియోజకవర్గాల్లో 1952 నుంచి 2019 వరకూ ఆయా పార్టీలు సాధించిన ఎంఎల్ఏ స్థానాలు, గెలుపొందిన వారి వివరాలు, మెజార్టీలు పట్టిక రూపాన వివరించారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి ఇప్పటి వరకూ ఎన్నికల్లో పాల్గొన్న గుర్తింపు పార్టీల గురించి విపులంగా వివరించారు. ఎంఎల్ఏలుగా హ్యాట్రిక్, అత్యధిక మెజార్టీ, ఒకే కుటుంబానికి చెందినవారు, వివిధ నియోజకవర్గాల నుంచి గెలుపొందినవారు, రద్దయిన స్థానాలు, ఎస్టీ, ఎస్సీ స్థానాల్లో మార్పులు వంటివి ఈ పుస్తకంలో పొందుపరచడం వెనుక రచయిత శ్రమ ఎంతగానో కనిపిస్తోంది.

జిల్లా నుంచి ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులు, కేంద్ర–రాష్ట్ర కేబినెట్‌ల్లో మంత్రులుగా వ్యవహరించిన వారు, శాసనమండలి సభ్యులు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, కమ్యూనిస్టుల పార్టీల పాత్రతో పాటు పలు రాజకీయ సంచలనాలు, విశేషాలు వంటివి వివరించే ప్రయత్నం ఎంతో ప్రశంసనీయం. ఈ జిల్లా నుంచి ఎంపిగా రైతునేత ఆచార్య ఎన్.జి.రంగా, ఎంఎల్ఏగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీరామారావు, ఆయన సతీమణి లక్ష్మీపార్వతీ తదితరులు విజయం సాధించడాన్ని ప్రస్తావించారు. దాదాపుగా అందరం మరిచిపోయిన సుమారు 50 మంది పాతతరం రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు గురించి ఎన్నో ఆసక్తికర వివరాలు, చట్టసభల్లో వారి ప్రసంగాలు, ఫొటోలతో ఒక ఛాప్టర్‌గా ఇవ్వడం అభినందనీయం. పివిజిరాజు, పోతుల గున్నయ్య, కొత్తపల్లి పున్నయ్య, రోణంకి సత్యన్నారాయణ, కెఎన్ ఛుక్తా, లుకలాపు లక్ష్మణ్‌దాస్, సాకేటి గురువులు, ముదిండి రాజు, పసగాడ సూర్యనారాయణ, కిల్లి అప్పలనాయుడు, తమ్మినేని పాపారావు, ఆర్ఎల్ఎన్ దొర, బెండి కూర్మన్న, బమ్మిడి నారాయణస్వామి, సుక్క పగడాలు, చీకటి పరుశరామనాయుడు, తురమల్ల రామూర్తి, శిమ్మ జగన్నాథం, ఉప్పాడ రంగబాబు కొత్తపల్లి నరసయ్య తదితర విలువల గల నాటి నేతల గురించి ఈ సిక్కోలు రాజకీయ చరిత్ర పుస్తకంలో పొందుపరచడం రచయిత సామాజిక, చారిత్రక బాధ్యతకు నిదర్శనమని చెప్పవచ్చు. జిల్లా రాజకీయాలకు చెందిన అరుదైన చిత్రాలతో చివరిలో రెండు పేజీలు అందజేయడం పుస్తకానికే మరింత వన్నె తెచ్చింది. ఈ పుస్తకం భావితరాలకు ఒక దిక్సూచి గ్రంథంగా, రచయితలకు, పాత్రికేయులకు రిఫరెన్స్ మెటీరియల్‌గా ఉపయోగపడుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. వందేళ్ల రాజకీయ చరిత్రను ఒక చోటకు చేర్చి అక్షరీకరించిన రచయిత, జర్నలిజం అధ్యాపకుడు డా. లీలావరప్రసాద్ ప్రయత్నం ఎంతో సాహసోపేతమైనదే కాకుండా ప్రశంసనీయమైనది.

నాగబోయిన నాగేశ్వరరావు
సీనియర్ జర్నలిస్ట్ మరియు ఫ్రీలాన్స్ రచయిత,
చరవాణి: 99899 66767

---

## బ్రహ్మర్షి సూక్తులు

*ఒక్క చిరుగీతి విరిసిన నొక్కయాస,*
*జోతి మెఱసిన నొక మంచిచేఁత కొక్క*
*పూత సంకల్ప మొలసిన మ్రోల నిలుచు*
*నను౯గుఁజెలి వీవె యనుచు బ్రహ్మర్షిమాట.*

*హే ప్రభూ! వేదవేదము లెల్ల నీయ*
*మేయసందేశ మందు సంధ్యాయములగు;*
*నిఖిలలోకప్రవ క్తలు నీ కటాక్ష*
*మధుర వార్తావహు లను బ్రహ్మర్షిమాట.*

పద్యానువాదం : దేవులపల్లి కృష్ణశాస్త్రి

- బ్రహ్మర్షి శ్రీ వేంకటరత్నం నాయుడు సూక్తులు

# చదవండి...

– మిసిమి

**వెన్నెల కుప్పలు : డా॥ ఎమ్. పురుషోత్తమాచార్య**




చిన్నప్పటి నుండి పాటలు పాడటం ఆనవాయితీగా వచ్చిన రచయిత – ఈ 'వెన్నెల కుప్పలు' చిన్నారి పాటలు కుప్పలుగా రాశిపోసి మన ముంగిట ఉంచారు. పెద్దవాళ్లు పిల్లల పాటలు రాయడం – వారు వారి బాల్యంలోకి చూసు కోవటమే – అదొక మధురానుభూతి – వారి తొలినాటి బాల్యపు లేలేత అనుభవాలు – ఇంకా 'అహం'తో మకిలికాని వెన్నెల మనకూ కన్నుల ముందుంటుంది. ఇవి వెన్నెలంత చల్లన.

*పేజీలు : 50 వెల: ₹ 70/- ప్రతులకు: 9396611905*

**చట్టం - న్యాయం :** ఇది మాస పత్రిక అన్నారు కాని–




ఎన్ని విషయాలు – చట్టాలు – న్యాయస్థానాలు – తీర్పులు గురించి చెప్పారు – సామాన్యుడికి ఎంతో ఉపయోగకరం. ఎప్పటికప్పుడు వెలువడుతున్న విలువైన తీర్పులు – మన జీవితాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో తెలుస్తుంది.

*పుటలు : 100, సంవత్సరానికి: ₹ 750/-*

*ప్రతులకు : తెలుగు లా పబ్లికేషన్స్, ఇంటి నెం. 12-13-364, పద్మావతి టవర్స్, ఫ్లాట్ నెం. 302, స్ట్రీట్ నెం. 9, తార్నాక, సికింద్రాబాద్ – 500 017*

**గాజుల లక్ష్మీనరసు చెట్టి -1806-1868 :**

వకుళాభరణం రామకృష్ణ/కొంపల్లి సుందర్. బందరు నుంచి మద్రాసు వెళ్లిన కుటుంబం – 19వ శతాబ్దంలోనే మొదటగా ప్రజా ఉద్యమాన్ని – ఆంగ్లేయులకు వ్యతిరేకంగా నడిపిన దేశభక్తుడు. వలస ప్రభుత్వంచే ఓ ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను ఖండించిన ఉద్యమకారుడు. మద్రాసు గవర్నర్ శాసన మండలి సభ్యుడుగా ఉండి ప్రజల హక్కులు ప్రజాస్వామ్య పద్ధతులపై మండలిలో ఘాటుగా తనగొంతు వినిపించాడు. 'తొలిపోరాట' యోధుడుగా అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ మేధావులు ఆయన్ని గుర్తించారు. వీరి చరిత్ర వకుళాభరణం రామకృష్ణ – సుందర్ గార్లు తెలుగు పాఠకులకు అందించారు. తప్పనిసరిగా చదవతగిన చరిత్ర.




*పేజీలు: 100, వెల: ₹ 100/- ప్రతులకు: ప్రజాశక్తి పుస్తకాలు, ఫోన్ : 0866-2577533*

**పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథలు/మొదటి సంపుటి :** ఎన్నో పత్రికల్లో అచ్చయిన ఈ కథలు విశాలాంధ్ర వారు పుస్తక రూపంలో తెచ్చారు. శాప గ్రస్తులకు చరిత్ర – కథా చరిత్రలో అందాం – ఓ చిరస్థానం కల్పించారు పెద్దిభొట్ల అంటారు మునిపల్లె రాజు.




వీరి కథల్లో ఎటువంటి అలంకారాలు – నినాదాలు–నిర్దేశాలు కూడా ఉండవు. పైన చెప్పినట్లు శాపగ్రస్తు అర్ధనగ్న శరీరాలు– ఆకలి డొక్కలు– చిక్కిన చేతులూ–ఇవే వారి భౌతిక బాధలకు చిహ్నాలు. వీరి కథలూ అలాగే వుంటాయి – చదవండి –

*పేజీలు: 295, వెల: ₹ 160/- ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్ సుల్తాన్ బజార్ రోడ్, విజయవాడ.*

**కథాస్రవంతి :** అరసం వారు ఈ తరం కోసం ప్రచురించిన పదిమంది రచయితల కథా సంపుటులు – పది పుస్తకాలు – ఒక సెట్టుగా అందిస్తున్నారు. ఆ కథకులు ఎవరంటే – అల్లం శేషగిరిరావు, పెద్దిభొట్ల, మధురాంతకం రాజారాం, కొలకలూరి ఇనాక్, బుచ్చిబాబు, అల్లం రాజయ్య, పి. సత్యవతి, కొడవటిగంటి, ఓల్గా, కేతు విశ్వనాథ రెడ్డి, ఇలా పదిమంది కథలు – పది పుస్తకాలు ఒక సెట్టుగా వెలువరించారు. ఈతరం ఈ పుస్తకాలు చదువుతారనే ఆశతో వారు చేశారు. ఈరోజు ఉన్న పరిస్థితుల్లో – సెల్ హస్తభూషణం అయిన తరంలో పుస్తకాలు పట్టుకునేదెవరు – పట్టుమని పది పేజీలు చదివేదెవరు? ఈ సందేహాలు వదిలి – చదవాలని ఆశిద్దాం. ఈ పుస్తకాలు ఒక్కటి 50/- బాక్స్‌లో ఈ సెట్టు రూ. 500/-




*ప్రతులకు : అరసం గుంటూరు జిల్లా శాఖ, విశాలాంధ్ర అన్ని శాఖలూ.*

**భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న :** సంస్కరణలు అనేక రకాలుగా – అవసరాన్నిబట్టి సమాజంలో

మార్పులు తేవటానికి పుట్టుకొస్తాయి. వేమనతో మొదలయిన ఈ యజ్ఞం – స్వామినేని ముద్దు నరసింహనాయుడు – భాషాపరంగా వాడుక భాష అవసరాన్ని ప్రబోధించారు – వీరి "హితసూచని" తొలి తెలుగు వ్యవహారిక భాషలోని వచన రచన! తరువాతి సంస్కరణకంటే అర్ధశతాబ్దం ముందుగానే




వీరు స్పష్టంగా వివరించారు. తరువాత జె.యె. ఏట్సు ప్రబంధ భాషకు వాడుక బాషకు వ్యత్యాసాన్ని గుర్తించి శ్రీనివాస అయ్యంగారు, గురజాడ, గిడుగు రామ్మూర్తి గార్లను వేర్వేరుగా కలిసి సందేహ నివృత్తి కోసం అడుగుతారు. ముగ్గురూ తమ అభిప్రాయాలను చెప్పే ప్రయత్నం చేస్తారు. నాటి 'ఏట్స్' ప్రశ్న – తరువాత విద్యాధికారిగా ఆయన చేసిన అవిరళ కృషి "వ్యావహారిక భాష" ఉద్యమానిక ప్రేరణ! వింతగా, ఆశ్చర్యంగా లేదు. తెలుగు వ్యవహారికంగా ఉండాలి అని ఒక ఆంగ్లేయుని 'సందేహం' ప్రశ్న మూలకారణమంటే ఇప్పటి భాషోద్యమకారులు ఏమంటారో?

ఇలాంటి విశేషాలతో ఈ పుస్తకం ఎంతో భాషా సంబంధమైన వివరాలను అందిస్తుంది. ప్రొ. సిమ్మన్న అభినందనీయులు.

*పేజీలు: 263 వెల ₹ : 200/– ప్రతులకు: గిడుగు మునిమనుమడు వెంకట నాగేశ్వర రావు, ఫోన్ : 9581888989*

**ఆచార్య అనుమాండ్ల భూమయ్య :** పద్య కవిగా, కవితా విమర్శకులుగా, సాహిత్య విశ్లేషకులుగా ప్రసిద్ధి



చెందిన తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ వైస్ ఛాన్సలర్ వారి పుస్తకాలు మూడు – తెలంగాణ కవితా వైభవం, గేయకావాలు – సమగ్ర సాహిత్యం, భౌమ మార్గ విమర్శ మిసిమి పరిచయానికి వచ్చేశాయి. అదేదో సామెత ఉంది. గుడిసెలో ఏనుగు దూరునా? అని! అలా ఈ విస్తృత సాహిత్య గ్రంథాలను పరిచయం చేయగల స్థలం గాని, స్తోమతు గాని లేవనుకుంటూనే విపులంగా వచ్చిన విమర్శనా వ్యాసాన్ని ఇస్తున్నాం.



అంతేకాదు వీరు గద్దర్ గురించి 'బిడ్డల యాదిలో గద్దర్' విశ్లేషణ కూడా వారి అనుమతితో ప్రచురిస్తున్నాం. ఎందుకంటే గద్దర్ కూడా 'బిడ్డల యాదిలా' ఒక్కసూపే సుక్కయిందు" గదా! దాదాపు 400 పుటల మూడు పుస్తకాలు – ఒక్కటి 500/–



కాని గుండెలకు హత్తుకోవలసినవి – సరస్వతి పూజార్హమైనవి.

*ప్రతులకు: ఫోన్ : 8897073999, ప్లాట్ నెం. 519ఎ, అపురూప జగపతి హైట్స్, ఆదర్శనగర్, ఉప్పల్, హైదరాబాద్ – 500 039.*

**కాలంతోపాటు - ఎస్.ఎం. సుభాని :** "ఆధునిక వచన కవితా రంగం" అంటూ అందులోను




విలక్షణ స్వరం అనికూడా కలుపు తున్నారు – సమాజ చైతన్యాన్ని, విప్లవ చైతన్యాన్ని పుంజీభవించుకుని సౌందర్య వంత సంపద్వంతముంది. ఇలా విరోధా భాస పదాలతో భయపెడుతున్నారు డా॥ భవాని గారు. ఇంకా చూడండి చిరు అలలా ప్రవహిస్తూనే సంక్షోభిత సాంద్ర దృశ్య పరంపరగా విశాల వస్తు విస్తృతతో... ఇదంతా ప్రబంధ పదబంధాలతో నిండిపోయింది. ఏ కవికైనా మనసులోని ఆవేదన కవిత్వ రూపంలో వెలువడు తుంది. ఆత్రేయ – ఆవేశం రావాలి, ఆవేదన కావాలి అంటాడు కవిత్వానికి – ఈ కాలంతోపాటు కవిత్వం కాలంతోపాటు ఉన్నాయా/లేవి అనేది చదివి తెలుసుకోండి.

*పేజీలు : 127, వెల ₹ 150/–*

*ప్రతులకు: 9490776184*

**చిత్రకళ - నూతన ధోరణలు : టి.వి. ప్రసాద్**

రచయిత మనలాంటి సామాన్యులకు దగ్గర చేసిన ఎన్నో చిత్రాలు – చిత్రకారుల చరిత్రలు ఇందులో వున్నాయి. ఆధునికత అంటూ




చిత్రకళా ధోరణలు ఎన్నో మార్పులకు చోటు చేసుకున్నాయి. సమాజంలో వచ్చిన మార్పులను అవి ప్రతిబింబిస్తూ – వ్యాఖ్యానిస్తున్నాయి. భయపెడ్తూ ఆశ్చర్యం గొలుపుతాయి. ఇప్పుడు పాఠకులు ఎలాంటి పుస్తకాలు చదువుతున్నారు – కొంటున్నారు? ఇది సమాధానం వెంటనే దొరకని ప్రశ్న. అయినా రచయితలు తమ తమ విషయాలతో రచనలు చేస్తున్నారు – పుస్తకాలు వేసుకుంటున్నారు. ఒకరకంగా కళాప్రియులు అదృష్టవంతులు. వారికి కావలసినది దొరుకుతోంది. కాని చదవడం మీరు చేయవలసినది! ఈరకం అరుదైన పుస్తకం మీకు దొరకదు. ఈ అవకాశం జారవిడువకండి – ఇవన్నీ – **మిసిమి**లో ప్రచురింప బడినవే.

*పేజీలు : 200, వెల ₹ 200/– ప్రతులకు: పాలపిట్ట – 9848787284, రచయిత : 7981398250*

# మిసిమి
మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి** **బహుమతిగా పంపండి**

*మీకు ప్రియమైనవారు, స్నేహితులు - మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.*

**A/C Name : Misimi Publication**
**HDFC Current Account No. 50200069769243**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),
**Scan QR to Pay**
Misimi Publication

**మిసిమి** ప్రచురణలు


**నోబెల్ వ్యాసాలు**


**మిసిమి** పార్థసారథి వ్యాసాలు


**చిత్రకళా నీరాజనం**


**దూరతీరాలలో...**


**రజ్జు సర్పభ్రాంతి**


**బైరన్**


**పురస్కార సాహిత్యం**


**వ్యాస మంజూష**


**సారస్వత వ్యాసాలు**


చార్లీ చాప్లిన్


సిద్ధార్థ


సప్తపర్ణి


**షెల్లీ జీవిత కథ**


దోసిట చినుకులు


**నృత్యభారతి**


పారిజాతం

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.

**మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.**